

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 24
మంగళవారం 16-4-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



సన్‌రైజర్స్ రికార్డు స్కోరు
ఐపీఎల్‌లో 287 పరుగులు నమోదు. బెంగళూరుపై విజయం. - 14లో


మార్కెట్లకు యుద్ధ భయం..
ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు.. సెన్సెక్స్ 845 పాయింట్ల పతనం.. - 15లో


భారీ ప్లాన్ అనగానే భయపడొద్దు
భారత్ కోసం బృహత్ ప్రణాళికలు ప్రకటించిన ప్రతిసారీ భయపడాల్సిన పనిలేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.
- వివరాలు 6లో


ఆ సంస్థలు మోదీ సొత్తు కాదు
రాజ్యాంగబద్ధ సంస్థలు ప్రధాని వ్యక్తిగత ఆస్తులు కావని, అవి దేశ పౌరులందరివని కాంగ్రెస్ నేత రాహుల్ పేర్కొన్నారు.
- వివరాలు 6లో


న్యాయవ్యవస్థ చులకనకు యత్నాలు
న్యాయ వ్యవస్థను చులకన చేసేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని రిటైర్డ్ జడ్జీల బృందం సీజేఐకి లేఖ రాసింది.
- వివరాలు 6లో


ఈడీకి సుప్రీంకోర్టు నోటీసు
తన అరెస్టును సవాల్ చేస్తూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌కు బదులివ్వాలని ఈడీకి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది.
- వివరాలు 6లో



జాతీయం..
జాతీయ పార్టీలకు ద్రవిడ స్వప్నం..
తమిళనాట హోరాహోరీ.. ఎలాగైనా పాగా వేసే ప్రయత్నాల్లో బీజేపీ..
- వివరాలు 11లో

తెలంగాణ
బీజేపీ టార్గెట్.. డబుల్ డిజిట్

10 నుంచి 12 సీట్లు గెలుస్తామన్న ధీమా.. 2019లో 4 సీట్లలో విజయం
- వివరాలు 10లో

ఆంధ్రప్రదేశ్
పొత్తు చిత్తే!

బాబు, పవన్, పురందేశ్వరి పైపై.. స్థానిక నేతలు నైనై.. టీడీపీ సభలకు బీజేపీ, జనసేన దూరం..
- వివరాలు 12లో

బీజేపీకి బీఆర్ఎస్ తాకట్టు

బిడ్డకు బెయిల్ కోసం కేసీఆర్ సుపారీ తీసుకున్నారు
నారాయణపేట జనజాతర సభలో సీఎం రేవంత్‌రెడ్డి

- 5 స్థానాల్లో కాంగ్రెస్‌ను అడ్డుకుని బీజేపీని గెలిపించేందుకు కుతంత్రాలు
- బీజేపీకి ఓట్లేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు చెప్తున్నారు
- ఆగస్టు 15 లోపు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ అమలు
- అన్ని పార్లమెంట్ స్థానాల్లోనూ హస్తం అభ్యర్థులను గెలిపించాలి
- 14 ఎంపీ సీట్లు గెలిపిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రి చేస్తా..
- ఎస్సీ వర్గీకరణ చట్టం చేసే బాధ్యతను కాంగ్రెస్ తీసుకుంటుందని వెల్లడి



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''బీఆర్ఎస్‌ను ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రధాని మోదీకి తాకట్టు పెట్టారు. కవితకు బెయిల్ వచ్చేందుకు కోసమని కాంగ్రెస్‌ను ఓడించేలా చీకటి ఒప్పందం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, చేవెళ్ల, మల్కాజిగిరి, భువనగిరి, జహీరాబాద్ లోక్‌సభ సీట్లలో బీజేపీని గెలిపించేందుకు సుపారీ తీసుకున్నారు. బీఆర్ఎస్‌ను బొందపెట్టి, తెలంగాణ ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల వద్ద తాకట్టు పెట్టారు..'' అని టీపీసీసీ చీఫ్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ జన జాతర సభలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''లక్షలాది మంది కార్యకర్తలు, ఇతర పార్టీల నేతలు జైలుకు పోయినా కేసీఆర్‌కు దుఃఖం రాలేదు. నా బిడ్డ లగ్గం ఉన్నా నన్ను వదలకుండా జైల్లో పెట్టించారు. అప్పుడు కూడా ఆయనకు బాధ కలగలేదు. కానీ ఆయన బిడ్డ జైలుకు పోగానే మోదీ దగ్గర తెలంగాణను తాకట్టు పెట్టారు. ఇది తెలంగాణ ఆత్మ గౌరవానికి మంచిదా? బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

ఆ 5 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని..

పాలమూరులో బీజేపీకి ఓట్లు వేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు సొంత పార్టీ కార్యకర్తలకు చెప్తున్నారు. చేవెళ్లలోనూ బీఆర్ఎస్ లీడర్లను బీజేపీకి లొంగిపొమ్మంటున్నారు. భువనగిరి, మల్కాజిగిరి, జహీరాబాద్, చేవెళ్ల, మహబూబ్‌నగర్ ఎంపీ సీట్లలో కాంగ్రెస్ గెలుపు ఖాయం. వాటిల్లో కాంగ్రెస్‌ను దెబ్బతీస్తే రేవంత్‌ను దెబ్బతీయొచ్చనే ఆలోచన చేస్తున్నారు. నాపై కోపముంటే నాతో కొట్లాడండి. మా కార్యకర్తలతో కొట్లాడండి.. మేం తప్పు చేస్తే ప్రజలకు చెప్పండి. వంద రోజుల్లోనే నన్ను గద్దె దించాలని అంటున్న కేసీఆర్.. పదేళ్లుగా గద్దె మీద ఉన్న మోదీని గద్దె దించాలని ఎందుకు అనట్లేదు?

ముదిరాజ్ బిడ్డను మంత్రి చేస్తాం..

బలహీన వర్గాలకు చట్టసభల్లో అవకాశాలు కల్పించింది కాంగ్రెస్సే. రజకబిడ్డ అయిన వీర్లపల్లిని, ముదిరాజ్ బిడ్డ మిగతా 3వ పేజీలో ▶

వంద రోజుల్లో చాలా పనులు చేశాం. ఇంకా చేయాల్సినవి ఉన్నాయి. నారాయణపేట గడ్డపై నుంచి రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతులకు మాట ఇస్తున్నా. ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతాం. ఏకకాలంలో, ఏకమొత్తంలో రుణమాఫీ చేసే బాధ్యత నాది. వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇచ్చి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ జర్నీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీలు అమల్లోకి తెచ్చాం. రుణమాఫీ కూడా చేసి తీరుతాం.

నా సంకల్పం చెదరదు

ఎవరెన్ని కుట్రలు పన్నినా బెదరను..
గుడివాడ మేమంతా సిద్ధం సభలో ఏపీ ముఖ్యమంత్రి జగన్

- వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే.. వాళ్లు ఓటమిని అంగీకరించినట్లే..
- ప్రజలు అనే శ్రీకృష్ణుడి అండ ఉన్న అర్జునుడు మీ బిడ్డ జగన్..
- నాపై ఒక రాయి విసిరినంత మాత్రాన యుద్ధాన్ని కౌరవులు గెలిచినట్లు కాదు
- పేదలకు మంచి చేయకూడదనేదే చంద్రబాబు ఫిలాసఫీ..
ఎన్టీఆర్‌ను దింపేసి కిలో రూ.2 బియ్యం రూ.5.20 చేసింది బాబే
- ఇంగ్లీష్ మీడియం వద్దన్నది.. ప్రభుత్వ బడులను పాడుబెట్టిందీ చంద్రబాబే


మేమంతా సిద్ధం సభలో ప్రసంగిస్తున్న సీఎం జగన్

- వివరాలు 5లో

ఏపీ సీఎంపై హత్యాయత్నం కేసు
దర్యాప్తు ముమ్మరం

పదునైన రాయితోనే హత్యాయత్నం
వీడియో ఫుటేజీల ద్వారా పోలీసుల నిర్ధారణ

5లో

కాల్ డేటా, వీడియో రికార్డుల విశ్లేషణ

- అదుపులో 60 మంది వరకు అనుమానితులు
- అన్ని కోణాల్లో విచారణ.. 10 మంది తీరు సందేహాస్పదం
- ఆగంతకుడి సమాచారం చెప్పినవారికి రూ.2 లక్షల బహుమతి
- సున్నిత భాగాలపై తగిలితే సీఎంకు ప్రాణాపాయం ఉండేది
- త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం: పోలీస్ కమిషనర్ టి.కె.రాణా



పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వడం లేదు
- ఇప్పటి వరకు 2.69 ఎల్ఎంటీ ధాన్యం కొనుగోలు
- ధాన్యం వేలం ద్వారా పౌరసరఫరాల సంస్థకు అదనపు ఆదాయం
- అవగాహన లేమితో బీఆర్ఎస్ నాయకుల విమర్శ
- జూన్ 9న ప్రధానిగా రాహుల్ ప్రమాణం.. మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్

3లో

వెన్నుపోటే ఇందిరమ్మ రాజ్యమా?

- 6 గ్యారంటీలు, మేనిఫెస్టో హామీల అమలు ఏమైంది ?
- అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాహుల్‌గాంధీ మరిచిపోయారా ?
- గ్యారంటీలు ఏమయ్యాయని సర్కార్‌ను రైతులు నిలదీయాలి
- రైతుదీక్షలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


సోమవారం బీజేపీ కార్యాలయంలో చేపట్టిన రైతు దీక్షలో కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ప్రజలను వెన్నుపోటు పొడవటమే ఇందిరమ్మ రాజ్యమా..? ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు ఏమైందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని' కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో 'కాంగ్రెస్ గ్యారంటీల అమలుకు ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతు' పేరిట ఆయన రైతుదీక్ష నిర్వహించారు. ఈ దీక్ష ముగింపు సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో కార్యాచరణపై రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాహుల్‌గాంధీ మరిచిపోయి, లోక్‌సభ ఎన్నికలప్పుడు కొత్త వాగ్దానాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పాతవాటిని గాలికొదిలేసి కొత్త హామీలతో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అడిగేందుకు వచ్చే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతులు, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఎందుకు అమలు చేయలేదో ప్రశ్నించాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ.15,000 వ్యవసాయ కూలీలకు రూ.12,000, మిగతా 10వ పేజీలో ▶

నెలాఖరు వరకే గడువు



- గోదావరి–కావేరీ అనుసంధానంపై 'కేంద్రం' డెడ్‌లైన్
- ముసాయిదా డీపీఆర్‌పై అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలన్న ఎన్‌డబ్ల్యూడీఏ
- లేకుంటే ఆమోదించినట్టుగానే పరిగణిస్తామని స్పష్టీకరణ
- తర్వాత ఆయా రాష్ట్రాల సీఎంలతో ఒప్పందం చేసుకుంటామని వెల్లడి - 2లో



రాష్ట్రంలో సాధారణ వర్షపాతం!

- మండుటెండల వేళ చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ
- వచ్చే నైరుతి సీజన్ వర్షపాతం అంచనాలు విడుదల
- భూమధ్య రేఖ, పసిఫిక్ ప్రాంతంలో మధ్యస్థంగా ఎల్‌నినో పరిస్థితి
- నైరుతి సీజన్ ప్రథమార్థానికి అది బలహీనపడే చాన్స్

గత వానాకాలం కంటే కాస్త ఎక్కువే వానలు పడొచ్చని అంచనా..



సాక్షి, హైదరాబాద్: మండుటెండల వేళ వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. జూన్ నుంచి ప్రారంభమయ్యే నైరుతి రుతుపవనాల సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఈ మేరకు జూన్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో వర్షపాతం అంచనాలను భారత వాతావరణ శాఖ సోమవారం ప్రకటించింది. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో తెలంగాణలో సంతృప్తికర స్థాయిలో వానలు పడతాయని తెలిపింది. గత నైరుతి సీజన్‌తో పోలిస్తే.. కాస్త ఎక్కువే పడే అవకాశమూ ఉందని వివరించింది.

ఎల్‌నినో బలహీనపడి..

రాష్ట్రంలో నైరుతి సీజన్ సాధారణ వర్షపాతం సగటున 72.21 సెంటీమీటర్లు. 2021, 2022 వానాకాలాల్లో ఈ సగటుకంటే 40% అధిక వర్షపాతం నమోదైంది. కానీ గత సీజన్ నాటికి ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గింది. మొత్తంగా సాధారణ వర్షపాతం నమోదైనా.. వరుసగా కొన్నిరోజులు కురవడం, తర్వాత వరుసగా 20–25 రోజుల పాటు వాన జాడే లేకుండా పోవడం (డ్రైస్పెల్స్) జరిగింది. అంతేకాదు.. కొన్ని ప్రాంతాల్లోనే కుండపోత వానలు పడితే, మరికొన్ని చోట్ల విపరీతమైన లోటు నెలకొంది. దాంతో కరువు తరహా పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో.. నైరుతి సీజన్ ప్రథమార్థంలో బలహీనపడుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీంతో సీజన్ ప్రారంభం నుంచే వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణలో సాధారణంతో పోలిస్తే.. మిగతా 16వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీసీ రిజర్వేషన్లు పెంచాకే ఎన్నికలు జరపాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య లేఖ



కాచిగూడ: బీసీల కులగణన చేసి పంచాయతీరాజ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు 50 శాతం పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా వార్తలు వస్తున్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 22 శాతం నుంచి 42 శాతానికి పెంచుతామని ప్రకటించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణన జరిపి జనాభా ప్రకారం స్థానిక సంస్థల రిజర్వేషన్లు 50 శాతానికి పెంచుతామని ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. ఇంకా కులగణనే జరపలేదు, అప్పుడే ఎన్నికలంటే ఎలా అని ఆయన లేఖలో ప్రశ్నించారు.

గొంగిడి మహేందర్‌రెడ్డికి కేటీఆర్ అభినందన



సాక్షి, హైదరాబాద్: జాతీయస్థాయిలో ఉత్తమ కోఆపరేటివ్ బ్యాంక్‌గా అభివృద్ధి చేసినందుకు బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు అందుకున్న గొంగిడి మహేందర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం అభినందించారు. దేశంలో 500కు పైగా డీసీసీబీలు ఉంటే ఐదు గురికి మాత్రమే ఈ గౌరవం దక్కిందని కేటీఆర్ పేర్కొన్నారు.

అంబేడ్కర్‌కు పూలమాల వేయకుండా అవమానించారు

సీఎం క్షమాపణ చెప్పాలి: దాసోజు



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి రోజు ఆయన విగ్రహానికి పూలమాల వేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అవమానించిందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. నెక్లెస్‌రోడ్‌లో నిర్మించిన అతిపెద్ద స్మారక చిహ్నమైన అంబేడ్కర్ విగ్రహాన్ని పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే బేషరతుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని సోమవారం ఒక ప్రకటనలో దాసోజు డిమాండ్ చేశారు. కేవలం మాజీ సీఎం కేసీఆర్ మీద ఉన్న దురభిమానం, ప్రతీకార రాజకీయాలతోనే అంబేడ్కర్‌ను అవమానించారని మండిపడ్డారు. అంబేడ్కర్ దళితుడు కాకపోయి ఉంటే ఆయన్ను అవమానించే పని మీరు చేసేవారా?.. లేదా రాజకీయ ప్రతీకారం, ద్వేషంతో ఈ చర్యకు పాల్పడ్డారనుకోవాలా? అని దాసోజు ప్రశ్నించారు. విగ్రహాలు, స్మారక చిహ్నాలు కేవలం రాయి, లోహం మాత్రమే కాదని, అవి జాతీయ నాయకుల పట్ల మనకున్న సామూహిక గౌరవాన్ని సూచిస్తాయన్న విషయం తెలుసుకోవాలని హితవుపలికారు. ప్రభుత్వాలు రావొచ్చు, పోవచ్చు కానీ, దేశం కోసం దేశ ప్రజల భవిష్యత్ కోసం తమ జీవితాన్నంతా త్యాగం చేసిన లెజెండరీ లీడర్ల వారసత్వం కలకాలం జీవించాలని దాసోజు ఆకాంక్షించారు.

బీజేపీ అనుకుంటే 3 రోజుల్లో వర్గీకరణ బిల్లు

మాదిగలకు న్యాయం చేసేది కాంగ్రెస్సే: గజ్జెల కాంతం, పిడమర్తి రవి



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తలచుకుంటే మూడు రోజుల్లో ఎస్సీల వర్గీకరణ బిల్లును పార్లమెంటులో పెట్టి ఉండవచ్చని, కానీ మాదిగలను మోసం చేసేందుకే కమిటీల పేరిట మోదీ కాలయాపన చేస్తున్నారని టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, పిడమర్తి రవి, ఊట్ల వరప్రసాద్ ఆరోపించారు. సోమవారం గాంధీ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నేత మందకృష్ణ మాదిగ 2017 నుంచి బీజేపీని పొగుడుతున్నారని, అయినా ఇప్పటి వరకు ఎస్సీ వర్గీకరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. దీనిపై కృష్ణమాదిగ, బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో కృష్ణమాదిగకు మాదిగల మద్దతు ఉంటుంది కానీ, బీజేపీ విషయంలో ఉండదని, అందుకే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ కోసం కృష్ణ మాదిగ పని చేసినా మాదిగ కులస్తులు కాంగ్రెస్‌కు అండగా నిలిచారని తెలిపారు. పార్లమెంటు టికెట్ల విషయంలో కొన్ని కారణాల వల్ల మాదిగలకు నష్టం జరిగిన మాట వాస్తవమేనని, కానీ భవిష్యత్‌లో తప్పక అవకాశాలిస్తామని సీఎం రేవంత్ చెప్పారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లకే పెద్ద ప్రమాదం ఉంటుందని, తెలంగాణ ప్రజలు, మాదిగ జాతి అప్రమత్తతతో వ్యవహరించి కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలవాలని కోరారు.

'మైనర్'లో పొదుపు ఎలా చేశారు?

45 టీఎంసీలను పొదుపు చేస్తున్నారనడానికి ప్రాతిపదిక ఏమిటి?

- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌పై సీడబ్ల్యూసీ ప్రశ్నలు
- రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ
- నిర్దేశిత ఫార్మాట్‌లో వివరాలు సమర్పించాలని సూచన
- సమ్మక్క బ్యారేజీకి 85 టీఎంసీల లభ్యతపైనా సందేహాలు

సాక్షి, హైదరాబాద్: మైనర్ ఇరిగేషన్ కోటా కింద వాడుకోకుండా పొదుపు చేసిన 45 టీఎంసీల కృష్ణా జలాలను పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కొర్రీలు వేసింది. కృష్ణా బేసిన్‌లో 2012–13 నుంచి 2021–23 మధ్య కాలంలో ఏటా 45.66 టీఎంసీల జలాలను ఏ విధంగా పొదుపు చేశారని ప్రశ్నించింది. తెలంగాణ మైనర్ ఇరిగేషన్ అవసరాల కోసం 90 టీఎంసీలను బచావత్ ట్రిబ్యునల్ (కృష్ణా ట్రిబ్యునల్-1) కేటాయించగా, అందులో వాడుకోకుండా పొదుపు చేస్తున్న 45 టీఎంసీలతో పాటు మరో 45 టీఎంసీలు కలిపి మొత్తం 90 టీఎంసీల నికర జలాలను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేటాయిస్తూ గత బీఆర్‌ఎస్ నిర్ణయం తీసుకుంది. దీని ఆధారంగా రూపొందించిన ప్రాజెక్టు డీపీఆర్‌ను గతేడాది సీడబ్ల్యూసీ ఆమోదం కోసం సమర్పించింది. అయితే మైనర్ ఇరిగేషన్ కోసం జరిపిన కేటాయింపుల్లో 45 టీఎంసీలను ఏ విధంగా పొదుపు చేశారోతెలపాలని కోరుతూ ఇటీవల సీడబ్ల్యూసీలోని ప్రాజెక్టు అప్రైజల్ (సౌత్) డైరెక్టరేట్.. రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ రాసింది. పొదుపు ఏ విధంగా చేశారు? పొదుపు చేస్తున్నారనడానికి ప్రాతిపదిక ఏమిటి? లాంటి వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో సమర్పించాలని సూచించింది.

పాలమూరుకు వరుస అడ్డంకులు

పోలవరం ప్రాజెక్టు ద్వారా కృష్ణా డెల్టాకు తరలించే 80 టీఎంసీల గోదావరి జలాలకు బదులుగా, నాగార్జునసాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలు 80 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవాలని 1978 ఆగస్టు 4న బచావత్ ట్రిబ్యునల్ ముందు ఒప్పందం కుదిరింది. 80 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలు ఇప్పటికే 35 టీఎంసీలను వాడుకోగా, ఉమ్మడి ఏపీకి 45 టీఎంసీలు మిగిలాయి. ఈ 45 టీఎంసీలతో పాటు మైనర్ ఇరిగేషన్‌లో పొదుపు చేసిన 45 టీఎంసీలను కలిపి మొత్తం 90 టీఎంసీలను పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం కేటాయించింది. అయితే ఉమ్మడి ఏపీకి లభించిన 45 టీఎంసీల కృష్ణా జలాల్లో తమకు కూడా హక్కు ఉందని, మొత్తం 45 టీఎంసీలు తెలంగాణ వాడుకోవడానికి అంగీకరించబోమని సీడబ్ల్యూసీకి చేసిన ఫిర్యాదులో ఏపీ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునః కేటాయింపులపై కృష్ణా ట్రిబ్యునల్-2 నిర్ణయం తీసుకునే వరకు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతుల విషయాన్ని పరిశీలించబోమని ఇప్పటికే సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. ట్రిబ్యునల్ కేటాయింపులు లేకుండా ఏకపక్షంగా 45 టీఎంసీలను వాడుకోవడానికి వీలు లేదని స్పష్టం చేసింది. తాజాగా మైనర్ ఇరిగేషన్‌లో పొదుపుపై కొర్రీ వేసింది. ఇలా వరుస అడ్డంకులతో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియ దీర్ఘకాలం పాటు మూలనపడిపోయే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కృష్ణా ట్రిబ్యునల్-2 కేటాయింపులు ముగిసిన తర్వాతే ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర జలశక్తి శాఖ ఇప్పటికే స్పష్టం చేయడం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారింది.

సమ్మక్కకు ఛత్తీస్‌గఢ్ ఎన్వోసీ తీసుకున్నారా?

సమ్మక్క బ్యారేజీ నిర్మాణంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఏర్పడనున్న ముంపు విషయంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్వోసీ) తీసుకున్నారా? అని సీడబ్ల్యూసీ రాష్ట్ర నీటిపారుదల శాఖను ప్రశ్నించింది. సమ్మక్క బ్యారేజీ, సీతారామా-సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుల డీపీఆర్‌లను అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన నేపథ్యంలో వీటికి సంబంధించి సీడబ్ల్యూసీ పలు సందేహాలను వ్యక్తం చేసింది. సమ్మక్క బ్యారేజీ నుంచి దేవాదుల ఎత్తిపోతల పథకానికి 38 టీఎంసీలు, శ్రీరాంసాగర్ రెండో దశకు 47 టీఎంసీల నీటిని తరలించడానికి తెలంగాణ ప్రతిపాదించింది. అయితే ఎగువ రాష్ట్రాలు తమ వాటా జలాలను వాడుకున్న తర్వాత 85 టీఎంసీల లభ్యత ఉంటుందా? పరిశీలించాలని కోరింది. సిమ్యులేషన్ స్టడీస్ చేసి నివేదిక అందించాలని కోరింది. మరోవైపు సీతారామ ఎత్తిపోతల పథకం కింద ఒక్కో హెక్టార్ ఆయకట్టులో 79.07 క్వింటాళ్ల వడ్లు/49.42 క్వింటాళ్ల పత్తి/ 69.19 క్వింటాళ్ల మొక్క జొన్న పండిస్తామని డీపీఆర్‌లో ప్రతిపాదించడంపై సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. 2022 వ్యవసాయ గణాంకాల ప్రకారం తెలంగాణలో సరాసరిగా ఒక హెక్టార్లో 33 క్వింటాళ్ల వడ్లు/ 5.46 క్వింటాళ్ల పత్తి/ 51.78 క్వింటాళ్ల మొక్క జొన్న దిగుబడి మాత్రమే జరిగిందని స్పష్టం చేసింది. డీపీఆర్‌లో ప్రతిపాదించిన మేరకు పంటల దిగుబడిని సమర్థించేందుకు అవసరమైన ఆధారాలను, వ్యవసాయ శాఖ నివేదికలను సమర్పించాలని కోరింది.

నెలాఖరు వరకే గడువు

- గోదావరి-కావేరీ అనుసంధానంపై 'కేంద్రం' డెడ్‌లైన్
- ముసాయిదా డీపీఆర్‌పై అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలన్న ఎన్‌డబ్ల్యూడీఏ
- లేకుంటే ఆమోదించినట్టుగానే పరిగణిస్తామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గోదావరి-కావేరీ నదుల అనుసంధానం ప్రాజెక్టు డీపీఆర్‌పై నెలాఖరులోగా అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) కోరింది. లేనిపక్షంలో ఆమోదించినట్లు (డీమ్డ్ టూ అప్రూవ్)గానే భావిస్తామని స్పష్టం చేసింది. ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మాణానికి గాను ఆయా రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంలో భాగంగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, పుదుచ్చేరి ముఖ్యమంత్రుల సంతకాలను తీసుకునే ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపింది. తెలంగాణ అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ.. అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా ఇచ్చంపల్లి వద్దే గోదావరిపై 87 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తామని తాజాగా రాష్ట్రానికి పంపించిన ప్రాజెక్టు ముసాయిదా డీపీఆర్‌లో ప్రతిపాదించింది. ఎన్నికలకు ముందు ఎన్‌డబ్ల్యూడీఏ ఈ విధంగా డెడ్‌లైన్ విధించడంపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

దిగువ జలాశయాలకు వరదలు తగ్గిపోతాయి: తెలంగాణ


అనుసంధాన ప్రాజెక్టులో భాగంగా 148 టీఎంసీల గోదావరి జలాలను తరలించాలని ప్రతిపాదించగా, ఆ మేరకు 16 టీఎంసీలను కర్ణాటకకు కేటాయిస్తూ ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయం తీసుకుంది. అయితే నదుల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా తరలించే జలాల నుంచి కాకుండా ప్రత్యమ్నాయ మార్గంగా కృష్ణా బేసిన్‌లోని మలప్రభ(కే-4) ఉపనదిపై నిర్మించిన ఆల్మట్టి బ్యారేజీ నుంచి 16 టీఎంసీలను కేటాయించడంపై తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడానికి బదులుగా సాగర్ ఎగువన ఉన్న రాష్ట్రాలకు కేటాయించిన 80 టీఎంసీల కృష్ణా జలాల్లో ఇప్పటికే 35 టీఎంసీలను కర్ణాటక, మహారాష్ట్రలు వాడుకుంటున్నాయి. తాజాగా మరో 16 టీఎంసీల కృష్ణా జలాలను వాడుకోవడానికి కర్ణాటకకు వీలు కల్పిస్తే భవిష్యత్తులో దిగువన ఉన్న జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలకు వచ్చే వరదలు తగ్గిపోతాయని తెలంగాణ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తెలంగాణ లేవనెత్తిన ఈ అంశాలను బేఖాతరు చేస్తూ ఎన్‌డబ్ల్యూడీఏ ముసాయిదా డీపీఆర్‌ను సిద్ధం చేయడం గమనార్హం.

ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీతో నష్టం!

నదుల అనుసంధానంలో భాగంగా ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే దిగువన ఉన్న సమ్మక్క బ్యారేజీకి వచ్చే వరదల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుందని కూడా తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. అయినా ఎన్‌డబ్ల్యూడీఏ పట్టించుకోవడం లేదు. ఇచ్చంపల్లి వద్ద కొత్త బ్యారేజీ నిర్మించడానికి బదులుగా సమ్మక్క (తుపాకులగూడెం) బ్యారేజీ నుంచే గోదావరి జలాలను తరలించాలని చేసిన సూచనను కూడా తిరస్కరించింది. వాస్తవానికి తెలంగాణకు గోదావరి జలాలు తరలించడానికి వీలుగా ఇచ్చంపల్లి వద్ద 118 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించడానికి 1980లో బచావత్ ట్రిబ్యునల్ అనుమతిచ్చింది. అయితే మధ్యప్రదేశ్, మహారాష్ట్ర అభ్యంతరాలతో తొలుత ఈ బ్యారేజీ ఎత్తును 112 మీటర్లకు తగ్గించారు. మళ్లీ 1986–88లో 108 మీటర్లకు, కాలక్రమంలో 105 మీటర్లకు తగ్గించారు. తాజాగా నదుల అనుసంధానంలో భాగంగా 87 మీటర్లకు ఎత్తును తగ్గించి బ్యారేజీ నిర్మించాలని ఎన్‌డబ్ల్యూడీఏ నిర్ణయించింది. ఇచ్చంపల్లికి 24 కిలో మీటర్ల దిగువన సమ్మక్క బ్యారేజీ ఉంది. దీంతో ఇచ్చంపల్లి బ్యారేజీ నుంచి అకస్మికంగా వరద విడుదల చేస్తే సమ్మక్క బ్యారేజీ వద్ద వరదల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతుందని తెలంగాణ అంటోంది. ఇచ్చంపల్లికి దిగువన ఉన్న దేవాదులకు 38 టీఎంసీలు, సీతారామాకు 70 టీఎంసీలు, తుపాకులగూడెంకు 50 టీఎంసీలు కలిపి మొత్తం 158 టీఎంసీల అవసరాలు తెలంగాణకు ఉన్నాయని, ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే వీటికి నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది.

మీ వాదనలేంటో తెలియజేయండి

- కౌశిక్‌రెడ్డి పిటిషన్‌లో దానం, ఈసీకి హైకోర్టు నోటీసులు
- స్పీకర్‌పై కోర్టులు ఒత్తిడి తేలేవన్న ఏజీ



సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో తమ వైఖరిని తెలియజేయాలంటూ హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని దానంతోపాటు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించింది. విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది. 'ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్.. ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేయకుండా మార్చి 15న సీఎం రేవంత్‌ను కలిసి కాంగ్రెస్‌లో చేరారు. దానంను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ మార్చి 18న, అనంతరం మార్చి 30న మరోసారి నేను ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశాం. అయినా స్పీకర్ నిర్ణయం తీసుకోలేదు. నాగేందర్‌పై మేము చేసిన ఫిర్యాదును పరిశీలించి, నిర్ణీత సమయంలో అతన్ని అనర్హుడిగా ప్రకటించేలా నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించాలి'అని కోరుతూ పాడి కౌశిక్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ (కౌశిక్‌రెడ్డి) తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే. ఆయనకు పిటిషన్ వేసే అర్హత ఉంది. అనర్హతపై స్పీకర్‌ను కలుద్దామని అనుకున్నా.. ఆయన ఎవరికీ అవకాశం ఇవ్వడం లేదు' అని చెప్పారు. అనర్హత అంశంపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌పై కోర్టులు ఒత్తిడి తీసుకురాలేవని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

సీబీఐ కేసులో కవితకు జ్యుడీషియల్ రిమాండ్

- తొమ్మిది రోజుల కస్టడీకి పంపిన న్యాయమూర్తి... తిరిగి తిహార్ జైలుకు తరలించిన అధికారులు
- కోర్టు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడటంపై ఆగ్రహం
- ఎన్నికలు, వైద్య పరీక్షల కోసం రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలంటూ కవిత పిటిషన్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి తీహార్ జైలుకు వెళ్లారు. ఇంతకుముందు ఈడీ కేసులో ఆమె తీహార్ జైలుకు వెళ్లగా.. ఇప్పుడు సీబీఐకి సంబంధించిన కేసులో రిమాండ్ అయ్యారు. కవితకు మూడు రోజుల సీబీఐ కస్టడీ ముగియడంతో.. అధికారులు సోమవారం ఉదయం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరుపర్చారు. ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టును కోరారు. తీహార్ జైల్లో, కస్టడీ సమయంలో కవితను విచారించినప్పుడు.. ఏమాత్రం సహకరించలేదని కోర్టుకు వివరించారు. సహ నిందితుల స్టేట్‌మెంట్లు, డాక్యుమెంటరీ ఆధారాలకు విరుద్ధంగా కవిత సమాధానాలు ఉన్నాయన్నారు. మహబూబ్‌నగర్‌లో ఎలాంటి భూమి లేకుండానే రూ.14 కోట్ల భూకొనుగోలు ఒప్పందం, మాగుంట శ్రీనివాసులురెడ్డి, విజయ్‌నాయర్‌లతో భేటీల గురించి ప్రశ్నిస్తే.. తగిన సమాధానాలు ఇవ్వలేదన్నారు. కస్టడీ సమయంలో కవితకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించామని, కుటుంబ సభ్యులను కలిసేందుకు అనుమతించామని.. అయినా ఆమె నుంచి ఎలాంటి సహకారం లేదన్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాధానాలు ఇస్తున్నందున ఇకపై కవిత కస్టడీ అవసరం లేదని పేర్కొన్నారు. కానీ కవిత ప్రముఖ రాజకీయ నాయకురాలు, పలుకుబడి కలిగిన వ్యక్తి అయినందువల్ల.. ఇంకా విచారించాల్సిన సాక్షులు, సేకరించాల్సిన సాక్ష్యాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని కోర్టుకు వివరించారు. ఈ క్రమంలో ఆమెను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని కోరారు. సీబీఐ వాదనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కవితకు తొమ్మిదిరోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. ఈ నెల 23న తిరిగి న్యాయమూర్తి ముందు కవితను హాజరుపర్చనున్నారు.

కవితపై న్యాయమూర్తి ఆగ్రహం

కవిత ప్రత్యేక కోర్టులోకి వస్తున్న సమయంలో అక్కడున్న జర్నలిస్టులతో మాట్లాడారు. ''ఇది సీబీఐ కస్టడీ కాదు.. బీజేపీ కస్టడీ.. రెండు నెలల నుంచి అడిగిందే అడుగుతున్నారు. బయట బీజేపీ అడిగిందే లోపల సీబీఐ అడుగుతోంది. కొత్తగా ఏమీ లేదు..''అని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసిన న్యాయమూర్తి.. కవితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టులు ప్రశ్నలు అడిగినంత మాత్రాన కోర్టు ప్రాంగణంలో ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. మరోసారి ఇలా చేయవద్దని స్పష్టం చేశారు.

రెగ్యులర్ బెయిల్ ఇవ్వండి

సీబీఐ కేసులో రెగ్యులర్ బెయిల్ ఇవ్వాలంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం రౌజ్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. 664 పేజీల ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి.. ఈ నెల 20లోపు కౌంటర్ కౌంటరు దాఖలు చేయాలని సీబీఐని ఆదేశించారు. దీనిపై 22న విచారణ చేపడతామని తెలిపారు. కాగా.. మద్యం కేసులో తన పాత్ర ఏమీ లేదని కవిత తన బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున సీబీఐకు తన సాయమేదీ అవసరం లేదని వివరించారు. తాను సమాజంలో పలుకుబడి ఉన్న మహిళనని, మరోవైపు దర్యాప్తు కూడా ముగింపు దశకు వచ్చిందని తెలిపారు. సహ నిందితులు విజయ్‌నాయర్, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు, అరవింద్‌కుమార్ సింగ్, చరణ్‌ప్రీత్ సింగ్‌లకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిందని గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా ఈ నెల 20 నుంచి ప్రచార సభల్లో పాల్గొనాల్సి ఉందని వివరించారు. తనకు మహిళలకు సంబంధించిన సమస్యపై వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మరోవైపు.. ఈడీ నమోదు చేసిన కేసులో కవిత దాఖలు చేసిన రెగ్యులర్ బెయిలు పిటిషన్‌పై మంగళవారం విచారణ జరగనుంది.



ఏఐయూ సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్. చిత్రంలో జీడీ శర్మ, మిట్టల్ తదితరులు

విద్యార్థుల ప్రతిభకు సానబట్టాలి

- యూనివర్సిటీలకు గవర్నర్ రాధాకృష్ణన్ పిలుపు
- పోటీ ప్రపంచంలో వారిని విజయ సోపానం వైపు నడిపించాలి
- భావి నాయకత్వానికి బాటలు వేయాలని వెల్లడి
- ఏఐయూ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగం

సాక్షి, హైదరాబాద్/శామీర్‌పేట్: విద్యార్థుల ప్రతిభకు సానబట్టి, వారిని మరింత అర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. పోటీ ప్రపంచంలో వారిని విజయ సోపానం వైపు నడిపించాల్సిన బాధ్యత చేపట్టాలని యూనివర్సిటీల వీసీలకు ఉద్బోధించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ (ఏఐయూ) సంస్థ 98వ వార్షిక సమావేశంలో భాగంగా మూడు రోజుల సదస్సును ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ నేతృత్వంలో 'ఉన్నత విద్య-2047'సదస్సు సోమవారమిక్కడ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన గవర్నర్ మాట్లాడుతూ, ఉన్నత విద్యలో వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకుని ముందుకెళ్లాలని విశ్వవిద్యాలయాలకు సూచించారు. దేశాభివృద్ధికి తోడ్పడుతున్న విద్యారంగానికి వీసీలు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ దిశగా ఏఐయూ చేస్తున్న కృషిని గవర్నర్ అభినందించారు. వికసిత్ భారత్ ప్రణాళికను సాకారం చేసే దిశగా విశ్వవిద్యాలయాలు కృషి చేస్తే అది భారత పురోగతికి దోహదపడుతుందని చెప్పారు. సరికొత్త ఆలోచనలను పంచుకునేందుకు ఈ సమావేశం వేదిక అవుతుందని ఆకాంక్షించారు. వైజ్ఞానిక పురోగతి గల భారత్‌ను నేటి తరం కోరుకుంటోందన్నారు. భారతీయ సంస్కృతిని అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లే ఉన్నత విద్య నేటి సమాజానికి అవసరమని పేర్కొన్నారు. నిత్యం ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, అవకాశాల వైపు దూసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సరికొత్త ఆలోచనలతో పారిశ్రామికాభివృద్ధి సాధించే యువత దేశాన్ని అగ్రపథంలోకి తీసుకెళ్తుందన్న ఆకాంక్ష వెలిబుచ్చారు. నైపుణ్యాభివృద్ధికి భారతీయ విద్యా విధానం ప్రాధాన్యత నివ్వాలన్నారు. పరిశోధన, డిజిటల్ విద్య ప్రపంచ అవకాశాలను దగ్గర చేసిందని రాధాకృష్ణన్ చెప్పారు. ఆశాజనక భవిష్యత్ అందించే కోర్సులకు విశ్వవిద్యాలయాలు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. డ్రగ్స్, అవినీతిరహితంగా భారత వర్సిటీలు ఆదర్శంగా నిలవాలని, దేశానికి మంచి నాయకత్వాన్ని అందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐయూ అధ్యక్షుడు జీడీ శర్మ, ప్రధాన కార్యదర్శిపంకజ్ మిట్టల్, ఇక్ఫాయ్ వీసీ గణేష్, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తెలంగాణ, ఏపీ సీఎస్‌లు శాంతికుమారి, జవహర్‌రెడ్డి. చిత్రంలో డీజీపీ తదితరులు

సమన్వయంతో ప్రశాంతంగా ఎన్నికలు

- తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల నిర్ణయం
- అంతర్రాష్ట్ర సమన్వయంపై ఇరు రాష్ట్రాల సీఎస్‌లు భేటీ

సాక్షి, హైదరాబాద్: సార్వత్రిక ఎన్నికలతోపాటు, ఏపీ అసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిర్ణయించాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, జవహర్ రెడ్డి సోమవారం తెలంగాణ సచివాలయంలో సమావేశమై అంతర్రాష్ట్ర సమన్వయంపై చర్చించారు. మే 13న పోలింగ్ సక్రమంగా నిర్వహించేందుకు సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాలు నిర్వహించామని శాంతికుమారి తెలిపారు. అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు, ఇతర ప్రలోభాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామని, శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందన్నారు. ఇదే రకమైన వాతావరణాన్ని పోలింగ్ వరకు కొనసాగించేందుకు ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల స్థాయి సమావేశం దోహదపడుతుందని చెప్పారు. గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టుల్లో మరింత అప్రమత్తత అవసరమని తెలిపారు. తెలంగాణ పోలీస్ శాఖ 36, అటవీ శాఖ 3, ఎక్సైజ్ శాఖ 8, వాణిజ్య పన్నుల శాఖ 7 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు 224 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలూ పటిష్టమైన గస్తీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలో తీవ్రవాద ప్రాబల్యం లేదని, ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల కార్యకలాపాలు జరగకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శాంతికుమారి పేర్కొన్నారు.

ఏపీలో ఆపరేషన్ పరివర్తన సక్సెస్

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తెలంగాణతో పూర్తి సమన్వయంతో వ్యవహరిస్తున్నామని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. ఏపీలో గంజాయి, మాదక ద్రవ్యాలు, గుడుంబా నిరోధానికి ఆపరేషన్ పరివర్తన పేరుతో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ సత్ఫాలితాలను ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల్లో పలు శాఖల ద్వారా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి అక్రమ మద్యం రవాణా, వివిధ వస్తువుల రవాణాను అడ్డుకుంటున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల నిఘా బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ డీజీపీ రవి గుప్తా, అడిషనల్ డీజీలు శివధర్ రెడ్డి, మహేష్ భగవత్, ఏపీ అడిషనల్ డీజీ డా.శంకబ్రత బాగ్చి, ఏపీ వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా. రజత్ భార్గవ పాల్గొన్నారు.



'స్వాలోయింగ్ ద సన్' పుస్తకావిష్కరణలో ముర్డేశ్వర్‌పూరి, సంగీతరెడ్డి, నవాబ్‌జంగ్ తదితరులు

యువతకు ఎంతో స్ఫూర్తి ఈ పుస్తకం

స్వాలోయింగ్ ద సన్ పుస్తకావిష్కరణలో వక్తలు

సాక్షి, హైదరాబాద్: యువతులు, మహిళలకు ఎన్నో అంశాల్లో 'స్వాలోయింగ్ ద సన్ నవల'స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రతి మహిళ, యువతి తనను తాను ఈ పుస్తకంలోని పాత్రల్లో చూసుకుంటుందని వారు పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో మహిళ పాత్ర ఎంత కీలకం అన్నది ఈ నవల ద్వారా యువతరానికి తెలుస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితి మాజీ అసిస్టెంట్ సెక్రటరీ జనరల్, అంబాసిడర్ లక్ష్మి ముర్డేశ్వర్‌పూరి రచించిన స్వాలోయింగ్ ద సన్ పుస్తకాన్ని సోమవారం తాజ్‌కృష్ణ హోటల్‌లో ప్రభాఖైతాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంగీతరెడ్డి, ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నవాబ్‌జంగ్ హాజరయ్యారు. పుస్తకావిష్కరణ అనంతరం నవాబ్‌జంగ్ మాట్లాడుతూ లక్ష్మి ముర్డేశ్వర్‌పూరి రాసిన ఈ నవల తాను చదువుతున్నప్పుడు ఎన్నో అంశాలు ఆలోచింపజేశాయన్నారు. దేశంలోని మరింతమంది పాఠకులకు చేరేలా వివిధ భారతీయ భాషల్లోకి దీనిని అనువదించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, తన పూర్వీకులు, కుటుంబసభ్యులు ఎంతోమంది ఈ నగరానికి చెందినవారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సంగీతరెడ్డి మాట్లాడుతూ లక్ష్మి ముర్డేశ్వర్‌పూరితో తనకు ఎంతో అనుబంధం ఉందని, ఆమె ఎంతో ప్రేరణ గా ఉంటారన్నారు. ఈ నవలలోని బాలికల పాత్రలు మహిళలు, యువతులకు ఎంతో ప్రేరణగా నిలుస్తాయని చెప్పారు. నవలారచయిత లక్ష్మి ముర్డేశ్వర్‌పూరి మాట్లాడుతూ 1918లో రత్నగిరి ప్రాంతంలో మొదలయ్యే ఈ నవల ప్రధానంగా ఇద్దరు అమ్మాయిల చుట్టూ తిరుగుతుందన్నారు. 2020 జూన్ నుంచి 2021 జూన్ వరకు రోజుకు 10 గంటలపాటు రాస్తూ దీనిని పూర్తి చేసినట్టు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల పాత్రను ఎక్కడా పెద్దగా చూపలేదని, అలాంటి ఎంతోమంది గురించి తన నవల తెలియజేస్తుందన్నారు. మహిళలు ఎక్కడైనా విజయం సాధించగలరని సందేశం ఇస్తుందన్నారు. సమాజంలోని భిన్న కోణాలు ఈ నవలలోని పాత్రలు స్పష్టం చేస్తాయన్నారు. ఇందులో ఆసక్తికరమైన అంశాలను నలంద వర్సిటీ మాజీ వీసీ డా.సునైనసింగ్, లక్ష్మి ముర్డేశ్వర్‌పూరిలు తమ చర్చ ద్వారా పాఠకులకు వివరించారు.

క్లుప్తంగా...

పారాబాయిల్డ్ బియ్యం సేకరణకు కేంద్రం ఆమోదం

- పీయుష్ గోయల్‌కు ధన్యవాదాలు తెలిపిన కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 2023–24 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల పారాబాయిల్డ్ రైస్ సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనిపై కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి పీయుష్ గోయల్‌కు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా రైతులకు కనీస మద్దతు ధరను, రాష్ట్ర ప్రభుత్వం హామీగా ఇచ్చిన రూ. 500 బోనస్‌ను చెల్లించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతుల నుంచి వరిధాన్యాన్ని వెంటనే సేకరించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు లబ్ధి చేకూరేందుకు వీలున్న అన్ని మార్గాల్లో కేంద్ర ప్రభుత్వం తనవంతు కృషిచేస్తుందని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

అవినీతి అనకొండలకు కాంగ్రెస్ అండ

- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- ఎంపీ రంజిత్‌రెడ్డి చేవెళ్లలో వేల ఎకరాలు కొల్లగొట్టారు



సాక్షి, హైదరాబాద్: అక్రమాలకు పాల్పడిన అవినీతి అనకొండలకు కాంగ్రెస్ అండగా నిలుస్తోందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి విమర్శించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి మోసగాళ్లకు నాయకుడిలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, నమ్మినవారిని నట్టేట ముంచే నయవంచకుడు రంజిత్‌రెడ్డి అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో చేరిక కోసం రంజిత్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి మధ్య జరిగిన చీకటి ఒప్పందం బయట పెట్టాలన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఎంపీ రంజిత్‌రెడ్డి వేల ఎకరాల భూములు అక్రమంగా కొట్టేశారన్నారు. సిద్దిపేట జిల్లా ధర్మాజీపేటలోని సర్వే నంబర్ 591లో 14 ఎకరాల అసైన్డ్ భూమిని బ్యాంక్‌లో తనఖా పెట్టి చట్టవిరుద్ధంగా రంజిత్‌రెడ్డి రూ.233 కోట్లు అప్పుతెచ్చుకున్నారని ఆరోపించారు. పుప్పాలగూడ సర్వే నంబర్ 341లో కాందిశీకులు, అసైన్డ్ భూముల్లో 1.40 కోట్ల చదరపు అడుగుల అక్రమ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఈ అక్రమ నిర్మాణాల కోసమే రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారని జీవన్‌రెడ్డి విమర్శించారు.

బీసీలకు మోదీ గ్యారంటీ దక్కలేదు: జాజుల



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ విడుదల చేసిన సంకల్ప పత్రంలో బీసీలకు ఎలాంటి గ్యారంటీ దక్కలేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 60 శాతంపైగా ఉన్న బీసీలకు బీజేపీ మేనిఫెస్టోలో ఎలాంటి హామీ దక్కలేదన్నారు. బీసీల రాజ్యాంగ బద్ధమైన హక్కులు, జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు సమగ్ర కులగణన, ప్రత్యేక మంత్రిత్వ శాఖ తదితరాలను డిమాండ్ చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీజేపీ పార్టీ వీటిని పరిగణనలోకి తీసుకోలేదని విమర్శించారు. గత పదేళ్ల కాలంలోనూ మోదీ బీసీలకు చేసింది శూన్యమన్నారు. బీసీలకు రేషన్ బియ్యం, ముద్ర లోన్లు, సబ్సిడీ గ్యాస్ అవసరం లేదని, బీసీలకు కావాల్సింది సమగ్ర కులగణన, చట్టసభలలో రిజర్వేషన్లు, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంపు, కేంద్ర బడ్జెట్లో వాటా కావాలని జాజుల డిమాండ్ చేశారు.

రాజీవ్ రతన్‌కు పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ సంతాపం

సాక్షి, హైదరాబాద్: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి రాజీవ్‌రతన్‌కు తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో సోమవారం సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ ఎం.రమేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ, రాజీవ్ రతన్ చిత్తశుద్ధి, నిజాయితీ, విధి నిర్వహణ అభినందనీయమని అన్నారు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ, రాజీవ్ క్రమశిక్షణ, విలువల గురించి తన సహోద్యోగులతో సదా చర్చించేవారన్నారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేశ్ రాజీవ్ రతన్‌తో కలిసి వివిధ విభాగాల్లో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. రాజీవ్ రతన్ ఆకస్మిక మరణంపై పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులు, సిబ్బంది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు. చీఫ్ ఇంజనీర్ డి.తులసీధర్, ఆర్థిక సలహాదారు ఆర్.సి.కుమార్‌తో పాటు ఇంజనీరింగ్, మినిస్టీరియల్ సిబ్బంది రాజీవ్ రతన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

- ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వడం లేదు
- ఇప్పటి వరకు 2.69 ఎల్ఎంటీ ధాన్యం కొనుగోలు
- ధాన్యం వేలం ద్వారా పౌరసరఫరాల సంస్థకు అదనపు ఆదాయం
- అవగాహన లేమితో బీఆర్ఎస్ నాయకుల విమర్శ
- జూన్ 9న ప్రధానిగా రాహుల్‌గాంధీ ప్రమాణం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి లాభనష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా రైతులను ఆదుకోవాలనేదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. తెలంగాణ ఏర్పాటైన నాటి నుంచి ఇంత సమర్థవంతంగా ధాన్యం కొనుగోళ్లు సాగిందెప్పుడూ లేదని చెప్పారు. ధాన్యం కొనుగోళ్లు, పౌర సరఫరాల శాఖ పనితీరుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న విమర్శలు అవగాహనా రాహిత్యంతో కూడినవని ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను కనీస మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామన్నారు. తరుగు, తాలు పేరుతో ధాన్యం అదనంగా తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ ఏడాది మార్చి 23నే ప్రారంభించేలా కేంద్రం నుంచి అనుమతి పొంది, తెరిచామన్నారు. గత ఏడాది యాసంగి కొనుగోళ్లు ఏప్రిల్ 9 నుంచి మొదలైనట్టు చెప్పారు. గత ఏడాది 7,031 కొనుగోలు కేంద్రాలు ఉంటే ఇప్పుడు 7,149 ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో ఇప్పటికే 6,919 కేంద్రాలు ప్రారంభించామని, ఈ సమయానికి గత ఏడాది 335 ధాన్యం కేంద్రాలు మాత్రమే ప్రారంభించారని వివరించారు. ఇప్పటి వరకు 2,69,699 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు.

సిద్దిపేటలో గత ఏడాది ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం లేదు

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఎమ్మెల్యే హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు అవగాహనారాహిత్యంతో కూడుకున్నవని ఉత్తమ్ అన్నారు. సిద్దిపేటలో గత ఏడాది ఈ సమయానికి ఒక్క ధాన్యం కొనుగోలు కేంద్రం కూడా ప్రారంభించలేదని, ఈసారి మాత్రం 418కేంద్రాలు ప్రారంభించినట్టు తెలిపారు. కొన్ని చోట్ల వ్యాపారులు రైతుల నుంచి కనీస మద్దతు ధర కన్న ఎక్కువకు ధాన్యాన్ని కొనుగోలు చేశారని, ఇది రైతులకు మేలు చేసేదేనన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకుల ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకున్నట్టు వివరించారు. తెలంగాణ రైతాంగం ధాన్యాన్ని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవద్దని స్పష్టం చేశారు.

272 స్థానాల కన్నా ఎక్కువ గెలుస్తాం

దేశంలో ఇండియా కూటమి 272 స్థానాలకంటే ఎక్కువగానే గెలుస్తుందని మంత్రి ఉత్తమ్ జోస్యం చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రిగా జూన్ 9న ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. తన రాజకీయ అనుభవంతో చెబుతున్న మాటలు ఇవని, ఇండియా కూటమి గెలుస్తుందని చెప్పారు. కిషన్‌రెడ్డి చేసిన దీక్ష ఉత్తిదేనని కొట్టివేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలలో వాస్తవాలు లేవని, అవగాహన లేక మాట్లాడుతున్నారనని విమర్శించారు.

ధాన్యం టెండర్లతో మెరుగైన ఆదాయం

రైస్ మిల్లుల్లో నిల్వ ఉన్న గత సంవత్సరం యాసంగి ధాన్యాన్ని వేలంలో విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి మెరుగైన ఆదాయం సమకూరుతుందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. నిల్వ ఉన్న ధాన్యాన్ని గత ప్రభుత్వ హయాంలో క్వింటాల్‌కు రూ.1,702కు విక్రయించేందుకు టెండర్లు పిలిచారని, 2వేల కోట్ల నష్టానికి టెండర్లు వచ్చాయని చెప్పారు. తర్వాత అవి రద్దు కావడంతో రెండోసారి టెండర్లు ఆహ్వానించారని, ఎన్నికల కోడ్‌తో అవి ఆగిపోయాయని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కమిటీ వేసి అదే ధాన్యం అమ్మివేస్తే.. క్వింటాల్‌కు రూ. 2022 వచ్చిందని, గత ప్రభుత్వంలో సన్న బియ్యం, దొడ్డు బియ్యానికి తేడా లేకుండా వేలంలో అమ్మి వేశారని వివరించారు. ఈసారి ధాన్యం వేలం వేయడం ద్వారా బీఆర్ఎస్ హయాంలో వచ్చిన మొత్తాని కన్నా రూ.1110.05 కోట్లు ఎక్కువగా వచ్చాయన్నారు.

ఇంకా ఎన్నాళ్లు ప్రతిష్టంభన?


మార్కెట్ గేటు ఎదుట గడ్డిని తగులబెట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

- ధాన్యం కొనుగోళ్లపై జనగామ మార్కెట్‌లో వీడని చిక్కుముడి
- మొదలుకాని ప్రైవేట్ కొనుగోళ్లు
- ఆగ్రహించిన రైతులు
- గడ్డి తగులబెట్టి నిరసన
- నేడు కొనుగోళ్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు

జనగామ: ప్రైవేట్ ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రతిష్టంభన కొనసాగడంతో జనగామ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయం గేటు ఎదుట గడ్డికి నిప్పు అంటించి నిరసన చేపట్టడంతో ఒకింత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ సెంటర్లతో పాటు తేమ శాతం ఆధారంగా ప్రైవేట్ కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు. 30 నుంచి 50 శాతం తేమ ఉన్న ధాన్యం ఆరబోస్తే 17 శాతం రావడానికి మూడు రోజులు పడుతుందనీ, ఇన్ని రోజులు పనులు వదులుకుని ఇక్కడ ఉండలేమంటూ అధికారులను నిలదీశారు. ధాన్యం ఆరబోయడానికి మార్కెట్‌లో స్థలమే లేదని, పచ్చి ధాన్యం కుప్పలు మూడు, నాలుగు రోజులు ఒకే చోట ఉండడంతో బూజు పట్టి మొలకత్తే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ట్రేడర్లు కూడా ఎంఎస్‌పీకి కొనుగోలు చేయాలనే నిబంధనలు ఉన్నాయని, తేమ విషయం తమ పరిధిలో లేదని అధికారులు చెప్పడంతో రైతులు భగ్గుమన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రైతులు

కలెక్టర్ రిజ్వాన్ బాష వద్దకు కొంతమంది రైతులు వెళ్లి మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితిని వివరించారు. రూ.1,650 నుంచి రూ.2వేల వరకు ధర వచ్చేలా చూడాలని కోరారు. ట్రేడర్లు, అడ్తి వ్యాపారులను పిలిపించిన కలెక్టర్ మంగళవారం రైతుల విజ్ఞప్తి మేరకు ప్రైవేట్ కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. అయితే ధర ఎంతనేది కొనుగోళ్లు ప్రారంభమైన తర్వాత తెలియనుంది. కాగా, మార్కెట్‌లో 295 మంది రైతులకు చెందిన సుమారు 30వేల బస్తాలకు పైగా ధాన్యం నిల్వలు పేరుకు పోయాయి.

రైతు రుణాలను రికవరీ చేయొద్దు


- బ్యాంకులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- రుణమాఫీ పథకాన్ని తీసుకొస్తామని.. అప్పటివరకు ఇబ్బంది పెట్టొద్దని వినతి
- రైతు భరోసా పథకం విధివిధానాలపై కసరత్తు జరుగుతోందని వెల్లడి
- వానాకాలం సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ పథకాన్ని తీసుకొస్తామని, అప్పటివరకు బ్యాంకులు, ప్రాథమిక సహకార పరపతి సంఘాలు రైతులను పంటరుణాల రికవరీ పేరుతో ఇబ్బందులు పెట్టవద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, సంబంధిత అధికారులతో చర్చించి రుణమాఫీ చేస్తామని చెప్పారు. ఈ అంశంపై సోమవారం మంత్రి తుమ్మల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వచ్చే వానాకాలం సీజన్‌కు ఎరువులు, విత్తనాలను ముందుగానే సిద్ధం చేసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డులకు తీసుకువచ్చే ధాన్యానికి గిట్టుబాటు ధర అందేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. పండ్ల పక్వానికి కార్బైడ్ ప్రయోగించే వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, శనగ, జొన్న సహా అన్ని రకాల పంటల కొనుగోలు సజావుగా సాగేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది నుంచి పంటల బీమా అమలుకు ప్రతిపాదనలను పరిశీలించి, ఎన్నికల సంఘం అనుమతితో ఈ ఖరీఫ్ కాలానికి అమలుచేసే విధంగా టెండర్ల ప్రక్రియ చేపట్టాల్సిందిగా ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం ఏ ఒక్కరైతు, ఏ ఒక్క ఎకరానికి ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయే సందర్భం ఇక ఉండకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. రైతుభరోసా పథకాన్ని అమలు చేసే విధివిధానాల మీద కసరత్తు జరుగుతోందని, వచ్చే ఖరీఫ్ నుంచి దీనిని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన విధానాన్ని రూపొందించి, అర్హులైన వారందరికీ రైతుభరోసా సొమ్ము అందజేస్తామని తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి అన్ని రకాల పంటలకు అవసరమయ్యే విత్తన సరఫరాలో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవల్సిందిగా ఆదేశించారు. ఎరువులను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి, దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల వరకు జూన్ నెల ఆరంభంలోనే నిల్వలు ఉండేవిధంగా చూడాలని సూచించారు. ఇప్పటికే నాలుగున్నర లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉంచామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలకు సంబంధించి టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ఎన్నికల సంఘం అనుమతులు కోరామని, అనుమతి రాగానే రైతులకు సబ్సిడీపై అందుబాటులో ఉంచుతామని వివరించారు.

రైతుల పోస్టుకార్డు ఉద్యమం

- ఎన్నికల హామీలు అమలు చేయాలని సీఎం రేవంత్‌కు లేఖలు


సీఎం రేవంత్ రెడ్డికి రైతు తిరుపతి రాసిన ఉత్తరం

సాక్షి, సిద్దిపేట: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సిద్దిపేట రైతులు వినూత్నంగా పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి కార్డుల ద్వారా తమ ఆవేదనను వ్యక్తంచేశారు. సిద్దిపేట అర్బన్, రూరల్, నారాయణరావు పేట, చిన్నకోడూరు, నంగనూరు మండలాలకు చెందిన రైతులు తమ ఆవేదనను పోస్టు ద్వారా తెలిపారు. క్వింటాలు వడ్లకు రూ.500 బోనస్, రైతుబంధు ఎకరానికి రూ.15 వేలు, కౌలు రైతులకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు, రూ.2 లక్షల రుణమాఫీలను విస్మరించారని ఆరోపించారు. హామీలను వెంటనే అమలు చేయాలని, లేదంటే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌కు చెందిన సంపంగి తిరుపతి పోస్టుకార్డు రాస్తూ 'నేను రెండెకరాల్లో వరి సాగు చేశాను. పంట కోతకు వచ్చింది. మీరు ఇస్తామని చెప్పిన క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వలేదు. అలాగే రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, సాగు నీరు అందించాలి'అని కోరారు. ఈ ఉద్యమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

15,246 మంది రైతులకు నష్ట పరిహారం

- చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం
- గత నెలలో అకాల వర్షంతో జరిగిన నష్టంపై వ్యవసాయశాఖ నిర్ధారణ
- 15 వేల ఎకరాల్లో పంట నష్టం
- ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.15.81 కోట్లు ఖరారు
- నేడో రేపో రైతుల ఖాతాలో జమ చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గత నెల వడగళ్లు, అకాల వర్షాలకు 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయశాఖ నిర్ధారించింది. 15,246 మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు నష్టపోయాయనీ, వారందరికీ నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ. 15.81 కోట్లు పరిహారం అందజేయాలని భావిస్తోంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకుని, నేడో రేపో రైతుల ఖాతాల్లో నష్ట పరిహారపు సొమ్ము జమ చేయాలని నిర్ణయించినట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. మొత్తం పది జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ పేర్కొంది. అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 10,328 ఎకరాల్లో నష్టం జరిగిందని అధికారులు వెల్లడించారు.

తక్కువ అంచనా వేశారా?

గత నెలలో అకాల వర్షాలు, వడగళ్ల వానలు, ఈదురు గాలులకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని కింది స్థాయిలో అధికారులు అంచనా వేశారు. వరి, మొక్కజొన్న, జొన్న, పొగాకు, వేరుశనగ, మిర్చి, కూరగాయలు, బొప్పాయి, ఉల్లి పంటలు బాగా దెబ్బతిన్నాయి. వరి పొలాలకు నీళ్లు లేక ఎండిపోయి దెబ్బతినటంతోపాటు ఈ వర్షాల వల్ల ఉన్న కాస్త వరి ధాన్యం కూడా నేలరాలిపోయింది. ఈక్రమంలో భారీ నష్టం వాటిల్లినా కేవలం 15 వేల ఎకరాల వరకే నష్టం జరిగిందని వ్యవసాయశాఖ నిర్ధారించడంపై విమర్శలు వస్తున్నాయి. చివరకు వ్యవసాయశాఖ వేసిన 20 వేల ఎకరాల పంట నష్టాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గత ప్రభుత్వం మాదిరిగానే పరిహారం

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గతేడాది ఒకసారి తీవ్రమైన వర్షాలతో పంటలకు నష్టం జరిగినప్పుడు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇచ్చిన సంగతి తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు కూడా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈసీ అనుమతి తీసుకొని పరిహారం ఇవ్వాలని నిర్ణయించినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వెల్లడించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్‌ను కోరాలని అధికారులను ఆదేశించామన్నారు.


బీజేపీలో చేరిన పీఆర్టీయూ నేత చెన్నకేశవరెడ్డి

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, తదితరులు పార్టీలో చేరారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, బి.నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.

'ఆర్‌టీఐ కమిషనర్లను నియమించాలి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్, కమిషనర్లను నియమించాలని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్–తెలంగాణ (యూఎఫ్–ఆర్‌టీఐ) కోరింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి యూఎఫ్–ఆర్‌టీఐ రాష్ట్ర కన్వీనర్ మహేశ్, మహిళా కోకన్వీనర్ సోమలక్ష్మి, కోకన్వీనర్ జంగయ్య లేఖరాశారు. పాలన పారదర్శకంగా ఉండేలా అధికార యంత్రాంగం, పౌరులకు జవాబుదారీతనంగా ఉండాలంటే ఆర్‌టీఐ కమిషనర్లను వెంటనే నియమించాలన్నారు.

బీజేపీకి బీఆర్ఎస్ తాకట్టు



నారాయణపేట కాంగ్రెస్ జనజాతర సభలో వంశీచంద్‌ను పరిచయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి • సభకు హాజరైన జనం

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీహరిలకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి అసెంబ్లీకి పంపించాం. తెలంగాణలో 10 శాతం ఉన్న ముదిరాజ్‌లను కేసీఆర్ విస్మరించారు. కానీ కాంగ్రెస్ ముదిరాజ్ బిడ్డను ఎమ్మెల్యే చేయడంతోపాటు మెదక్ ఎంపీ అభ్యర్థిగా నీలం మధు ముదిరాజ్‌కు అవకాశం కల్పించాం. మెదక్‌లో నీలం మధును, మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చడంపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. కేసీఆర్ నిర్లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించకపోవడం వల్లే లక్షలాది ముదిరాజ్ బిడ్డలకు ఉద్యోగాల్లో అన్యాయం జరిగింది. ఇప్పటికైనా బీసీ–డీ నుంచి బీసీ–ఏకు మార్చాలంటే.. మంచి వకీళ్లను పెట్టి మీ వాదన బలంగా వినిపించాలంటే వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలి. తెలంగాణలో 14 ఎంపీ సీట్లు గెలిపిస్తే ఆగస్టు 15లోపు ముదిరాజ్ బిడ్డను మంత్రిని చేసే బాధ్యత నాది.

ఎస్సీ వర్గీకరణ చట్టం బాధ్యత మాదే..

ఎస్సీ వర్గీకరణపై కేసీఆర్ పదేళ్లుగా సుప్రీంలో కేసు వాదించకపోతే.. ఉద్ధండులైన న్యాయవాదులతో నేను వాదన వినిపించా. ఎస్సీ వర్గీకరణ కోసం కొట్లాడిన ఓ వ్యక్తి మోదీకి ఓటేయాలని అంటున్నారు. మరి ఆయనను కేసీఆర్ అరెస్టు చేయించిననాడు ఎవరూ పలకరించలేదు. నేను బెయిల్ ఇప్పించా. పోలీసుల నిర్బంధం కొనసాగుతున్నా.. పరేడ్ గ్రౌండ్స్‌లో ధర్మయుద్ధం కార్యక్రమానికి అండగా నిలిచా. సిరిసిల్ల రాజయ్యకు ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా.. అద్దూరి లక్ష్మణ్‌కు విప్‌గా, పాల్వాయి రజనికి టీఎస్‌పీఎస్సీ మెంబర్‌గా, ప్రీతం కుమార్‌కు చైర్మన్‌గా అవకాశం ఇచ్చాం. రానున్న రోజుల్లో కూడా పార్టీ తీసుకునే నిర్ణయాల్లో, నియామకాల్లో మాదిగలకు సముచిత స్థానం కల్పిస్తాం. ఎస్సీ వర్గీకరణ చట్టం చేసే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుంది.

పాలమూరులో డీకే అరుణ కుట్రలు..

డీకే అరుణ బీజేపీ ముసుగులో బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌రెడ్డిని పడగొట్టాలని.. బలహీనం చేసి, పాలమూరును ఎండబెట్టాలని ప్రయత్నం చేస్తున్నారు. మేం కురుమ యాదవులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని గద్వాలలో సరితకు టికెట్ ఇస్తే.. గద్వాల కోటలో కుట్రలు చేశారు. అరుణ నాయకత్వంలో బీజేపీ ఓట్లు బీఆర్ఎస్‌కు వేయించి ఓడగొట్టారు. సరిత గెలిస్తే మంత్రి అయ్యేవారు. అరుణ రాజకీయాలతో ఆ సామాజిక వర్గానికి అన్యాయం జరిగింది. ఆనాడు బీజేపీ వాళ్లు బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు బీఆర్ఎస్ వాళ్లు బీజేపీకి ఓట్లు వేసేలా కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి..'' అని రేవంత్ సూచించారు. ఈ సభలో ఎమ్మెల్యేలు పర్ణికా రెడ్డి, వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల వ్యతిరేకి డీకే అరుణ: వంశీచంద్‌రెడ్డి

డీకే అరుణ బలహీనవర్గాల వ్యతిరేకి అని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి మండిపడ్డారు. ''అరుణమ్మ నువ్వు బంగ్లా రాజకీయాలు చేసే దొరసానివి. పూటకో పార్టీ మార్చే దొరసానివి. మక్తల్‌లో శ్రీహరిని ఓడించి.. సొంత పార్టీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని కాదని తమ్ముడు రామ్మోహన్‌రెడ్డిని గెలిపించాలని చూసిన ముదిరాజ్‌ల వ్యతిరేకివి. గద్వాలలో యాదవ సోదరి సరితను ఓడించి అల్లుడిని గెలిపించేందుకు బంగ్లా రాజకీయాలు చేశావు..'' అని ఆరోపించారు. డీకే అరుణకు పదవుల మీద ఉన్న ప్రేమ అభివృద్ధి మీద లేదని విమర్శించారు.



నీ శీలాన్ని నాశనం చేయగలిగినప్పుడు మాత్రమే
అది నీ జీవితాన్ని నాశనం చేస్తుంది. లేదంటే అది నీకు
ఏ నష్టమూ కలిగించలేదు – అంతర్గతంగా, బహిర్గతంగా!
– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 16 ఏప్రిల్ 2024

కుట్రదారుల పనిబట్టాలి!

ప్రారంభమైంది మొదలు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు పోటెత్తుతున్న జనవాహినిని చూసి పుట్టగతులుండవని ఎంచిన ప్రత్యర్థులు శనివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై పన్నిన కుట్ర వెంట్రుకవాసిలో భగ్నమైంది. పైనున్న దేవుడి ఆశీస్సులూ, అశేష ఆంధ్ర ప్రజానీకం ఆశీర్వాదాలూ తనకు పుష్కలంగా వున్నాయని జగన్ తరచు చెబుతుంటారు. విజయవాడ సింగ్ నగర్‌లో గుర్తుతెలియని దుండగులు చీకటిచాటున పదునైన వస్తువును గురిచూసి ప్రయోగించినప్పుడు అదే రుజువైంది. నేరుగా కణతకు గురిపెట్టి హాని తలపెట్టాలన్న ఉన్మాదుల పన్నాగం ఆయన ప్రజలకు అభివాదం చేస్తూ పక్కకు తిరగటంతో త్రుటిలో తప్పింది. ఎడమకన్ను పైభాగాన గాయమైంది. పక్కనే వున్న వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ సైతం ఈ దాడిలో గాయపడ్డారు. అంతక్రితం పాలనానుభవం లేని ఒక ముఖ్యమంత్రి అయిదేళ్ల అనంతరం 'మీ ఇంట్లో మంచి జరిగుంటేనే ఓటేయండి' అని అడుగుతుంటే ఇంత పెద్దయెత్తున ప్రజలు ఎదురేగి నీరాజనాలు పట్టడం బహుశా దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. అందుకే కూటమి నేతలు తట్టుకోలేకపోయారు. ఎడమవైపు కనుబొమ్మ పైభాగాన లోతుగా పడిన గాయం బాధిస్తున్నా... వాపు పూర్తిగా తగ్గకపోయినా జగన్ సోమవారం యధావిధిగా కొనసాగించిన బస్సుయాత్రకూ, గుడివాడలో నిర్వహించిన బహిరంగసభకూ మరిన్ని రెట్లు ఎక్కువగా జనవాహిని తరలిరావటం గమనించాక త్రికూటమికి, ప్రత్యేకించి టీడీపీకి తత్వం బోధపడి వుండాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్నీ, పార్టీనీ కబ్జా చేసినప్పటికన్నా చాలా ముందే చంద్రబాబు రాజకీయాలను కలుషితం చేశారు. జర్నలిస్టు పింగళి దశరథరామ్ హత్య, కాపు నాయకుడు వంగవీటి రంగాను అత్యంత దారుణంగా హతమార్చటం, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి దుర్మరణం వగైరాల్లో బాబుపై ఆరోపణలు రావటం యాదృచ్ఛికం కాదు. కేంద్రంలో తొలి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహించిన వాజపేయి అంతటి నాయకుడే బాబు తీరుతెన్నులు గమనించి దిగ్భ్రాంతి చెందేవారని ఆ రోజుల్లో కథనాలొచ్చేవి. తెరవెనక పావులు కదపడం, జరిగింది ఒకటైతే బయటకు వేరేలా చూపటం, మంచిని తన ఖాతాలో వేసుకుని, పొరపాట్లు అవతలివారిపై రుద్దటం బాబుకు వెన్నతో పెట్టిన విద్య. ఫలానావారిని ప్రధానిని చేశాను... ఇంకొకరిని రాష్ట్రపతిని చేశాను అని చెప్పుకోవటం ఆయనకు అలవాటైన విద్య. రాజకీయాల్లో శత్రువులుండరని, ప్రత్యర్థులు మాత్రమే వుంటారని ఇన్నేళ్ల అనుభవం తర్వాత కూడా బాబు గ్రహించలేకపోయారని ఆయన తరచుగా మాట్లాడే మాటలు, చేసే ప్రసంగాలు రుజువు చేస్తున్నాయి. కనీసం ఈ అవసాన దశలోనైనా నలుగురికీ ఆదర్శంగా వుండాలన్న ఇంగితజ్ఞానం లేకపోగా మరింత అధమస్థాయి రాజకీయాలు చేసే సినీ నటుడు పవన్ కల్యాణ్‌ను వెంటేసుకుని ఆయన ఉన్మాదిలా రెచ్చిపోతున్న తీరు అందరికీ దిగ్భ్రాంతి కలిగిస్తోంది. సరిగ్గా ముఖ్యమంత్రిపై దాడి జరగడానికి కొన్ని గంటల ముందు తాడికొండలో బాబు చేసిన ప్రసంగమే అందుకు తార్కాణం. 'ప్రతి ఒక్కరూ రాయి తీసుకుని, ఏది దొరికితే అది తీసుకుని ఆ దున్నపోతుపై దాడి చేయండి' అంటూ ఆయన రెచ్చగొట్టారు. సొంత పార్టీ కార్యకర్తలను ఇలా గూండాలుగా, హంతకులుగా మార్చాలనుకోవటం ఏ మార్కు రాజకీయమో ఆయనకు అవగతమవుతున్నట్టు లేదు. వయసు ముదిరిన ఈ దశలో బాబుకు పరిణతి రావటం అసంభవం. కనీసం చట్టమైనా దుండగులను శిక్షించగలిగితే ఇతరులకు జ్ఞానోదయమవుతుంది. 'ఆవు చేలో మేస్తే... దూడ గట్టున మేయదు' అంటారు. రాజకీయాల్లోకొచ్చి దాదాపు పదేళ్లవుతున్నా, ఒకటి కాదు– రెండు మంత్రి పదవులు వెలగబెట్టినా ఏ భాషలోనూ తప్పుల్లేకుండా పలకడంరాని లోకేష్ వంచనలో, వాచాలత్వంలో మాత్రం తండ్రిని మించారు. ఇలాంటివారంతా ప్రజాస్వామ్యం మాటున వీరంగం వేస్తుంటే అవాంఛనీయ ఉదంతాలు జరగటంలో ఆశ్చర్యమేముంది?

ఏం నేరం చేశారు జగన్? ఏ పథకం పెట్టినా దళారుల భోజ్యంగా మారే తీరును సమూలంగా మార్చారు. వాలంటీర్ల వ్యవస్థను నెలకొల్పి నేరుగా నిరుపేదల ముంగిటకే పథకాలు వెళ్లే సరికొత్త విధానం తీసుకొచ్చారు. గ్రామసచివాలయాలు ఏర్పాటుచేశారు. ఇళ్లులేని పేదలను గుర్తించి దరఖాస్తు చేయించి రూ. 10 నుంచి 15 లక్షల విలువైన ఆస్తుల్ని కట్టబెట్టారు. వాగ్దానం చేసిన నవరత్నాలే కాదు... మరిన్ని పథకాలు ప్రజలకందించారు. విద్య, వైద్యరంగాల ప్రక్షాళనకు నడుం బిగించారు. రైతుభరోసా కేంద్రాలు నెలకొల్పారు. రైతులకు అండగావున్నారు. విలేజ్ క్లినిక్‌లు, ఆరోగ్యశ్రీ తదితరాలతో జనహృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. అలాంటి నేతను దుర్భాషలతో, దుశ్చర్యలతో ప్రజలకు దూరం చేయాలని చూడటం తెలివితక్కువతనమని ఆ ముఠాకు మరో నెలరోజుల్లో అర్థమవుతుంది.

సత్సంకల్పంతో రాజకీయాలు నెరపేవారినీ, మంచి పాలన అందిస్తున్నవారినీ ప్రజలనుంచి వేరుచేయటం అసాధ్యం. మండుటెండల్ని సైతం లెక్కచేయకుండా బస్సు యాత్ర పొడవునా బడి పిల్లలు మొదలుకొని వృద్ధులవరకూ అన్ని తరాలవారూ, అన్ని వర్గాలవారూ కనబడటం జగన్ మంచి పనులకు నిదర్శనం. విజయవాడ దురంతం వెనకున్న సూత్రధారులనూ, పాత్రధారులనూ సత్వరం బంధించి, కఠినశిక్ష పడేలా చేసినప్పుడే హత్యారాజకీయాలకు అడ్డుకట్టపడుతుంది. నాయకులు బాధ్యతాయుతంగా మెలగటం నేర్చుకుంటారు.

పెత్తందారులు విసిరిన రాయి

అమెరికా అధ్యక్షుడు అబ్రహాం లింకన్ మీద ఏప్రిల్ 14న (1865) దాడి జరిగింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మీద ఏప్రిల్ 13న దాడి జరిగింది. శ్వేత జాతీయుడయినప్పటికీ నల్ల జాతీయుల హక్కుల కోసం లింకన్ అలుపెరుగని పోరాటం చేశారు. పేదవాళ్ళు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియంలో చదవాలని జగన్ సంకల్పించారు. లింకన్ సమయంలోనే కాదు, ఇప్పుడు కూడా పేదలు ఆత్మగౌరవంతో తల ఎత్తి నిలబడితే పెత్తందార్లకు కడుపు మంట. లింకన్‌ను కేవలం భౌతికంగా నిర్మూలించడం కాదు, లింకన్ సమానత్వ ఎజెండాను సమాధి చేయడం అప్పటి లక్ష్యం. జగన్ మీదకు ఈ పెత్తందార్లు విసిరిన రాయి లక్ష్యం జగన్‌ను కేవలం భౌతికంగా గాయపరచడం కాదు, ప్రగతి పథంలో సాగుతున్న జగన్ ప్రయత్నాన్ని స్తంభింపజేయడం!

సమానత్వ సాధనను అడ్డుకునేందుకే...



సామాన్య

ఏప్రిల్ 13న తనను ఎన్నుకున్న ప్రజల మధ్య ప్రయాణిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మీద జరిగిన దాడి, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసింది. భౌతిక దాడులకు దిగి, ఎన్నికల రూపంలో చేయాల్సిన పోరాటాన్ని ఆయుధ పోరాటంగా మార్చిన వ్యక్తులు ఒక అనాగరిక సాంప్రదాయానికి మళ్ళీ తెరతీశారు. కేవలం ఆయనకు వున్న ప్రజాదరణ చూసి, మళ్లీ ముఖ్యమంత్రి కావచ్చునేమో అని ఓర్వలేక వారు అలా దాడి చేశారా?

అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ఇదే ఏప్రిల్ నెలలో హత్య కావించబడ్డారు. సామాన్య ప్రజలతో కలిసిపోయి వారిలో ఒకడిగా సంభాషణ చేయగల సామర్థ్యం, సాటి మనిషిపై సహానుభూతి ఆయన ప్రధాన లక్షణాలు. శ్వేత జాతీయుడయినప్పటికీ నల్ల జాతీయుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారు. అంతర్యుద్ధం తర్వాత దేశాన్ని సమానత్వం ప్రాతిపదికగా పునర్ నిర్మించాలని సంకల్పించారు. బానిసత్వ నిర్మూలన, ఆఫ్రికన్ అమెరికన్‌లకు భూమి హక్కులు, ఓటు హక్కు కల్పించడం అందులో ముఖ్యమైన అంశాలు. ఆధిపత్య శ్వేత జాతీయ దురహంకార రాష్ట్రాలు అంతర్యుద్ధం తీసుకువచ్చినా వెనకాడలేదు. 'మనుష్యులందరూ సమానంగా సృష్టించబడ్డారు' అని నినాదమిచ్చారు.

యూనియన్ విక్టరీ తరువాత శ్వేత జాతీయుల నాయకుడు రాబర్ట్ ఇ. లీ లొంగిపోయిన అయిదు రోజులకు 1865 ఏప్రిల్ 14న సాయంత్రం లింకన్ వాషింగ్టన్ డి.సి.లో నాటకం వీక్షించడానికి సతీ సమేతంగా వెళ్ళారు. జాన్ విల్కిస్ బూత్ అనే నటుడు, శ్వేతజాతి ఆధిక్యతావాది లింకన్‌ను వెనక నుండి అతి దగ్గరగా కాల్చాడు. మనుషులందరూ సమానమే అని లింకన్ చేసిన ప్రకటన, ఆయన చర్యలు, శ్వేతజాతి దురహంకారి అయిన జాన్ విల్కిస్ బూత్‌ను అలజడికి గురి చేశాయి. బానిసలు తమతో సమానంగా, ఆత్మ గౌరవంతో బతకడం అనే ఆలోచన నిద్ర లేకుండా చేసింది. లింకన్‌ను భౌతికంగా నిర్మూలిస్తే తప్ప నల్ల జాతీయులను అణిచి ఉంచలేమని అతనికీ, అతని తరపు వారికీ అనిపించింది. జాన్ విల్కిస్ బూత్ కాల్చిన తూటా లింకన్ ప్రాణాలను బలి తీసుకొంది. 1865 ఏప్రిల్ 15న లింకన్ కన్నుమూశారు.



దాడికి గురైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి

బాబాసాహెబ్ అంబేడ్కర్ 'ఒక సమాజం విద్యలో సాధించిన పురోగతే ఆ సమాజపు అభివృద్ధిని నిర్ణయిస్తుంది' అంటారు. జగన్ ఆ సత్యాన్ని పట్టుకున్నారు. అందుకే తన దృష్టిని ప్రధానంగా విద్యపై కేంద్రీకరించారు. మనది 'పేదవాడు పెత్తందారుపై చేస్తున్న పోరాటం' అని నినాదం ఇచ్చారు. పేదవాళ్ళు కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మీడియంలో చదవాలని సంకల్పించారు. డబ్బున్న వాళ్ళలాగే పేదవాళ్ళు కూడా విదేశాలకు చదువుల కోసం వెళ్లొచ్చని విదేశీ విద్యకు అవకాశం కల్పించారు. గుడ్లు పెట్టడానికంటే ముందే తల్లిపక్షి గూడు కడుతుంది. ఆ జాగ్రత్త స్త్రీ సహజ లక్షణం. అది గ్రహించినవాడు కనుకనే పిల్లలకు చదువు కోసం డబ్బులిచ్చినా, ఇళ్ల స్థలాలిచ్చినా జగన్ ఆ ఇంటి తల్లికి ఇస్తున్నారు. స్త్రీ పేరిట ఇస్తున్నారు. దీనినే స్త్రీవాదం అని మేధావులు పిలుస్తారు. ఏ రోగమో రొష్టో వచ్చినపుడు ఆసాముల దగ్గర చేయి చాచకుండా ప్రభుత్వ రూపంలో ఆదుకుంటూ డబ్బున్నవాడి పక్క బెడ్డులోనే చికిత్స తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. జగన్ చేపడుతున్న ప్రతి కార్యక్రమం, పేదవాడిని పెత్తందారుల సంకెళ్ళ నుండి విడిపించేదే!

అబ్రహాం లింకన్ సమయంలోనే కాదు, ఇప్పుడు కూడా పేదలు గుండెల నిండా ఆత్మగౌరవంతో తల ఎత్తి నిలబడితే పెత్తందార్లకు కడుపు మంట. 'ఎవరయినా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా?' అని హేళనగా మాట్లాడిన చంద్రబాబు లాంటివారికి, పెత్తందార్లకు కాపు కాసే నటులకు, వారికి మద్దతునిస్తూ భౌతిక దాడులకు దిగిన అనుయాయులకు, ప్రధానంగా జగన్ సమానత్వ ఎజెండా మీదే ఆక్రోశం. ఇది కాకతాళీయమే కావొచ్చు... నటుడు జాన్ విల్కిస్ బూత్ ఏప్రిల్ 14న లింకన్ మీద తూటా పేల్చాడు. ఆంధ్ర ప్రదేశ్‌లో పెత్తందార్లు, నటులు... పేద ప్రజల నాయకుడు జగన్ మీదజుజ ఏప్రిల్ 13న రాయి విసిరారు. జాన్ విల్కిస్ బూత్ తూటా లక్ష్యం కేవలం లింకన్‌ను భౌతికంగా నిర్మూలించడం కాదు, లింకన్ సమానత్వ ఎజెండాను సమాధి చేయడం. అలాగే పేద ప్రజల పక్షపాతి జగన్ మీదకి ఈ పెత్తందార్లు విసిరిన రాయి లక్ష్యం జగన్‌ను కేవలం భౌతికంగా గాయపరచడం కాదు, ప్రగతి పథంలో సాగుతున్న జగన్ ప్రయత్నాన్ని స్తంభింపజేయడం! లింకన్ మరణం ఆఫ్రికన్ అమెరికన్ సమానత్వ ఆకాంక్షలను వంద సంవత్సరాలు ఆపగలిగింది. ఇప్పుడు ఈ పెత్తందారులు జగన్‌పై విసిరిన రాయి, మంచి చదువులు చదువుతూ అభివృద్ధి వైపు పరిగెడుతున్న ఆంధ్రప్రదేశ్‌ను ఏం చేస్తుందో చూడాలి!

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

ఎదుర్కోలేమనే భయంతోనే...



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకుంటోంది. ఒకవైపు ఎండవేడిమి మంట పుట్టిస్తుంటే, మరోవైపు ప్రచారాల్లో భాగంగా రాజకీయ పార్టీల మాటల తూటాలు పేలుతున్నాయి. ఇది ఒక అడుగు ముందుకేసి దాడులకు తెగబడే పరిస్థితులకు చేరింది. 13వ తేదీన విజయవాడ వేదికగా సాక్షాత్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై జరిగిన దాడి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

గత నెల 27న ఇడుపులపాయలోని తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి నుండి 'మేమంతా సిద్ధం' పేరుతో వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్ తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ నాలుగు సంవత్సరాల 10 నెలల కాలంలో తాను ఏం చేశానో ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ప్రచారానికి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోంది. అంతేకాకుండా తెలుగుదేశం, జనసేన పార్టీల నుండి అనేకమంది వైసీపీలో చేరుతున్నారు. ఈ క్రమంలోనే ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మీదే రాయి వేసి ఆయన్ని అంతమొందించే ప్రయత్నం జరిగింది. దీనిని ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ముక్తకంఠంతో ఖండించారు.

చంద్రబాబు కూడా ఈ దాడిని ఖండించారు. అయితే, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అడగకుండా అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన చేసిన ట్వీట్, వెంటనే ఆ పార్టీకి చెందిన నేతలు చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. తానేమీ తక్కువ తినలేదంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలపై కూడా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ప్రజా ముఖ్యమంత్రి, జనం గుండెల్లో గూడు కట్టుకున్న నేతపై దాడి జరిగితే దీనిని రాజకీయం చేయడం ఏంటని అసహ్యించుకుంటున్నారు. దాడి సమయంలో తమ ప్రియతమ నేత అభివాదం చేస్తూ పక్కకు తిరగడంతో పెను ప్రాణాపాయం నుండి రక్షించుకున్నారని చెబుతున్న ప్రజలు ఆయన ఎప్పుడూ చెప్పే ఒక్క మాటను గుర్తు చేస్తున్నారు. దేవుడి దయ, ప్రజల చల్లని దీవెనలు ఉన్నంతకాలం తనకేమీ కాదన్నది ఇప్పుడు నిరూపితమైంది.

గతంలో 2019 ఎన్నికల సమయంలో విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై కత్తితో దాడికి ప్రయత్నించిన ఘటనను ప్రజలు ఉటంకిస్తూ, ఘటన జరిగిన 24 గంటల్లో నిందితుణ్ణి పట్టుకోలేకపోయారని గుర్తు చేస్తున్నారు. విశాఖ విమానాశ్రయంలో జరిగిన దాడి సమయంలో అక్కడ డీజీపీ హడావిడిగా ఇదంతా కేవలం సానుభూతి కోసం అంటూ ప్రెస్ మీట్ పెట్టారు. ఆయన చెప్పిన గంటకే అమరావతిలో చంద్రబాబు కూడా ప్రెస్ మీట్ పెట్టి అదే మాట చెప్పారు. అంటే దర్యాప్తు సంస్థలను ప్రభావితం చేయడం కాదా అన్నది ఇక్కడ అందరూ అడుగుతున్న ప్రశ్న.

తెలుగుదేశం పార్టీకి ఈ ఎన్నికలు చావో రేవో అన్న చందంగా మారి ఆ కంగారులో తలో మాట మాట్లాడుతున్నారనుకుంటే, పవన్ కల్యాణ్ దాడి ఘటనను డ్రామాగా చిత్రీకరిస్తూ సినిమా తరహాలో డైలాగులు చెబుతున్నారు. ప్రజలు సూటిగా ఒకటే ప్రశ్న అడుగుతున్నారు. ఇదంతా డ్రామాగా మీరే తేల్చేసినప్పుడు ఇక దీనిపై విచారణ ఎందుకు?

చంద్రబాబు రాజకీయ నైజం గురించి కూడా విస్తృతమైన చర్చ జరుగుతోంది. 1987 ప్రాంతంలో పేదల పక్షపాతి, నిస్వార్థ రాజకీయ నేత వంగవీటి మోహన రంగాను అకారణంగా పొట్టన పెట్టుకున్న ఘటనను ఇప్పుడు ప్రజలు ఉటంకిస్తుండటం నిజంగా ప్రజల్లోని రాజకీయ చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం. అంతేకాకుండా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బషీర్‌బాగ్ కాల్పుల ఘటన, అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన ఘటన, గోదావరి పుష్కరాల్లో ప్రచార ఆర్భాటం కోసం 26 మందిని పొట్టనపెట్టుకున్న సంఘటన, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభంపై, ఆయన కుటుంబంపై పరుష పదజాలం వాడుతూ కొట్టుకుంటూ ఇంటి నుండి బయటకు తీసుకొచ్చిన వైనం, గుంటూరులో చీరలు పంపిణీ చేస్తామని పిలిచి తొక్కిసలాటలో అమాయక మహిళల ప్రాణాలను బలిగొన్న అంశాలను చర్చించటం చూస్తుంటే, ఒక నేతపై ప్రజల్లో ఉండే అభిప్రాయానికి దీన్ని సూచికగా చెప్పుకోవచ్చు.

ఇదంతా చూస్తుంటే కేవలం జగన్మోహన్ రెడ్డికి ప్రజల నుండి వస్తున్న అనూహ్య స్పందనే అయనంటే గిట్టనివారి కడుపు మంటకు కారణంగా కనిపిస్తోంది. రాజధాని ప్రాంతంలో కూడా విశేష ఆదరణ లభించడం ఈ కడుపు మంటను రెట్టింపు చేసింది. అందుకే జనాల గుండెల్లో గూడు కట్టుకున్న జగన్‌ను అంతమొందించేందుకు కుట్రకు తెరలేపినట్లు స్పష్టంగా అర్థమవుతోంది.

వ్యాసకర్త వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏపీ అధ్యక్షులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.అష్టమి సా.4.23 వరకు, తదుపరి నవమి,
నక్షత్రం: పునర్వసు ఉ.6.11 వరకు, తదుపరి పుష్యమి,
వర్జ్యం: ప.2.40 నుండి 4.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.35 వరకు,
అమృతఘడియలు: రా.12.53 నుండి 2.34 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

ఆటే... ఆర్ట్!



ఒక షట్లర్‌కు రాకెటే పెయింట్ బ్రష్. కోర్టే క్యాన్వాస్ అవుతాయి. అది కేవలం క్రీడ కాదు; కదలికలు, మెరుగైన వ్యూహాల మేళనం. స్వచ్ఛమైన రూపంలో ఉన్న కళ అది (జనవరి 15న వరల్డ్ ఆర్ట్ డే).

– సైనా నెహ్వాల్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

శిక్ష పడాలి!



సిడ్నీ (ఆస్ట్రేలియా)లో బిషప్ మార్ మారీ ఎమాన్యుయెల్ మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. దేవుడు ఆయన్ని పూర్తిగా కోలుకునేట్టు చేయాలి. దాడిచేసినవాడికి శిక్ష పడాలి.

– మహమ్మద్ తాహిది, ఇన్‌ఫ్లుయెన్సర్

తగ్గుతున్న జనం



'జనాభా పతనాన్ని' ఎదుర్కోనున్న తొలి దేశం గ్రీస్ కానుందని అంచనా. ఓవైపు హఠాన్మరణాలు పెరుగుతుండగా, మరోవైపు సంతాన సాఫల్య రేట్లు నిపుణులు గతంలో ఊహించినదాని కంటే కిందికి పడిపోయాయి. గుండె ఆగిపోవడం, రక్తం గడ్డకట్టడం, క్యాన్సర్ల లాంటివి యువకులను బలిగొంటున్నాయి.

– లూథర్ సైరస్, యాక్టివిస్ట్

ఇది... పెగ్గా సెస్!

అభిప్రాయం



పి. విజయబాబు

ఉండిలో అంతసేపు ఉండి వాళ్లతో విసిగి వేగి వేసారి ఇంటికి వచ్చిన చంద్రయ్యకు ఇల్లంతా హడావుడిగా కనిపించింది. రామయ్య, అచ్చయ్య, వెంకన్నలాంటి వాళ్లతో పాటు వకీళ్లు కూడా కనిపించారు. వాళ్ళ హడావిడితో పాటు సంటోడి ముఖంలో ఆందోళన చూసేసరికి ఏం అర్థం కాలేదు.

''ఏటయ్యింది?'' అడిగాడు. అయినా అంతా నిశ్శబ్దం. ఎవరి నోటి నుంచి బదులు రాలేదు. ''సెస్! అడుగుతున్నది మిమ్మల్నే. అంతా బెల్లం నోట్లో ఎట్టుకున్నట్టు మాహాడరే?'' సున్నితంగా గద్దించాడు. ''అయ్యా! అది కాస్తంత ఇబ్బందికర పరిస్థితి'' వకీలు రవీంద్ర గంభీర వదనంతో పలికాడు. ''అదేనయ్యా అదేటో సెప్తేనే కదా తెలిసేది? గొరమ్మా ఏటైనాది? నువ్వైనా సెప్పు'' అన్నాడు దూరంగా ఉన్న భార్య వైపు చూస్తూ. ''అది ఏటంటే... మన సంటోడు పోన్లో మాట్లాడేదంతా ఇనేత్తున్నారంట. ఒకేపు కేసులు గట్రా ఉన్నాయి గందా? అదేదో పెగాసస్ అంట. దాంతో మన సంటోడు పోన్లో దూరి మొత్తం ఇనేస్తున్నారంట'' సస్పెన్స్‌కి తెరదించుతూ భార్య గౌరీ చెప్పింది.

''మీరేం కంగారు పడకండి. ఈ సంగతి ఢిల్లీకి కూడా కంప్లైంట్ చేశా'' అన్నాడు రవీంద్ర కోటు, టై సవరించుకొంటూ.

ఆ మాటకి ఉలిక్కిపడ్డాడు చంద్రయ్య. వెంటనే రామయ్య అందుకుంటూ, ''ప్రెస్ మీట్ కూడా పెట్టాం. అధికార పార్టీ కుట్రని కడిగిపారేశాం'' అన్నాడు అచ్చయ్య వైపు మెచ్చుకోలుగా చూస్తూ.

''అంతేకాదు రేపు ఆందోళన కార్యక్రమాలు కూడా ప్లాన్ చేశాం'' అచ్చయ్య ఉత్సాహంగా పలికాడు. ''ఇది దేశంలోనే అతి పెద్ద కుట్ర'' వెంకన్న ఆవేశంగా పలికాడు. ''అసలు ఈ పెగాసెస్సు...'' ఎప్పటిలాగే కాగితాలు ఏవో చూపుతూ



పాట్టాభి ఏదో చెప్పబోయాడు. చంద్రయ్యకు ఆగ్రహం తన్నుకొచ్చింది. అవ్యక్తమైన ఉద్వేగాన్ని అణచుకొంటూ ''సెస్! ఊరుకొండెహె. అంతా మీ మానాన మీరు చేసుకెల్లి పోవడమేనా? కనీసం ముందు నాతో ఒక ముక్క సెప్పాలని తెల్దేటి? పెతివాడికి అతి ఉత్సాహం!''

చంద్రయ్య తనని తను తమాయించుకొని, ''సరే సరే. ఢిల్లీ లెవెల్ దాకా తీసుకెల్లారన్నమాట. సర్లే ఆ తర్వాత ఎలా ముందుకు బోవాలో రేపు చర్చిద్దాం వెళ్ళండి'' అన్నాడు కూల్ గా. ''నువ్వా ఎల్లి తొంగో'' అన్నాడు సంటోడితో. ''ఏటీ అలా సిటపటలాడిపోతున్నారు. ఎండదెబ్బ కొట్టేసినాదా?'' అన్నది గౌరీ దగ్గరకొస్తూ. ''నాక్కాదు నీ కొడుక్కి కొట్టినాది. నేను అలా కాస్త బయిటికి ఎల్లొస్తే చాలు. ఏదో ఒక పేడ తట్ట ఎట్టేస్తాడు. అవునే నాకు తెలవక అడుగుతాను. ఆడి పోను హ్యాకింగ్ చేసేవాడు ఎవడుంటాడు?''

''అంటే వాడి ఫోను హ్యాకింగ్ అవలేదా?'' చిరుకోపం ప్రదర్శిస్తూ అడిగింది గౌరీ. ''సెస్. మళ్లీ అదే మాట. వాడి ఫోనుతో ఎవరికి పనే?'' ''మరెవరికి పని?'' రెట్టించింది గౌరీ.

''ఇంకెవరికి? నాకు, నీకు, కాదంటే కోడలు పిల్లకు''

''అంటే ఏటి మీరు అనేది?'' అనుమానంగా చూస్తూ అడిగింది గౌరీ. ''మరేటుంది? నేనే చేశాను. అంతా నేనే చేశాను. ఒకేపు నేను వాడి కోసం పడరాని పాట్లు పడుతూ, నానా తిట్లు తింటూ, ఎండలో తిరుగుతూ ఉంటే, ఈడేమో ఏసీలో తొంగొని, 24 గంటలు ఫోన్‌తో కాలం గడిపేస్తుంటాడు. అసలు ఆ ఫోన్లో ఏటుందో తెలుసుకుందామని నేనే ఆ పని చేశా! తీరా ఫోన్లో సమాచారం మరి ఏటున్నదో తెలుసా?? ఫోన్ అంతా అమెరికా ఫ్రెండ్స్‌తో చాటింగ్లు, వీడి వీర గాథలు, సిగ్గీలు, జొమాటోల ఆర్డర్లు. ఈ మధ్య కాస్త ఎండలో తిరగటం మొదలెట్టిన దగ్గర నుంచి ఫోన్ అంతా సిగ్గీ ఆర్డర్లే. సిగ్గు లేకపోతే సరి. ఈ సమాచారం తెలుసుకొని ఎవరైనా ఏం చేసుకుంటారు? ఇంత హడావిడి జరుగుతున్నా బాధ్యత లేదు. ఓ ఎదవ హడావిడి తప్ప. పోనీ నాతో పాటు తిప్పుకుందాం అంటే, ఎక్కడ ఏ పేడతట్ట ఎత్తాడో అని భయం'' అంటూ అసలు సంగతి బయట పెట్టే సరికి గౌరీ అవాక్కయిపోయింది.

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

నాయకరాజుల వసంతోత్సవ హేల

సందర్భం



నాగపట్ల భక్తవత్సల రెడ్డి

మదురైలో ఏటా నిర్వహించే 'చిత్తిరై తిరువిళా' తిరణాల తెలుగు సంస్కృతికి నీరాజనం, తెలుగు వసంతోత్సవ హేలా విన్యాసం. చైత్ర శుద్ధ త్రయోదశిన జరిగే మీనాక్షీ సుందరేశ్వరుల తిరుకల్యాణ ఉత్సవం ఇది. ఏటా చిత్తిరై పౌర్ణమికి పదిరోజుల ముందు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే (12.4.2024) ఉత్సవంలో... కళ్యాణం (21.4.24), రథం లాగడం (22.4.24), కళ్లళగర్ ఎదురుసేవ (22.4.24), అళగర్ వైగై ఒడ్డున దిగడం (23.4.24) ప్రధానమైన ఘట్టాలు. తిరు కల్యాణంలో వధూవరుల తరఫున తాంబూలాలు మార్చుకోవడం, నలుగు పెట్టడం, కన్యాదానం లాంటి సంప్రదాయాలతో పాటు ఆడవారికి పసుపు, కుంకుమ, గాజులిచ్చే ఆచారం ఉంది. పుణ్య స్త్రీలు తాళి మార్చుకుంటారు.

మదురై చతురస్రాకారంలో నిర్మితం. గుడి చుట్టూ ఆడి, చిత్తిరై, ఆవణిమూల, మాసి అని తమిళ నెలల పేరుతో దిక్కునూ బట్టి కీళ్మాసి (తూర్పు మాసి), మేల్మాసి (పడమటి మాసి), వడక్కు మాసి (ఉత్తర మాసి), తెన్మాసి (దక్షిణ మాసి) వీధులు. వెళి (బైట) వీధులు ఒకప్పుడు ఎల్లలు. గుడిలో ఉత్సవం జరిగే నెలను బట్టి ఆ పేరు గల వీధిలోనే దేవుని ఊరేగింపు ఉంటుంది. మీనాక్షీ కల్యాణం చిత్తిరై నెలలో కాబట్టి చిత్తిరై వీధుల్లోనే ఊరేగింపు జరగాలి కాని మాసి వీధుల్లో జరుగుతోంది. పూర్వం మీనాక్షీ కళ్యాణం మాసి నెలలో జరిగేదనీ, నాయకరాజైన తిరుమల నాయకర్ దాన్ని చైత్ర మాసానికి మార్చి, పౌర్ణమికి ముందు జరిపించాడని అంటారు. ధ్వజారోహణం మర్నాటి నుంచి రోజూ మీనాక్షీ సుందరేశ్వరులను విడివిడిగా, పూటకొక్క వాహనం మీద ఉదయం, సాయంత్రం మాసి వీధిలో ఊరేగిస్తారు. శక్తి (పిరియావిడై), శివుడు కలిసే ఉంటారని పురాణాలు చెప్తున్నాయి కనుక సుందరేశ్వరుడు ఉండే వాహనంలో పిరియావిడై విగ్రహాన్ని కూడా ఉంచి ఊరేగిస్తారు. పెళ్లినాటి సాయంత్రం పూలపల్లకీలో



మీనాక్షి, గజవాహనంలో సుందరేశ్వరుడు – పిరియావిడైల ఊరేగింపు ఉంటుంది.

పల్లకిని పూర్తిగా మల్లెపూలతో సింగారించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతారు. మర్నాడు పొద్దున కల్యాణం తర్వాత రెండు తేర్లు (జగన్నాథ రథాల లాగా చాలా పెద్దవి) – ఒక దానిలో మీనాక్షి, రెండో తేరులో సుందరేశ్వరుడు–పిరియావిడై ఊరేగింపు. పొడుగాటి లావు మోకులు కట్టిన ఈ రథాలను ప్రజలు లాగుతారు. మదురైలోని మీనాక్షియమ్మన్, ఇరవై కిలోమీటర్ల దూరంలోని అళగర్ కోవెలలో ఉన్న సుందరరాజ స్వామి (అళగర్ అని మరో పేరు)కి చెల్లెలు కనుక మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణం చూడడం కోసం అళగర్ నుంచి కళ్లళగర్ (దొంగ లేదా వ్యాజ) వేషం వేసుకొని, తన చెల్లెలికి కట్నకానుకలు సమర్పించడం కోసం ఊర్లు కొల్లగొట్టుకొంటూ, తేరు ఉత్సవం జరిగిన మర్నాడు మదురై చేరగా ఎదురు సేవ ఉంటుంది.

ఆ రాత్రి తల్లాకుళం (వైగై నది చేరడానికి ముందు ఉన్న ప్రాంతం)లోని ప్రసన్న వేంకటాచలపతి దేవాలయంలో బస. తెల్లవారుజామున వేషం మార్చుకొని, రాజు వేషంలో కుదిర (గుర్రం) సప్పరం గుండా వైగై తీరం వరకూ పోయి, అక్కడ సప్పరం వదిలి ఉత్తర ఒడ్డు చేరగా ఆవలి గట్టున మీనాక్షీ సుందరేశ్వరులు ఉంటారు. అది చిత్తిరై (చైత్ర) పౌర్ణమి. అప్పటికే కల్యాణం జరిగిపోయిన విషయం కూడల్ అళగర్ పెరుమాళ్ (అళగర్ తమ్ముడు, మదురైలో కోవెల ఉంది) ద్వారా దారిలో వచ్చేటపుడే విన్నా ఇపుడు ప్రత్యక్షంగా చూడగానే కోపం వచ్చి మీనాక్షీ సుందరేశ్వరులను చూడకుండానే వైగై తీరం వెంబడి వండియూర్ వెళతాడు. అక్కడ ఒక ముసల్మాన్ యువతికి అళగర్ తాను తెచ్చిన కానుకల్ని బహూకరిస్తాడు. ఇలాంటి ఘటనలతో దాదాపు తొమ్మిది రోజులు అళగర్ ప్రయాణం సాగుతుంది.

వైగై దక్షిణ ఒడ్డున మీనాక్షీ సుందరేశ్వరులకు తిరిగి పెండ్లి చేయాలన్న ప్రయత్నంలో తాళి కట్టబోయే శుభవేళ ఎవరో తుమ్ముతారు. అపశకునం అంటూ మరుసటేడు పెండ్లి జరిపిద్దామంటూ వారిని మీనాక్షీ కోవెలకు తీసుకువెళ్తారు. ఇది స్థూలంగా మదురై చిత్తిరై తిరువిళా ఉత్సవం.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్ I 94401 70703



'మీ బిడ్డ జగన్ మీద ఒక రాయి విసిరినంత మాత్రాన ఎన్నికల కురుక్షేత్రంలో పెత్తందారుల ఓటమిని, పేదల ప్రభుత్వం గెలుపుని ఆపలేరు. ఇలాంటి దాడులతో నా సంకల్పం చెక్కు చెదరదు. వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే వాళ్లు ఓటమిని అంగీకరించారని అర్థం'

- గుడివాడ సభలో ఏపీ సీఎం జగన్



కృష్ణా జిల్లా గుడివాడలో మేమంతా సిద్ధం సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

నా సంకల్పం చెదరదు

ఎవరెన్ని కుట్రలు పన్నినా బెదరను.. గుడివాడ మేమంతా సిద్ధం సభలో ఏపీ సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా బెదిరే ప్రసక్తే లేదని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల గుండెల్లో నిలవడం చేతకాని వారు ఎన్ని మాటలు మాట్లాడినా లెక్క చేయబోనన్నారు. 15వరోజు బస్సుయాత్ర సందర్భంగా సోమవారం సాయంత్రం కృష్ణా జిల్లా గుడివాడ శివారు నాగవరప్పాడులో నిర్వహించిన 'మేమంతా సిద్ధం'బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఒక్క జగన్‌పై.. పదిమంది కుట్రదారుల దాడి

గుడివాడలో ఈరోజు మహా సముద్రం కనిపిస్తోంది. ఇది జన సముద్రం. మే 13న జరగనున్న ఎన్నికల మహా సంగ్రామంలో మంచి వైపు నిలబడిన ప్రజా సముద్రం ఇది. పేదల భవిష్యత్తు కోసం.. పథకాలన్నీ కాపాడుకోవడానికి.. కొనసాగించేందుకు.. ఇంటింటి అభివృద్ధి, పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునేందుకు ఆ పెత్తందారులతో యుద్ధానికి మీరంతా సిద్ధమేనా? ప్రజలకు మంచి చేశానన్న ధైర్యంతో నిలబడ్డ మీ ఒక్క జగన్‌పై మోసాలే అలవాటుగా పెట్టుకున్న పదిమంది కుట్రదారులు దాడి చేస్తున్నారు.

తాటాకు చప్పుళ్లకు మీ బిడ్డ బెదరడు..

చంద్రబాబు, దత్తపుత్రుడు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, బీజేపీ, కాంగ్రెస్.. కుటిల పద్మవ్యూహంతో ఒక్కటై మీ జగన్ మీద బాణాలు సంధిస్తున్నాయి. మీకు మంచి చేసిన మీ బిడ్డ మీద, మీ సేవకుడిగా ఉన్న మీ బిడ్డ మీద ఇంతమంది దాడి చేస్తున్నారు. అయినా సరే మీ బిడ్డ అదరడు, బెదరడు. కారణం .. ప్రజలు అనే శ్రీకృష్ణుడి అండ ఉన్న అర్జునుడు మీ బిడ్డ. అర్జునుడి మీద ఓ బాణం వేసినంత మాత్రాన కురుక్షేత్రం గెలిచినట్లు కాదు. జగన్ మీద ఒక రాయి విసిరినంత మాత్రాన ఆ దుష్టచతుష్టయం, పెత్తందారుల ఓటమిని, మన పేదల ప్రభుత్వం గెలుపును ఎవరూ ఆపలేరు. ఇలాంటి దాడుల వల్ల నా సంకల్పం చెక్కుచెదరదు. వాళ్లు ఈ స్థాయికి దిగజారారంటే దాని అర్థం.. విజయానికి మనం చేరువగా ఉన్నామని, వారు దూరంగా ఉన్నారనే. తాటాకు చప్పుళ్లకు మీ బిడ్డ అదరడు, బెదరడు. మీకు సేవ చేయాలన్న సంకల్పం మరింత పెరుగుతుందే కానీ తగ్గదు.

దేవుడు... పెద్ద స్క్రిప్టు రాశాడు

నా నుదిట మీద వారు చేసిన గాయం కన్నుపై, తలపై తగలలేదంటే దాని అర్థం.. దేవుడు మీ బిడ్డ విషయంలో పెద్ద స్క్రిప్టు రాశాడనే! నా నుదిట మీద వారు చేసిన గాయం పది రోజుల్లో తగ్గిపోతుందేమో గానీ చంద్రబాబు ప్రజలకు చేసిన గాయాలను పేదలు ఎన్నడూ మరిచిపోయే పరిస్థితి ఉండదు. గాయపరచడం, మోసం చేయడం, కుట్రలు చేయడం చంద్రబాబు నైజం. ఇంటింటికి మంచి చేయడం మీ బిడ్డ నైజం.

మంచి చేయకూడదన్నదే బాబు ఫిలాసఫీ

ఈ కూటమి నాయకుడు చంద్రబాబు 30 ఏళ్ల ఫిలాసఫీని ఒక్కసారి చూస్తే పేద ప్రజలకు ఎలాంటి మంచి చేయకూడదన్నదే ఆయన సిద్ధాంతం. చంద్రబాబు ఎలాంటి వారో ఆయన నైజం చూస్తే అందరికీ తెలుస్తుంది. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వొద్దన్నదీ, తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్నదీ ఈ బాబే. కిలో రెండు రూపాయలకు బియ్యం ఇవ్వొద్దని, ఎన్టీఆర్‌ను దింపేసి రూ.5.25కి పెంచేసిందీ, నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వొద్దన్నదీ ఈ బాబే. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిషు మీడియం వద్దన్నదీ, ప్రభుత్వ పాఠశాలలను పాడు పెట్టిందీ ఈ బాబే. పేదలకు ఇళ్ల స్థలాలిస్తుంటే అడ్డు పడి కులాలు, సామాజిక సమతుల్యం దెబ్బతింటుందంటూ ఏకంగా కోర్టులకు వెళ్లి కేసులు వేసింది చంద్రబాబు కాదా? ముఖ్యమంత్రిగా ఉంటూ బీసీలను, ఎస్సీలను అవహేళన చేసిన వ్యక్తి ఎవరు? ఈ బాబే కదా! విడగొట్టిన రాష్ట్రానికి ప్రత్యేక హోదా వద్దన్నది ఎవరు?.. ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా అన్నది ఎవరు? ఈ బాబే. ఆ హోదాను తాకట్టు పెట్టిందీ ఈ బాబే.

మానవత్వం, మంచితనం లేదు..

.చంద్రబాబు ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పుడు ఎన్టీఆర్ పిల్లనిచ్చి చేరదీస్తే చెప్పులు వేయించి వెన్నుపోటు పొడిచింది బాబు కాదా? మళ్లీ అవసరమైతే ఎన్టీఆర్ ఫొటో బయటకు తీసి దండలు వేస్తాడు. ఇంత నీచమైన వ్యక్తి బాబే. ఆ మనిషికి మానవత్వం, మంచితనం లేదు. దొంగ వాగ్దానాలు, మోసం, కుట్రలు, దోచుకోవడం, దోచుకున్నది పంచుకోవడం.. ఇదే చంద్రబాబుకు తెలిసిన నీతి. చంద్రబాబును నమ్మడం అంటే చెరువులో చేపలకు కొంగను కాపలా పెట్టడం లాంటిదే. దొంగ చేతికి తాళాలు ఇవ్వడమే. పులి నోట్లో తల పెట్టడమే. మరి మీ జగన్‌ను చూడండి. ఈ 58 నెలల కాలంలో మీరిచ్చిన అధికారంతో, దేవుడి ఆశీస్సులతో గ్రామ గ్రామాన, ఇంటింటా జగన్ తెచ్చిన మార్పులు ఏమిటో మీరే చూడండి.

మన జెండా తలెత్తుకుని ఎగురుతోంది.

99 శాతం హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకున్నాం. ప్రతి ఇంటికి మంచి చేసి, మీ బిడ్డ వల్ల మీకు మంచి జరిగి ఉంటే మీరే సైనికులుగా నిలబడాలంటూ మొట్టమొదటిసారిగా ఒక ముఖ్యమంత్రి కళ్లల్లో కళ్లు పెట్టి చూసి నిజాయితీగా ఈ వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చి చెప్పగలుగుతున్నాడు. ప్రజలందరికీ మంచి చేసిన మన జెండా తలెత్తుకుని సగర్వంగా ఎగురుతోంది. వారి జెండా మరో నాలుగు జెండాలతో జతకట్టి కూడా ఎగరలేక కిందపడుతోంది.

బాబు మోసాల చిట్టా ఇదిగో

2014లోకూడా చంద్రబాబు ఇదే కూటమిగా ఏర్పడి రంగురంగుల హామీలిచ్చారు. దత్త పుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో రూపొందించిన మేనిఫెస్టోను ఇంటింటికీ పంపించారు. ఆ విఫల హామీల్లో ప్రధానమైనవి ఒక్కసారి పరిశీలిస్తే.. రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానన్నాడు. రూ.87,612 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయా? పొదుపు సంఘాల రుణాలు పూర్తిగా రద్దు చేస్తానన్నాడు. మరి రూ.14,205 కోట్ల రుణాలలో అక్కచెల్లెమ్మలకు ఒక్క రూపాయి అయినా మాఫీ చేశారా? ఆడ బిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చి ఒక్కరికైనా చేశాడా? ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2000 నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పాడు. ఐదేళ్లలో అంటే 60 నెలల్లో నెలకు రూ.రెండు వేలు చొప్పున ఒక్కో ఇంటికి రూ.1,20,000 ఎవరికైనా ఇచ్చాడా? పక్కా ఇల్లు ఇస్తానన్న చంద్రబాబు కనీసం ఏ ఒక్కరికైనా ఒక్క సెంటు స్థలమైనా ఇచ్చాడా? రూ.పదివేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్ అన్నాడు. చేనేత, పవర్ లూమ్స్ రుణాలు మాఫీ అన్నాడు. ఎక్కడైనా చేశాడా మరి? ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా? సింగపూర్‌ని మించి అభివృద్ధి చేసి ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మరి మీ గుడివాడలో కనిపిస్తోందా? ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ కొత్త హామీలతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు.

ఏపీ సీఎంపై హత్యాయత్నం కేసు

దర్యాప్తు ముమ్మరం

- పదునైన రాయితోనే హత్యాయత్నం
- వీడియో ఫుటేజీల ద్వారా పోలీసుల నిర్ధారణ
- అదుపులో 60 మంది వరకు అనుమానితులు
- 10 మంది తీరు సందేహాస్పదం
- సున్నిత భాగాలపై తగిలితే సీఎంకు ప్రాణాపాయం ఉండేది
- త్వరలోనే నిందితుడిని పట్టుకుంటాం: పోలీస్ కమిషనర్ టి.కె.రాణా

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడ సింగ్ నగర్ డాబాకొట్ల సెంటర్‌లో జరిగిన హత్యాయత్నం కేసులో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సింగ్ నగర్‌లోని వివేకానంద పాఠశాల ప్రాంగణం నుంచే పదునైన రాయితో హత్యాయత్నానికి పాల్పడినట్టు వీడియో ఫుటేజీల ఆధారంగా నిర్ధారించారు. డాబా కొట్ల జంక్షన్ ప్రాంతంలో సీసీ టీవీ ఫుటేజీలు, ఆ ప్రాంతంలోని పలువురి సెల్ ఫోన్లలో వీడియో రికార్డులు, హత్యాయత్నం చేసిన సమయంలో ఆ ప్రాంతంలో కాల్ డేటాను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో కీలక సమాచారాన్ని పోలీసులు రాబట్టినట్టు సమాచారం. దాని ఆధారంగా కేసు దర్యాప్తును వేగవంతం చేశారు.



రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లపై ప్రత్యేక దృష్టి

ముఖ్యమంత్రిపై హత్యాయత్నం కేసులో విజయవాడ పోలీసులు పలువురు అనుమానితులను గుర్తించారు. పోలీసు రికార్డుల ప్రకారం నేర చరితులతోపాటు ఘటన జరిగిన సమయంలో ఆ ప్రాంతంలో వీడియో ఫుటేజీలు, కాల్ డేటా ఆధారంగా దాదాపు 60 మంది వరకు అనుమానితులను మ్యాపింగ్ చేశారు. వారిని పోలీసులు పిలిపించి అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. ఆ ప్రాంతంలో మాజీ ప్రజాప్రతినిధి వర్గంలో క్రియాశీలకంగా వ్యవహరించే రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్ ముఠా సభ్యులు, ఇతర అసాంఘిక శక్తులపై కూడా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటనకు రెండు రోజుల ముందు నుంచి వారి కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. అనుమానితులు ఏయే ప్రాంతాల్లో సంచరించింది.. వారి ఫోన్ల నుంచి ఎవరెవరికి కాల్స్ చేశారు.. గ్రూప్ కాల్స్ ఏమైనా మాట్లాడారా అనే కోణాల్లో సమాచారాన్ని క్రోడీకరించారు. ఆ వివరాల ఆధారంగా అనుమానితులను పలు కోణాల్లో ప్రశ్నించారు. వారు చెప్పిన సమాధానాలను కాల్ డేటా విశ్లేషణతోపాటు ఆ ప్రాంతంలోని వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు చెప్పిన వివరాలతో సరి పోలుస్తున్నారు. ఆ విధంగా పిలిపించి విచారించిన దాదాపు 60మందిలో ఓ పదిమంది తీరు సందేహాస్పదంగా ఉన్నట్టు గుర్తించారు. వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.

దాబా కొట్ల సెంటర్‌నే ఎందుకు ఎంపిక చేసుకున్నారో..

సీఎం జగన్‌పై హత్యాయత్నానికి డాబా కొట్ల జంక్షన్ ప్రాంతాన్నే ఎందుకు ఎంపిక చేసుకున్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తద్వారా ఈ కేసును ఛేదించాలని భావిస్తున్నారు. వివేకానంద స్కూల్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో యాత్ర సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని అగంతుకుడికి ముందే తెలుసు. ఆ స్కూల్ ప్రాంగణంలో మాటు వేసి హత్యాయత్నానికి పాల్పడిన వెంటనే మాకినేని బసవపున్నయ్య స్టేడియం నుంచి తప్పించుకునేందుకు అవకాశం ఉండటం వల్లే డాబాకొట్ల ప్రాంతాన్ని ఎంపిక చేసుకున్నారని ఇప్పటికే పోలీసులు ఒక అంచనాకు వచ్చారు. అంతేకాకుండా ఆ ప్రాంతంపై అగంతకుడికి పూర్తి పట్టు ఉండటంతో ఆ ప్రాంతానికి లేదా ఆ సమీప ప్రాంతానికి చెందిన వ్యక్తి అయ్యుండొచ్చని భావిస్తున్నారు. ఆ ప్రాంతంలోని తన ఇంటికి లేదా తనకు ఆశ్రయం ఇచ్చేవారి ఇంటికి సులువుగా చేరుకుని పోలీసుల కళ్లు కప్పవచ్చనే ధీమా కూడా అగంతుకుడికి ఉండి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అందుకే సింగ్ నగర్‌తోపాటు ఆ పరిసర ప్రాంతాల్లోని రౌడీషీటర్లు, బ్లేడ్ బ్యాచ్‌లు, ఇతర అసాంఘిక శక్తులపై పోలీసులు దృష్టి సారించారు. వారిలో రాజకీయ పార్టీల్లో క్రియాశీలకంగా వ్యవహరించేవారు, ప్రత్యర్థి పార్టీ వర్గీయులతో ఘర్షణ పడ్డ చరిత్ర ఉన్నవారు, గంజాయి తదితర వ్యసనాలకు బానిసైన వారు.. ఇలా పలు కోణాల్లో అనుమానితులను గుర్తించి విచారించే ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రత్యేక పోలీసు బృందాలు సింగ్ నగర్‌తోపాటు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి.

సమాచారమిస్తే రూ.2లక్షల బహుమతి

ముఖ్యమంత్రిపై హత్యాయత్నానికి పాల్పడిన అగంతుకుడి సమాచారం అందిస్తే రూ.2లక్షల నగదు బహుమతి అందిస్తామని విజయవాడ పోలీసులు సోమవారం ప్రకటించారు. అగంతకుడికి సంబంధించిన సమాచారం/వీడియో, సెల్‌ఫోన్ ఫుటేజీ అందించినా, హత్యాయత్నాన్ని చూసిన ప్రత్యక్ష సాక్షులు ముందుకు వచ్చి సమాచారమిచ్చినా ఈ బహుమతి అందిస్తామని తెలిపారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అగంతకుడి సమాచారాన్ని నేరుగా లేదా ఫోన్/వాట్సాప్ ద్వారా తెలియజేయవచ్చన్నారు.

సమాచారం అందించేందుకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

కంచి శ్రీనివాసరావు, డీసీపీ 9490619342
ఆర్.శ్రీహరిబాబు,
డీసీపీ, టాస్క్‌ఫోర్స్: 9440627089

సున్నిత భాగాల్లో తగిలి ఉంటే సీఎంకు ప్రాణాపాయం

విజయవాడ పోలీస్ కమిషనర్ రాణా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సున్నిత భాగాల్లో రాయి తగిలి ఉంటే ప్రాణాపాయం జరిగి ఉండేదని విజయవాడ పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. హత్యాయత్నం చాలా బలంగా జరిగింది కాబట్టే సీఎంతోపాటు మాజీ మంత్రి వెలంపల్లికి కూడా గాయమైందని చెప్పారు. విజయవాడలోని తన కార్యాలయంలో రాణా సోమవారం మీడియాతో మాట్లాడారు. హత్యాయత్నానికి సంబంధించి అన్ని ఆధారాలూ సేకరిస్తున్నామన్నారు. సింగ్‌నగర్‌లోని వివేకానంద స్కూల్, గంగానమ్మ గుడి మధ్య ఉన్న ఖాళీ స్థలం నుంచి ఒక వ్యక్తి రాయితో హత్యాయత్నం చేసినట్లు గుర్తించామన్నారు. చేతికి సరిపడినంత రాయితో హత్యాయత్నం చేశారని తెలిపారు. ఇందులో ఒక్కరే పాల్గొన్నారా, సమూహం ఉందా అనే అంశంపై విచారణ చేస్తున్నామన్నారు. సీఎం సెక్యూరిటీ కోసమే ఘటన జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. సీఎం పర్యటన ప్రాంతాల్లో విద్యుత్ కేబుళ్లు, నెట్‌వైర్లు ఉన్నాయన్నారు. కొన్ని ప్రాంతాల్లో వాటిని తొలగించామని, మరికొన్ని ప్రాంతాల్లో సాధ్యం కాలేదని చెప్పారు. హత్యాయత్నానికి సంబంధించి 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎనిమిది బృందాలను నియమించామన్నారు. 60 మందిని విచారించినట్లు వెల్లడించారు. కొంత మందిపై అనుమానం ఉందన్నారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు. నిందితుడు దొరికితే కుట్ర కోణం తెలుస్తుందన్నారు. సీఎం పర్యటనకు 1,480 మంది సిబ్బంది విధుల్లో ఉన్నారని, రూట్ మ్యాప్ ప్రకారం బందోబస్తులో పాల్గొన్నారని వివరించారు. అందులో 40 రోప్ పార్టీలు ఉంటే 20 రోప్ పార్టీలు సీఎం బస్సు చుట్టూ ఏర్పాటు చేశామన్నారు.

రఘురామ కేసులో

స్టే ఎత్తేయండి

- సుప్రీంకోర్టుకు సీబీఐ అభ్యర్థన
- విచారణ వాయిదా వేసిన ధర్మాసనం
- రెండు వారాల తర్వాత విచారణ చేపడతామని స్పష్టీకరణ

వివరాలకు
ఈ క్యూఆర్ కోడ్‌ను
స్కాన్ చేయండి

దస్తగిరితో చంద్రబాబే పిటిషన్ వేయించారు

- ఈ పిటిషన్ వెనుక దురుద్దేశాలు
- తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు

సాక్షి, హైదరాబాద్: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ అప్రూవర్‌గా మారిన కిరాయి హంతకుడు దస్తగిరి పిటిషన్ వేయడం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి చెప్పారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు దస్తగిరితో ఈ పిటిషన్ దాఖలు చేయించారని చెప్పారు. ఓ పక్క కేసు విచారణ సాగుతుండగా.. కడప నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి, వైఎస్ వివేకా కూతురు.. ఇద్దరూ అవినాశ్‌ను హంతకుడిగా చిత్రీకరించేందుకు శతవిధాలా ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అవినాశ్ బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఇదే కేసులో నిందితుడు (ఏ–4) దస్తగిరి తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. అవినాశ్‌రెడ్డి తరఫున నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ దస్తగిరి పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు.

వారివి సంబంధం లేని వాదనలు

సీబీఐ, సునీత తరఫు న్యాయవాదుల వాదనలు ఎంత మాత్రం సమర్థనీయం కాదని నిరంజన్ రెడ్డి చెప్పారు. 'చట్టవిరుద్ధంగా అవినాశ్‌కు బెయిల్ ఇచ్చారని చెప్పడం ఈ వాదనలతో సంబంధంలేని అంశం. ఆ కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. సునీత, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, కిరాయి హంతకుడు దస్తగిరి కూడా చంద్రబాబు చెబుతున్నట్లు వ్యవహరిస్తున్నారు. వివేకాకు రెండో భార్య ఉందని, ఆమెతో కలిగిన కుమారుడికి, సునీతకు ఆస్తి తగాదాలు ఉన్నాయన్నది వాస్తవం. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయడంలేదు. వివేకాను నరికానని చెబుతున్న వ్యక్తికే సునీత మద్దతుగా నిలవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అతని బెయిల్‌ను రద్దు చేయాలని ఆమె కోరలేదు. ఎవరు ఏ పిటిషన్ వేసినా ఇంప్లీడ్ అవుతూ అవినాశ్‌ను ఎలాగైనా ఈ కేసులో ఇరికించాలని ఆమె విశ్వప్రయత్నం చేస్తున్నారు' అని నిరంజన్ రెడ్డి వాదించారు.

వివేకా హత్య కేసుని లోతుగా

దర్యాప్తు చేయాలి: సునీత

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుని లోతుగా దర్యాప్తు చేయాలని ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత కోరారు. ఆమె సోమవారం హైదరాబాద్‌లో 'జస్టిస్ ఫర్ వివేకా – సూత్రదారులెవరు?' అన్న అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. వివేకా హత్య జరిగి ఐదేళ్లు పూర్తయినా ఇంకా కేసు కొలిక్కి రాలేదని, సీబీఐని సైతం ప్రభావితం చేసే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఆ రోజు అవినాష్‌రెడ్డి ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారో తెలియాలని, ఆయన ఫోన్ సరెండర్ చేయకపోవడానికి గల కారణాలు సైతం తెలియాలని అన్నారు. ఇతర నిందితులతో సంబంధం లేదని అవినాశ్‌రెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇతర నిందితులతో అవినాశ్‌రెడ్డి చేసిన ఫోన్, వాట్సాప్ కాల్స్, పలు సందర్భాల్లో కలిసిన ఘటనల ఫోటోలు, కాల్ డేటాను ఆమె మీడియా సమావేశంలో ప్రదర్శించారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ఫోన్ చూడొద్దు.. చదువుకోమని తండ్రి మందలించినందుకు మనస్తాపం



నిఖిల్ (ఫైల్)

కమలాపూర్: పరీక్షలు ఉన్నాయి.. చదువుకోమని తండ్రి మందలించినందుకు ఓ డిగ్రీ విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన బలిజ రవీందర్ కుమారుడు నిఖిల్ (21) హనుమకొండలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. మే 6 నుంచి పరీక్షలు ఉండడంతో ఈ నెల 14న (ఆదివారం) 'ఫోన్ చూడకు. పరీక్షలు ఉన్నాయి చదువుకో 'అని నిఖిల్‌ను తండ్రి మందలించాడు. తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన నిఖిల్ పురుగుల మందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు విషయాన్ని రవీందర్‌కు చెప్పగా వెంటనే ఇంటికి వచ్చి కుమారుడిని 108 ద్వారా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ప్రభుత్వోద్యోగం రావడం లేదని యువకుడి బలవన్మరణం



రంజిత్ (ఫైల్)

హసన్‌పర్తి: ఉద్యోగం రావడం లేదని ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అర్వపల్లికి చెందిన ఆకుల రంజిత్(30) పదేళ్లుగా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యాడు. మూడు సార్లు కానిస్టేబుల్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎంపిక కాలేదు. ఇక ఉద్యోగం రాదనుకున్న రంజిత్ సోమవారం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

దస్తగిరి కుమ్మక్కు డ్రామాలు

మీడియాతో దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి.. ఎర్ర గంగిరెడ్డి తలుపు తీయడంతో లోపలకు వెళ్లామనడం అబద్ధం

- ఉత్తరం వైపు తలుపులు నెట్టడంతో తాళాలు పగిలి లోపలకు చొరబడ్డారు
- వివేకా ఆస్తి పత్రాలను దొంగిలించాల్సిన అవసరం ఎవరికి ఉంది?



సాక్షి ప్రతినిధి, కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దస్తగిరి కట్టుకథ పథకం ప్రకారమే తెరపైకి వచ్చిందని ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి తనయుడు డాక్టర్ చైతన్యరెడ్డి స్పష్టం చేశారు. వివేకా కుమార్తె డాక్టర్ సునీత ఆ కట్టుకథను నిజం చేయాలనే కుట్రతో వ్యవహరిస్తున్నారని, సీబీఐ సైతం ఆరోపణలకు తగిన ఆధారాలు సేకరించలేదన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, డాక్టర్ నర్రెడ్డి సునీత ఎన్నికల వేళ రాజకీయ లబ్ధి కోసం పదే పదే వివేకా హత్యను ప్రస్తావిస్తున్నారని చెప్పారు. తన తండ్రి దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డితో పాటు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి ప్రతిష్టకు భంగం వాటిల్లేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వివేకాను చంపినట్లు నేరం ఒప్పుకున్న దస్తగిరిని సీబీఐ విడిచిపెట్టడం వెనుక తిరకాసు ఉందన్నారు. డాక్టర్ సునీత ఆరోపణలు, సీబీఐ దర్యాప్తులో లోపాలపై సోమవారం కడపలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ముందస్తు బెయిల్ లభించాకే అప్రూవర్‌గా..

డ్రైవర్ దస్తగిరి 2021 ఆగస్టు 25న 161 సీఆర్‌పీసీ స్టేట్‌మెంట్ ఇవ్వగా ఆగస్టు 31న మేజిస్ట్రేట్ ఎదుట 164 స్టేట్‌మెంట్ ఇచ్చాడు. దీని ప్రకారం దస్తగిరి స్వయంగా వివేకాను చంపినట్లు ఒప్పుకున్నాడని చైతన్యరెడ్డి గుర్తుచేశారు. అదే ఏడాది అక్టోబర్ 7న ముందస్తు బెయిల్ కోసం దస్తగిరి దరఖాస్తు చేసుకోగా అక్టోబర్ 22న మంజూరైంది. దస్తగిరి బెయిల్‌కు అటు సీబీఐ, ఇటు సునీత ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. అప్రూవర్‌ను అరెస్టు చేస్తే కేసు పూర్తయ్యే వరకు బెయిల్ లభించే అవకాశం లేదు కాబట్టి ముందస్తు బెయిల్ లభించిన తర్వాత దస్తగిరి అప్రూవర్‌గా మారాడు. ఈ వ్యవహారం వెనుక డాక్టర్ నర్రెడ్డి సునీత, అప్పటి సీబీఐ అధికారి రాంసింగ్ ఉన్నారు.

అసలు విషయం అక్కడే ఉంది..

వివేకా హత్యకు గురైన ప్రదేశంలో క్లూస్ టీమ్‌కు లభించిన ఆధారాలు, అప్రూవర్‌గా మారిన దస్తగిరి స్టేట్‌మెంట్ పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. క్లూస్ టీమ్ ఫొటోల ప్రకారం తలుపుల సేఫ్టీ లాక్, టవర్ బోల్ట్ బద్దలైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది. దస్తగిరి మాత్రం తన వాంగ్మూలంలో ఎర్ర గంగిరెడ్డి లోపలి నుంచి తలుపు గడియ తీయడంతో తాము ఇంట్లోకి ప్రవేశించామని చెప్పాడు. అది శుద్ధ అబద్ధం. నర్రెడ్డి సునీత దంపతులు తలుపుల లాక్‌లకు మరమ్మతులు చేయించారు. సేఫ్టీలాక్, టవర్ బోల్ట్ బద్దలైన విషయాన్ని సీబీఐ దృష్టికి తీసుకెళ్లకుండా దాచి పెట్టారు. అక్కడే అసలు విషయం దాగి ఉంది. తలుపులు బద్దలు కొట్టి లోపలికి వచ్చారన్న విషయం బహిర్గతం అయితే దస్తగిరి కట్టుకథ తేలిపోతుందని జాగ్రత్త పడ్డారు. క్లూస్‌టీమ్ సేకరించిన ఐదు వేలి ముద్రలు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులవి కాదు. అవి ఎవరివో ఇప్పటికీ సీబీఐ నిగ్గు తేల్చలేదు.

పరస్పర విరుద్ధ వాంగ్మూలాలు

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో వివేకా హత్యకు గురయ్యారు. ఇంట్లో ఉన్న వారే హత్య చేసినట్లు నాడు తేల్చారు. ఇంటి ఉత్తరం వైపు తలుపు నుంచి ముగ్గురు బయటికి వచ్చారని, కొద్ది సేపటికి బయటకు వచ్చిన ఎర్రగంగి రెడ్డిని ఏమైందని అడగ్గా కోపంగా తోసేయడంతో కింద పడ్డానని ప్రత్యక్ష సాక్షి రంగన్న చెప్పాడు. దస్తగిరి తూర్పు వైపు ఉన్న మెయిన్ డోర్ గుండా బయటికి వచ్చినట్లు చెబుతుండగా రంగన్న మాత్రం ఉత్తరం వైపు డోర్ నుంచి వచ్చారని చెబుతూ పరస్పర విరుద్ధంగా వాంగ్మూలాలు ఇచ్చారు.

ఆ అవసరం ఎవరికి ఉంది?

వివేకా హత్య అనంతరం రౌండ్ సీల్ ఉన్న దస్తావేజులు తీసుకెళ్లినట్లు దస్తగిరి చెబుతున్నాడు. రౌండ్ సీళ్లు ఉన్నాయంటే అవి నోటరీ అఫిడవిట్లు లేదా వీలునామా కావచ్చు. బెంగళూరు స్థలానికి చెందిన డాక్యుమెంట్లు అన్నది శుద్ధ అబద్ధమని సీబీఐ దర్యాప్తులో తేలింది. వీలునామా దస్తావేజులు దొంగిలించాల్సిన అవసరం ఎవరికి ఉంటుంది? దీన్నిబట్టి వివేకా రెండో భార్య షమీమ్, వారసుడు షహెన్‌షా పేరుతో ఉన్న విల్లును దొంగిలించినట్లు తెలుస్తోంది. అసలు ఎర్ర గంగిరెడ్డి నేరస్తులతో కలిసి లేరని దర్యాప్తు ఆధారంగా రూఢీ అవుతోంది. అంటే దస్తగిరి వాంగ్మూలం అంతా కట్టుకథేనని స్పష్టమవుతోంది. దస్తగిరి అప్రూవర్‌గా మారడం ఒక నాటకమే. ఎర్రగంగిరెడ్డి చెప్పాడని నా తండ్రి శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కరరెడ్డి పేర్లను కేసులో చేర్చడం పథకంలో భాగమే.



భారీ ప్లాన్ అనగానే భయపడొద్దు

జాతి సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు

- నా ధ్యాసంతా 2047 విజన్ మీదే
- అభివృద్ధితో దేశాన్ని పరుగులు పెట్టిస్తా
- అందరూ కొత్త సంకల్పంతో ముందడుగు వేయాలి
- ఏఎన్ఐ ఇంటర్వ్యూలో పలు అంశాలను ప్రస్తావించిన ప్రధాని

న్యూఢిల్లీ: భారత్ కోసం బృహత్ ప్రణాళికలు ప్రకటించిన ప్రతిసారీ భయపడాల్సిన పనిలేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. పెద్ద నోట్ల రద్దు ప్రకటించిన క్షణాన దేశవ్యాప్తంగా జనంలో ఒకింత ఆందోళన, పాత నోట్ల మార్పిడిపై భయాలు నెలకొన్న ఘటనను ప్రధాని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. ఏఎన్ఐ వార్తాసంస్థతో ముఖాముఖి కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడారు. '' పెద్ద ప్రణాళిక ఉంది అన్నంతమాత్రాన ఎవరూ భయపడాల్సిన పని లేదు. ఎవరినీ ఆందోళనకు గురిచేసేలా నా నిర్ణయాలు ఉండవు. దేశ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా నా నిర్ణయాలుంటాయి. సాధారణంగా ప్రజా సంక్షేమం కోసం అంతా చేశామని ప్రభుత్వాలు ప్రకటించుకుంటాయి. అంతా నేనే చేశానంటే నమ్మను. సవ్యపథంలో ప్రజాసంక్షేమానికి శాయశక్తులా కృషిచేస్తా. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. నా దేశం సాధించాల్సింది ఇంకా ఉంది. ప్రతి కుటుంబం కలను నెరవేర్చేది ఎలాగ అనేదే నా ఆలోచన. అందుకే గత పదేళ్లలో చేసింది ట్రైలర్ మాత్రమే అంటున్నా'' అని మోదీ చెప్పారు.



విఫల కాంగ్రెస్‌కు, సఫల కమలానికి పోటీ

''వైఫల్యాల కాంగ్రెస్ విధానానికి, అభివృద్ధిని సాకారం చేసిన బీజేపీ విధానాలకు మధ్య పోటీ ఈ ఎన్నికలు. కాంగ్రెస్ ఐదారు దశాబ్దాలు పాలించింది. మాకు ఈ పదేళ్లే పనిచేసే అవకాశమొచ్చింది. అందులోనూ కోవిడ్ వల్ల రెండేళ్లకాలాన్ని కోల్పోయాం. ఈ ఎనిమిదేళ్లలో దేశంలో కనిపిస్తున్న అభివృద్ధిని, నాటి కాంగ్రెస్, నేటి ఎన్‌డీఏ పాలనతో పోల్చి చూడండి. అభివృద్ధి విస్తృతి, వేగాన్ని లెక్కలోకి తీసుకుని ఓటరు ఎటువైపు నిలబడాలో తేల్చుకోవాల్సిన తరుణమిది. వచ్చే ఐదేళ్లకాలంలో అభివృద్ధిని పరుగుపెట్టిస్తాం. దేశాన్ని పాలించే బాధ్యతలు మనకు అప్పగించినప్పుడు ఒక్కటే లక్ష్యం కళ్ల ముందు కదలాడుతుంది. అదే దేశ ప్రజల అభ్యున్నతి'' అని మోదీ అన్నారు. గాంధీల కుటుంబంపై మోదీ విమర్శలు ఎక్కుపెట్టారు. '' ఒక్క కుటుంబ ప్రయోజనాలే పరమావధిగా నాడు రాజకీయ సంస్కృతి కొనసాగింది. కుటుంబ పునాదులు కదలకుండా అంతా కాపుగాశారు. దేశ పునాదులను పటిష్టపరిచే సదుద్దేశంతో పనిచేస్తున్నా. నిజాయితీతో మేం చేసిన పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి'' అని అన్నారు.

100 రోజుల ప్లాన్ ముందే సిద్ధం

'' నా ధ్యాసంతా 2047 విజన్ మీదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా చాలా సంవత్సరాలుగా పనిచేసిన అనుభవం ఉంది. ఆ రోజుల్లో ఎన్నికలొచ్చినపుడు ఓ 40 మంది సీనియర్ ఉన్నతాధికారులు ఎన్నికల పర్యవేక్షక విధుల్లోకి వెళ్లిపోయేవారు. అలా దాదాపు 50 రోజులు కీలక అధికారులు లేకుండా రాష్ట్రాన్ని ఎలా పరిపాలించాలి అనేదే సమస్యగా ఉండేది. తరచూ ఎన్నికలు జరిగే దేశంలో ఇలాంటి సమస్యలు అనివార్యం. వాళ్లు లేని ఆ 50 రోజులు నాకు విరామం ఇచ్చినట్లు కాదని నిర్ణయించుకున్నా.

ఇంటర్వ్యూ

పూర్తిచేయాల్సిన పనులను ముందే వాళ్లకు పురమాయించేవాడిని. రాబోయే ప్రభుత్వం కోసమే ఈ పనులు చేయండని ఆదేశించేవాడిని. అలా 100 రోజుల ముందస్తు ప్రణాళిక పద్ధతి ఆనాడే అలవాటైంది నాకు. అదే మాదిరి ఇప్పుడూ మూడోసారి ప్రధాని అయితే తొలి 100 రోజుల్లో చేయాల్సిన పనులు, ప్రణాళికలను ముందే సిద్ధంచేసి పెట్టుకున్నా. 2047 వికసిత భారత్ కోసం చేయాల్సిన పనులపై గత రెండు సంవత్సరాలుగా కసరత్తు చేస్తున్నాం'' అని మోదీ వెల్లడించారు.

తొలి 100 రోజుల్లో చేసినవే అవి..

''2019 లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందే 100 రోజుల ప్లాన్ సిద్ధం చేశాం. గెలిచి రాగానే ఒక్క నిమిషం కూడా వృథాచేయకుండా వాటి అమలుపై దృష్టిపెట్టా. 2019లో గెలిచిన 100 రోజుల్లోపే ఆర్టికల్ 370ని రద్దుచేశా. ట్రిపుల్ తలాఖ్‌ను రద్దుచేయడంతో ముస్లిం సోదరీమణులకు స్వేచ్ఛ లభించింది. ఇది కూడా తొలి 100 రోజుల్లోనే అమలుచేశా. విశ్వాసమనేది కొండంత బలాన్ని ఇస్తుంది. భారతీయులు నా మీద పెట్టుకున్న నమ్మకం నాపై వాళ్లు ఉంచిన బాధ్యతగా భావిస్తా. భరతమాత ముద్దుబిడ్డగా నేను చేస్తున్న సేవ ఇది'' అని మోదీ వ్యాఖ్యానించారు.

20 లక్షల మంది నుంచి సలహాలు

'వచ్చే పాతికేళ్లలో దేశం ఎలాంటి అభివృద్ధి దిశలో పయనిస్తే బాగుంటుందో చెప్పాలని లక్షలాది మందిని సలహాలు అడిగా. వారి నుంచి సూచనలు స్వీకరించా. విశ్వవిద్యాలయాలు, వేర్వేరు రంగాల ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు ఇలా దాదాపు 15–20 లక్షల మంది నుంచి సలహాలు తీసుకున్నా. కృత్రిమ మేథ సాయంతో సలహాలను రంగాలవారీగా విభజించా. ప్రతి మంత్రిత్వశాఖ, డిపార్ట్‌మెంట్‌లో అంకితభావంతో పనిచేసే అధికారులకు ఈ పని అప్పగించా. ఈసారి ఐదేళ్ల ఎన్‌డీఏ హయాంలో చేయగలిగిన అభివృద్ధి ఎంత అని బేరీజువేసుకున్నా. 2047నాటికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తవుతుంది. ఇలాంటి మైలురాయిని చేరుకున్నపుడు గ్రామమైనా, దేశమైనా కొత్త సంకల్పంతో ముందడుగు వేయాలి. నా గ్రామానికి నేనే పెద్ద అయినపుడు 2047కల్లా సొంతూరుకు ఏదైనా మంచి చేయాలని అనుకుంటాను కదా. దేశవ్యాప్తంగా ఇలాంటి స్ఫూర్తి రగలాలి. వందేళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు అనేవి ప్రతి ఒక్కరికీ గొప్ప స్ఫూర్తినిస్తాయి'' అని మోదీ అన్నారు.



ఎన్నికల విచిత్రం

ఈమె కేంద్ర మంత్రి, ఉత్తర బెంగళూరు లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి శోభా కరంద్లాజే. ఆటో నడుపుతూ సోమవారం బెంగళూరులో ఇలా ఎన్నికల ప్రచార వాహనాలను ఆమె ప్రారంభించారు

ఎలక్షన్ బీట్

రోజుకి రూ.100 కోట్లు

- రికార్డు స్థాయిలో రూ.4,650 కోట్లు పట్టివేత
- గణాంకాలు వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మార్చి ఒకటో తేదీన ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఏప్రిల్ 13వ తేదీ వరకు రోజుకు రూ.100 కోట్ల చొప్పున విలువైన సొత్తు పట్టుబడిందని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) తెలిపింది. స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.4,650 కోట్ల విలువైన సొత్తులో రూ. 395.39 కోట్ల నగదు, బంగారంతో పాటు ఇతర విలువైన లోహాల విలువ రూ. 562.10 కోట్లు, రూ.489.31 కోట్లు విలువచేసే 3.58 కోట్ల లీటర్ల మద్యం, వివిధ రూపాల్లో ఉన్న రూ.2,068.85 కోట్లు విలువ చేసే డ్రగ్స్ ఉన్నాయి. ఇక టీవీలు, ఫ్రిడ్జిలు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎల్రక్టానిక్ గృహోపకరణాలు, బహుమతుల రూపంలో ఓటర్లకు అందించేందుకు సిద్ధం చేసిన రూ.1,142.49 కోట్ల మేర విలువైన ఉచితాలను జప్తు చేసినట్లు ఈసీ తెలిపింది. మొత్తం రికవరీల్లో 45%తో మాదకద్రవ్యాలే సింహభాగంలో ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఈసీ మొత్తం రికవరీల విలువ రూ.3,475 కోట్లు మాత్రమే. ఇప్పుడు తొలి విడత పోలింగ్ కూడా జరక్క ముందే ఆ రికార్డును అధిగమించడం గమనార్హం.

అగ్రస్థానంలో రాజస్థాన్.

దేశవ్యాప్తంగా ఈసీ స్వాధీనం చేసుకున్న మొత్తం రూ. 4,658 కోట్లలో అత్యధికంగా రాజస్థాన్ నుంచి రూ. 778.52 కోట్లు ఉన్నాయి. ఆ తర్వాత రూ.605 కోట్లతో గుజరాత్ రెండో స్థానంలో ఉంది. కాగా తెలంగాణ నుంచి రూ.121.84 కోట్లు, ఆంధ్రప్రదేశ్ నుంచి రూ. 125.97 కోట్లు విలువైన రికవరీ జరిగినట్లు ఈసీ వెల్లడించింది.

బీజేపీకి అనుకూలంగా ఈసీ: మమత

కూచ్ బెహార్/అలీపూర్‌ద్వార్: ఎన్నికల కమిషన్(ఈసీ) కేంద్రంలోని బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మరోసారి ఆరోపించారు. ముర్షిదాబాద్ డీఐజీని ఈసీ తొలగించడం వెనుక బీజేపీ హస్తముందన్నారు. ఎన్నికల వేళ ముర్షిదాబాద్, మాల్దాల్లో ఒక్క హింసాత్మక ఘటన జరిగినా ఈసీదే బాధ్యతని ఆమె హెచ్చరించారు. అవసరమైతే ఈసీ కార్యాలయం ఎదుట 55 రోజుల పాటు నిరశన దీక్ష చేపడతానని హెచ్చరించారు. గతంలో సింగూర్‌లో భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల తరఫున 26 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ దర్యాప్తు విభాగాలను కేంద్రం టీఎంసీపైకి ఉసిగొల్పుతోందని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతలను జైలుకు పంపుతామంటూ బీజేపీ బెదిరిస్తోందంటూ ఆమె..'ఎలా పోరాడాలో నాకు తెలుసు, నేనేమీ పిరికిదాన్ని కాదు'అని మమత వ్యాఖ్యానించారు.

హక్కుల్ని లాగేసుకునేందుకే: ప్రియాంక

జైపూర్: ప్రజల హక్కులను లాగేసుకునేందుకే బీజేపీ నేతలు రాజ్యాంగ సవరణ గురించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ఆరోపించారు. ఎవరూ ఊహించని రీతిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని కూడా ఆ పార్టీ భావిస్తోందన్నారు. ఇవి బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్య జరుగుతున్న ఎన్నికలు కావు..రాజ్యాంగ పరిరక్షణకు, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అని ఆమె అన్నారు. గత పదేళ్ల పాలనను గురించి ప్రధాని మోదీ చెప్పే మాటల్లో డొల్లతనం కనిపిస్తోందన్నారు. రాజస్తాన్‌లోని దౌసా జిల్లా బందికుయిలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక మాట్లాడారు. బీజేపీ నాయకుల మాటల్ని కాకుండా..దేశం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆలోచించండి అని ప్రజలకు పిలుపునిచ్చారు.

బీజేపీ రాజ్యాంగమే మార్చేస్తుంది: అఖిలేశ్

లక్నో: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400పైగా సీట్లు దక్కిన పక్షంలో ఆపార్టీ రాజ్యాంగాన్ని మార్చివేయడంతోపాటు రిజర్వేషన్లను ఎత్తి వేస్తుందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ) అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఓటు హక్కును కూడా లాగేసుకుంటుందని అన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీలను బూచిగా చూపి కార్పొరేట్ సంస్థల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో కోట్లాది రూపాయలను వసూలు చేసిందని ఆయన బీజేపీని విమర్శించారు. సోమవారం ముజఫర్‌నగర్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా పదేళ్లలో లక్ష మందికిపైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు.

'రామరాజ్యం' మొదలైంది: రాజ్‌నాథ్

కథువా(జమ్మూకశ్మీర్): దేశంలో రామరాజ్యం వేళ్లూనుకోవడం మొదలైందని, కార్యరూపం దాల్చకుండా ఆపడం ఎవరి వల్లా కాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ప్రజలకు తమ విధుల పట్ల వాస్తవమైన అవగాహన ఉండటమే రామరాజ్యమన్నారు. అటువంటి పరిస్థితులు దేశంలో ఇప్పుడిప్పుడే వాస్తవరూపం దాల్చుతున్నాయని చెప్పారు. కథువా జిల్లా బసోహ్లిలో సోమవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో మంత్రి మాట్లాడారు. ప్రజలు, రాజకీయ నేతల మధ్య పెరిగిన అంతరాన్ని పూడ్చేందుకే తప్ప కేవలం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికే బీజేపీ రాజకీయాలు చేయడం లేదన్నారు. సీఏఏ అమలు ఫలితంగా భారతీయ పౌరులెవరూ పౌరసత్వాన్ని కోల్పోరని స్పష్టం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే వచ్చే ఐదేళ్లలో దేశంలో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని తెలిపారు.

ఒడిశాలో కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే బహిష్కరణ

భువనేశ్వర్: క్రమశిక్షణారాహిత్యం, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడనే కారణాలతో కాంగ్రెస్ పార్టీ ఒడిశాలో తమ సీనియర్ ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రేను పార్టీ నుంచి ఆరేళ్ల పాటు బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అందిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని సురేష్‌కుమార్‌ను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం ప్రకటించారు. జటానీ నియోజకవర్గం నుంచి సురేష్ కుమార్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఈసారి ఆయన తనయుడు మన్మథ్ రౌత్రే బిజూ జనతాదళ్ అభ్యర్థిగా భువనేశ్వర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేస్తున్నారు. కుమారుడిగా మద్దతుగా నిలుస్తున్నారని, బీజేడీ నేతలతో వేదికను పంచుకుంటున్నారని సురేష్ కుమార్‌పై ఫిర్యాదులు వచ్చాయి. కాంగ్రెస్‌తో తనది ఐదు దశాబ్దాల అనుబంధమని, తనను బహిష్కరించినా చివరి శ్వాస వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని, బహిష్కరణపై అధిష్టానంతో మాట్లాడతానని సురేష్‌కుమార్ స్పందించారు.

మే 15న పదవి నుంచి తప్పుకుంటా: లూంగ్

సింగపూర్: సింగపూర్ ప్రధానిగా దాదాపు రెండు దశాబ్దాలపాటు కొనసాగిన లీ సీయన్ లూంగ్(72) రిటైర్మెంట్ ప్రకటించారు. మే 15వ తేదీన బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు లూంగ్ సోమవారం తెలిపారు. అదే రోజున ఉప ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్(51) ప్రధానిగా బాధ్యతలు చేపడతారన్నారు. సింగపూర్ మూడో ప్రధానిగా 2004లో లూంగ్ బాధ్యతలు చేపట్టారు. ఏ దేశానికైనా నాయకత్వ మార్పిడి ఎంతో ముఖ్యమైన విషయమని ఆయన ఫేస్‌బుక్‌లో పేర్కొన్నారు. సింగపూర్‌కు మరింత ఉజ్వల భవిష్యత్తును అందించేందుకు వాంగ్ ప్రభుత్వానికి సహకారం అందించాల్సిందిగా ప్రజలను ఆయన కోరారు.

ఈసారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం

వాతావరణ శాఖ అంచనా

న్యూఢిల్లీ: ఎండలు, వడగాడ్పులతో అల్లాడుతున్న వేళ భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లని కబురు మోసుకొచ్చింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో సమృద్ధిగా వానలు కురుస్తాయని శుభవార్త చెప్పింది. 'లా నినో' వాతావరణ పరిస్థితులు కలిసిరావడంతో దేశంలో ఈసారి సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనావేసింది. వాతావరణ శాఖ అంచనా వివరాలను కేంద్ర భూవిజ్ఞానశాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం.రవిచంద్రన్ సోమవారం ఢిల్లీలో వెల్లడించారు. ''దీర్ఘకాల సగటు వర్షపాతం 106 శాతం మేర పడొచ్చు. అంటే 87 సెంటీమీటర్లకు మించి నమోదు కావచ్చు. ప్రస్తుతం భూమధ్య రేఖ పసిఫిక్ ప్రాంతంలో మధ్యస్థ ఎల్‌నినో పరిస్థితులున్నాయి. ఈ ఎల్ నినో (వర్షాభావ పరిస్థితులు) నైరుతి రుతుపవనాల ప్రవేశం (జూన్) నాటికి బలహీనపడి, ద్వితీయార్థంలో లా నినో (వర్షాలకు అనుకూల) పరిస్థితులు ఏర్పడనున్నాయి. గడచిన మూడు నెల్లో ఉత్తరార్థ గోళం, యూరేసియాలో మంచు సాధారణం కన్నా తక్కువగా ఉంది. దీంతో ఈసారి భారత్‌లో వర్షపాతం సాధారణం కన్నా ఎక్కువ నమోదు కావచ్చు'' అని పేర్కొన్నారు. దేశ సాగు విస్తీర్ణంలో 52 శాతం పంటలు వర్షాధార పంటలే. రిజర్వాయర్లు అడుగంటి తాగునీటికి సైతం జనం కష్టాలు పడుతున్న ఈ తరుణంలో వాతావరణ శాఖ ప్రకటన రైతాంగాన్ని భారీ ఊరటనిస్తోంది. అయితే వాయవ్య, తూర్పు, ఈశాన్య భారతావనిలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదుకావచ్చని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర అంచనా వేశారు. మధ్యప్రదేశ్, రాజస్తాన్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లలో వర్షపాత వివరాలను ఐఎండీ వెల్లడించలేదు. గత 50 ఏళ్ల సగటున అయిన 87 సెంటీమీటర్ల వర్షపాతంలో 96 శాతం నుంచి 104 శాతాన్ని 'సాధారణ వర్షపాతం'గా ఐఎండీ గణిస్తోంది.



దీర్ఘకాల సగటులో 90 శాతం కన్నా తక్కువ వర్షపాతం కురిస్తే దానిని వర్షాభావ పరిస్థితిగా లెక్కిస్తారు. 90–95 శాతం కురిస్తే దానిని సాధారణ వర్షపాతంగా, 105–110 శాతం కురిస్తే సాధారణం కన్నా ఎక్కువగా పరిగణిస్తారు. 1951–2023 కాలంలో పరిశీలిస్తే ఎల్ నినో తర్వాత వచ్చే లా నినో సందర్భాల్లో తొమ్మిదిసార్లు దేశంలో రుతుపవన కాలాల్లో సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదైంది. లా నినో సంభవించిన 22 సంవత్సరాల్లో 20 సార్లు సాధారణం/సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

రాజ్యాంగ సంస్థలు మోదీ సొత్తు కాదు

వయనాడ్ ప్రచార సభలో రాహుల్ విమర్శ

వయనాడ్/నీలగిరి: సీబీఐ, ఈడీ మొదలుకుని కేంద్ర ఎన్నికల సంఘం దాకా ప్రతి రాజ్యాంగబద్ధ సంస్థల్లోకి తమ వారిని జొప్పిస్తూ ప్రధాని మోదీ వాటిని తన సొంత ఆస్తులుగా భావిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. కేరళలోని సొంత ఎంపీ నియోజకవర్గం వయనాడ్‌లో ప్రచారంలో భాగంగా సోమవారం వల్లి మండలో రోడ్‌షో నిర్వహించి అక్కడి పార్టీ కార్యకర్తలు, ఓటర్లనుద్దేశించి రాహుల్ ప్రసంగించారు. '' రాజ్యాంగబద్ధ సంస్థలన్నింటినీ బీజేపీ హస్తగతం చేసుకుంటున్న తీరు మీకందరికీ అర్థమయ్యే ఉంటుంది. న్యాయవ్యవస్థ, ఎలక్షన్ కమిషన్, సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖ ఇలా ప్రతి రాజ్యాంగబద్ధ విభాగంలోనూ తమ అస్మదీయులను జొప్పించడంలో ఆర్‌ఎస్ఎస్, బీజేపీ బిజీగా ఉన్నాయి. అవే రాజ్యాంగబద్ధ సంస్థల పరిరక్షణ కోసం విపక్షాల 'ఇండియా' కూటమి పాటుపడుతోంది. ఇవి ఎవరి సొంత సంస్థలుకావు. ప్రధాని మోదీ వ్యక్తిగత ఆస్తులు అస్సలు కావు. ఇవి ప్రతి ఒక్క భారతీయ పౌరుడివి. రాజ్యాంగాన్ని సవరించబోతున్నట్లు ఒక బీజేపీ ఎంపీ ఇటీవలే ప్రకటించారు. రాజ్యాంగాన్ని మార్చే అవకాశం ఆర్‌ఎస్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీ ఇవ్వదు. రాజ్యాంగాన్ని తమకు నచ్చినట్లు మార్చేసి జాతి సమున్నత ఆశయాలను సమాధిచేయాలని చూస్తున్నారు' అని ఆరోపించారు. '' కేరళను నాగ్‌పూర్(ఆర్‌ఎస్ఎస్ ప్రధానకేంద్రం) పాలించకూడదు. సొంత పట్టణాలు, పల్లెల నుంచే పరిపాలన సాగాలి. కేరళ ప్రజలకు ఏం కావాలో, వాళ్లేం ఆశిస్తున్నారో ఢిల్లీ(మోదీ సర్కార్)కి ఎలా తెలుస్తుంది?'' అని ప్రశ్నించారు. ''ఎంతోకాలంగా డిమాండ్‌చేస్తున్నా సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డీఎఫ్ సర్కార్ వయనాడ్ జిల్లాలో ఇంతవరకు ఒక్క వైద్యకళాశాలను ఏర్పాటుచేయలేదు. యూడీఎఫ్ ప్రభుత్వం వస్తేగానీ కాలేజీ రాదేమో'' అని విమర్శించారు. 'ఇంతటి అందమైన ప్రదేశం వయనాడ్‌లో ఓ వారం పది రోజులు గడపమని మా అమ్మ(సోనియా)కు చెప్పా. ఆమెకు అతి ఉక్కబోత పడదు. భువిపైనే అందమైన ప్రదేశాన్ని మిస్ అవుతున్నావని గుర్తుచేశా'' అని రాహుల్ అన్నారు.



రాహుల్ హెలికాప్టర్‌లో తనిఖీలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా తమిళనాడులోని నీలగిరి ప్రాంతానికి రాహుల్ వచ్చినపుడు ఆయన ప్రయాణించిన హెలీకాప్టర్‌లో ఎన్నికల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఎలాంటి చట్టవ్యతిరేక వస్తువులు లభించలేదు.

పదేళ్ల అభివృద్ధి.. ట్రైలర్ మాత్రమే: మోదీ

త్రిసూర్/తిరువనంతపురం/తిరునల్వేలి: గత దశాబ్దకాలంగా ఎన్‌డీఏ పాలనాకాలంలో దేశం చవిచూసిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి సాకారంకానుందని ఆయన ప్రకటించారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యతనిస్తూ బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప పత్రం' విడుదల చేసిన మరుసటి రోజే ప్రధాని మోదీ ఆ హామీలను పునరుద్ఘాటించారు. కేరళలోని కున్నమ్‌కులమ్, కట్టకడ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగసభల్లో మోదీ ప్రసంగించారు. రాహుల్‌గాంధీపై పరోక్ష విమర్శలు చేశారు. '' కాంగ్రెస్ యువరాజుకు ఉత్తరప్రదేశ్‌లో దశాబ్దాలుగా తమ కుటుంబ గౌరవం(అమేథీ ఎంపీ స్థానం)ను కాపాడే సత్తాలేదుగానీ కేరళకు వచ్చి ఓట్లడుగుతారు. కేరళీయుల ఓట్లడిగే ఆయన సీపీఐ(ఎం) ఏలుబడిలో కరువన్నూర్ సహకార బ్యాంక్‌లో వెలుగుచూసిన కుంభకోణంపై నోరు మెదపరెందుకు? నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా రాజకీయ విభాగం సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు కాంగ్రెస్‌కు ఉంది. ఈ రెండింటి మధ్య చీకటి ఒప్పందం కుదిరింది. కోఆపరేటివ్ బ్యాంక్ స్కామ్‌కు పాల్పడి ప్రజాధనాన్ని లూటీ చేశారు. ఈ మోసంపై నేనే ఈడీ దర్యాప్తునకు ఆదేశించా'' అని అన్నారు.

లెఫ్ట్ ఉంటే అంతా లెఫ్ట్ అయినట్లే

''కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి, అధికార ఎల్‌డీఎఫ్ కూటములు కేరళలో అభివృద్ధికి ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. త్రిపుర, పశ్చిమబెంగాల్, కేరళ ఈ రాష్ట్రాల్లో లెఫ్ట్ పార్టీ అధికారంలో ఉందీ అంటే అక్కడ అంతా పోయినట్లే(లెఫ్ట్ అయినట్లే). అక్కడ మంచి అనేదే జరగదు. పశ్చిమబెంగాల్, త్రిపురలో ఏం చేశారని, కొత్తగా కేరళకు చేయడానికి?' అంటూ ధ్వజమెత్తారు.

కచ్చతీవు ఉదంతాన్ని, 4 దశాబ్దాలు దాచారు

తమిళనాడులోని తిరునల్వేలిలో జరిగిన సభలోనూ మోదీ ప్రసంగించారు. కచ్చ తీవును శ్రీలంకకు ఇచ్చేసి కాంగ్రెస్, డీఎంకే ఈ ఉదంతాన్ని 40 ఏళ్లు దాచిపెట్టాయని మోదీ ఆరోపించారు. అక్కడ తమిళ మత్స్యకారులు తరచూ అరెస్ట్ అవుతున్నారని, ఈ పాపం ఆ పార్టీలదేనన్నారు.

కేజ్రీవాల్ పిటిషన్‌పై ఈడీకి సుప్రీం నోటీస్

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై తనను అరెస్ట్ చేయడాన్ని సవాల్ చేస్తూ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. ఈ నెల 24వ తేదీ లోగా సమాధానమివ్వాలని ఈడీని ఆదేశించింది. ఈ కేసుపై తదుపరి విచారణ ఈ నెల 29వ తేదీన చేపడతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం సోమవారం పేర్కొంది. సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలన్న అభిషేక్ సింఘ్వి వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం చట్ట విరుద్ధం కాదంటూ ఢిల్లీ హైకోర్టు ఈ నెల 9వ తేదీన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా, ఈ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 23వ తేదీ వరకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇచ్చిన 15 రోజుల కస్టడీ గడువు ముగియడంతో సోమవారం సీబీఐ, ఈడీ కేసుల ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా వర్చువల్‌గా విచారణ చేపట్టారు. ఏప్రిల్ 23వ తేదీ వరకు కస్టడీని పొడిగిస్తూ ఆదేశాలిచ్చారు. ఇదే కేసులో బీఆర్ఎస్ నేత కె.కవిత తదితర నిందితుల కస్టడీ గడువు కూడా అదే రోజుతో ముగుస్తోందని ఆమె తెలిపారు.

న్యాయవ్యవస్థను తక్కువ చేసేందుకు ప్రయత్నాలు

సీజేఐకి రాసిన లేఖలో రిటైర్డు జడ్జీల ఆందోళన

న్యూఢిల్లీ: పథకం ప్రకారం ఒత్తిళ్లు తేవడం, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం, బహిరంగ విమర్శల ద్వారా న్యాయ వ్యవస్థను చులకన చేసేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని రిటైర్డు జడ్జీల బృందం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు రాసిన లేఖలో ఆందోళన వ్యక్తం చేసింది. వ్యక్తిగత లబ్ధి, రాజకీయ స్వార్థం కోసం జరిగే ఇటువంటి ప్రయత్నాల కారణంగా న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం తగ్గిపోయే ప్రమాదముందని వారు పేర్కొన్నారు. అయితే, ఏ పరిణామాలు తమను ఈ లేఖ రాసేందుకు ప్రేరేపించాయనే విషయాన్ని అందులో వారు ప్రస్తావించలేదు. అవినీతి కేసుల్లో కొందరు ప్రతిపక్ష నేతల అరెస్టుపై అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల తూటాలు పేలుతున్న సమయంలో ఈ లేఖ రాయడం గమనార్హం. ఆరోపణలెదుర్కొంటున్న నేతలు, వారి పార్టీలు కోర్టులను ఆశ్రయించడం, న్యాయవ్యవస్థ తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలను చూపుతూ బీజేపీ వారిపై ప్రత్యారోపణలు చేస్తుండటాన్ని లేఖలో వారు ప్రస్తావించారు. 'ఇటువంటి చర్యలతో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతింటోంది. జడ్జీల నిష్పాక్షికత, సచ్ఛీలత అనే సూత్రాలకు ఇవి సవాల్‌గా మారాయి. ఇటువంటి అవాంఛిత ఒత్తిడుల నుంచి న్యాయవ్యవస్థను కాపాడు కోవాల్సిన అవసరం ఉంది'అని లేఖలో పేర్కొన్నారు. నిరాధార సిద్ధాంతాలను ప్రచారం చేయడం వంటి చర్యల ద్వారా న్యాయపరమైన ఫలితాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కొన్ని సమూహాలు అనుసరిస్తున్న వ్యూహం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు నేతృత్వంలోని న్యాయవ్యవస్థను ఇటువంటి ఒత్తిళ్లకు వ్యతిరేకంగా బలోపేతం చేయాలని, న్యాయ వ్యవస్థ పవిత్రతను, స్వయంప్రతిపత్తిని పరిరక్షించాలని వారు కోరారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా, అస్థిర రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. లేఖ రాసిన వారిలో సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జీలు జస్టిస్ దీపక్ వర్మ, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ దినేశ్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షా సహా వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది న్యాయమూర్తులు ఉన్నారు.



ఈ ట్రాఫిక్ పోలీసు హెల్మెట్‌కు ఏసీ ఉంది. మండే ఎండలకు విరుగుడుగా దీని ఐఐఎం వడోదర విద్యార్థులు రూపొందించారు.

ఆ ఓడలోని భారత సిబ్బందితో భేటీకి ఓకే

న్యూఢిల్లీ: హోర్ముజ్ జలసంధిలో శనివారం ఇరాన్ స్వాధీనం చేసుకున్న సరుకు రవాణా నౌకలోని 17 మంది భారతీయ సిబ్బందిని కలుసుకునేందుకు మన అధికారులకు త్వరలోనే అనుమతి రానుంది. ఇరాన్ విదేశాంగ మంత్రి హొస్సైన్ అమీర్ అబ్దొల్లాహియాన్ భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌కు ఈ మేరకు హామీ ఇచ్చారు. ఆదివారం వీరిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో ఉన్న 17 మంది భారతీయ సిబ్బంది భద్రతపై జై శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

జైలు నుంచే ప్రభుత్వం నడుపుతారు: ఆప్

న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వచ్చే వారం నుంచి జైల్లోనే ప్రతి వారం ఇద్దరేసి మంత్రులతో సమావేశమవుతారని అధికార ఆప్ రాజ్యసభ ఎంపీ సందీప్ పాఠక్ తెలిపారు. సంబంధిత మంత్రుల శాఖల్లో అభివృద్ధి పనుల తీరును ఆయన సమీక్షించి, మార్గదర్శనం చేస్తారని వివరించారు. ఒక పద్ధతి ప్రకారం జైలు నుంచే ఢిల్లీ ప్రభుత్వం పనిచేయడం మొదలవుతుందన్నారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సోమవారం పాఠక్‌తోపాటు పంజాబ్ సీఎం మాన్ కలిశారు.

సర్ఫరాజ్ బతికే ఉన్నాడు?

లాహోర్: 2013లో సరబ్‌జీత్ సింగ్ అనే భారతీయుడిని జైలులోనే చంపినట్లు ఆరోపణలున్న మాఫియా డాన్ అమిర్ సర్ఫరాజ్ టంబా ఇంకా బతికే ఉన్నాడని పంజాబ్ ప్రావిన్స్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. తీవ్రగాయాలతో ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడన్నారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 16 । ఏప్రిల్ । 2024



ఏసీబీకి చిక్కిన ఆర్టీసీ డీఎం

ఆర్టీసీడ్రైవర్‌కు ఇచ్చిన చార్జిమెమో ఎత్తేసేందుకు రూ.30వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.

8లో▸



క్వింటాల్ పత్తి రూ.7,400

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో క్వింటాల్ పత్తిధర గరిష్టంగా రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్‌కు 51వాహనాల్లో 644 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు.

గరిష్టం/కనిష్టం
41.0/28.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. వడ గాలులు వీస్తాయి. తీవ్ర ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వెలిచాల!



సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్ రావు పేరు దాదాపు ఖరారైనట్లు తెలిసింది. ఎంపీ టికెట్‌పై ఢిల్లీ అధిష్టానం ఇంకా నిర్ణయం తీసుకోనప్పటికీ.. మొదటి నుంచి ఆశావహుల జాబితాలో హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, కరీంనగర్‌కు చెందిన సీనియర్ లీడర్ వెలిచాల రాజేందర్ రావు ఉన్నారు. వీరిద్దరూ నువ్వానేనా అన్నట్లు టికెట్ కోసం పోటీపడుతున్నారు. అన్ని అంశాలను పరిశీలించిన అధిష్టానం వెలిచాల వైపే మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. అంతేకాదు.. సోషల్ మీడియా, రాష్ట్ర కాంగ్రెస్‌లో కూడా వెలిచాల పేరే వినిపించడం విశేషం.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

- చిన జీయర్‌స్వామి



భక్తులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న చిన జీయర్‌స్వామి

కరీంనగర్‌కల్చరల్: రామాయణం సనాతనమని అందులోని ధర్మాలను ఆచరించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతునన్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో సోమవారం స్వామి ప్రవచనాలు వినిపించారు. రామాయణ ధర్మాలను ఆచరిస్తోంది తెలుగువారేనని, ప్రేమలేని కారణంగా తెలుగు మరుగునపడిన పరిస్థితుల్లో రామాయణ ధర్మాలు నశిస్తున్నాయన్నారు. రాముని చరిత్ర, రామాయణం విన్న మనం రాముని గుణగణాలను అలవరుచకోవాలన్నారు. ఆనాడు అయోధ్య ప్రజా సంక్షేమం, లంకస్వార్థం ఆకాంక్షించిందని అందుకే రామరావణ యుద్ధం జరిగిందన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్టి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, బీవీ.రావు, యాద కిషన్, ఎల్.భూపతిరావు, ఎస్.వేంకటేశం, వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

'బోనస్ ఇచ్చి, రుణమాఫీ చేశాకే ఓట్లడగాలి'



ప్రచారం చేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

హుజూరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసి, రూ.500 బోనస్ అందించిన తరువాతే కాంగ్రెస్ పార్టీ ప్రజలను ఓట్లు అడగాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం విజయ సంకల్ప అభియాన్‌లో భాగంగా హుజూరాబాద్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ప్రజలందరూ మోదీ ప్రభుత్వంపై నమ్మకంతో ఉన్నారని, అందుకే వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, కరీంనగర్ పార్లమెంటు పరిధిలో బండి సంజయ్‌కుమార్ భారీ మెజారిటీతో గెలవబోతున్నారని పలు సర్వే సంస్థలు వెల్లడించాయన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రగల్భాలు పలికి, నేడు తూతూ మంత్రంగా గ్యారంటీలను అమలు చేస్తోందని అన్నారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలో, మోదీ ప్రభుత్వం కావాలో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. బీఆర్‌ఎస్ పని అయిపోయిందని, ఆ పార్టీకి ఓటేస్తే ప్రయోజనం లే దనే భావన ప్రజల్లో ఉందన్నారు. బీజేపీ పట్ట ణ అధ్యక్షుడు జి.రాజు, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నిర్మలారెడ్డి ఉన్నారు.


అంధులపై బ్రహ్మాస్త్రం!



- వేతనాల చలాన్లలో రూ.10 లక్షల వరకు గోల్‌మాల్
- అంధ క్లర్కు దంపతులపై హెడ్మాస్టర్ ఫిర్యాదు
- ప్రాథమిక విచారణ లేకుండా ఫిర్యాదు ఆధారంగా కేసు
- వేతనాలు ప్రిపేర్ చేసిన వ్యక్తిని మినహాయించడంపై విస్మయం
- చూపులేకుండా అక్రమాలు ఎలా చేస్తామంటున్న దంపతులు
- టీచర్లు విదేశాలకు వెళ్లినా.. హెడ్మాస్టర్ జీతమెలా ఇచ్చాడని ప్రశ్న



రాజ్‌కుమార్- తిరుమల దంపతులు



విదేశాలకు వెళ్లిన టీచర్‌కు డీఈవో అనుమతి

సాక్షిప్రతినిధి, కరీంనగర్:

తిరుమల–రాజ్‌కుమార్ దంపతులు అంధులు. కరీంనగర్ జిల్లా ఎల్ఎండీ కాలనీలోని జెడ్పీహెచ్ఎస్‌లో తిరుమల క్లర్కు. ఆమెకు జూనియర్ అసిస్టెంట్ విధులు కేటాయించారు. సాయం కోసం (స్క్రైబ్) తన భర్త రాజ్‌కుమార్‌ను తోడుగా తెచ్చుకునేది. వీరిద్దరికీ 80శాతం చూపులేదు. కనీసం నాలుగు అంగుళాల దగ్గరగా ఉంటే తప్ప చూడలేరు. వ్యక్తులను కేవలం గొంతు ఆధారంగా గుర్తుపడతారు. కానీ, దాదాపు రూ.10 లక్షల వరకు టీచర్ల సొమ్ము ప్రభుత్వానికి జమ చేయకుండా జేబులో వేసుకున్నారని హెడ్‌మాస్టర్ ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి. దీంతో, టీచర్ల లోకం భగ్గుమంది. పోలీసుల తీరుపై మండి పడుతోంది. చూపులేని వారు తమ వేతనాలు ఎలా కాజేస్తారు? ఆ విషయాన్ని పోలీసులు ఎలా నమ్మారు? అసలు ప్రాథమిక విచారణ జరిగిందా? అని ప్రశ్నిస్తున్నారు. తమను స్కూల్ హెడ్‌మాస్టర్ రాజభాను చంద్రప్రకాశ్ ఈ కేసులో ఇరికించారని, ఎదుటి వ్యక్తిని చూడలేని తాము రూ.లక్షలు ఎలా తీసుకుంటామని ఆ అంధ దంపతులు అంటున్నారు.

అసలేం జరిగింది?

ఈ వ్యవహారంలో అంధ దంపతులు 'సాక్షి'ని ఆశ్రయించి జరిగింది మొత్తం వివరించారు. వారెమన్నారంటే.. 'ఎల్ఎండీ కాలనీ జెడ్పీ హైస్కూల్లో రాజభాను చంద్రప్రకాశ్ హెడ్‌మాస్టర్. ప్రతినెలా పాఠశాలలో పనిచేసే టీచర్ల జీతాలు ఇతనే ప్రిపేర్ చేసి, పంపిస్తారు. ఇక్కడి ఉపాధ్యాయుల్లో చాలామంది వివిధ వ్యక్తిగత కారణాలతో సెలవు (మెడికల్/చైల్డ్ కేర్ తదితర లీవు)లు పెడుతుంటారు. కానీ, హెచ్ఎం వారు సెలవులో ఉన్నట్లు కాకుండా పని చేసినట్లు రికార్డులో నమోదు చేస్తారు. ఆయా పని దినాలకు వేతనం లెక్కగట్టి, ఉన్నతాధికారులకు పంపుతారు. వేతనం టీచర్ల ఖాతాలో క్రెడిట్ కాగానే వారికి ఫోన్ చేసి, పొరపాటున సెలవు దినాలకు జీతం యాడ్ అయిందని, దాన్ని వెనక్కి పంపితే చలానా రూపంలో తిరిగి ప్రభుత్వానికి పంపుతానని నమ్మబలుకుతారు. ఇలా 2021 నుంచి 2024 వరకు దాదాపు రూ.10 లక్షల వరకు వేతనాలను క్రెడిట్ చేయడం, అనంతరం వారి నుంచి తీసుకోవడం, వాటిని తన జేబులో వేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఎవరైనా అడిగితే నకిలీ చలానాలు చూపేవారు. ఐటీ రిటర్నుల విషయంలోనూ ఇలాగే చేసి, డబ్బులు వసూలు చేసేవారు' అని అంధ దంపతులు బోరుమన్నారు. ప్రతీసారి టీచర్ల డబ్బును తెలివిగా తమకు ఫోన్ పే/గూగుల్ పే చేయించేవారని, వాటిని తాము డ్రా చేసి నగదు రూపంలో హెడ్‌మాస్టర్‌కు అందజేసేవారమని చెప్పారు. ఇటీవల కొందరు టీచర్లకు అనుమానం వచ్చి, నిలదీసేసరికి విషయాన్ని తమపైకి నెట్టాడని వాపోయారు.

రూ.7 లక్షలు అడిగితే ఇచ్చాం..

ఈ నెల మొదటివారంలో తమ వద్దకు వచ్చిన హెడ్‌మాస్టర్ తమను బెదిరించి, బలవంతంగా తామే ఈ నేరానికి పాల్పడినట్లు లెటర్ తీసుకున్నారని తిరుమల–రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం పోకుండా ఉండాలంటే రూ.7 లక్షలు కట్టాలని బెదిరిస్తే.. అప్పు చేసి ఇచ్చామన్నారు. ఆ తర్వాత జరిగిన వ్యవహారంలో ఎక్కడా ఆయన పాత్ర లేకుండా చూపేందుకు ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసి, సమాజంలో తమను దోషులను చేశాడని వాపోయారు. తమకు ఇద్దరు పిల్లలని, ఇప్పుడు ఈ కేసులో జైలుకు పంపి, తమ కుటుంబాన్ని నాశనం చేసే కుట్రకు తెరతీశారని కన్నీరు పెట్టుకున్నారు.

అమెరికా వెళ్లినా జీతం క్లెయిమ్..

తిమ్మాపూర్‌లో ఓ టీచర్ 2022 సెప్టెంబర్‌లో అమెరికా వెళ్లారని, ఇందుకోసం 6 నెలలపాటు ముందస్తుగా డీఈవో వద్ద అనుమతి పొందారని తెలిపారు. నవంబర్ జీతం డిసెంబర్‌లో ఆమెకు బ్యాంకు ఖాతాలో పడిందన్నారు. వెంటనే హెడ్‌మాస్టర్ సదరు టీచర్‌ను సంప్రదించి, మొత్తం వేతనం వెనక్కి తెప్పించారని, ఈ వ్యవహారంలో సదరు టీచర్ హెచ్ఎం తీరుపై మండిపడి, నిలదీశారని తెలిపారు. కాగా ఈ విషయమై పాఠశాల హెచ్ఎంను సంప్రదించగా.. అందుబాటులోకి రాలేదు.

కనికరం లేని పోలీసులు..

పోలీసులు కేసు నమోదు చేసే క్రమంలో కనీసం తమను సంప్రదించలేదని, అసలు 80 శాతం చూపులేని తమకు హెడ్‌మాస్టర్ ముఖమే తెలియదని, సంతకాలు ఎలా ఫోర్జరీ చేస్తామని ఆ అంధ దంపతులు అన్నారు. పోలీసులు ప్రాథమిక విచారణ చేయకుండా తమపై కేసు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు. కేసు విషయంలో నిజానిజాలు తెలుసుకునేందుకు తిమ్మాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే తమను పట్టించుకోలేదని వాపోయారు. కంటిచూపులేని వారమన్న కనికరమైనా చూపకుండా హెచ్ఎంపై ఫిర్యాదు తీసుకోకపోవడం దారుణమన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులను, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. హెచ్ఎం రాజభాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ప్రతీచోట తాము అంధులమని పేర్కొన్న విషయాన్ని గమనించాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి



ఫైర్‌సేఫ్టీ కిట్ల ప్రదర్శనను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌క్రైం/కరీంనగర్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్ సిబ్బంది కఠోరంగా శ్రమిస్తూ ఆస్తులు, ప్రజల ప్రాణాలు కాపాడడం వారి తెగువకు నిదర్శనమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫైర్‌సేఫ్టీ కిట్ల ప్రదర్శనను ప్రారంభించారు. ఒక్కో పరికరానికి సంబంధించిన పనితీరును పరిశీలించారు. వాటి ఉపయోగాలను జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వశక్తి మహిళలు, మున్సిపల్, విద్యుత్ సిబ్బంది ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రైవేట్ హాస్పిటళ్లు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ భవనాల్లో ఫైర్‌సేఫ్టీ కిట్ల పనితీరును పర్యవేక్షించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పాటించని నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ అజయ్‌యాదవ్, సీపీవో కొమురయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఈనెల 25వ తేదీ నుంచి మే 2 వరకు జరగనున్న ఓపెన్‌స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను ఎట్టి పరిస్థితిల్లోనూ అనుమతించవద్దని అన్నారు. ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీకి సంబంధించిన పరీక్షకేంద్రాలు కరీంనగర్‌లో రెండు, హుజూరాబాద్‌లో ఒకటి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మూడు కేంద్రాల్లో 475మంది పరీక్షలు రాయనున్నారని అన్నారు. ఇంటర్‌కు కరీంనగర్‌లో మూడు, హుజూరాబాద్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 881 మంది పరీక్ష రాయనున్నారని తెలిపారు. ప్రశ్న పత్రాలు, జవాబు పత్రాలు తీసుకెళ్లే సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. డీఆర్‌వో పవన్‌కుమార్, డీఈవో జనార్దన్ రావు, డీఎంహెచ్‌వో సుజాత పాల్గొన్నారు.



నిర్మానుష్యంగా ఎస్సారార్ కళాశాల రోడ్డు

'మండే' సూరీడు



మూడు రోజులు చల్లబడిన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం 40.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవగా నగరంలోని రహదారులు బోసిపోయాయి. ప్రధాన రహదారులతో పాటు, పలు వీధుల్లో అప్రకటిత కర్ఫ్యూను మరిపించగా చిరువ్యాపారులు, సిటీ ప్రజలు బెంబేలెత్తారు. మంగళ, బుధవారాల్లోనూ ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు వివరించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

20 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో నిర్వహణ
- జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగంరావు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆగంరావు, తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఆగంరావు తెలిపారు. సోమవారం శిక్షణ శిబిరాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను క్రికెట్ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించి, శిబిరాలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. అండర్– 14,16,19,23 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్, గోదావరిఖని, రాజన్న సిరిసిల్లలో ఈనెల 20 నుంచి మే 20వ తేదీ వరకు క్రికెట్ కోచ్‌ల ఆధ్వర్యంలో శిబిరాలు కొనసాగుతాయని అన్నారు. ప్రతిభ కనబరిచే వారికి హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా, రాష్ట్రస్థాయి టోర్నీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందని అన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లను www.hycricket.org వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 16 నుంచి 18లోపు నమోదు చేసుకోవాలని, వివరాలకు 80087 29397 నంబర్‌ను సంప్రదించాలన్నారు. క్రికెట్ సంఘం కార్యదర్శి ఎస్.మురళీధర్ రావు, పి.మనోహర్‌రావు, కిరణ్ పాల్గొన్నారు.

ఉత్తుత్తి డాక్టర్లు

- అర్హత లేకుండా వైద్యం చేసే వారిపై టీఎస్ఎంసీ కొరడా
- జిల్లాలో నాలుగు తనిఖీ బృందాలు ఏర్పాటు

'జిల్లాకేంద్రంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కార్యాలయానికి కూతవేటు దూరంలోనే కొందరు నకిలీ వైద్యులు అనుమతి లేకుండా వైద్యం చేస్తున్నారు. తెలిసీ తెలియని వైద్యంతో హాస్పిటల్‌కు వచ్చే వందలాది మందిని మభ్యపెడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. వారిచ్చిన మందులతో నయం కాకుంటే ప్రైవేటు ఆస్పత్రులకు పంపించి కమీషన్లు దండుకుంటున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినా ఐఎంఏ బాధ్యులు చూస్తూ ఊరుకోవడం గమనార్హం'.



తనిఖీలు నిర్వహిస్తున్న టీఎస్ఎంసీ వైద్యుడు

కరీంనగర్‌టౌన్: అర్హత లేకున్నా వైద్యులుగా చెలామణి అవుతూ.. తెలిసీ తెలియని వైద్యం చేస్తూ రోగులప్రాణాల మీదకు తెస్తున్న వారిపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పలు సంఘటనలు బయటకురావడంతో టీఎస్ఎంసీ దృష్టి సారించింది. జిల్లాలో ఇలాంటి వారిని నియంత్రించేందుకు ప్రత్యేకంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టింది. దీంతో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయి. అర్హత లేకుండా బోర్డులపై డాక్టర్ అని పేరు రాసుకోవడం, ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన వారు యాంటిబయోటిక్ మందులు, పెయిన్‌కిల్లర్స్, స్టెరాయిడ్స్ ఇస్తూ, ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలకు ఎంసీఐ సిద్ధమవుతోంది.

సహాయకులే పీఎంపీలుగా..

వైద్యుల వద్ద గతంలో సహాయకులుగా పనిచేసిన వారు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్లు(పీఎంపీ)గా సొంత వైద్యం చేస్తున్నారు. అర్హత లేకుండా వైద్యం చేస్తూ పరిస్థితి చేయి దాటితే కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ కమీషన్లు దండుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని కొన్ని ఏరియాల్లో ప్రజలు అర్ధరాత్రి వేళ అనారోగ్యానికి గురైతే వారికి తక్కున గుర్తుకు వచ్చేది పీఎంపీలే. అదే వారికి కలిసివస్తోంది.

రూ.వేలల్లో కమీషన్లు.. బహుమతులు

కమీషన్లకు కక్కుర్తిపడి ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకువచ్చి అవసరం లేని పరీక్షలు, వైద్యం చేయించి 30 నుంచి 50శాతం వరకు కమీషన్లు పొందుతున్నారు. వారికి ప్రైవేటు ఆసుపత్రులు కమీషన్లతో పాటు విలువైన బహుమతులు, టూర్లకు పంపుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు కళకళలాడటానికి, రోగుల జేబులు గుల్ల కావడానికి క్షేత్రస్థాయిలో వీరే కారణమవుతున్నారు.

వైద్యం చేసే అర్హత ఎవరికుంటుంది?

ప్రభుత్వం దృష్టిలో ఆర్ఎంపీ అంటే రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ అని అర్థం. వీరు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. అంతకుమించి వైద్యం చేయడం నేరం. ఎంబీబీఎస్ చదివి, ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన తర్వాత వచ్చే ఎంబీబీఎస్ సర్టిఫికెట్‌తో ఎస్ఎంసీ, ఎంసీఐ వద్ద నమోదు చేసుకోవాలి. అలా నమోదు చేసుకున్న వారికి మాత్రమే వైద్యం చేసే అర్హత ఉంటుంది. అర్హతలేని వైద్యులు మోసం చేసినా, రోగనిర్ధారణ పరీక్షలకు అధిక చార్జీలు వసూలు చేసినా సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, జిల్లా కలెక్టర్ లేదా తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

అవకాశమివ్వండి.. ప్రశ్నించే గొంతుకనవుతా

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్



న్యాయవాదుల మద్దతు కోరుతున్న బోయినపల్లి

కరీంనగర్/కరీంనగర్‌క్రైం: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఐదేళ్లలో కరీంనగర్‌ను విద్యాహబ్‌గా తీర్చిదిద్దుతానని, పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతానని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని 60వ డివిజన్ ప్రజలతో సమావేశం అయ్యారు. అనంతరం జిల్లాకోర్టు ఆవరణలో న్యాయవాదులు, కక్షిదారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ 2014 నుంచి 2019వరకు ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్‌కు రూ.వెయ్యికోట్లతో స్మార్ట్‌సిటీ, కొత్తపల్లి– మనోహరాబాద్ రైల్వేలైన్ తీసుకొచ్చినట్లు వెల్లడించారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100కోట్లు కేటాయించడం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరిందని అన్నారు. హైకోర్టులో జడ్జీల సంఖ్య పెరిగేందుకు తానే కారణమని తెలిపారు. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో ఒక్కరూపాయి తీసుకురాలేదని అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ పదేళ్లల్లో కరీంనగర్ జిల్లాను 60ఏళ్లల్లో చూడని అభివృద్ధిని చేసి చూపించామని, వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపిస్తే అత్యధిక నిధులు తెచ్చి మరింత అగ్రగామిగా నిలుపుతామని స్పష్టం చేశారు. మేయర్ సునీల్ రావు, తులఉమ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణరావు, రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లాహరిశంకర్ పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

సాక్షి ఎఫెక్ట్

జమ్మికుంట: పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎస్‌వో ఎం.గౌరీశంకర్ సందర్శించారు. 'కల్లాల్లో ధాన్యం.. మొగులు భయం' శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. కొనుగోలుకేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కొనుగోళ్ల విషయంలో జరుగుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. నిర్దేశిత తేమశాతం వచ్చిన రైతులకు గన్నీ సంచులు అందించాలని, ధాన్యం శుభ్రం చేసేందుకు ప్యాడీక్లీనర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. హుజూరాబాద్ ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ వినోద్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో రవీందర్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీఎస్‌వో గౌరీశంకర్

క్లుప్తంగా

రాములోరి కల్యాణానికి వేములవాడ గోటి తలంబ్రాలు

ఇల్లందకుంట: అపరభద్రాద్రిగా పేరొందిన మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి కల్యాణానికి వేములవాడకు చెందిన శ్రీరాజరాజేశ్వరిదేవి సేవా సమితివారు గోటితో ఒలిచిన తలంబ్రాలు, ముత్యాల తలంబ్రాలను సోమవారం ఆలయంలో సమర్పించారు. ఎంతో శ్రమించి ఒలిచి, పసుపు ఇతర సుగంధ ద్రవ్యాలతో కలిపి నియమనిష్ఠలు, శాస్త్రోక్తంగా తలంబ్రాలను సిద్ధం చేశామని మహిళలు తెలిపారు. ఈవో కందుల సుధాకర్, అర్చకులు ,భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకుతో గొడవపడి వెళ్లిపోయిన మహిళ

- 15 నిమిషాల్లో గుర్తించిన కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు



కరీంనగర్ క్రైం: ఇంట్లో కొడుకుతో గొడవపడిన ఓ మహిళ బయటకు వెళ్లిపోయింది. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు 15 నిమిషాల్లో ఆమె ఆచూకీ కనిపెట్టారు. వారి వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంలోని కిషన్‌రావుపల్లికి చెందిన రాజేశ్వరి తన భర్త నుంచి విడాకులు తీసుకుంది. కుమారుడు నితిన్ ఆమె వద్దే ఉంటున్నాడు. అయితే, సోమవారం కొడుకుతో గొడవపడిన రాజేశ్వరి ఇంటి నుంచి బయటకు వెళ్లి, కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకుంది. నితిన్ ఫోన్ చేస్తే తాను కరీంనగర్ వచ్చానని, డ్యాంలో దూకి చనిపోతానని చెప్పింది. అతను వెంటనే 100కు ఫోన్ చేసి, వివరాలు తెలిపాడు. రాజేశ్వరి ఫొటోల ఆధారంగా వన్ టౌన్ బ్లూకోల్ట్స్ సిబ్బంది సర్వర్ అలీ, భాస్కర్ కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఆమెను గుర్తించారు. అనంతరం బాధితురాలి కుమారుడిని పిలిపించి, కౌన్సెలింగ్ చేసి, పంపించారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడికి రూ.30 వేల జరిమానా

ఇల్లందకుంట: బైండోవర్ నిబంధనలు అతిక్రమించిన ఓ బెల్ట్‌షాప్ నిర్వాహకుడికి రూ.30వేలు జరిమానా విధించిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు సీతంపేటకు చెందిన ఓ వ్యక్తి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మద్యం అమ్మినందుకు తహసీల్దార్ రాణి ఎదుట బైండోవర్ చేశారు. మళ్లీ ఎంపీ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మద్యం అమ్ముతుండగా సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి, జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఎండైనా, వానైనా..

- గణాంకాల నమోదుకు ఒకే విధానం
- ఇప్పటివరకు మూడు విధానాలు
- వర్షపాతం నమోదులో గజిబిజికి తెర
- రెయిన్‌గేజ్‌లు, ఏడబ్ల్యూఎస్, ఐఎండీ శాఖల లెక్కలతో ఒకే నివేదిక

కరీంనగర్ అర్బన్: ఉష్ణోగ్రత అయినా వర్షపాతమైనా లెక్కల్లో గందరగోళానికి తెరపడినట్లే. ప్రస్తుతం అవలంబిస్తున్న మూస పద్ధతులకు స్వస్తి చెప్పి సరికొత్త విధానాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. సమీకృత వర్షపాతం పేరుతో ఒకటే విధానం అమలు చేస్తోంది. ప్రస్తుతం వర్షపాతం వివరాలను మూడు శాఖలు నమోదు చేస్తున్నాయి. జిల్లా ప్రణాళిక విభాగం రేయిన్ గేజ్‌ల ద్వారా, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీఎస్‌డీపీఎస్) ఆధ్వర్యంలో ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు, ఇండియన్ మెథలాజికల్ డిపార్ట్‌మెంట్ ఈ మూడు విభాగాలు వేర్వేరుగా గణాంకాలు నమోదు చేస్తున్నాయి.

లెక్కల్లో వ్యత్యాసం

మండలాల్లో నమోదయ్యే వర్షపాతం రేయిన్‌గేజ్‌ల నుంచి గణాంక అధికారులు మాన్యువల్‌గానే తీసుకుంటున్నారు. ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లు, ఐఎండీ ఈ రెండు విభాగాలు మాత్రం శాటిలైట్ ద్వారా వర్షపాతాన్ని నమోదు చేస్తున్నాయి. ఈ మూడు శాఖలు నమోదు చేస్తున్న లెక్కల్లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అకాల వర్షాలు, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులపై ఈ విభాగాలు ఇస్తున్న నివేదికలు కూడా గందరగోళంగా ఉంటున్నాయి. ప్రధానంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు లేదా అకాల వర్షాలకు పంట నష్టం వాటిల్లినప్పుడు, కరువు పరిస్థితులను అంచనా వేయాల్సిన సందర్భాల్లో వర్షపాతం లెక్కలే కీలకం. కానీ మూడు శాఖలు వేర్వేరుగా ఇస్తున్న లెక్కలు గజిబిజిగా ఉండటంతో విపత్కర పరిస్థితులను అంచనా వేయడం సాధ్యం కావడం లేదు. పంటనష్టం జరిగినప్పుడు రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ లేదా ఆర్థికసాయం అందజేసే క్రమంలో కేంద్రం వర్షపాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటోంది. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కేంద్రం సమీకృత వర్షపాతం విధానాన్ని ప్రవేశపెట్టింది.



సైట్‌లో వాతావరణ వివరాలు తెలిపే చిత్రాలు

ఇక ఒకటే రిపోర్టు

రేయిన్‌గేజ్‌ల ద్వారా నమోదయ్యే వర్షపాతం జిల్లా ప్రణాళిక కార్యాలయంలోనే లభిస్తుంది. కానీ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు, ఐఎండీ రిపోర్టు మాత్రం హైదరాబాద్ ప్రధాన కార్యాలయాల్లోనే ఉంటాయి. ఈ రెండు శాఖలు, రేయిన్‌గేజ్‌లు నమోదు చేసిన లెక్కలను విశ్లేషించి సగటు వర్షపాతాన్ని లెక్కకడతారు. ఈ విధానాన్నే దేశవ్యాప్తంగా అమలు చేయనున్నారు. దీంతో ఏ జిల్లాలో, ఏ మండలంలో ఎంత వర్షపాతం నమోదవుతుందో తెలుసుకునే వెసులుబాటు అందరికీ కలుగుతుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను www. tsdps. telangana. gov. in ఆవిష్కరించింది. దీంతో సామాన్య ప్రజలు కూడా వర్షపాతం వివరాలను తెలుసుకోవచ్చు. రేయిన్‌గేజ్‌ల ద్వారా అయితే ముందురోజు కురిసిన వర్షపాతం వివరాలు మరుసటి రోజు ఉదయం 8గంటల వరకు నమోదు చేసి రిపోర్టు ఇచ్చేవారు. కానీ సమీకృత విధానంలో వర్షపాతం రిపోర్ట్ మధ్యాహ్నం 12గంటల తర్వాత అందుబాటులో ఉంటుంది.

తెలుసుకోవడం ఇలా..

వర్షపాతం, ఎండల తీవ్రత వివరాలు ఎప్పటికప్పుడు ఇంటర్నెట్‌లో తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. వీటిలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల చిత్రపటాలు దర్శనమిస్తాయి. మనకు కావాల్సిన జిల్లా వాతావరణ వివరాలకు చిత్ర పటంపై క్లిక్ చేయాలి. తర్వాత జిల్లాను ఎంపిక చేసుకుంటే జిల్లా ముఖచిత్రం ప్రత్యక్షమవుతుంది. ఇందులోనే జిల్లాకు సంబంధించిన వివిధ మండలాల్లో నమోదైన వాతావరణ వివరాలు తెలుస్తాయి. ఏ ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ పరిధిలో ఎంత వర్షపాతం నమోదైంది, ఉష్ణోగ్రత వివరాలు తెలుసుకోవచ్చు. రానున్న 72 గంటల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయనే సమాచారం కూడా ఉంటుంది.

కరీంనగర్ జిల్లాలో..

రేయిన్ గేజ్‌లు	18
ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు	17
ఐఎండీ స్టేషన్లు	1

రూ.70 లక్షలతో చిట్టీ వ్యాపారి పరార్

పాలకుర్తి(రామగుండం): పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలానికి చెందిన చిట్టీల వ్యాపారి రూ.70లక్షలతో పరారైనట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి స్థానికంగా జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధి బీసీకాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాడు. హోల్‌సేల్‌గా కిరాణం నడుపుతున్నాడు. వివిధ గ్రామాల్లోని రిటైల్ కిరాణాకు వస్తుసామగ్రి డెలివరీ చేస్తూ వస్తున్నాడు. ఈక్రమంలో దుకాణా యజమానులతో పరిచయమైంది. వారికి నమ్మకంగా ఉండడంతో వారితో చిట్టీల వ్యాపారం కూడా చేస్తున్నాడు. అయితే, కొంతకాలంగా చిట్టీ ఎత్తుకున్న వారికి డబ్బులు ఇవ్వకుండా, అధికవడ్డీ ఇస్తానని ఆశచూపి చెల్లించడం లేదు. ఇలా చాలామంది నుంచి దాదాపు రూ.70లక్షలకు పైగా వసూలు చేశాడు. అయితే, నాలుగైదు రోజులుగా కిరాణం మూసిఉండడం, ఆ వ్యాపారి కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు.. మొబైల్‌కు ఫోన్ చేశారు. అది స్విచాఫ్ రావడంతో తాము మోసపోయినట్లు గుర్తించి బసంత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. దుకాణానికి తాళం వేశారు. కాగా, ఒక్కో కిరాణా వ్యాపారికి రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు చిట్టీ సొమ్ము చెల్లించాల్సి ఉందని తెలిసింది.

'జువ్వాడి' సేవలు మరువలేనివి

- మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



నివాళి అర్పిస్తున్న వెంకటరెడ్డి, వినోద్‌కుమార్

తిమ్మాపూర్: స్వాతంత్ర్య సమరయోధుడు జువ్వాడి మధుసూదన్‌రావు సేవలు మరువలేనివని, కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు చైర్మన్ చాడ వెంకట్‌రెడ్డి, కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అన్నారు. మధుసూదనరావు కుటుంబ సభ్యులు మానసిక వికలాంగుల సంస్థ ప్రాంగణంలో సోమవారం సంతాపసభ నిర్వహించారు. మానసిక వికలాంగ విద్యార్థులకు భోజనం అందించారు. సభకు చాడ వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. మధుసూదన్‌రావు 36 ఏళ్ల క్రితం సంస్థ స్థాపించి మేనేజింగ్ ట్రస్టీగా అమోఘమైన సేవలందించారన్నారు. కొన్నేళ్లుగా సంస్థ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న క్రమంలోనే పరమపదించడం బాధాకరమన్నారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ట్రస్టీ సముద్రాల జనార్దన్ రావు మాట్లాడుతూ.. మధుసూధన్‌రావు ధైర్యశాలీ అని కుటుంబ సభ్యులు వారితోపాటు వచ్చి అమెరికాలో నివాసముండాలని కోరినా తిరస్కరించి ప్రాణముండే వరకు భారత దేశంలోనే నివసిస్తానని అనేవారన్నారు. ఆయన కూతుర్లు జువ్వాడి శైలజ, జువ్వాడి పద్మజ, పొట్లపల్లి గోవిందరావు, సత్యనారాయణ, బంధువు కమలాకర్‌రావు మాట్లాడుతూ అమెరికాలో సంస్థకు విరాళాలు సేకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ బొజ్జపురి వెంకటయ్య, ట్రస్టీలు కోమిరెడ్లారెడ్డి, గాజుల భగవాన్, జాప వెంకట రమణారెడ్డి, సీపీఐ నేత మర్రి వెంకటస్వామి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాల్‌రాజు, ప్రిన్సిపాల్ సతీశ్, ఉపాధ్యాయులు, సిబ్బంది మానసిక వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకుసాగాలి



మాట్లాడుతున్న వీసీ మల్లేశ్

కరీంనగర్‌సిటీ: మంకమ్మతోటలోని శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం సోమవారం శుభం గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్, కృష్ణారెడ్డి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



తిరుపతి (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్: చిన్నకల్వల గ్రామానికి చెందిన గాంట్ల తిరుపతి(40) సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్రావణ్‌కుమార్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. తిరుపతి ఏడాది క్రితం గ్రామంలో టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేశాడు. అందులో నష్టం రావడంతో పలు దుకాణాల్లో పనిచేస్తున్నాడు. అయినా, ఆర్థిక పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో భార్య రజిత, తిరుపతి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో సోమవారం కూడా గొడవ జరిగింది. మనస్తాపంతో బయటకు వెళ్లిన తిరుపతి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో మరోసారి భార్యతో గొడవ జరిగింది. దీంతో తిరుపతి ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, తిరుపతికి ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యతో పదేళ్లక్రితమే విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత రజితను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు కొడుకు, కూతురు ఉండగా, రెండో భార్యకు ఓ బాబు, ఓ పాప ఉంది. రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

ఇసుక లారీ పట్టివేత

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మీర్జంపేట మానేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని ఎస్సై ఓంకార్ యాదవ్ సోమవారం పట్టుకున్నారు. అనుమతి లేకుండా పారిశ్రామిక ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మానేరు ప్రాంతంలో లారీలు తనిఖీ చేశామన్నారు. ఈక్రమంలో ఓ లారీ అనుమతి లేకుండా ఇసుక తరలించడాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు. తదుపరి చర్యల కోసం మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

గోదావరిఖని: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు సోమవారం ట్రాఫిక్ పోలీ స్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తా గి వాహనం నడిపితే జరిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడి న 52 మందిని కోర్టులో హాజరుపర్చగా రూ.1.06లక్షల జరిమానా విధించినట్లు సీఐ వివరించారు.

రాజన్న క్యూలైన్ల వద్ద వ్యక్తి మృతి



వీరస్వామి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు

వేములవాడ: రాజన్న ఆలయ కోడెల క్యూలైన్ వద్ద పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వీరస్వామి (52) ఫిట్స్‌తో సోమవారం మృతి చెందాడు. వరంగల్‌కు చెందిన వీరస్వామి కుటుంబ కలహాల కారణంగా గాంధీనగర్‌లో కొద్దిరోజులుగా ఉంటూ రాజన్నగుడి వద్ద కొబ్బరికాయలు కొట్టే వారి వద్ద పనిచేస్తున్నారు. కొద్ది రోజులుగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్న వీరస్వామి పనిలో భాగంగా గుడి వద్దకు వెళ్లగా కోడెల క్యూలైన్ వద్ద ఫిట్స్ వచ్చి మరణించినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు..



తిరుపతి మృతదేహం

గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఓ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు పడి తిరుపతి (25) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాలు.. ఓ కాంట్రాక్టర్ సోమవారం కరీంనగర్‌లోని కూలీల అడ్డా నుంచి తిరుపతిని తీసుకువచ్చి పని చేయిస్తున్నాడు. రెండస్తుల భవనంపై గోడ కడుతుండగా అదుపుతప్పి కింద పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై కిరణ్‌రెడ్డి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రాజీవ్ రహదారిపై విరిగిపడిన చెట్టు



తిమ్మాపూర్: మండల కేంద్రంలో తృటిలో పెనుప్రమాదం తప్పింది. 'సాక్షి' కార్యాలయం సమీపంలో రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఓ భారీవృక్షం సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. ఆ సమయంలో రహదారి మీద వాహనాలు ప్రయాణించకపోవడం అంతా ఊపిరి పీల్చుకున్నారు. రెప్పపాటులో ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. ఇదిలా ఉండగా ఆర్టీవో కార్యాలయం సమీపంలో మరో చెట్టు ప్రమాదకరంగా ఉంది ఎప్పుడు పడిపోతుందో తెలియని చెట్లను తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు గ్రామాల్లో దొంగతనాలు



పదిరలో మహేందర్‌రెడ్డి ఇంట్లో చిందరవందరగా వస్తువులు



అల్మాస్‌పూర్ హోటల్‌లో..

- రూ.30 వేలు, సామగ్రి అపహరణ
- వరుస చోరీలతో వణుకుతున్న ప్రజలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం పదిర, అల్మాస్‌పూర్ గ్రామాల్లో ఒకే రోజు ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్పడ్డారు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అల్మాస్‌పూర్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంతో పాటు పక్కనే ఉన్న హోటల్‌లో చొరబడి రూ.20 వేల నగదు, ఇతర సామగ్రి అపహరించుకువెళ్లారు. అలాగే పదిరకు చెందిన ఎన్నారై కుంబాల మహేందర్‌రెడ్డి దుబాయిలో నివసిస్తుండగా.. తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి రూ.10వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌తో పాటు పాటు ఇంటి ఆవరణలోని స్కూటీ ఎత్తుకెళ్లారు. మహేందర్‌రెడ్డి భార్య సుచిత్ర పిల్లలకు సెలవులు కావడంతో ఆమె కూడా దుబాయికి వెళ్లింది. ఇదే అదునుగా భావించి చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్‌లు సంఘటన స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో తనిఖీలు చేపట్టారు. ఈ రెండు దొంగతన సంఘటనలపై కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. గ్రామాలు, ఆలయాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. పోలీసులు నిఘా పెంచి దొంగతనాలను అరికట్టాలని కోరుతున్నారు.

దశదిన కర్మకు వెళ్లొస్తుండగా..

- చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం శివారులో ఓ కారు చెట్టును ఢీకొట్టింది. ఈప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. హుజూరాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన ముద్రవేణి ప్రభాకర్(45) సైదాపూర్ మండలం అమ్మనగుర్తి గ్రామానికి చెదిన గోనెల సుదర్శన్(70), గోనెల వర్శిణి(10) మానకొండూర్ మండలం కొండపల్కలలోని బంధువు దశదినకర్మకు ఆదివారం హాజరయ్యారు. సోమవారం తెల్లవారుజామున ముగ్గురు కారులో స్వగ్రామాలకు బయలు దేరగా శంకరపట్నం మండలం శివారులో చెట్టును ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రభాకర్, సుదర్శన్, వర్శిణి తీవ్రంగా గాయపడ్డారు. రహదారి వెంట వెళ్తున్న లారీడ్రైవర్ 108కు సమాచారం అందించారు. లారీడ్రైవర్, అంబులెన్స్ సిబ్బంది అరగంట శ్రమించి ముగ్గురిని బయటకు తీసి హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న సుదర్శన్‌ను వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

బీజేపీని ఓడించేందుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి, వాసుదేవరెడ్డి

కరీంనగర్: దేశంలో మతతత్వ బీజేపీని ఓడించేందుకు కమ్యూనిస్టులు సిద్ధం కావాలని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు లేనిపోని హామీలు ఇస్తూ మూడోసారి అధికారం చేపట్టాలని బీజేపీ ప్రయత్నిస్తోందని, దీన్ని సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవాలని కోరారు. పదేళ్లుగా ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగాన్ని పెంచి పోషించిందని, మత రాజకీయాల ఆధారంగా పరిపాలన సాగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలలను ప్రైవేటుపరం చేసిన చరిత్ర బీజేపీదని ఎద్దేవా చేశారు. దేశంలో రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి, రైతులపై తూటాలు పేల్చిందని మండిపడ్డారు. 400 ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో ఉందని, కుల, మత వ్యవస్థలకు వ్యతిరేకంగా ఆనాడు అంబేద్కర్ తీసుకువచ్చిన చట్టాలను తీసివేయాలని కుట్ర చేస్తోందన్నారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్‌కు ఒక చిన్న పరిశ్రమ కూడా తీసుకురాలేదని విమర్శించారు. ఈ నెల 20న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సదస్సును కరీంనగర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గుడికందుల సత్యం, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, పిట్టల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కోరుట్ల: పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ సమీపంలో గుండ్లోజి రాజేందర్ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. రాజేందర్ కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చేసరికి తాళం పగుల గొట్టి ఇంట్లోని 4 గ్రాముల బంగారం, రూ.15 వేల నగదు చోరీ చేసినట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లిలో తాళం వేసిన ఇంట్లో సోమవారం మధ్యాహ్నం దొంగలు చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన నక్క సతీశ్ ఇంటికి తాళం వేసి గ్రామానికి వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం పగలగొట్టి వస్తువులు చిందర వందర చేశారు. బీరువాలోని రూ.3 వేలు నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన ఆర్టీసీ డీఎం



పట్టుబడిన డబ్బులు, డిపో మేనేజర్ శ్రీకాంత్‌తో ఏసీబీ అధికారులు



డ్రైవర్ రవీందర్

- డ్రైవర్‌పై చార్జ్ మెమో ఎత్తేసేందుకు రూ.30 వేలు డిమాండ్ చేసిన శ్రీకాంత్
- డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

ఎల్కతుర్తి/హుజూరాబాద్: ఆర్టీసీ డ్రైవర్‌కు ఇచ్చిన చార్జ్ మెమో ఎత్తేసేందుకు రూ.30వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు హుజూరాబాద్ డిపో మేనేజర్ శ్రీకాంత్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సంఘటన సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండెపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రవీందర్ హుజూ రాబాద్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత ఫిబ్రవరి 12న తన బంధువు చనిపోవడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వెళ్లాడు. దీంతో డిపో మేనేజర్ శ్రీకాంత్.. రిజిష్టర్‌లో గైర్హాజరు వేశారు. మూడు రోజుల తర్వాత రవీందర్ విధులకు వెళ్లగా మూడు రోజులు గైర్హాజరు వేసి చార్జి మెమో జారీచేశారు. అయితే, చార్జిమెమో ఎత్తివేయాలని రవీందర్ వేడుకోగా.. తనకు రూ.30వేలు లంచం ఇవ్వాలని డిపో మేనేజర్ డిమాండ్ చేశాడు. ఇందులో రూ.10వేలను తొలుత ఈనెల 10వ తేదీన డీఎంకు ఇచ్చాడు. మిగతా సొమ్ము కూడా ఇవ్వాలని డిపో మేనేజర్ ఒత్తిడి చేయడంతో విసుకు చెందిన డ్రైవర్ రవీందర్.. ఇటీవల వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మిగతా రూ.20వేలు ఇస్తానని, అయితే, ఎల్కతుర్తికి రమ్మని డీఎంకు కబురు పంపించాడు. ఈ క్రమంలో ఎల్కతుర్తిలోని ఓ హోటల్‌కు చేరుకున్న డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు డ్రైవర్ రవీందర్ డబ్బులు ఇస్తుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం హుజూరాబాద్ డిపోకు తీసుకొచ్చి రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారుల తనిఖీల సమాచారం అందుకున్న ఆర్టీసీ డీవీఎం భూపతిరెడ్డి వెంటనే డిపోకు చేరుకుని వివరాలపై ఆరా తీశారు. డీఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, రాజు తదితర సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య

క్లుప్తంగా

శృంగేరి పీఠాధిపతిని దర్శించుకున్న ఎంపీ సంజయ్



విధుశేఖర భారతీస్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న ఎంపీ సంజయ్

కరీంనగర్‌టౌన్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ సోమవారం శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామిని దర్శించుకున్నారు. శృంగేరి పూర్వ పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామీజీ 74వ వర్ధంతి సందర్భంగా ఆయన అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీని ఆశీర్వదించిన భారతీ స్వామి ధర్మ రక్షణ కోసం ఆయన చేస్తున్న పోరాటాలను అభినందించారు. ధర్మాన్ని వీడొద్దు.. ధర్మరక్షణను కొనసాగించండి.. ధర్మ పరిరక్షణ, గోసం రక్షణ కోసం సమాజాన్ని సంఘటితం చేయడంలో ముందుండి పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్వారిష్ట శాంతి హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

కరీంనగర్ కల్చరల్: నగరంలోని తిరుమలనగర్ శ్రీనిలయంలో వసంత నవరాత్రుల్లో భాగంగా మయూరగిరి పీఠాధిపతి నమిలకొండ రమణాచార్య స్వామి ఆధ్వర్యంలో సోమవారం సర్వారిష్ట శాంతి హోమం నిర్వహించారు. ఈ సంవత్సరం రాజు కుజుడు, మంత్రి శని కావడం వల్ల సమాజంలో ఎలాంటి చెడు జరగకూడదని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. పండితులు రామకృష్ణమాచార్యులు, వేణుగోపాలాచార్యులు, వినయ్ స్వామి, వివేక్ స్వామి, గోపి శర్మ, శివరామకృష్ణ శర్మ తదితరులున్నారు.

రేపు శ్రీసీతారాముల కల్యాణం

విద్యానగర్: కరీంనగర్ బొమ్మకల్ రోడ్‌లోని కృష్ణానగర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల చతుర్థశ కల్యాణ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు కలశ స్థాపన, గణపతి, గౌరి, నవగ్రహ దిక్పాలక, పంచలోక పాలక సహిత మండపారాధన, ఉదయం 10 గంటలకు గణపతి, నవగ్రహ హోమాలు, శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీసీతారామచంద్ర స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఫలపంచామృతాభిషేకం, సాయంత్రం స్వామివార్ల ఎదుర్కోలు జరుపుతామన్నారు. బుధవారం ఉదయం 11.15 గంటలకు సీతారాముల కల్యాణం జరిపిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఫెడరేషన్ బాధ్యులు

విద్యానగర్: తెలంగాణ యునైటెడ్ మోటార్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కమాన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దొంత రవీందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాయితోజు పవన్ కుమార్, ప్రధాన కార్యదర్శి తిప్పర్తి రత్నాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏడీఈ నరేందర్ తెలిపారు. 11 కేవీ గోదాంగడ్డ ఫీడర్ పరిధిలోని సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ, గోదాంగడ్డ, భగత్‌నగర్ ప్రాంతాలతోపాటు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 11 కేవీ సివిల్ ఆస్పత్రి ఫీడర్ పరిధిలోని గోపీకృష్ణ ఫంక్షన్‌హాల్, వావిలాలపల్లి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

తీగలగుట్టపల్లి పరిధిలో..

చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తీగలగుట్టపల్లి, చంద్రపురికాలనీ, ఆర్టీసీ కాలనీ, ఒడ్డెరకాలనీ, హ్యాపీ హోమ్స్, రాణిపూర్ రోడ్, పోచమ్మ దేవాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ ఏడీఈ రాజు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరీంనగర్ క్రైం: మద్యం తాగి, వాహనాలు నడిపేవారిపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. నిత్యం కరీంనగర్ నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ పట్టుబడినవారిని కోర్టులో హాజరుపరుస్తున్నారు. న్యాయస్థానం కూడా మద్యం మత్తులో వాహనాలు నడపడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ జైలుశిక్ష, జరిమానా విధిస్తోంది. ఈ చర్యలు మందుబాబుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి, వాహనాలు నడపొద్దంటూ అవగాహన కల్పిస్తున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడం లేదు. మత్తులో వాహనాలు నడుపుతూ చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నా తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

తాగి డ్రైవ్ చేస్తే జైలుకే

- నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్న మందుబాబులు
- ఈ ఏడాది ఇప్పటివరకు 129 మందికి జైలు





వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్)

జైలుశిక్ష పడిన వ్యక్తుల వివరాలు

పట్టుబడినవారి సంఖ్య	జైలుశిక్ష (రోజుల్లో)
17	10
10	7
23	5
79	3

యువతే ఎక్కువ మంది..

ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 129 మంది మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరికి కోర్టు జైలుశిక్ష విధించడంతో జైలుకు తరలించారు. ఇటీవల నగరంలో హోలీ రోజు ఇద్దరు యువకులు బైక్‌పై అతివేగంగా వెళ్తూ సిరిసిల్ల బైపాస్‌లోని సైన్ బోర్డుకు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా మరో యువకుడు గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి మద్యం తాగి, వాహనం నడపడమే కారణమని స్థానికంగా చర్చ జరిగింది. ఇంకా ఎన్నో ప్రమాదాల్లో డ్రంకెన్ డ్రైవ్ ద్వారా జరిగినవేనని పోలీసులు చెబుతున్నారు. నిబంధనలు పాటించకుండా మద్యం మత్తులో ఇష్టారాజ్యంగా వాహనాలు నడపడం వల్ల వారితోపాటు ఎదుటివారికి ఇబ్బందులు వస్తాయని అంటున్నారు. తనిఖీల్లో ఎక్కువగా యువతే పట్టుబడుతున్నారని గణంకాలు చెబుతున్నాయి. ఇలాంటి వారికి జైలుశిక్ష, జరిమానాతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తున్నాం



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీరోజు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం. మద్యం తాగి, వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దు. తనిఖీల్లో నిత్యం చాలా మంది పట్టుబడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 129 మంది మందుబాబులకు కోర్టు జైలుశిక్ష విధించింది. ఇలాంటి వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తున్నాం.

– కరీముల్లా ఖాన్, ట్రాఫిక్ సీఐ

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న సైఫుల్లా ఖాలిద్

- పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైఫుల్లా ఖాలిద్

కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైఫుల్లా ఖాలిద్ అన్నారు. సోమవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో ఉత్తర తెలంగాణ పార్లమెంట్ నియోజకవర్గ మైనార్టీ విభాగం ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు అధిక శాతం కాంగ్రెస్‌కు ఓట్లు వేసేలా కృషి చేయాలని సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎండీ.తాజొద్దీన్, ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి, హనుమకొండ పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌కు ఓటు వేయండి

కొత్తపల్లి: కరీంనగర్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని ఆయన సతీమణి డాక్టర్ మాధవి కోరారు. కొత్తపల్లి మండలంలోని ఎలగందుల, ఖాజీపూర్ గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి, ఓటు అభ్యర్థించారు. కరీంనగర్ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారన్నారు. ఆరు గ్యారంటీలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న బీజేపీని గద్దె దించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎంపీపీ పిల్లి శ్రీలత, వైస్ ఎంపీపీ భూక్య తిరుపతినాయక్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినోద్‌కుమార్ సతీమణి మాధవి

బీజేపీపై చర్యలు తీసుకోవాలి

- ఎన్నికల అధికారికి కాంగ్రెస్ ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్న బీజేపీపై చర్యలు తీసుకోవాలని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా కాంగ్రెస్‌పై ముద్రించిన కరపత్రాలను బీజేపీ శ్రేణులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా కరీంనగర్ నగరంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మద్దతుగా టవర్ సర్కిల్‌లోని కొంతమంది వ్యాపారులు తమ వద్దకు వచ్చే వినియోగదారులకు ఈ కరపత్రాలు ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ మిగతా రెండింటికి అడ్డంకిగా మారిందన్నారు. హామీలను అమలు చేయడం లేదంటూ బీజేపీ శ్రేణులు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి, దుష్ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నాయకులు, వారికి సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

- దేశ ప్రజల సంక్షేమమే బీజేపీ లక్ష్యం
- బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు

కరీంనగర్‌టౌన్: దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధే బీజేపీ లక్ష్యమని పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉండాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారని తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని పలు పోలింగ్ బూత్‌లలో ప్రచారం నిర్వహించారు. పదేళ్ల బీజేపీ పాలనకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. 60 ఏళ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రజలకు న్యాయం చేయలేకపోయిందని, ఇప్పుడు న్యాయం చేస్తామని మళ్లీ మోసం చేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడానికి కేసీఆర్ ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత, ఆరు గ్యారంటీల ప్రకటనే కారణాలన్నారు. ప్రస్తుతం ఆ గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15 వేలు, పంటలకు బోనస్ రూ.500, మహిళలకు రూ.2,500, పింఛన్ రూ.4 వేలు, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం వంటివి 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, మోసం చేసిందని మండిపడ్డారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇక, బీఆర్‌ఎస్ గల్లీలో లేదని, ఢిల్లీలో ఉండదన్నారు. ఆ పార్టీకి ఓటు వేస్తే వృథా అన్న భావన ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



కరపత్రాలు పంచుతున్న ప్రవీణ్‌రావు, నాయకులు

ఎంపీ సంజయ్‌కి అత్యధిక మెజార్టీ ఇవ్వాలి

కరీంనగర్‌టౌన్: ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిని బీజేపీ నాయకులు సోమవారం ఇంటింటికీ వివరించారు. సంబంధిత కరపత్రాలను కరీంనగర్ 18వ డివిజన్ రేకుర్తిలోని 36, 37, 38, 39, 40వ బూత్‌లలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్ రెడ్డి, ఆయా బూత్‌ల అధ్యక్షులు కడారి మహేశ్వర్ రెడ్డి, నాంపల్లి శంకర్, పింగిలి ప్రతాప్ రెడ్డి, పిచర విష్ణు ప్రసాద్‌రావు, ముదిమడుగుల లక్ష్మీరాజం, నాయకులు గోదారి నరేశ్, దుర్గం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

17వ డివిజన్‌లో...

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్‌కి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. సోమవారం నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో 17వ డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి, కరపత్రాలు పంచారు. బండ రాకేశ్, సీతాల రమేశ్ చంద్ర, చంద్రగిరి వేణు, ఖచ్చు మధు, వినయ్, చందు గౌడ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఇస్తున్న బీజేపీ నాయకులు

59వ డివిజన్‌లో...

ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను బీజేపీ నాయకులు సోమవారం 59 డివిజన్ 163వ పోలింగ్ బూత్‌లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి శ్రీనివాస్, ఒజ్జం సంజీవ్ కుమార్, పబ్బుల్ల కమల, దయ్యాల అశోక్ కుమార్, రేణుక, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను బీజేపీ నాయకులు సోమవారం గోపాల్‌పూర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి, నాయకులు అనుముల తిరుపతి, రాజ్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, అనిల్, అశోక్, హరికృష్ణ తదితరులున్నారు. ఎలబోతారంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్‌కుమార్, ఉపాధ్యక్షుడు గాండ్ల గోపాల్, నాయకులు వేల్పుల శ్రీనివాస్, ఆనంద్, అంజయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. మొగ్దుంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులు కూకట్ల రమేశ్, మైలారం శ్రీనివాస్, పొలగాని రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పూర్‌లో..

వరి పూర్తిగా ఎండేవరకు చూడొద్దు

- గిట్టుబాటు ధర రావాలంటే జాగ్రత్తలు తప్పనిసరి
- పొలం 20 శాతం పచ్చిగా ఉన్నప్పుడే కోయాలి
- నాలుగు రోజులు ఆరిన తర్వాత నూర్పిడి చేయాలి
- తప్ప, తాలు ఉండొద్దు
- కరీంనగర్ మండల ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలో ముందుగా నాట్లు వేసిన రైతులు వరి కోతలు ప్రారంభించగా ఆలస్యంగా నాట్లేసినవారు మరో వారం, పది రోజుల్లో చేపట్టనున్నారు. పండించిన పంట నాణ్యతగా ఉండాలన్నా, గిట్టుబాటు ధర రావాలన్నా వరి కోతల నుంచి ధాన్యం కేంద్రాలకు తెచ్చేవరకు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. వాటిని కరీంనగర్ మండల వ్యవసాయాధికారి సత్యం వివరించారు.

పంట గోధుమ రంగులోకి మారితే..

వరి కంకి పూర్తిగా ఎండేవరకు పొలానికి నీళ్లు పెట్టొద్దు. పొలంలో 80 శాతం ఒక్కో కంకిలో 80 శాతం గింజ గోధుమ రంగులోకి మారుతున్నపుడు నీటి పారకం నిలిపివేయాలి. మరో పది రోజుల్లో కోతకు వస్తుందనుకుంటే ముందునుంచే పొలాన్ని ఎండబెడితే గింజ గట్టిపడుతుంది. నీళ్లు అలాగే ఉంచితే కోత సమయంలో ఇబ్బందిగా మారుతుంది.



పచ్చిగా ఉన్నప్పుడే కోత..

వరి పూర్తిగా ఎండిపోయిన తర్వాత కోస్తే గింజలు పొలంలోనే రాలిపోయే ప్రమాదముంది. పొలం 20 శాతం పచ్చిగా ఉన్నప్పుడే కోత ప్రారంభించాలి. పచ్చిగింజ కోస్తే నూక అవుతుంది. గింజ నాణ్యత తగ్గుతుంది. భూమి తడిగా ఉంటే చైన్ మెషిన్‌తో కోస్తున్నారు. పొలం ఆరిన తర్వాత సాధారణ మెషిన్‌తో కోయడం వల్ల భూమి సమతలంగా ఉండటంతోపాటు మెషిన్ కిరాయి తగ్గుతుంది. వరి కోసే సమయంలో ఫ్యాన్ వేగం ఎక్కువగా ఉండేలా పెడితే తప్ప, తాలు ఎగిరిపోతాయి.

నూర్పిడి చేస్తేనే ప్రయోజనం..

వరి కోశాక నాలుగైదు రోజులు ఆరిన తర్వాత నూర్పిడి చేయాలి. కోసిన వెంటనే చేస్తే తేమ ఎక్కువగా, గింజ పచ్చిగా ఉంటాయి. నూర్పిడి చేసేటప్పుడు దుమ్ము, ధూళి పోయేలా ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలి. తప్ప, తాలు పోయేలా, మట్టిపెల్లలు లేకుండా చూడాలి. టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలి. నూర్పిడి పూర్తయ్యాక రెండు రోజుల పాటు ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టాలి. రోజుకు రెండు, మూడుసార్లు తిరగబోసినట్లయితే తేమ తగ్గుతుంది. నల్ల కవర్లపై ధాన్యాన్ని ఆరబెట్టకూడదు. ఆకస్మికంగా వర్షాలు కురిసినట్లయితే భూమిలోకి పోయిన నీటితేమను గ్రహించడంతో ధాన్యంలో మొలకలు వచ్చే ప్రమాదముంది. కింద ఇతర కవర్లు మాత్రమే వినియోగించాలి.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కరీంనగర్‌రూరల్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని డీఎంవో పద్మావతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ మండలంలోని నగునూరు, చెర్లభూత్కూర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కరీంనగర్ సింగిల్‌విండో సీఈవో రమేశ్‌తో కలిసి తనిఖీ చేశారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యం, రైసుమిల్లుల కేటాయింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కాంటా పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంవో పద్మావతి

23న వీర హనుమాన్ విజయ యాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న భజరంగ్ దళ్, వీహెచ్‌పీ బాధ్యులు

విద్యానగర్: కరీంనగర్ నగరంలోని ఈ నెల 23న వీర హనుమాన్ విజయ యాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు తెలిపారు. సంబంధిత పోస్టర్లు, కరపత్రాలను సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆవిష్కరించారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, భజరంగ్ దళ్ కో–కన్వీనర్ కన్నం శంకర్ మాట్లాడుతూ.. చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా 23న సాయంత్రం 4 గంటలకు హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీ నగరంలోని గాంధీ రోడ్ రామాలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా విశ్వ హిందూ పరిషత్ ప్రాంత సహ కార్యదర్శి శాలివాహన పండరి నాథ్ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, జిల్లా సహ కార్యదర్శి శ్రీనివాస్, భజరంగ్ దళ్ జిల్లా సురక్ష ప్రముఖ్ అడ్డకట్ల శ్రీనివాస్, భజరంగ్ దళ్ నగర కన్వీనర్ గుజ్జెంటి రాజేందర్, నాయకులు శ్రీనివాస్, రంజిత్, నీలకంఠం, సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

కరీంనగర్‌రూరల్: నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మేధో సంపత్తి హక్కులపై ఆన్‌లైన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్, ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా ప్రొఫెసర్ రమేశ్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమత, వైస్ ప్రిన్సిపాల్ సుష్మ, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు స్వప్న, మనీషా తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసం షెడ్డు, చలివేంద్రం ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని మల్కాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల కోసం భరత్‌రెడ్డి స్మారకార్థం అతని తండ్రి, రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి షెడ్డు, చలివేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం వాటిని ప్రారంభించారు. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులు ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.



షెడ్డు, చలివేంద్రాన్ని ప్రారంభించిన లక్ష్మారెడ్డి

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలు

కరీంనగర్ క్రైం: పట్టణంలో మద్యం తాగి, వాహనాలు నడుపుతూ పట్టుబడిన 21 మందిని కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు సోమవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరిలో ముగ్గురికి 5 రోజులు, నలుగురికి 3 రోజుల జైలుశిక్ష, రూ.35,500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా ఖాన్ తెలిపారు.

భవనం పైనుంచి మహిళ మృతి

కరీంనగర్‌క్రైం: భవనంపై నుంచి పడి ఓ మహిళ మృతిచెందింది. వన్‌టౌన్ సీఐ సరిలాల్ కథనం ప్రకారం .. నగరంలోని పద్మశాలీ స్ట్రీట్‌కు చెందిన తివారి యశోద(43)కు చిన్నప్పటి నుంచి రెండు కాళ్లు సరిగా పనిచేయవు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం ఉదయం ఆమె, తల్లి పార్వతి భవనంపై మిర్చిని ఆరబెట్టారు. సాయంత్రం మిర్చిని కిందికి తీసుకొద్దామని భవనంపై ఎక్కి తిరిగి వచ్చే క్రమంలో యశోద ప్రమాదవశాత్తు కింద సిమెంట్ రోడ్డుపై పడింది. ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సస్పెన్షన్ ఉపసంహరించుకోవాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు

కరీంనగర్: పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనంలో సెల్‌ఫోన్లు ఉపయోగించారన్న నెపంతో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాగంపేట చంద్రశేఖర్, పి.దామోదర్‌రెడ్డిలను సస్పెండ్ చేయడం కక్షసాధింపు చర్యల్లో భాగమేనని ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు ఒక ప్రకటనలో ఆరోపించారు. డీఈవో వెంటనే స్పందించి, సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సెస్సీ జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తున్న సాధారణ ఉపాధ్యాయుల వద్ద సెల్‌ఫోన్ లభించినప్పుడు వారిని క్షమించి వదిలేసి, ఉపాధ్యాయ సంఘం నాయకులను మాత్రమే సస్పెండ్ చేయడం విచారకరమన్నారు. డీఈవో కావాలనే ఉపాధ్యాయ సంఘం నాయకులపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే సస్పెన్షన్‌ను ఉపసంహరించుకొని, వారు విధుల్లో చేరేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.



ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న ఇందుప్రియ

కాంగ్రెస్ ఖాతాలో కామారెడ్డి బల్దియా

చైర్‌పర్సన్‌గా ఇందుప్రియ ఎన్నిక

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మునిసిపాలిటీ కాంగ్రెస్ ఖాతాలో చేరింది. చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు గతనెల 30న బల్దియా చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్‌కు చెందిన నిట్టు జాహ్నవిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు ఇవ్వడంతో అవిశ్వాసం నెగ్గింది. దీంతో కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక కోసం సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. 28 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు సోమవారం ఉదయం 10.30 గంటలకు క్యాంపు నుంచి నేరుగా బల్దియా కార్యాలయానికి చేరుకున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాలేదు. కామారెడ్డి మున్సిపాలిటీలో 49 మంది మున్సిపల్ కౌన్సిలర్లు, ఒక ఎక్స్ అఫీషియో సభ్యుడు ఉండగా.. చైర్‌పర్సన్ ఎన్నిక కోసం 26 మంది సభ్యుల కోరం అవసరం. దీంతో ఆర్డీవో రఘునాథ్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. అధిష్ఠానం సూచన మేరకు కాంగ్రెస్ సభ్యులు వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుప్రియకు ఆర్డీవో ఎన్నిక పత్రాన్ని అందించి, ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ చైర్‌పర్సన్ ఎన్నికకోసం త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని మున్సిపల్ కమిషనర్ సుజాత తెలిపారు.



కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి రూరల్: మాజీ సీఎం కేసీఆర్ పదేళ్ల పాలనలోనే పోరాడి సాధించిన తెలంగాణలో అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ వాకర్స్‌తో మాట్లాడారు. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు. కాంగ్రెస్ పాలనను అర్థం చేసుకున్న ప్రజలు కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ సాగునీటిని రైతులకు అందించి వ్యవసాయాన్ని పండుగ చేస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కోతలు విధిస్తూ పంటలను ఎండబెడుతోందని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. అనంతరం కల్వకుర్తిలోని పలు హోటళ్లలో చాయ్‌పే చర్చ నిర్వహించి ప్రజలు, హోటల్ యజమానులతో మాట్లాడారు. నాయకులు మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మధు, విజయ్‌గౌడ్, జంగయ్య, శ్రీనివాసులు యాదవ్, మనోహర్‌రెడ్డి, గణేశ్, వెంకటయ్య గౌడ్, తాండ్ర ఈశ్వరయ్య, సూరి పాల్గొన్నారు.

త్వరలో కడియం అక్రమ ఆస్తుల చిట్టా విప్పుతా

మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య




స్టేషన్‌ఘన్‌పూర్: నీతిమంతుడని చెప్పుకునే నమ్మకద్రోహి, బ్లాక్‌మెయిల్ కింగ్ కడియం శ్రీహరి అక్రమ ఆస్తుల చిట్టా తనవద్ద ఉందని, త్వరలో బయటపెడతానని మాజీ ఎమ్మెల్యే టి.రాజయ్య తెలిపారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తండ్రి జుట్టు బిడ్డ చేతిలో ఉందని, కడియం అక్రమ ఆస్తులు విదేశాల్లో ఉన్నాయని ఆరోపించారు. వీటికి మొదటి సాక్షి అతడి కుమార్తె, రెండవ సాక్షి అల్లుడని రాజయ్య తెలిపారు. కేసీఆర్ బీఆర్‌ఎస్‌లో ఎవరికీ ఇవ్వనంత ప్రాధాన్యం కడియంకు ఇచ్చారన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో పలు పదవులు అనుభవించి కుమార్తెకు పార్టీ ఎంపీ అభ్యర్థిగా టికెట్, పార్టీ ఫండ్ తీసుకుని రాత్రికి రాత్రే ప్లేటు ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరిన నంబర్‌వన్ మోసగాడని రాజయ్య విరుచుకుపడ్డారు. కడియంకు సిగ్గుంటే వెంటనే రాజీనామా చేసి చేతిగుర్తుపై గెలిచి నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు.

10 నుంచి 12 ఎంపీ సీట్లలో గెలుస్తామన్న ధీమా పనిచేస్తుందా?

2019లో బీజేపీకి అనూహ్య ఫలితాలు.. 4 ఎంపీ స్థానాల్లో విజయం

కె.రాహుల్

వచ్చేనెల 13న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పది సీట్లకు పైగా గెలుపొంది సత్తా చాటాలనే బీజేపీ లక్ష్యం నెరవేరుతుందా? భారతీయ జనసంఘ్(బీజేఎస్) నుంచి 1980లో భారతీయ జనతాపార్టీగా మారాక...1984లో ప్రధాని ఇందిరాగాంధీ హత్యకు గురైన నేపథ్యంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ రెండే రెండు సీట్లలో గెలుపొందింది. అందులో ఒకటి ఉమ్మడి ఏపీలోని హనుమకొండ స్థానం నుంచి అప్పటి కేంద్ర మాజీ మంత్రి పీవీ.నరసింహారావును ఓడించిన చందుపట్ల జంగారెడ్డి కాగా, మరో స్థానంలో గుజరాత్‌లోని మెహసినా నుంచి ఏకే.పాటిల్ గెలిచారు. అగ్రనేతలైన వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్‌జోషి లాంటివారు ఓటమి పాలుకాగా, ఎక్కడో ఏపీ నుంచి బీజేపీ ఒక సీటు దక్కించుకోవడం అప్పట్లోనే పెద్దసంచలనంగా రికార్డయ్యింది. ఇందిరాగాంధీ హత్యతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీకి సానుభూతి ఓట్లుపడినా కూడా జంగారెడ్డి చేతుల్లో పీవీ పరాజయం పాలుకావడం కూడా ఆనాడు రాజకీయ నిపుణుల అంచనాలకు అందలేదు. వాజ్‌పేయి, అద్వానీ కాలం దాటి 2014 తర్వాత నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ కొత్తపుంతలు తొక్కుతూ వరుసగా 2014, 2019 ఎన్నికల్లో సొంతంగా మెజారిటీ సాధించింది. ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ రికార్డు సాధించాలని పట్టుదలతో ఉంది. తెలంగాణలోనూ మెజారిటీ స్థానాలపై దృష్టి సారించింది.



బీజేపీ టార్గెట్.. డబుల్ డిజిట్

ఆయా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ బలం ఇలా..

- 1998 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 4 ఎంపీ స్థానాలు గెలుచుకుంది. తెలంగాణలోని సికింద్రాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ, కరీంనగర్ నుంచి సీహెచ్.విద్యాసాగరరావు, ఏపీలో కాకినాడ నుంచి సినీనటుడు కృష్ణంరాజు, రాజమండ్రి నుంచి గిరిజా వెంకటస్వామినాయుడు గెలిచారు.
- 1999 ఎన్నికల్లో బీజేపీ టీడీపీతో పొత్తు పెట్టుకుంది. 7 ఎంపీ స్థానాల్లో 12 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించింది. ఎంపీగా గెలిచిన వారిలో సికింద్రాబాద్ నుంచి బండారు దత్తాత్రేయ, కరీంనగర్ నుంచి సీహెచ్.విద్యాసాగరరావు, మెదక్ నుంచి ఆలె నరేంద్ర, మహబూబ్‌నగర్ నుంచి ఏపీ.జితేందర్‌రెడ్డి, ఏపీలోని రాజమండ్రి నుంచి ఎస్‌బీపీబీకే సత్యనారాయణ, నర్సాపూర్ నుంచి ఉప్పలపాటి కృష్ణంరాజు, తిరుపతి నుంచి డా.ఎన్ వెంకటస్వామి ఉన్నారు.
- 2004, 2009 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒక చోట కూడా విజయం సాధించలేకపోయింది.
- 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒక్క సికింద్రాబాద్ ఎంపీ సెగ్మెంట్ నుంచే విజయం సాధించింది.
- 2019 పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ సొంతంగా పోటీచేసి 4 ఎంపీ సీట్లలో విజయం సాధించి సత్తా చాటి అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఎన్నో ప్రశ్నలు



2023 చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ అధికారంలోకి వచ్చేంత స్థాయిలో మెజారిటీ సీట్లు గెలుస్తామనే ధీమా, విశ్వాసం ప్రకటించి చివరకు 8 ఎమ్మెల్యే స్థానాలకే పరిమితమైంది. 19 చోట్ల బీజేపీ అభ్యర్థులు రెండోస్థానంలో నిలిచి, 46 స్థానాల్లో డిపాజిట్లు దక్కించుకున్నారు. 30 లక్షలకు పైగా ఓట్లతో 14 శాతం ఓటింగ్ సాధించింది. ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈ 14 శాతం ఓటింగ్‌ను గణనీయంగా పెంచుకొని, పది నుంచి 12 ఎంపీ సీట్లు గెలుచుకునే దిశలో పకడ్బందీ వ్యూహాలతో ముందుకెళ్లాలని బీజేపీ జాతీయ నాయకత్వం నిర్ణయించింది. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్–బీఆర్‌ఎస్‌ల మధ్యనే ప్రధాన పోటీ జరగగా, ఇప్పుడు కాంగ్రెస్–బీజేపీల మధ్యనే ప్రధాన పోటీ నెలకొనడంతో మంచి ఫలితాలు సాధిస్తామనే ధీమా ఆ పార్టీలో వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను చూసినందువల్లనే, నిన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు బీజేపీ గట్టిపోటీ ఇచ్చినా, ఆశించిన స్థాయిలో సీట్లు గెలుచుకోలేక పోయిందని పార్టీనేతలు విశ్లేషిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బలంగా ఉందని భావించిన గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, తదితర చోట్ల ఊహించని విధంగా బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతోనే 8 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చిందని, మోదీ ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూలత కారణంగా ఇప్పుడా పరిస్థితులను అధిగమించి అత్యధికసీట్లలో గెలుపొందుతామనే విశ్వాసాన్ని నేతలు వ్యక్తం చేస్తున్నారు.

7 నుంచి 19 శాతం ఓటింగ్..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం బీజేపీ ఒక సీటు మాత్రమే గెలుచుకుంది. 105 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతై కేవలం ఏడుశాతం ఓటింగ్ మాత్రమే వచ్చింది. ఆ తర్వాత ఆరునెలలలోపే జరిగిన 2019 లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 4 ఎంపీ సీట్లు గెలుపొంది గణనీయంగా 19 శాతం ఓటింగ్‌ను సాధించి బీజేపీ సత్తా చాటింది.

ఉప ఎన్నికలతో ఊపు...

2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ బీజేపీ బలం పుంజుకుంది. అధికార బీఆర్‌ఎస్‌తో నువ్వా నేనా అన్నట్టుగా తలపడి దుబ్బాక నుంచి రఘునందన్‌రావు, హుజురాబాద్ నుంచి ఈటల రాజేందర్ గెలుపొందారు. మునుగోడు ఉప ఎన్నికలో విజయం దగ్గర దాకా చేరుకుంది. కేవలం 12 వేల ఓట్ల తేడాతోనే బీజేపీ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఓటమి పాలయ్యారు.

మొదటిసారిగా పార్టీ బీ ఫామ్‌పై హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి 2023లో ఏవీఎన్‌రెడ్డి సంచలన విజయం సాధించారు.

2020 డిసెంబర్‌లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 48 మంది కార్పొరేటర్లు గెలుపొందడం ద్వారా బీజేపీ సంచలనం సృష్టించింది. అంతకు ముందు ఆ పార్టీకి నలుగురు మాత్రమే కార్పొరేటర్లు ఉండగా ఏకంగా వారి సంఖ్య 48కు చేరుకుంది. హిందుత్వ నినాదంతో ఓటర్ల పోలరైజేషన్ దిశగా హైదరాబాద్ ప్రజలు అడుగులు వేస్తున్నారనే చర్చ కూడా అప్పట్లో బలంగానే సాగింది.

బీఆర్‌ఎస్‌కే అనుకూలం

పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై కేటీఆర్

కాంగ్రెస్, బీజేపీలకు ఒకేసారి ఎదురుదెబ్బ

అధికార పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

బీజేపీకి చెప్పుకోవడానికి ఎజెండానే లేదు

వరంగల్, పెద్దపల్లి ముఖ్య నేతలతో భేటీ



పార్టీ నేతలతో మాజీ మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు అనుకూల ఫలితాలు రాబోతున్నాయని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు చెప్పారు. మోసపు మాటలతో గద్దె నెక్కిన కాంగ్రెస్‌కు, మతం పేరుతో రాజకీయం చేస్తున్న బీజేపీకి ఒకేసారి ఎదురుదెబ్బ తగలబోతుందని అన్నారు. సోమవారం ఆయన వరంగల్, పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీపై అన్నదాతలు మొదలుకొని ఆటో డ్రైవర్ల దాకా ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో తప్పకుండా ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్తారని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో చెప్పుకోవడానికి బీజేపీకి ఎజెండానే లేదని, అందుకే మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టి గట్టెక్కాలని చూస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా అసలైన సమస్యలు చర్చకు రాకుండా ప్రజల దృష్టిని మరల్చే ఇలాంటి కుట్రలను క్షేత్రస్థాయిలో తిప్పి కొట్టాలని సూచించారు. నాయకుల వలసల వల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని, తెలంగాణ సమాజం బీఆర్‌ఎస్‌తోనే ఉందని అన్నారు.

కడియం కుటుంబంపై తీవ్ర వ్యతిరేకత

వరంగల్‌లో చివరి క్షణంలో బీఆర్‌ఎస్ పార్టీకి కడియం శ్రీహరి కుటుంబం చేసిన మోసంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని కేటీఆర్ తెలిపారు. కొందరు నాయకులు వలస వెళ్లినంత మాత్రాన ఎలాంటి నష్టం లేదని, ప్రజలంతా బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని అన్నారు. వరంగల్ నుంచి బీఆర్‌ఎస్ బరిలోకి దించిన డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వంపై ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని తెలిపారు. 2001 నుంచి కేసీఆర్‌తో కలిసి నడిచిన సుధీర్‌కుమార్ గెలుపు కోసం కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చైతన్యానికి ప్రతీకైన వరంగల్ ప్రజలు బీఆర్‌ఎస్‌ను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

ఉద్యమ గొంతుక కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గంలో కూడా గులాబీ గెలుపు ఖాయం అయిపోయిందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంతో పాటు, సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో మచ్చలేని నాయకుడిగా బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని గుర్తు చేశారు. కొప్పుల ఈశ్వర్ లాంటి ఉద్యమ గొంతుకను ఎన్నుకుంటేనే పార్లమెంటులో తెలంగాణ వాణిని బలంగా వినిపించగలుగుతారని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త తనను తానే అభ్యర్థిగా భావించి బీఆర్‌ఎస్ గెలుపు కోసం కదం తొక్కాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు సమిష్టిగా పనిచేస్తామని, నాయకత్వం అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తామని నేతలంతా ఈ సందర్భంగా వాగ్దానం చేశారు.

కాంగ్రెస్‌లోకి ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు

రాథోడ్ బాపూరావు, చిలుముల మదన్‌రెడ్డి చేరిక

సాక్షి, హైదరాబాద్/నర్సాపూర్/తిరుమలగిరి: ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావుకు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డికి గాంధీభవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సూర్యాపేట జిల్లాకు చెందిన ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలో చేరారు.



బాపూరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి సీతక్క, వెడ్మ బొజ్జు తదితరులు

గెలిచినా.. ఓడినా ప్రజల మధ్యే బీఆర్‌ఎస్



పదేళ్లు చేసిన అభివృద్ధి చెప్పలేక.. గుడి కట్టామని అక్షంతలు పంచి ఓట్లు అడుగుతున్న బీజేపీ

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుకు పోరాటం చేస్తాం : మాజీ మంత్రి హరీశ్‌రావు

కోస్గి: రెండుసార్లు ఓట్లేసి గెలిపించి అధికారం ఇచ్చిన ప్రజలు కొందరి మాయ మాటలు నమ్మి మూడోసారి బీఆర్‌ఎస్‌కు ప్రతిపక్ష హోదా ఇచ్చారని.. గెలిచినా, ఓడినా జనం మధ్యనే ఉంటూ ప్రజల పక్షాన పోరాటం చేసేది బీఆర్‌ఎస్ పార్టీ అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం కోస్గిలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కొడంగల్ నియోజకవర్గస్థాయి ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి హరీశ్‌రావు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. బీజేపీ పెట్రోల్ డీజిల్ ధరలు, గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడంతోపాటు జీఎస్టీలతో పేదల నడ్డి విరవడం తప్ప ఏం చేసిందో ప్రజలకు వివరించి ఓట్లు అడగాలన్నారు. బీజేపీ పాలనలో ఆకలి, నిరుద్యోగం, పేదరికం పెరిగిందని చెప్పారు. బీజేపీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని.. పదేళ్ల పాలనలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా.. ఎందుకు ఇవ్వలేదో చెప్పి ఓట్లు అడగాలన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి మెడికల్, నర్సింగ్ కళాశాలలు, పాలమూరు–రంగారెడ్డికి జాతీయహోదా వంటి ఎన్నో పథకాలు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుందని ఆరోపించారు. పదేళ్ల చేసిన అభివృద్ధిని చెప్పలేని బీజేపీ గుడి కట్టామని, మాయమాటలతో అక్షంతలు పంచి ఓట్లు అడుగుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ యాదాద్రి వంటి గుడి కట్టడంతోపాటు ప్రతి గ్రామంలో బడి కట్టించారన్నారు. పాలమూరు–రంగారెడ్డి పనులు చివరిదశలో ఉన్నాయని, 80 శాతం పనులు పూర్తి చేశామని, కర్వెన నుంచి ఓ కాల్వ తవ్వితే కొడంగల్ ప్రాంతంలో 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చే అవకాశం ఉన్నా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ టెండర్లు రద్దు చేసి కాలయాపన చేస్తున్నారన్నారు. ఇదే కోస్గి సభలో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు నాది గ్యారంటీ అంటూ ప్రగల్భాలు పలికి ఎక్కడికి పోయిందో ప్రజలే ఆలోచించుకోవాలని, కాంగ్రెస్ పరిస్థితి ఓడ ఎక్కితే ఓడ మల్లన్న..ఓడ దిగితే బోడి మల్లన్న అన్న చందంగా ఉందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను స్క్రీన్‌ల ద్వారా ప్రదర్శించి అమలు చేశారా అంటూ ఒక్కొక్కటిగా వివరిస్తూ కాంగ్రెస్ మోసం..మోసం అంటూ ప్రజల ద్వారా చెప్పించారు. గ్రామాల్లోకి వెళ్లి చర్చ పెట్టి కాంగ్రెస్ పథకాలు అందినవారు కాంగ్రెస్‌కు ఓటేయాలని, అందని వారు కారుకు ఓటేయాలని సూచించాలన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ఆల వెంక

పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికే..

రుణమాఫీపై బీఆర్‌ఎస్ పోరాటానికి భయపడే రేవంత్ ప్రకటన

మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి, ప్రజలను మభ్యపెట్టడానికి మాత్రమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని హామీ ఇస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై 'ఎక్స్' వేదికగా స్పందించారు. గత ఏడాది డిసెంబర్ 9నాడే రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చి తప్పినందుకు సీఎం రైతులకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం బీఆర్‌ఎస్ చేసిన పోరాటానికి భయపడే రేవంత్ ఈ ప్రకటన చేశారన్నారు. ఎకరానికి రూ.15వేలు చొప్పున రైతు భరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇంకా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు రూ12వేలు ఇస్తామనే హామీ ఎందుకు అమలు కావడం లేదో చెప్పాలని, మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు నెలకు రూ. 2500 చొప్పున ఇస్తామన్న హామీ ఏమైందని, రూ.4 వేలకు పెంచుతామన్న పెన్షన్‌ను ఎప్పుడు పెంచి ఇస్తారో కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు.

రాహుల్ కూడా రాముడికి మొక్కుతారు

కానీ మోదీ మాదిరి కెమెరాల ముందు కాదు



ఉద్వేగాలు రెచ్చగొట్టడం తప్ప పాలనలో ఏం చేశారు

రాహుల్‌ను పీఎం చేసేందుకు రాష్ట్ర ప్రజలు సహకరించాలి: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశంలోని హిందువులంతా శ్రీరాముడిని ఆరాధిస్తారని, అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా రాముడికి మొక్కుతారని, కానీ ప్రధాని నరేంద్ర మోదీలాగా కెమెరాలు పెట్టుకుని మాత్రం కాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ నేతల వైఖరి చూస్తుంటే రాముని పూజ వాళ్లు తప్ప ఎవరూ చేయనట్లుందని ఎద్దేవా చేశారు గ్రామాల్లో హనుమాన్ దేవాలయాల్లో దీపం వెలిగించేది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనని, దేవుడైన శ్రీరాముడిని రాజకీయానికి ఉపయోగించుకోవడం మినహా బీజేపీ నేతలు చేసేదేమీ లేదని ఆయన విమర్శించారు. సోమవారం గాంధీభవన్‌లో రాష్ట్ర మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డిలతో కలిసి జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. కేవలం ఉద్వేగాలను రెచ్చగొట్టి అధికారంలోకి రావాలన్న ఆలోచనతోనే బీజేపీ నేతలుంటారని, వారికి పాలన ఏమాత్రం తెలియదని ఆరోపించారు. త్యాగాల కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌కి ప్రధాన మంత్రి అయ్యే అర్హతలన్నీ ఉన్నాయని, ఆయన్ను ప్రధానిని చేసేందుకు తెలంగాణ ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళలూ ఆలోచించండి

నాడు తులం రూ. 28 వేలు... ఇప్పుడు రూ.75 వేలు

బీజేపీకి ఎందుకు ఓటు వేయకూడదో మహిళలు అర్థం చేసుకోవాలని జగ్గారెడ్డి అన్నారు. 'సోనియాగాంధీ నాయకత్వంలో మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు తులం బంగారం ధర రూ.28వేలు ఉండేది. కానీ, పదేళ్ల మోదీ పాలన తర్వాత రూ.75వేలు అయింది. అసలు బంగారం కొనే పరిస్థితి ఉందా? తులం లక్ష దాటుతుందని అంటున్నారు. రాహుల్ ప్రధాని అయితే బంగారం ధరలు నియంత్రిస్తారు. అందుకే మహిళలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓట్లేయాలి' అని జగ్గారెడ్డి కోరారు. తొమ్మిదేళ్ల ఎనిమిది నెలల పాటు పెట్రోల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచిన మోదీ ఎన్నికల కోడ్ వస్తుందనగా కంటితుడుపుగా తగ్గించి మహిళలు, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

వెన్నుపోటే ఇందిరమ్మ రాజ్యమా?

▶ మొదటి పేజీ తరువాయి

వరి పంటకు రూ.500 బోనస్ ఇస్తామని వాగ్దానం చేసి అమలు చేయని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని చెప్పారు. ఎరువుల సరఫరాలో రాష్ట్రం వైఫల్యం చెందినా, రుణాలు కట్టాలని బ్యాంకులు ఒత్తిడి చేసినా, విత్తనాలు అందకపోయినా, కల్తీ విత్తనాలు సరఫరా చేసినా ఫిర్యాదు చేయాలని అన్ని జిల్లాల రైతులను కోరుతున్నామన్నారు. రాష్ట్ర రైతాంగం కష్టాలు, సమస్యలు, ఫిర్యాదులు తెలుసుకునేందుకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన 9904119119 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని, కిసాన్ సమ్మాన్ నిధి కింద అర్హులు పేరు నమోదు చేసుకోవాలనుకుంటే ఇదే నంబరుకు ఫోన్ చేయాలన్నారు. రైతులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని మోదీ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రైతుల కల్లాల నుంచి మొదలు ఎఫ్‌సీఐ గోదాంలకు ధాన్యం తీసుకెళ్లేంతవరకు ఖర్చంతా కేంద్రప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి.. తర్వాత మాట తప్పడం కాంగ్రెస్‌కు అలవాటు అని బీజేపీ రాష్ట్ర లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్ విమర్శించారు. రైతులకు ఇవ్వడానికి సీఎం రేవంత్‌రెడ్డి దగ్గర డబ్బులు లేవు కానీ ఎన్నికల కోసం ఢిల్లీ కాంగ్రెస్‌కు ఇవ్వడానికి ఆయన దగ్గర డబ్బులు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రజల దృష్టిని మరల్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఖర్చు పెట్టిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పెండింగ్ బిల్లుల బకాయిల చెల్లింపులకు బ్యాంకు రైతుబంధుకు ఉంచిన డబ్బులను ఇచ్చారని రాష్ట్ర ప్రధానకార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లుయాదవ్ ఆరోపించారు.

ఒక్క సీటైనా ఇవ్వండి

వామపక్షాలను మోసం చేసిన వారు బాగుపడరు: చాడ

హుస్నాబాద్: వామపక్షాలను మోసం చేసినవారెవరూ బాగుపడరని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పొత్తులో భాగంగా కాంగ్రెస్‌ను ఐదు ఎంపీ సీట్లు అడిగాం .. కనీసం ఒక్క సీటైనా ఇవ్వాలని కోరామని, అయినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదని విచారం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐకి ఒక సీటు ఇస్తే, 118 సీట్లల్లో తమ కేడర్ ఓటు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచ్చలవిడిగా జరగడం దుర్మార్గమని, నిందితులు ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందేనని చాడ పేర్కొన్నారు.

'ఇంటింటికీ బీజేపీ' షురూ!

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం "ఇంటింటికీ బీజేపీ"(హర్ ఘర్ బీజేపీ) కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్‌బూత్‌లలో ఆ పార్టీ నేతలు ప్రారంభించారు. తాను పోటీ చేస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలో అక్కడి అభ్యర్థి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కరీంనగర్‌లో ఎంపీ అభ్యర్థి జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్, మేడ్చల్‌లోఎంపీ అభ్యర్థి, జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్,.. ఇలా ముఖ్య నేతలంతా ఎక్కడికక్కడ పోలింగ్‌బూత్‌లలో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. పోలింగ్‌లోగా ప్రతి ఇంటి తలుపును మూడు సార్లు తట్టాలని నిర్ణయించారు.

స్టేట్ స్కాన్

దక్షిణాదిన జాతీయ పార్టీలకు కొరకరాని కొయ్యగా నిలుస్తున్న రాష్ట్రాల్లో ప్రధానమైనది తమిళనాడు! 50 ఏళ్లకు పైగా ఇక్కడ ప్రాంతీయ పార్టీలదే హవా. తమిళులు కూడా సినీ గ్లామర్, ప్రాంతీయ సమస్యలు, అంశాలకే ప్రాధాన్యమిస్తారు. కానీ 39 లోక్‌సభ స్థానాలతో సీట్లపరంగా దేశంలో ఐదో అతి పెద్ద రాష్ట్రమైన తమిళనాడును పక్కనపెట్టే పరిస్థితి లేదు. దాంతో కాంగ్రెస్, బీజేపీ ఇక్కడి ప్రాంతీయ పార్టీతో పొత్తులు పెట్టుకోక తప్పడం లేదు. ఈసారి మాత్రం రాష్ట్రంలో బీజేపీ గట్టిగా ఉనికిని చాటే ప్రయత్నాల్లో ఉంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

జాతీయ పార్టీలకు... ద్రవిడ స్వప్నం!




తమిళనాట హోరాహోరీ

- ఎలాగైనా పాగా వేసే ప్రయత్నాల్లో బీజేపీ
- కాంగ్రెస్-డీఎంకే వైపే సర్వేల మొగ్గు
- నామమాత్రంగా మారిన అన్నాడీఎంకే



అవినీతికి మారుపేరు డీఎంకే. దానిపై తొలి కాపీరైట్ ఆ పార్టీదే. అదో ఫ్యామిలీ కంపెనీ. రాష్ట్రాన్ని లూటీ చేస్తోంది. భాష, కులం, మతం, విశ్వాసం అంటూ విద్వేష, విభజన రాజకీయాలు చేస్తోంది. కేంద్రంలో కాంగ్రెస్, రాష్ట్రంలో డీఎంకే వంటి కుటుంబ పార్టీలు అవినీతిపరులకు కొమ్ముకాస్తున్నాయి. కచ్చతీవు దీవిని 1974లో శ్రీలంకకు ధారాదత్తం చేసింది ఈ రెండు పార్టీలే.

- వెల్లూరు సభలో ప్రధాని మోదీ



ఎన్డీఏ ఈసారి అధికారంలోకి వస్తే దేశ రాజధానిని నాగపూర్‌కు మార్చేస్తుంది. త్రివర్ణ పతాకాన్ని కూడా కాషాయ జెండాగా మార్చాలని చూస్తున్నారు. గుజరాత్ మోడల్ కంటే ద్రవిడ మోడల్ చాలా గొప్పది. మేం దాన్నే అనుసరిస్తాం.

- డీఎంకే తరఫున ప్రచారంలో కమల్ హాసన్



పోలింగ్ తేదీ: ఏప్రిల్ 19

ఒకప్పుడు కరుణానిధి డీఎంకే, జయలలిత అన్నాడీఎంకేలకు కంచుకోటైన నిలిచిన తమిళనాట వారి తదనంతరం పరిస్థితులు మారుతున్నాయి. అన్నాడీఎంకే వంటి ప్రధాన ప్రాంతీయ పార్టీ బలహీనపడటంతో ఆ రాజకీయ శూన్యతను భర్తీ చేసి ఈ కీలక దక్షిణాది రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ పావులు కదుపుతోంది. కాంగ్రెస్ కూడా ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా పాలక డీఎంకేతో జట్టుకట్టింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన యూపీఏ కూటమి ఎన్డీఏను మట్టికరిపించింది. ఏకంగా 38 సీట్లను ఎగరేసుకుపోయింది. స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే 23 స్థానాల్లో పోటీ చేసి 23 సీట్లు చేజిక్కించుకుంది. కాంగ్రెస్ 9 స్థానాలకు 8 దక్కించుకుంది. సీపీఐ, సీపీఎం చెరో రెండు, ఇతర చిన్న పార్టీలు ఒక్కో సీటు గెలుచుకున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో జయలలిత సారథ్యంలో 37 స్థానాలు కొల్లగొట్టిన అన్నాడీఎంకే 2019లో బీజేపీతో కలిసి ఎన్డీఏ కూటమిగా పోటీ చేసి బొక్కబోర్లా పడింది. 21 స్థానాల్లో పోటీ చేసి కేవలం ఒక్క సీటు గెలుచు కుంది. బీజేపీ, పీఎంకే, డీఎండీకే, టీఎంసీ (ఎం) ఖాతా కూడా తెరవలేదు. ఈసారి ఇండియా కూటమి నుంచి డీఎంకే 21, కాంగ్రెస్ 9, సీపీఐ, సీపీఎం, వీసీకే రెండేసి స్థానాల్లో, ఎండీఎంకే, ఐయూఎంఎల్ చెరో చోట పోటీ చేస్తున్నాయి. ఒక స్వతంత్రుడు డీఎంకే మద్దతుతో ఆ పార్టీ గుర్తుపై పోటీ చేస్తున్నారు.

ఇండియా కూటమిదే హవా?



అవినీతి వర్సిటీకి చాన్సలర్ మోదీ

దేశంలో అత్యంత అవినీతిమయమైన పార్టీ బీజేపీయే. అవినీతి పేరుతో యూనివర్సిటీ పెడితే దానికి మోదీయే చాన్సలర్ అవుతారు. ఆ అర్హతలన్నీ ఆయనకే ఉన్నాయి.

- చెన్నై రోడ్‌షోలో సీఎం స్టాలిన్

బీజేపీ పాగా వేసేనా?

ద్రవిడ రాజ్యంలో పాగా వేయాలని తహతహలాడుతున్న కమలనాథులకు అన్నాడీఎంకే దూరమవడంతో ఈసారి ఆదిలోనే షాక్ తగిలింది. దాంతో చిన్నాచితకా పార్టీలతో బీజేపీ పొత్తు పెట్టుకుంది. 20 స్థానాల్లో పోటీ చేస్తోంది. జీకే వాసన్ నేతృత్వంలోని తమిళ మానిల కాంగ్రెస్ (ఎం)కు 3, ఎస్.రాందాస్‌కు చెందిన పట్టాలి మక్కల్ కచ్చికి 10, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)కు 2 సీట్లు కేటాయించింది. మరో 4 చోట్ల కూటమిలోని ఇతర పక్షాలు కమలం గుర్తుపై పోటీ చేయనున్నాయి. అన్నాడీఎంకే బహిష్కృత నేత పన్నీర్‌సెల్వంకు బీజేపీ మొండిచేయి చూపింది. ప్రధాని మోదీ తమిళనాట సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. అయోధ్య, డీఎంకే అవినీతి, కుటుంబ పాలనను ప్రచారాస్త్రాలుగా మలచడంతో పాటు తమిళ భాషకు పెద్దపీట వేస్తామంటూ పదేపదే ప్రకటిస్తున్నారు. దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే (5 సీట్లు), మరో రెండు పార్టీలతో (చెరో సీటు) అన్నాడీఎంకే కలిసి పోటీ చేస్తోంది. 32 చోట్ల ఆ పార్టీ బరిలో ఉంది.

అన్నామలై... బీజేపీ తురుపుముక్క

బీజేపీకి తమిళనాట ఎట్టకేలకు కె.అన్నామలై రూపంలో ఫైర్‌బ్రాండ్ నాయకుడు దొరికారు. 2021లో 36 ఏళ్ల అతి చిన్న వయసులో పార్టీ పగ్గాలు అందుకుని శరవేగంగా కీలక నేతగా ఎదిగారు. 'సింగమ్ అన్న'గా పేరొందిన ఈ మాజీ ఐపీఎస్ మొత్తం పాదయాత్రతో క్రేజ్ సంపాదించారు. డీఎంకే అవినీతిని ఎండగట్టడంతో పాటు హిందుత్వ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. దూకుడు, వాగ్ధాటితో బీజేపీకి జోష్ తెచ్చారు. కోయంబత్తూరు నుంచి బరిలో ఉన్నారు.



రాజధానిని నాగపూర్‌కు ఎలా మారుస్తారు? అర్థంపర్థముందా? కమల్ పిచ్చాసుపత్రికి వెళ్లి చెక్ చేయించుకుంటే మంచిది. డీఎంకే ప్రాపకం, రాజ్యసభ స్థానం కోసమే ఆయన పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారు

- కోయంబత్తూరు ర్యాలీలో అన్నామలై

ఐదుగురు 'సినీ' సీఎంలు

తమిళ రాజకీయాలకు, సినిమాలకు బ్రిటిష్ కాలం నుండీ విడదీయరాని బంధం! నాటి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) నుండి తాజాగా విజయ్ దాకా వెండితెరపై ఓ వెలుగు వెలిగి రాజకీయాల్లోకి వచ్చినవారే. సినీ పరిశ్రమ నుంచి తమిళనాట ఐదుగురు ముఖ్యమంత్రులయ్యారు. ద్రవిడ సిద్ధాంతాలను సినిమాల్లో చొప్పించిన వారిలో రాష్ట్ర తొలి ద్రవిడ సీఎం సీఎన్ అన్నాదురై ముందుంటారు. ఇక కవిగా, స్క్రీన్‌ప్లే, సంభాషణ రచయితగా పేరొందిన ఎం.కరుణానిధి, అన్నాడీఎంకే వ్యవస్థాపకుడైన తమిళ సినీ దిగ్గజం ఎంజీఆర్ కూడా ముఖ్యమంత్రులయ్యారు. ఎంజీఆర్ మరణానంతరం అతి స్వల్పకాలం పాటు సీఎంగా చేసిన ఆయన భార్య జానకీ రామచంద్రన్ కూడా సినీ నటి. అనంతరం ఎంజీఆర్ వారసురాలైన స్టార్ హీరోయిన్ జయలలిత సీఎంగా చెరగని ముద్ర వేశారు. తర్వాతి తరంలో విజయకాంత్ (ఎండీఎంకే), కమల్‌హాసన్ (మక్కల్ నీది మయం) పార్టీలు పెట్టినా రాణించలేదు. కమల్ ఈసారి ఇండియా కూటమికి మద్దతు తెలిపారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ పార్టీ పెట్టినంత పని చేసి చివరికి విరమించుకున్నారు. తాజాగా సూపర్‌స్టార్ విజయ్ కూడా తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీ పెట్టారు. 2026 అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగుతామని ప్రకటించారు. హీరో విశాల్ కూడా పార్టీ పెడతానని ప్రకటించారు.

ఇండియా కూటమికే సర్వేల మొగ్గు

తమిళనాట ఇండియా కూటమి మళ్లీ క్లీన్ స్వీప్ చేస్తుందని ఎన్నికల సర్వేలు చెబుతున్నాయి. బీజేపీకి ఓట్ల శాతం భారీగా పెరుగుతుందని, నాలుగైదు స్థానాలూ వస్తాయని మరో సర్వే అంటోంది.

చెరిగిపోని సిరాచుక్క



చూపుడువేలిపై సిరా చుక్క. ఓటేశామని చెప్పేందుకు తిరుగులేని గుర్తు. పోలింగ్ బూత్ నుంచి బయటికి రాగానే చూపుడువేలిపై సిరా చుక్కను చూపిస్తూ ఫొటో తీసుకుని సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటాం. ఆ ఇంకు కథ ఆసక్తికరం.

ప్రపంచవ్యాప్తంగా..

మన దేశంలో 1962 లోక్‌సభ ఎన్నికల నుంచి సిరా చుక్క వాడకం మొదలైంది. నాటి నుంచి నేటిదాకా కర్ణాటక ప్రభుత్వ సంస్థ మైసూర్ పెయింట్స్ దీన్ని సరఫరా చేస్తోంది. 30 పై చిలుకు దేశాలకు ఈ ఇంకును ఎగుమతి చేస్తోంది కూడా.

ఇదీ ప్రత్యేకత...

- ఓటేసినట్టు రుజువుగా ఓటరు ఎడమ చూపుడు వేలిపై సిరా గుర్తు పెడతారు. చూపుడు వేలు లేకుంటే ఎడమ చేతిలోని ఇతర వేలిపై వేస్తారు. ఎడమ చేయే లేకుంటే కుడిచేతి వేళ్లలో దేనికైనా వేస్తారు. రెండు చేతులు లేకుంటే? ఎడమ లేదా కుడి చేయి చివరి భాగాలకు సిరా గుర్తు వేయాలని ఈసీ చెబుతోంది.
- సిరా చుక్కలో సిల్వర్ నైట్రేట్ ఉంటుంది. ఇంకు గుర్తు సాధారణంగా చర్మంపై మూడు రోజుల దాకా ఉంటుంది. గోరుపై మాత్రం వారాల పాటు ఉంటుంది.
- 5.1 మిల్లీలీటర్ల సీసాలోని ఇంకుతో సుమారు 700 మందికి గుర్తు వేయవచ్చు. ఈ లోక్‌సభ ఎన్నికల కోసం ఈసీ 26 లక్షల ఇంకు బాటిళ్లు ఆర్డర్ చేసింది.
- మామూలుగా ఎన్నికల్లోనే వాడే ఈ ఇంకును ఇతరత్రా వాడేందుకు ఒకేసారి ఈసీ అనుమతించింది. అదెప్పుడంటే.. కరోనా వ్యాప్తి సమయంలో. కోవిడ్ బారిన పడి క్వారెంటైన్లో ఉన్నవారిని గుర్తించడానికి పలు రాష్ట్రాలు ఈ ఇంకును వాడాయి.

- సాక్షి, ఎలక్షన్ డెస్క్

కాంగ్రెస్ కోటకు బీటలు


తండ్రి నెహ్రూ వారసురాలిగా 1966లో ప్రధాని పీఠమెక్కిన ఇందిరాగాంధీ సరిగ్గా ఏడాది తిరిగే సరికి ప్రజాతీర్పు కోరాల్సిన పరిస్థితి! రాజకీయాల్లో ముక్కుపచ్చలారకపోయినా తొలిసారి ప్రజామోదం పొందడంలో ఆమె సక్సెసయ్యారు. కానీ సొంత పార్టీలో అసంతృప్తిని చల్లార్చలేకపోయారు. ధరల పెరుగుదల, మందగించిన వృద్ధి, ఉపాధి కల్పన వంటి సమస్యలకు తోడు పార్టీని కూడా చక్కదిద్దుకోవాల్సిన క్లిష్ట పరిస్థితి! చివరికి సొంత పార్టీయే బయటకు గెంటినా తట్టుకుని నిలవడమే గాక విపక్షాల మద్దతుతో అధికారాన్ని నిలబెట్టుకుని సంకీర్ణ శకానికి తెర తీశారు ఇందిర. ఇలా 1967-70 నాలుగో లోక్‌సభ ఎన్నో సంక్షోభాలకు సాక్షిగా నిలిచింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇందిరపై తిరుగుబాటు
పార్టీనుంచి బహిష్కరణ!

- డీఎంకే, సీపీఐ దన్నుతో నిలిచిన ప్రభుత్వం
- సంచలనాలకు వేదికైన నాలుగో లోక్‌సభ
- దేశవ్యాప్తంగా బలపడ్డ ప్రాంతీయ పార్టీలు

గతం



• కామరాజ్

చివరి జమిలి ఎన్నికలు

లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలపై ఇప్పుడు దేశంలో పెద్ద చర్చే నడుస్తోంది. కానీ మనకిదేమీ కొత్త కాదు. 1967 దాకా వరుసగా నాలుగు పర్యాయాలు దేశమంతటా ఇదే విధానంలో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు దీటైన ప్రతిపక్షం లేకపోవడంతో అక్కడా, ఇక్కడా పూర్తి పదవీకాలం పాటు ఆ పార్టీ ప్రభుత్వాలే రాజ్యమేలాయి. నెహ్రూ మరణానంతరం కాంగ్రెస్ కోటకు బీటలు మొదలయ్యాయి. ఇందిర సారథ్యంలో పార్టీ అస్మదీయ, తస్మదీయ వర్గాలుగా విడిపోయింది. దాంతో 1967 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బలం బాగా తగ్గిపోయింది. కేవలం 283 స్థానాలకే పరిమితమైంది. ఓట్ల శాతం కూడా 44.72 నుంచి 40కి తగ్గింది. ఏకంగా ఏడుగురు కేంద్ర మంత్రులు ఓటమి పాలయ్యారు. స్వతంత్ర పార్టీ ఏకంగా 44 చోట్ల గెలిచి లోక్‌సభలో అతి పెద్ద విపక్షంగా నిలిచింది. అఖిల భారతీయ జన్ సంఘ్ కూడా ఏకంగా 21 సీట్లు అదనంగా నెగ్గి బలాన్ని 35కు పెంచుకుంది. ప్రజా సోషలిస్ట్ పార్టీ 13 సీట్లకు పరిమితమైంది. 1964లో దాన్నుంచి చీలి జార్జ్ ఫెర్నాండెజ్ నేతృత్వంలో పుట్టుకొచ్చిన సంయుక్త సోషలిస్ట్ పార్టీ 23 సీట్లు గెలిచింది. సీపీఐ ఆరు సీట్లు కోల్పోయి 23కు పరిమితమైంది. సీపీఐ నుంచి ఆవిర్భవించిన సీపీఎం 19 చోట్ల గెలిచింది.

నాలుగో లోక్‌సభలో పార్టీల బలాబలాలు

(మొత్తం స్థానాలు 520)

పార్టీ	సీట్లు
కాంగ్రెస్	283
స్వతంత్ర పార్టీ	44
భారతీయ జన్ సంఘ్	35
డీఎంకే	25
సంయుక్త సోషలిస్ట్ పార్టీ	23
సీపీఐ	23
సీపీఎం	19
ప్రజా సోషలిస్ట్ పార్టీ	13
ఇతరులు	20
స్వతంత్రులు	35

9 రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు

లోక్‌సభతో పాటే జరిగిన అసెంబ్లీ ఎన్నికల విషయానికొస్తే సగం రాష్ట్రాల్లోనే కాంగ్రెస్‌కు స్పష్టమైన మెజారిటీ దక్కింది. యూపీలో ఎన్నికలైన నెల రోజులకే చరణ్‌సింగ్ కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల మద్దతుతో తాను సీఎంగా కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నుంచి నేతల బహిష్కరణలు, రాజీనామాలు ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి దారితీశాయి. పశ్చిమ బెంగాల్, బిహార్, ఒడిశాల్లో కాంగ్రెస్ మాజీలు వేరుకుంపటి పెట్టుకుని ఆ పార్టీని ఢీకొట్టారు. ఏకంగా 9 రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి! తమిళనాట డీఎంకే అధికారంలోకి వచ్చి ఈ ఘనత సాధించిన తొలి ప్రాంతీయ పార్టీగా నిలిచింది. మిగతా 8 రాష్ట్రాల్లో సంకీర్ణ ప్రభుత్వాలు కొలువుదీరాయి.

ఇందిర బహిష్కరణ



1969 నవంబర్ 12వ తేదీకి చరిత్రలో ప్రత్యేకత ఉంది. అదే రోజున ప్రధాని ఇందిరను కాంగ్రెస్ నుంచి బహిష్కరించారు! పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారని, వ్యక్తి ఆరాధనకు కేంద్రంగా మారారనే ఆరోపణలపై కాంగ్రెస్‌లోని ఇందిర వ్యతిరేక వర్గమైన 'సిండికేట్' ఈ చర్య తీసుకుంది. హిందీయేతర నాయకులతో, ముఖ్యంగా దక్షిణాది నేతలతో కూడిన ఈ వర్గంలో కీలక నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.నిజలింగప్ప తీసుకున్న ఈ సంచలన నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. సిండికేట్ వర్గానికి కామరాజ్ నాయకత్వం వహించారు. ఈ చర్యతో కాంగ్రెస్ రెండు ముక్కలైంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని 705 మందిలో 446 మంది ఇందిర వెంట నడిచారు. ఆమె సారథ్యంలో కాంగ్రెస్ (ఆర్), సిండికేట్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ (ఓ)గా పార్టీ చీలిపోయింది. లోక్‌సభలో మెజారిటీ కోల్పోయినా సీపీఎం, డీఎంకే, సీపీఐ దన్నుతో ఇందిర సర్కారు మనుగడ సాగించింది.

ఎన్నెన్నో విశేషాలు...

- 1967 లోక్‌సభ ఎన్నికల్లో 61.1 శాతం ఓటింగ్ పోలైంది. మన దేశంలో అప్పటిదాకా నమోదైన గరిష్ట పోలింగ్ ఇదే.
- ఐదేళ్ల కాలం పూర్తి చేసుకోని తొలి లోక్‌సభ కూడా ఇదే. 1970 డిసెంబర్లో 15 నెలల ముందే రద్దయింది.
- రెండు వరుస యుద్ధాలు, రెండేళ్లు వరుసగా వానలు మొహం చాటేయడంతో పంటల దిగుబడి 20 శాతానికి పైనే తగ్గి ఆహార ధాన్యాలు అడుగంటాయి.
- దిగుమతులకు చెల్లింపుల సామర్థ్యం మరింత క్షీణించింది. ఆహారం కోసం అమెరికా రుణ సాయం తీసుకోవాల్సి వచ్చింది.
- స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా డాలర్‌తో రూపాయి విలువను ఎన్నికల ముందు 4.76 నుంచి 7.5కి తగ్గించారు.
- హరిత విప్లవం ఊపందుకోవడంతో 1971 కల్లా పంటల దిగుబడి 35 శాతం పెరిగింది.
- రాష్ట్రాల సంఖ్య 27కు పెరిగింది. దాంతో లోక్‌సభ స్థానాలు 494 నుంచి 520కి పెరిగాయి.

వివాదాలకు కేరాఫ్
ఫైర్‌బ్రాండ్ మహువా



చిన్న కుక్క పిల్ల కస్టడీకోసం మాజీ సహచరునితో కావచ్చు.. పార్లమెంటులో ఏకంగా ప్రధాని మోదీతో కావచ్చు... మహువా మొయిత్రా అంటేనే పోరాటం. తెలివైన వ్యక్తి. ఆధునికంగా, ఆకర్షణీయంగా ఉంటారు. ఎక్కడ తప్పు జరిగినా ప్రశ్నిస్తారు. పార్లమెంటులో బలమైన స్వరం. ఎంపీగా ఎన్నికైన నాటినుంచే మోదీ ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారారు. ఆ క్రమంలో ఎన్నో వివాదాలకు కేంద్ర బిందువయ్యారు. అంతే వివాదాస్పద రీతిలో నోటుకు ప్రశ్నల కేసులో లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురయ్యారు కూడా.

కాంగ్రెస్‌లో మొదలై...

దాదాపు 15 ఏళ్ల క్రితం 'ఆమ్ ఆద్మీ కా సిపాహీ' ప్రచారానికి నాటి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఎంపిక చేసిన యువజన కాంగ్రెస్ నాయకురాలిగా తొలిసారిగా మీడియా దృష్టిని ఆకర్షించారు మహువా. 1974 అక్టోబర్ 12న అస్సాంలోని కచార్ జిల్లా లాబాక్‌లో జన్మించిన ఆమె అమెరికాలోని మసాచుసెట్స్‌లో మౌంట్ హోలియోక్ కాలేజీలో పై చదువులు చదివారు. అమెరికన్ మల్టీ నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జేపీ మోర్గాన్‌లో బ్యాంకర్‌గా న్యూయార్క్‌లో, లండన్‌లో పని చేశారు. 2009లో ఉద్యోగం వదిలి భారత రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలుత కాంగ్రెస్‌లో చేరినా 2010లో తృణమూల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2016 పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కరీంపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అసెంబ్లీలో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. 2019లో కృష్ణానగర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. అక్కడా అదే వాగ్ధాటి కొనసాగించారు. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో ప్రధాని మోదీ సంబంధం గురించి పదేపదే సభలో ప్రశ్నలు లేవనెత్తారు. ఈసారీ కృష్ణానగర్ నుంచే పోటీ చేస్తున్నారు...

పరిచయం

'కుక్కపిల్ల కస్టడీ' తో సీటుకే ఎసరు...

పెంపుడు కుక్కపిల్ల కస్టడీ వ్యవహారం పార్లమెంటు నుంచి మొయిత్రా బహిష్కరణకు దారితీసింది. మాజీ సహచరుడు జై అనంత్ దెహద్రాయ్ నుంచి తమ పెంపుడు కుక్కపిల్ల కస్టడీ కోరుతూ కోర్టుకెక్కారు. ప్రతిగా అదానీని టార్గెట్ చేస్తూ ప్రశ్నలడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి మొయిత్రా భారీగా లంచం, బహుమతులు తీసుకుంటున్నారంటూ సీబీఐకి ఫిర్యాదు చేశారు. వ్యవహారం పార్లమెంటు ఎథిక్స్ కమిటీ విచారణ దాకా వెళ్లింది. పార్లమెంట్ లాగిన్ ఐడీని ఇతరులతో పంచుకున్నందుకు ఆమెను దోషిగా తేల్చి 2023 డిసెంబర్ 8న లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేశారు.

కొత్త రోల్ మోడల్స్ కావాలి..

ఖరీదైన బూట్లు, బ్రాండెడ్ బ్యాగులు కొనడానికి తనకు లంచాలు అవసరం లేదంటూ ఆరోపణలను గట్టిగా తిప్పికొట్టారు మొయిత్రా. తనపై ఆరోపణలను భారత రాజకీయాల్లో ఇమిడి ఉన్న స్త్రీ ద్వేషంలో భాగంగా అభివర్ణించారు. ''నేను ప్రగతిశీల కుటుంబంనుంచి వచ్చాను. భారతీయ స్త్రీ ఇలాగే ఉండాలనే మూస పద్ధతిలో పెరగలేదు. తృణమూల్ ఓ మహిళ సారథ్యంలో ఉంది. మమత మహిళలను ప్రోత్సహిస్తారు. అందుకే ఆ పార్టీలో చేరా. పార్లమెంటులో సగం మంది మహిళా ఎంపీలు టీఎంసీ వాళ్లే. ఎందుకంటే బెంగాల్‌లో స్త్రీలను శక్తిగా భావిస్తాం. మెదడున్న, గా చదువుకున్న, ఆర్థిక అవగాహన, ఆత్మవిశ్వాసమున్న స్త్రీని సగటు భారతీయ పురుషుడు, నాయకుడు ఎదుర్కోలేడు'' అంటూ కుండబద్దలు కొడతారు. ప్రజా జీవితంలో ఉన్న మహిళలకు సరికొత్త రోల్ మోడల్స్ అవసరమంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పొత్తు చిత్తే!

చంద్రబాబు, పవన్, పురందేశ్వరి సైసై.. స్థానిక నేతలు నైనై

- ➔ సీట్ల కేటాయింపును తప్పు పడుతున్న మూడు పార్టీల శ్రేణులు
- ➔ చంద్రబాబు, పవన కల్యాణ్‌లు తమను మోసం చేశారని సీట్లు రాని నేతల ఆవేదన
- ➔ అన్ని నియోజకవర్గాల్లోనూ మూడు పార్టీలు కలవడం కల్లే
- ➔ బీజేపీ, జనసేన శ్రేణులు టీడీపీ సభలకు దూరం
- ➔ జనసేన, బీజేపీ పోటీలో ఉన్న చోట ముఖం చాటేస్తున్న టీడీపీ నేతలు
- ➔ తెనాలిలో పవన్ కల్యాణ్ సభకు దూరంగా ఆలపాటి రాజా
- ➔ బాలకృష్ణ యాత్రలో కనిపించని బీజేపీ, జనసేన నేతలు
- ➔ ఆ ముగ్గురి ఆరాటమే తప్ప క్షేత్ర స్థాయిలో అమలు కాని పొత్తు
- ➔ ఇలాగైతే ఓట్ల బదిలీ సాధ్యం కాదంటున్న విశ్లేషకులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఓట్ల బదిలీ జరిగే అవకాశాలు కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదు. పేరుకు మాత్రమే ఈ మూడు పార్టీలు పొత్తు పెట్టుకున్నప్పటికీ.. నేతలు, కార్యకర్తల మధ్య ఏ దశలోనూ పొసగడం లేదు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పిఠాపురంలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్నా, టీడీపీ పూర్తిగా సహకరించడం లేదు. అక్కడ టీడీపీ ఇన్‌ఛార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ.. క్యాడర్ ఎవరూ జనసేనకు సహకరించకుండా కట్టడి చేసి తానొక్కడే పవన్ కల్యాణ్ వద్దకు వెళుతూ ఆయన కోసం పని చేస్తున్నట్లు బిల్డప్ ఇస్తున్నారు. కిందిస్థాయిలో టీడీపీ కేడర్ కూడా జనసేన పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉంది. తమ సీటును తాడూ బొంగరం లేని పార్టీ ఎగరేసుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీటును అన్యాయంగా జనసేనకు వదిలేసి సిగ్గు లేకుండా తిరుగుతున్నారని ఇటీవల వర్మను ఒక గ్రామంలో టీడీపీ కార్యకర్తలు నిలదీసి వెళ్లగొట్టారు. కోనసీమ జిల్లాలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పి.గన్నవరం, అమలాపురంలో సంయుక్తంగా నిర్వహించిన సభలకు జనం రాలేదు. రావులపాలెంలో నిర్వహించిన సభకు 3 వేల మంది కూడా రాలేదు.

కూటమి తొలి సభే తుస్సు

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఫిబ్రవరి 28న జరిగిన కూటమి తొలి సభే తుస్సుమంది. ఆ సభకు 6 లక్షల మంది జనం వస్తారని హంగామా చేసినా, వచ్చింది వేలల్లోనే. కార్యకర్తల కోసం కేటాయించిన గ్యాలరీల్లో సభ ప్రారంభం నుంచి చివరి వరకు సగం పైగా ఖాళీగానే ఉండిపోయాయి. ఈ నెల 5న నరసాపురం, పాలకొల్లులో చంద్రబాబు నిర్వహించిన కూటమి సభలు పేలవంగా జరిగాయి. పాలకొల్లు సభలో చంద్రబాబు జనసేన రాష్ట్ర నేత బన్నీ వాసును ప్రచార రథం ఎక్కనీయక పోవడంతో ఆయన అలిగి వెళ్లిపోయారు.

తణుకులో బాబు, పవన్‌ల నిలదీత

ఈ నెల 10వ తేదీన తణుకులో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను జనసేన పార్టీల నేతలు అడ్డుకుని నిలదీశారు. ఆశించిన స్థాయిలో జనం రాకపోగా, నిలదీతతో ఇద్దరు నేతలు ఖంగుతిన్నారు. తనకు ప్రకటించిన సీటును టీడీపీకి వదిలేశారని ఆగ్రహంతో ఉన్న జనసేన ఇన్‌చార్జి ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు సభకు గైర్హాజరవ్వగా ఆయన అనుచరులు సభా వేదిక వద్దకు చేరుకుని ప్లకార్డులతో నిరసన తెలిపారు. అక్కడే టీడీపీ, జనసేన కార్యకర్తలు తోపులాటకు దిగారు. గుంటూరు జిల్లా తాడికొండలో చంద్రబాబు నిర్వహించిన సభలో జనసేన నాయకులను ప్రచార వాహనం పైకి ఎక్కించి బీజేపీ నేతలను పక్కకు తోసివేశారు. తెనాలిలో పవన్‌కళ్యాణ్ సభకు అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజా డుమ్మా కొట్టి నాదెండ్ల మనోహర్ కోసం తాను పని చేసేది లేదని చెప్పకనే చెప్పారు.

ప్రధాని మోదీ వచ్చిన సభే విఫలం

గత నెల 17వ తేదీన చిలకలూరిపేటలో ప్రధాని మోదీ హాజరైన కూటమి సభ విఫలమవడం పొత్తు పరిస్థితిని తేటతెల్లం చేస్తోంది. ఎంత ప్రయత్నించినా జనం అనుకున్న స్థాయిలో రాకపోగా సభను నిర్వహించడంలో టీడీపీ నేతలు విఫలమవడంతో అడుగడుగునా అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో మోదీ.. టీడీపీ నేతలపై అసహనం వ్యక్తం చేశారు. ఈ నెల 6న చంద్రబాబు క్రోసూరు, సత్తెనపల్లిలో చేపట్టిన ప్రజాగళం సభల్లో జనసేన, బీజేపీ నేతలు కనిపించలేదు. సత్తెనపల్లి సభ జనం లేక అట్టర్‌ఫ్లాప్ అయ్యింది.

చంద్రబాబు కాళ్లబేరం.. బీజేపీ నేతలతో తిట్లు తిని పవన్ కల్యాణ్‌లు కుదుర్చుకున్న పొత్తు కింది స్థాయిలో ఎక్కడా పొసగడం లేదు. వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక కలిసిన మూడు పార్టీలకు జనంలోనే కాదు ఆయా పార్టీల్లోనూ నిరాదరణే ఎదురవుతోంది. ఆ పార్టీల అగ్ర నేతల హడావుడే తప్ప, కింది స్థాయిలో ఎక్కడా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలిసి పని చేస్తున్న దాఖలాలు కనిపించడం లేదు.

సీట్లు దక్కని నేతలు తమ నియోజకవర్గాల్లో కూటమి తరఫున పని చేసేందుకు ఏమాత్రం ఇష్టపడడం లేదు. చంద్రబాబు సభలు పెట్టినా, వారు ఆ ఛాయలక్కూడా వెళ్లడం లేదు. ఆయన విశాఖలో ఎన్నికల ప్రచారం నిర్వహించినా మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దూరంగా ఉన్నారు. తెనాలిలో పవన్ కల్యాణ్ నిర్వహించిన సభకు అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆలపాటి రాజా డుమ్మా కొట్టారు.

చంద్రబాబు సభల్లో చాలా చోట్ల బీజేపీ, జనసేన నాయకులను వేదికపైకి రానివ్వడం లేదు. ఆ పార్టీల అభ్యర్థులు ఉన్నచోట మొక్కుబడిగా పిలుస్తున్నా మిగిలిన నియోజకవర్గాల్లో వారిని దరిదాపుల్లోకి సైతం రానీయడం లేదు. టీడీపీ అభ్యర్థులున్న చోట్ల బీజేపీ, జనసేన నాయకులను పట్టించుకోవడంలేదు.

అనంతపురం జిల్లాలో బాలకృష్ణ చేపట్టిన యాత్రలో జనసేన, బీజేపీ జాడే కనిపించడం లేదు. మరోవైపు చంద్రబాబు ఒక్కడే నిర్వహిస్తున్న సభలతోపాటు పవన్ కల్యాణ్, పురందేశ్వరి కలిసి నిర్వహిస్తున్న కూటమి సభలు కూడా అట్టర్‌ఫ్లాప్ అవుతున్నాయి. ఆ సభలకు జనం రావడం గగనమవుతోంది. దీంతో చంద్రబాబు ఒక్కడే వచ్చినా, కూటమిగా వచ్చినా ప్రయోజనం మాత్రం శూన్యమేనని ఇట్టే తెలుస్తోంది.

నాయకులే కలవనప్పుడు ఇక ఆ పార్టీల మధ్య ఓట్ల బదిలీ ఎలా జరుగుతుందన్నది విశ్లేషకుల ప్రశ్న.

అంతటా అదే తీరు

- ఉమ్మడి విశాఖ జిల్లా గాజువాకలో ఈ నెల 14న చంద్రబాబు నిర్వహించిన సభకు బీజేపీ నేతలు హాజరు కాలేదు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర రెడ్డి సహా జిల్లా నాయకులెవ్వరూ హాజరవకపోవడం చర్చనీయాంశమైంది. కూటమి పార్టీల నాయకుల జాడ కూడా కనిపించలేదు. చంద్రబాబు పర్యటనకు పెందుర్తి సీటు దక్కని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి దూరంగా ఉన్నారు. చివర్లో చంద్రబాబు ఆయన్ను పిలిపించుకుని మాట్లాడినా బండారు శాంతించలేదు.
- తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో చంద్రబాబు సభలు ఆశించిన స్థాయిలో జరగలేదని టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. కొవ్వూరులో జరిగిన సభలో కూటమి నాయకులు కనిపించలేదు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో జరిగిన సభకు బీజేపీ, జనసేన నేతలు వెళ్లలేదు. ఈ నెల 10వ తేదీన నిడదవోలులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హాజరైన సభకు



ప్రచారం చేయాలని బండారును ఆదేశిస్తున్న బాబు

జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్‌ను ప్రచార వాహనం పైకి పిలిచి ఆ సీటును త్యాగం చేసిన టీడీపీ నేత బూరుగుపల్లి శేషారావును మాత్రం పట్టించుకోలేదు. దీంతో శేషారావు అనుచరులు గొడవకు దిగారు.

- నెల్లూరు జిల్లా కావలిలో గత నెల 29న చంద్రబాబు.. బీజేపీ, జనసేనలతో కలిసి నిర్వహించిన బహిరంగ సభ జనం లేక వెలవెలబోయింది. జనం లేకపోవడంతో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన సభ నాలుగు గంటలు ఆలస్యంగా జరిగింది. అప్పటి వరకు చంద్రబాబు బస్సులోనే ఉండిపోయారు. ఈ నెల 29న ఉదయగిరిలో జరిగిన సభకు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు గైర్హాజరయ్యారు.
- కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో గత నెల 31న చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన సభకు టీడీపీ అభ్యర్థి జయ నాగేశ్వరరెడ్డి.. బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఎవ్వరినీ ఆహ్వానించ లేదు. కర్నూలులోనూ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్.. కూటమి పార్టీలను పట్టించుకోకుండా ఒంటరిగానే ప్రచారం నిర్వహిస్తున్నారు.
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూటమి సమావేశాలు తూతూ మంత్రంగా సాగుతున్నాయి. స్వయంగా చంద్రబాబు, బాలకృష్ణ ఆయా నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నా.. బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎక్కడా కనిపించడం లేదు. గత నెల 28న చంద్రబాబు రాప్తాడులో నిర్వహించిన సభలో బీజేపీ ఊసే లేదు. శింగనమల నియోజకవర్గం బుక్కరాయసముద్రం సభలోనూ బీజేపీ వాళ్లు ఎవరూ లేరు. తమకు ఆహ్వానం లేదని స్థానిక జనసేన నేతలు ఆగ్రహం వ్యక్తం చేసి, సభకు దూరంగా ఉన్నారు.

టీడీపీ తీరుపై జనసేన, బీజేపీ నేతల ఆగ్రహం

బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు మూడు ప్రజాగళం సభలు జరగ్గా ఒక్కటీ విజయవంతం కాలేదు. బాపట్ల, వేమూరు, రేపల్లెలో జరిగిన సభలకు జనం కరువయ్యారు. ఆ సభలకు జనసేన, బీజేపీ నేతలు ఒకరిద్దరిని ప్రచార వాహనంపైకి పిలవడమే తప్ప కార్యకర్తలు ఎక్కడా కనిపించ లేదు. టీడీపీ తమకు సభల గురించి చెప్పడం లేదని, అస్సలు తమను పట్టించుకోవడం లేదని జనసేన, బీజేపీ నేతలు వాపోతున్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో గత నెల 31న జరిగిన చంద్రబాబు సభలో పెట్టిన ఫ్లెక్సీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేరు లేకపోవడంతో ఆ పార్టీ నేతలు గొడవకు దిగారు.

గుసగుస

బాబుకు గృహస్థాశ్రమమే!

చంద్రబాబుకు మరో ఐదేళ్లు గృహస్థాశ్రమం తప్పదట. జ్యోతిష్యులు, న్యూమరాలజీ నిపుణులు దీన్నే ఉద్ఘాటిస్తున్నారు. బాబు జాతక రీత్యా ఐదేళ్లు అధికారంలో ఉంటే.. తర్వాతి పదేళ్లు ప్రతిపక్షంలో ఉండాల్సిందేనట. దీనికి వారు చెప్తున్న మాటలతోపాటు, లాజిక్కులు పరిశీలిస్తే నిజమే కదా! అనిపిస్తున్నాయి. తొలిసారిగా చంద్రబాబు 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, గద్దెనెక్కారు. 1999 ఎన్నికల్లో ఎన్డీయేతో కలిసి గెలుపొందారు. తర్వాత 2004, 2009 ఎన్నికల్లో చతికిలపడి, పదేళ్ల విరామం ఇచ్చారు. మళ్లీ 2014లో బూటకపు హామీలు, అనైతిక పొత్తులతో గద్దెనెక్కారు. 2019లో చరిత్ర ఎరుగని దారుణ ఓటమి చవిచూశారు. దీంతో పదేళ్ల విరామం పాటించే బాబుకు 2024లో కూడా భంగపాటు తప్పదని జ్యోతిష్యులు, న్యూమరాలజీ నిపుణుల ఉవాచ.



కూటమి తాటతీస్తారు

బీకామ్‌లో ఫిజిక్స్.. ఎందుకుండదు? ఉంటది.. ఉంటది. ఈ మాటలు వింటే చాలు.. పేరు చెప్పనక్కర్లేదు. పలు పార్టీలు మారి టీడీపీలో చేరిన జలీల్‌ఖాన్‌కు పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న బీజేపీ నేత సుజనా చౌదరి కోసం ప్రచారంలో దిగారు. తాజాగా విజయవాడ పశ్చిమలో నిర్వహించిన కూటమి విస్తృత స్థాయి సమావేశంలో సుజనా, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని కోసం మాట్లాడుతుండగా వారిద్దరూ గుసగుసలాడుకుంటున్నారు. దీంతో చిర్రెత్తిన జలీల్ 'హలో ఎంపీగారు, ఎమ్మెల్యే గారు.. మీటింగండీ ఇది.. రహస్యాలుంటే ఇంటికెళ్లి మాట్లాడుకోండ'ంటూ చురకంటించారు. అంతటితో ఆగకుండా 'ముస్లింలు, కాపులు వచ్చారు.. తిక్కలేస్తే తాటతీస్తారంటూ'.. కూటమి పొత్తులపై ఆ రెండు సామాజిక వర్గాల వ్యతిరేకతను బయటపెట్టారని పార్టీ శ్రేణులు గుసగుసలుపోతున్నాయి.

సీటు 'చిర్రి'గిపోతోంది

పోలవరంలో జనసేన నేత చిర్రి బాలరాజు బాధ పగవాడిక్కూడా రాకూడదని ఆయన అనుచరులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా టీడీపీని కాపాడుకుంటూ వచ్చిన బొరగం శ్రీనివాసుల్ని కాదని కూటమి పొత్తుల్లో ఈ సీటును జనసేనకు కేటాయించారు. కాంగ్రెస్ సీనియర్ నేత కరాటం రాంబాబు దన్నుగా ఉండి చిర్రికి సీటు ఇప్పించారట. ఆయనకు సీటు ఖరారైనప్పటి నుంచి టీడీపీ వర్గం సైలెంటయిపోయింది. సీటు మార్చాలని అధిష్టానానికి పదేపదే విన్నవిస్తున్నారు. ఇక్కడ బీజేపీ ప్రభావం కూడా నామమాత్రమే. జనసేన యూత్ మినహా మరెవరూ బాలరాజుకు కలిసి రావట్లేదు. దీంతో చిర్రికి సీటు చిరగడం ఖాయమని టీడీపీ శ్రేణులు ప్రచారం చేస్తున్నాయట.



ఉండి టికెట్‌పై రూ.2 కోట్ల బెట్టింగ్

గోదావరి జిల్లాల్లో బెట్టింగ్‌కు కాదేదీ అనర్హం. కోడి పందేల నుంచి క్రికెట్, రాజకీయాల వరకు ప్రతీదీ జూదమే. తాజాగా ఉండి అసెంబ్లీ టీడీపీ టికెట్‌పై జరిగిన బెట్టింగ్ హాట్ టాపిక్‌గా మారింది. ఉండి ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన కలవపూడి శివకు కాకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజు(రాంబాబు)కు చంద్రబాబు టికెట్ ప్రకటించారు. దీంతో కలవపూడి 'శివ'తాండవం ఆడేశారు. తనకు దక్కని టికెట్ రాంబాబుకు దక్కడంతో రెబల్‌గా బరిలో దిగి, అతన్ని ఓడించి తీరతానని చెప్తున్నారు. అయితే ఉండి టికెట్ రాంబాబుకూ దక్కదని శివ అనుయాయులు కొత్తగా ప్రచారానికి తెరలేపారు. అది కూడా కనుమూరు రఘురామకృష్ణరాజు పేరు పరిశీలనకు రాకముందే ఈ సీటుపై బెట్టింగ్‌లు జరిగాయి. కలవపూడి శివకు బలమైన ఫాలోవర్, ఉండికి చెందిన పశువుల వ్యాపారి ఒకరు రాంబాబుకూ సీటు దక్కదని రూ.2 కోట్లు పందెం కాశాడట. తాజాగా రఘురామ పేరును ఉండి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించనున్నట్లు బలమైన సంకేతాలు రావడంతో ఈ రూ.2 కోట్ల బెట్టింగ్ విషయంపై జోరుగా చర్చ జరుగుతోంది. దీంతో సరిసర్లే.. శివకు టికెట్ రాకపోయినా ఆయన అనుచరుడికి బెట్టింగ్ సొమ్ము వస్తుందని.. జోకులు పేలుతున్నాయి.

పిఠాపురం: ఫలితం ఏదైనా వర్మకు వేదనే

అనుమానపు చూపులు



- గెలిస్తే తన బలమంటూ పవన్ గొప్పలు
- ఓడితే మాజీ ఎమ్మెల్యే వెన్నుపోటని ముద్ర
- ఏం జరిగినా వర్మకు రాజకీయ సమాధే..
- కేడర్‌తో మమేకం కాని జనసేనాధిపతి
- కొందరు నచ్చజెప్పగా రోజుకు 200 మందితో సెల్ఫీలకు సమ్మతి
- ఇప్పుడే ఇలాగుంటే రేపటి మాటేమిటంటున్న స్థానికులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ పడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ గెలుపు ఓటముల సంగతి ఎలా ఉన్నా.. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు రాజకీయంగా సమాధే అనే అభిప్రాయం ఆయన అనుచరవర్గం నుంచే వినిపిస్తోంది. ఒకవేళ విజయం సాధిస్తే అదంతా తన బలమేనని పవన్ గొప్పలు పోవడం గ్యారంటీ. ఓటమి పాలైతే వర్మ వెన్నుపోటు పొడిచారనే నెపం నెట్టేస్తారు. ఫలితం ఏదైనా తమ నాయకునికి రాజకీయ భవిష్యత్తు శూన్యంగా కనిపిస్తోందని వర్మ వర్గీయులు బలంగా భావిస్తున్నారు. ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి పవన్, వర్మల మధ్య సఖ్యత వీధుల్లో మాత్రమే కనిపిస్తోందని, అంతర్గతంగా ఎన్నెన్నో ఉన్నాయని జనసేన నాయకులు చెబుతున్నారు. పవన్ కల్యాణ్ 2019లో గాజువాక, భీమవరం నియోజకవర్గాల నుంచి పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన టీసీ నాగిరెడ్డి (గాజువాక) చేతిలో 16,753 ఓట్లు, గ్రంధి శ్రీనివాస్ (భీమవరం) చేతిలో 8,357 ఓట్ల తేడాతో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. తాజా ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చే యబోతున్నట్లు చివరినిమిషం వరకు కలరింగ్ ఇచ్చారు. టీడీపీ, బీజేపీలతో కలిసి జనసేన ఉమ్మడిగా ఎన్నికలకు వెళుతుండటం, తన సామాజిక వర్గీయులైన కాపుఓటర్లు అధికంగా ఉన్నందున పవన్ పిఠాపురం అసెంబ్లీ స్థానాన్ని ఎంచుకుని పోటీకి దిగారు. ఇక్కడి నుంచి 2014లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 47,080 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఎస్వీఎస్ఎన్ వర్మ 2019లో టీడీపీ తరఫున పోటీ చేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెండెం దొరబాబు చేతిలో 14,992 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అప్పటి నుంచీ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న వర్మను పొత్తుల మాటున పక్కకు నెట్టి పవన్ కల్యాణ్ సీటు చేజిక్కించుకున్నారు.

మాటపై నిలబడతారా?

అసెంబ్లీ సీటు చేజారడంతో జనసేనకు సహకరించే ప్రసక్తే లేదని, అనుయాయుల సహకారంతో మళ్లీ ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగుతానని బీరాలు పోయిన వర్మతో బాబు మంతనాలు జరిపి.. పవన్‌కు సహకరించేందుకు సమ్మతింపజేసిన సంగతి విదితమే. అన్యమనస్కంగానే ప్రచారంలోకి దిగిన తమ నేతతో ఎనలేని సఖ్యతను నటిస్తూ ఎన్నికల వరకూ సర్వం నీ చేతుల మీదుగానే సాగాలని అభిలషిస్తున్నట్టుగా పవన్ పోకడలు ఉంటున్నాయని వర్మ అనుచరగణం అంటోంది. వాస్తవంగా జనసేన, టీడీపీ వ్యవహారాలు ఆ దిశగా లేవనేది క్షేత్ర స్థాయిలో పరిశీలకుల విశ్లేషణ. మరోవైపు మిత్రపక్షంలోని బీజేపీది పిఠాపురంలో నామమాత్రపు పాత్రేనని అంటున్నారు. ఈ పరిస్థితిలో వర్మ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. పవన్ గెలుపు ఓటముల్లో ఏదైనా సరే తనకు సంకట స్థితేనని ఈ మాజీ ఎమ్మెల్యే తన ముఖ్య అనుయాయుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. పవన్‌ది మాటపై నిలబడే తత్వం కాదని అనేక అంశాల్లో ఇప్పటికే నిర్ధారణయ్యింది. నాగిని నృత్యంలా ఆయన నాలుక ఎన్ని వంకర్లయినా తిరుగుతుంది. అవసరానికి వాడుకుని ఎన్నికలయ్యాక తూచ్.. నీకూ నాకూ చెల్లు అనడన్న గ్యారంటీ ఏమిటి? అనే ప్రశ్నను విజయవాడలో టీడీపీ ముఖ్య నాయకుని వద్ద వర్మ వ్యక్తం చేశారు.

తర్వాత పిఠాపురం వైపు చూస్తారా?

ఎన్నికలయ్యాక పవన్ పిఠాపురం వైపు చూస్తారా అనే అనుమానాలు జనసేనతో పాటు టీడీపీ క్యాడర్‌లోనూ లేకపోలేదు. 2019 ఎన్నికల్లో ఓడిన తర్వాత రెండు పర్యాయాలు మాత్రమే ఆయన గాజువాక వచ్చారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసనకు సంఘీభావం తెలిపేందుకు ఓసారి, పార్టీ నాయకులతో సమావేశానికి మరోసారి వచ్చారు. భీమవరానికి కూడా అంతే. పార్టీ నాయకులతో సమావేశానికి ఓ రోజు, వారాహి యాత్రలో భాగంగా మూడు రోజులు ఉంటానని చెప్పి, రెండు రోజులకు పరిమితమయ్యారు. నామమాత్రంగా పార్టీ సమావేశం కానిచ్చేసిన పవన్.. తక్కిన సమయాన్ని బ్రో సినిమా ట్రైలర్ డబ్బింగ్ పనికి వినియోగించుకున్నారు. 2023లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన జనసేన అధినేత.. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో 2024 ఫిబ్రవరి 21న ముఖ్య నాయకులను కలుసుకునేందుకు మరోమారు వచ్చారు.

పోటీ అంత సేఫ్ ఏమీ కాదు

పోటీకి పిఠాపురాన్ని ఎంచుకున్నప్పటికీ అదంత సేఫ్ సీటేమీ కాదనే అనుమానాలు పవన్ వర్గంలో లేకపోలేదు. ఇదివరకే సొంత జిల్లాలోని భీమవరం నుంచి పవన్ ఓటమి చెందగా, ఆయన సోదరుడు చిరంజీవి సైతం సొంత నియోజకవర్గమైన పాలకొల్లులో బి.ఉషారాణి చేతిలో పరాభవం చవిచూశారు. మరో సోదరుడైన నాగబాబు సైతం నరసాపురం లోక్‌సభ అభ్యర్థిగా ఓడారు. వీటన్నింటినీ పరిశీలిస్తే గోదావరి జిల్లాలు కొణిదెల కుటుంబానికి సానుకూలం కాదనేది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. కాగా, పవన్ కల్యాణ్ ధోరణికి పిఠాపురం నియోజకవర్గం ఓటర్లు ముక్కున వేలేసుకుంటున్నారు. సినిమా యాక్టర్, ఎమ్మెల్యే అభ్యర్థి అయిన పవన్‌ను కలవాలనుకునే వారికి ఏమాత్రం సాధ్యపడటం లేదు. ఈ విషయమై కొందరు నచ్చజెప్పగా ముందుగా నిర్ణయించిన వారిలో రోజుకు 200 మందికి సెల్ఫీలు దిగే అవకాశం ఇస్తానని సెలవిచ్చారట. అదీ ఆయన నెల రోజుల పాటు నియోజకవర్గంలో నిలకడగా ఉన్న పక్షంలో 6000 మందిని కలుసుకోగలరన్న మాట. లేదంటే అదీ లేదు. ఇప్పుడే ఇలాగైతే ఎన్నికల తర్వాత తమ పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

గీత.. పక్కా లోకల్

పవన్‌కు పోటీదారైన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వంగా గీత విద్యాభ్యాసం అనంతరం టీడీపీలో చురుకుగా ఉంటూ జెడ్పీ చైర్‌పర్సన్‌గా, రాజ్యసభ సభ్యురాలిగా, ఎమ్మెల్యే (ప్రజారాజ్యం)గా, లోక్‌సభ సభ్యురాలిగా పిఠాపురం నియోజకవర్గంలో విస్తృత పరిచయాలు కలిగి ఉన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా వంగా గీతను 'మా అమ్మాయి' అని చెప్పుకునేంతగా అందుబాటులో ఉంటూ కలిసిపోతారని, ఆమెతో పోటీ పడటం అంత సులువు కాదని టీడీపీ, జనసేన పార్టీల ముఖ్యులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రజారోగ్యానికి పూర్తి భరోసా

- ➔ 2019కు ముందు ప్రభుత్వాస్పత్రుల్లో దారుణమైన పరిస్థితులు
- ➔ సరిపడా వైద్యులు, నర్సులు లేక ఆయాలే ప్రసవాలు చేసిన దుస్థితి
- ➔ సీఎం జగన్ వచ్చాక పెద్ద ఎత్తున పోస్టుల భర్తీతో మెరుగుపడ్డ వైద్య సేవలు
- ➔ కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో వైద్య రంగ విస్తరణకు అవకాశం
- ➔ ఆరోగ్యశ్రీ బలోపేతంతో నిరుపేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం
- ➔ ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష ముఖ్యమంత్రి చలవే
- ➔ ఆస్పత్రులకు పుష్కలంగా మందులు, సర్జికల్స్, వైద్య పరికరాలు
- ➔ 'సాక్షి' ఇంటర్వ్యూలో వైద్య విద్య మాజీ అదనపు సంచాలకుడు డాక్టర్ విఠల్‌రావు

సాక్షి, అమరావతి:





గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య రంగంలో సమూల మార్పులు వచ్చాయని వైద్యవిద్య పూర్వపు అదనపు సంచాలకులు (ఏడీఎంఈ) డాక్టర్ నత్తా శ్రీనివాస విఠల్‌రావు చెప్పారు. 2019కు ముందు ప్రభుత్వాస్పత్రుల్లో పరిస్థితులు ఎంతో అధ్వానంగా ఉండేవని, **అప్ప**టితో పోలిస్తే ఇప్పుడు ఆస్పత్రులు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నుంచి ఏడీఎంఈ వరకూ వివిధ హోదాల్లో 35 ఏళ్ల పాటు వైద్య శాఖలో పనిచేసిన తాను ఎన్నడూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఇంత ప్రాధాన్యత ఇవ్వడం చూడలేదన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా లేకుండా పెద్ద ఎత్తున నియామకాలు, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ బలోపేతం, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్యానికి పూర్తిస్థాయిలో భద్రత కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్ పాలనలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ రంగంలో వచ్చిన మార్పులు, వాటి ఫలితంగా మెరుగుపడిన వైద్య సేవలు తదితర అంశాలపై విఠల్‌రావు తన అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి


● ప్రధాని మోడీతో పాయల్

న్యూస్‌మేకర్

నంబర్ 1 మహిళా గేమర్


● పాయల్ ధారే

ఇటీవల ప్రధాని మోదీ దేశంలో టాప్ ఫాలోయింగ్ ఉన్న ఏడుగురు గేమర్స్‌ను కలిశారు. వారిలో ఒక్కతే అమ్మాయి పాయల్ ధారే. గేమ్స్‌ను ఆడుతూ తన వ్యాఖ్యానం వినిపిస్తూ 'లైవ్ స్ట్రీమింగ్' ద్వారా 35 లక్షల మంది ఫాలోయెర్లను సంపాదించుకున్న పాయల్ పురుషుల ఆధిపత్య రంగమైన గేమింగ్‌లో తనదైన స్థానం పొందారు. పాయల్ పరిచయం.

వీడియో గేమ్స్ అనగానే మూడు విధాలైన భాగస్వాములు ప్రస్తావనకు వస్తారు. 1. గేమ్స్ ఆడేవాళ్లు 2. చలామణిలో ఉన్న గేమ్స్‌ను ఆడుతూ తమ వ్యాఖ్యానం వినిపిస్తూ (లైవ్ స్ట్రీమింగ్) వీడియోలు చేసేవారు, 3. గేమ్స్ తయారు చేసే వారు. మన దేశంలో 2014 తర్వాత సెల్‌ఫోన్‌ల అందుబాటు పెరిగాక గేమ్స్ ఆడేవాళ్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. అయితే వారితోపాటు గేమ్స్ చుట్టూ షోస్ చేసేవారి (గేమర్స్) పలుకుబడి కూడా పెరిగింది. వీరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌గా మారారు. ఇక ఒరిజినల్‌గా మన దేశంలో గేమ్స్ తయారు చేసేవారు పై రెండు వర్గాలతో పోల్చితే తక్కువ. ఇటీవల ప్రధాని మోడి గేమ్స్ ద్వారా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా మారిన 7 మంది గేమర్స్‌ను న్యూఢిల్లీలో కలిసి వారితో మాటామంతి జరిపారు. తీర్థ్ మిత్ర, అనిమేష్ అగర్వాల్, అన్షు బిష్త్, నమన్ మాథుర్, మిథిలేష్, గణేష్ గంగాధర్ అనే యువ గేమర్‌లతోపాటు వీరితో పాల్గొన్న ఒకే ఒక మహిళా గేమర్ పాయల్ ధారే.

15000 మంది గేమర్స్

మన దేశంలో 15 వేల మంది గేమర్స్ ఉన్నారు. అంటే వీడియో గేమ్స్‌ను ఆడుతూ వాటిని వివరిస్తూ వాటిపై వ్యాఖ్యానం చేస్తూ ఇన్‌స్టా, యూట్యూబ్ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా పాపులర్ అయిన వారు. ఇలాంటి వారిలో అత్యంత ఆదరణ పొందిన వారికి లక్షల మంది ఫాలోయెర్స్ ఉంటారు. ఇదంతా గేమింగ్ కమ్యూనిటీ. గేమ్స్ చుట్టూ వీడియోలు చేసేందుకే మన దేశంలో దాదాపు 1500 స్టుడియోలు కూడా ఉన్నాయి. గేమ్స్‌ను స్వయంగా తయారు చేసే సాంకేతిక నైపుణ్యం లేని వారు కూడా ఉన్న గేమ్స్ ద్వారా పాపులర్ అవుతున్నారు. పాయల్ ధారే కూడా అలా పేరు పొందింది.

సంవత్సరానికి 5 కోట్లు

23 ఏళ్ల పాయల్ ధారేకు 'పాయల్ గేమింగ్' అనే యూట్యూబ్ చానల్ ఉంది. ఈ చానల్‌లో ఆమె వీడియో గేమ్స్ ఆడుతూ తన సరదా వ్యాఖ్యానంతో వీడియోలు చేసి పెడుతుంటుంది. మార్కెట్‌లో బాగా ట్రెండ్ అవుతున్న గేమ్స్‌ను పరిచయం చేయడం లేదా ఆడటం వల్ల, సరదా వ్యాఖ్యానం చేయడం వల్ల గేమ్స్ అంటే ఇష్టం ఉన్న యువత అంతా ఈమె వీడియోలు ఫాలో అవుతుంటారు. దానివల్ల ఆమెకు సంవత్సరానికి రూ. 5 కోట్ల ఆదాయం అందుతోందని ఒక అంచనా. ఆశ్చర్యం ఏమంటే ఇంటర్ చదివే వరకూ కూడా పాయల్‌కు సెల్‌ఫోన్ లేదు. గేమ్స్ తెలియదు.

పల్లెటూరి అమ్మాయి

పాయల్ ధారేది మధ్యప్రదేశ్‌లోని చింద్వారా అనే చిన్న పల్లె. ఫోన్ కూడా చూడని ఆ అమ్మాయి 2021లో లాక్‌డౌన్ సమయంలో గేమ్స్ గురించి తెలుసుకుంది. ఆ సంవత్సరమే తన వీడియోలు రిలీజ్ చేయసాగింది. 2023 నాటికి అంటే కేవలం రెండేళ్లలో విపరీతమైన ఫాలోయింగ్ పొందింది. 'మా అమ్మ నేను గేమింగ్‌లోకి వెళతానంటే భయపడింది. మా నాన్న ప్రోత్సహించారు. వీడియో గేమింగ్‌లో ఆడపిల్లలకు అంత సులువుగా ప్రవేశం లభించదు' అంటుంది పాయల్. ఇప్పుడు తనను చూసి కనీసం 200 మంది అమ్మాయిలు గేమింగ్‌లోకి వచ్చారని తెలిపింది.

మంచి మార్గం కోసం

'గేమ్స్‌ను తప్పించలేము. యువతకు మంచి లక్ష్యాలను ఏర్పరడానికి వీటిని మీరు ఉపయోగిస్తూ వారిని ఇన్‌ఫ్లుయెన్స్ చేయండి' అని ప్రధాని గేమర్స్‌ను కోరారు. 'మన పంచతంత్రం వంటి కథలను గేమ్స్‌కు వాడండి. పర్యావరణ సమస్యలు, స్వచ్ఛభారత్ వంటి అంశాలతో గేమ్స్ తయారు చేస్తే ఇండియన్ సంస్కృతి ఉన్న గేమ్స్ తయారు చేస్తే ఆటకు ఆట, బోధనకు బోధన సమకూరుతాయి' అని ప్రధాని అన్నారు.

చదువుకు తగిన సమయం ఇస్తూ, ఒకవేళ ఏదైనా ఉపాధి ఉంటే ఆ ఉపాధి, ఉద్యోగాల్లో ఉంటూ జీవనానికి తగు గ్యారంటీ ఉన్నప్పుడు గేమింగ్‌లోకి వచ్చి ఆ రంగంలో నిలదొక్కుకోవాలని గేమర్స్‌కు సూచించారు.

బ్యూటిప్స్

పెసరతో మెరుపు

మేనికి పెసరపిండి వాడితే చర్మకాంతి ఇనుమడిస్తుంది. పెసలలో ఉండే ప్రొటీన్లు చర్మ మృదుత్వాన్ని కాపాడతాయి.

- టీ స్పూన్ పెసరపిండిలో పచ్చిపాలు కలిపి మిశ్రమం తయారు చేసుకోవాలి. దీనిని ముఖానికి మాస్క్‌లా వేయాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్ర పరుచుకోవాలి. పొడిచర్మాన్ని ఈ మాస్క్ మృదువుగా మారుస్తుంది.
- టీ స్పూన్ పెసరపిండిలో తగినంత పెరుగు కలిపి ముఖానికి రాయాలి. ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. పొడి బారిన చర్మం మృదువుగా అవుతుంది.



ఫస్ట్ టైమ్

దేదీప్యమాన విజయం

గ్లోబల్ ఇండియన్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి ఇస్తోంది దీప ఖోస్లా. వక్తగా ప్రసిద్ధ హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ముచ్చటగా మూడోసారి ఆహ్వానం అందుకొని చరిత్ర సృష్టించింది. ఇన్‌ఫ్లుయెన్సర్, ఎంటర్‌ప్రెన్యూర్, ఫిలాంత్రపిస్ట్‌గా గుర్తింపు పొందిన దీప ఖోస్లా గెలుపు మంత్రం... ఆత్మవిశ్వాసం.

లా స్టూడెంట్ నుంచి కంటెంట్ క్రియేటర్‌గా, ఆ తరువాత ఎంటర్ ప్రెన్యూర్‌గా ప్రయాణం ప్రారంభించింది దీప ఖోస్లా. ఇన్‌స్టాగ్రామ్ కొత్తగా పరిచయం అవుతున్న కాలం అది. 'ఇన్‌ఫ్లూయెన్సర్ అంటే?' అని ప్రశ్న దగ్గరి నుంచి మొదలైన ఆమె ప్రయాణం మల్టీపుల్ బ్రాండ్ డీల్స్‌తో సక్సెస్‌ఫుల్ ఇన్‌ఫ్లుయెన్సర్ స్థాయికి చేరింది.

ఆమ్‌స్టర్ డామ్‌లోని సోషల్ మీడియా ఏజెన్సీలో ఇంటర్న్‌షిప్ చేసిన ఫస్ట్ ఇండియన్ డిజిటల్ క్రియేటర్‌గా ప్రత్యేకత సాధించింది.

ఆ తరువాత 'ఇండి వైల్డ్' (స్కిన్ కేర్ అండ్ బ్యూటీ బ్రాండ్) రూపంలో ఎంటర్‌ప్రెన్యూర్‌గా కూడా అద్భుత విజయం సాధించింది.

ఆమె ప్రతి విజయంలో తల్లి సంగీత ఖోస్లా ప్రోత్సాహం ఉంది.

ఆమె ఇచ్చిన అపారమైన ధైర్యం ఉంది.

'ఇండి వైల్డ్' హెయిర్ ఆయిల్ ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది. బెస్ట్‌సెల్లర్‌గా నిలిచింది. తన తల్లి ఫార్ములా ఆధారంగానే ఈ హెయిర్ ఆయిల్‌ను తయారు చేశారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా విజయం సాధించడానికి కావాల్సింది?

ఆత్మవిశ్వాసం.

మరి ఆ ఆత్మవిశ్వాసం ఎక్కడి నుంచి వస్తుంది? అనే ప్రశ్నకు దీప చెప్పే జవాబు ఇది...

'ధైర్యంగా ప్రశ్నలు అడగడం నుంచే ఆత్మవిశ్వాసం వస్తుంది. వ్యాపారరంగంలోకి అడుగు పెట్టినప్పుడు నాకు పెద్దగా ఏమీ తెలియదు. అయితే 'ఓటమి' అనే భయం నన్ను ఎన్నో ప్రశ్నలు అడిగేలా, ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునేలా చేసింది'

భర్తతో కలిసి 'పోస్ట్ ఫర్ చేంజ్' అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి ఉమెన్ ఎంపవర్‌మెంట్, జెండర్ ఈక్వాలిటీకి సంబంధించి ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది దీప.

'దిల్లీలో పుట్టి పెరిగాను. ఊటీ స్కూల్, యూరప్ యూనివర్శిటీలలో చదువుకున్నాను. ప్రతిష్ఠాత్మకమైన హార్వర్డ్ యూనివర్శిటీ సమావేశంలో ప్రసంగించడం నా అదృష్టంగా భావిస్తాను. నేను సాధించిన విజయాలే నన్ను అక్కడి వరకు తీసుకువెళ్లాయి. విజయం అంటే కొందరికే పరిమితమైనది కాదు. నాలాగే ఎవరైనా విజయం సాధించవచ్చు' అంటుంది దీప ఖోస్లా.

దీప నిరంతరం స్మరించే మంత్రం... ఆత్మవిశ్వాసం.

మొటిమలతో ఇబ్బంది పడుతూ నలుగురిలో కలవడానికి ఇష్టపడని స్థితి నుంచి బయటకు తీసుకువచ్చి 'స్టార్ ఇన్‌ఫ్లుయెన్సర్'ను చేసింది ఆ ఆత్మవిశ్వాసమే. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో వాక్ చేసిన తొలి ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చింది, నలుగురిలో మాట్లాడడానికి భయపడే స్థితి నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'బ్రిటిష్ హౌజ్ ఆఫ్ కామన్స్'లో ప్రసంగించే స్థాయికి తీసుకువెళ్లింది ఆ ఆత్మవిశ్వాసమే.

తాజాగా... హార్వర్డ్ బిజినెస్ స్కూల్ సమావేశంలో దీప ఖోస్లాపై రూపొందించిన స్ఫూర్తిదాయకమైన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. 2022లో 'డైవర్శిటీ ఇన్ ది బ్యూటీ ఇండస్ట్రీ' అంశంపై మాట్లాడడానికి హార్వర్డ్ యూనివర్శిటీ నుంచి దీపకు ఆహ్వానం అందించింది. హార్వర్డ్ బిజినెస్ స్కూల్ సమావేశంలో ప్రసంగించిన ఫస్ట్ ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్‌గా చరిత్ర సృష్టించింది దీప ఖోస్లా.

పర్సనల్ ఐకాన్

దీప ఖోస్లాకు తల్లి సంగీత ఖోస్లా పర్సనల్ ఐకాన్. కొండంత అండ. 'నా వెనుక మా అమ్మ ఉంది' అనే ధైర్యం దీపను ముందుకు నడిపించింది. తల్లి సంగీత ఖోస్లా ఫార్ములా ఆధారంగానే తమ బ్యూటీ బ్రాండ్‌కు సంబంధించిన 'హెయిర్ ఆయిల్'ను తయారు చేశారు. సహజ పద్ధతుల్లో ఆరోగ్యంగా ఉండడం, అందంగా కనిపించడం అనేది సంగీత ఖోస్లా ఫిలాసఫీ. అమ్మ బ్యూటీ ఫిలాసఫీని అనుసరిస్తూ సహజమైన పద్ధతులలో అందంగా కనిపించే టెక్నిక్స్‌ను ఫాలో అవుతుంటుంది దీప ఖోస్లా.


● తల్లి సంగీతతో దీప ఖోస్లా

సాగుబడి
అశ్విని కార్తె : ఏప్రిల్ 13 నుంచి

భూతల్లి కన్న తల్లితో సమానమని భావించే ఈ రైతు దంపతులు తమ సొంత భూమిలో మనసుపెట్టి ఇష్టంగా వ్యవసాయం చేస్తూ ఏడాదికి మూడు పంటలు పండిస్తున్నారు. దీంతో వీరి పొలాలు ప్రదర్శన క్షేత్రాలుగా మారిపోయాయి. పశువులు, గొర్రెలు, కోళ్ల ఎరువులు, జీవామృతంతో పంటలు పండిస్తున్నారు. మంచి దిగుబడులతో పాటు చక్కని ఆదాయం పొందుతున్నారు.

ఏడాదికి మూడు పంటలు!


● నువ్వు చేనులో రాజేష్ రెడ్డి-భారతి దంపతులు

మిట్టపెల్లి రాజేష్ రెడ్డి, భారతి ఆదర్శ రైతు దంపతులు. చదివించి పదో తరగతే అయినా తమ 12 ఎకరాల భూమిలో మనసుపెట్టి సేంద్రియ వ్యవసాయం చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇంటికి అవసరమైన అన్నింటినీ సేంద్రియంగా పండించుకొని తింటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. వీరిది జగిత్యాల జిల్లాలో మెట్‌పల్లి మండలంలోని జగ్గాసాగర్ గ్రామం.

3 కి.మీ.ల పైపులైను

ఆ రైతు దంపతులకు వ్యవసాయం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదు పంచ ప్రాణాలు! వీరికి పన్నెండు ఎకరాల భూమి ఉంది. బావులే ఆధారం. 3 కి.మీ. దూరంలో వున్న ఎస్సారెస్పీ వరద కాల్వ నుంచి పైపులైన్లు వేసుకొని డ్రిప్‌తో సాగు చేస్తున్నారు.

20 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నప్పటికీ దిగుబడులు అంతంతే కాని, ఖర్చులు మాత్రం పెరిగాయి. ఇష్టారీతిన రసాయన ఎరువులు వేయడంతో ప్రతి పంటలో పురుగులు, తెగుళ్ల బెడద ఎక్కువై, వాటికి రసాయన మందులు పిచికారీ చేసేందుకు వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వచ్చేది. కుటుంబ ఆదాయం పిల్లల చదువుకు కూడా సరిపోయేది కాదు. ఈ నేపథ్యంలో పాలేకర్ పద్ధతిలో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయవచ్చని తెలుసుకొని సాగు పద్ధతిని మార్చుకున్నారు.

ఈ దంపతులు ప్రతి ఏడాదీ మూడు పంటలు పండిస్తున్నారు. మేలో తప్ప మిగతా 11 నెలలూ వీరి పొలాల్లో పంటలతో ఉంటాయి. వర్షాలతో సంబంధం లేకుండా, వ్యవసాయ బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటితోనే, జూన్ రెండో వారంలోనే విత్తనాలు వేస్తుంటారు. వానాకాలం సీజన్‌లో ఆరు ఎకరాల్లో సన్న రకం వరి, రెండెకరాల్లో పసుపు, మూడెకరాల్లో మొక్కజొన్న, ఒక ఎకరంలో మిర్చి పంట సాగు చేశారు. యాసంగి సీజన్‌లో ఆరెకరాల్లో లావు రకం వరి, ఎకరంలో జొన్న, 3 ఎకరాల్లో మొక్కజొన్న, రెండెకరాల్లో నువ్వు సాగు చేస్తున్నారు.

వెద వరి.. 30 క్వింటాళ్ల దిగుబడి

వరి సాగు చేయబోయే పొలంలో జూన్‌లో మొక్కజొన్న సాగు చేసి, కంకులు కోసిన తర్వాత మొక్కజొన్న మొక్కలను రోటోవేటర్‌తో పొలంలో కలియ దున్నేస్తారు. ఆ తర్వాత, వరి నారు పోసి, నాటు వేసే బదులు, నేరుగా వెదజల్లి ఎకరానికి 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి సాధిస్తున్నారు. అలాగే, పసుపు, మొక్కజొన్న సాగు చేసే భూమిలో రెండు లారీల గొర్రెల ఎరువు, ఒక లారీ మాగిన కోళ్ల ఎరువు వేసి భూసారం పెంచుకుంటూ ఉంటారు. పంటకాలంలో ప్రతి పంటకు జీవామృతాన్ని మూడు సార్లు ఇస్తున్నారు. నాలుగు ఆవులు, మూడు గేదేలను పెంచుతున్నారు. సగటున ఎకరానికి సజ్జలు 12–15, పసుపు 30, మొక్కజొన్నలు 40–45, నువ్వులు 4–6 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు.

భారతి, రాజేష్ రెడ్డి దంపతులు తెల్లవారుఝామున 3 గంటలకే వీరి దినచర్య ప్రారంభం అవుతుంది. ఆవులు, గేదేల నుంచి పాలు పిండి 30 మందికి పాలు పోస్తారు. ఇంట్లో వంట పనులు పూర్తి చేసుకొని ఇద్దరూ తెల్లారేసరికే పొలంలో అడుగుపెడతారు. సా. ఆరు గంటలైతే కానీ ఇంటికి రారు. ఏ ఫంక్షన్‌కు వెళ్లినా సాయంత్రం ఇంటికి రావాల్సిందే!

విలువ జోడించే అమ్ముతారు

భారతి, రాజేష్ రెడ్డి దంపతులు తాము పండించిన పంటలను విలువ జోడించి అమ్ముతూ మంచి ఆదాయం పొందుతున్నారు. సన్న వరి ధాన్యాన్ని మర ఆడించి బియ్యం క్వింటాకు రూ. 6,500కు విక్రయిస్తున్నారు. మిరపకాయలను ఎండబెట్టి కారం పొడిని కిలో రూ. 280కి వినియోగదారులకు అమ్ముతున్నారు. సజ్జలను బై బ్యాక్ పద్ధతిలో కంపెనీలకు క్వింటా రూ.7 వేలకు, పసుపును క్వింటా రూ.11 వేలకు, మొక్కజొన్నను క్వింటా రూ.2,100కు నువ్వులను క్వింటా రూ.14 వేల చొప్పున విక్రయిస్తూ మంచి ఆదాయం పొందుతున్నారు. తమ పిల్లలిద్దరినీ హైద్రాబాద్‌లో ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. ఫార్మ్ అండ్ రూరల్ సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల హైదరాబాద్‌లో పూర్వ ఉపకులపతి దివంగత జె. రఘోత్తమరెడ్డి స్మారకోపన్యాస సభలో భారతి ఉత్తమ సేంద్రియ రైతు పురస్కారాన్ని అందుకోవటం విశేషం.

– పన్నాల కమలాకర్ రెడ్డి, సాక్షి, జగిత్యాల అగ్రికల్చర్

ఖర్చు తగ్గించే సాగు పద్ధతులతో మేలు!

మా భూమిలో రకరకాల పంటలు పండించి, ఆ పంటల్లో అధిక దిగుబడులు తీసినప్పుడు మాకు కష్టం గుర్తుకురాదు. ప్రధానంగా భూతల్లిని కాపాడేందుకు రసాయనాలను పూర్తిగా తగ్గించి, పశువులు, కోళ్లు, గొర్రెల ఎరువు వాడుతున్నాం. వ్యవసాయంతో చాలా మంది ఇబ్బందిగా ఫీలవుతుంటే, మేం మాత్రం ఇష్టంగా చేస్తున్నాం.. సంతృప్తిని, ఆదాయాన్ని పొందుతున్నాం. ప్రతి రైతు ఖర్చు తగ్గించే పద్ధతులపై దృష్టి పెట్టాలి. మేం అలాగే చేస్తున్నాం. మా పద్ధతిలోకి రావాలని తోటి రైతులను ప్రోత్సహిస్తున్నాం.

– మిట్టపెల్లి భారతి, రాజేష్ రెడ్డి (9618809924, 9618111367)

విపత్తులకు తట్టుకునే ప్రకృతి సేద్యం గొప్పేంటి?

- మిచాంగ్ తుపాను నాటి రసాయనిక, ప్రకృతి సేద్య వరి పంటలపై ఆస్ట్రేలియా శాస్త్రవేత్త డా. ఫిల్ లీ అధ్యయనం
- ప్రకృతి సేద్యంతో ఒనగూడుతున్న అద్భుత ఫలితాలను కళ్లకు కట్టిన అధ్యయన ఫలితాలు


● రసాయనాలతో సాగు చేసిన వరి పొలం మిచాంగ్ తుపానుకు నేలకొరిగింది (ఫైల్)
● ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పొలం మిచాంగ్ తుపానుకు తట్టుకుంది (ఫైల్)

2023 డిసెంబర్ 4,5 తేదీల్లో విరుచుకుపడిన మిచాంగ్ తుపాను ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో పంటలను, ముఖ్యంగా వరి పంటను, నేలమట్టం చేసింది. అయితే, ఆ తీవ్రమైన గాలులు, వర్షాన్ని తట్టుకొని నిలబడే ఉన్నాయి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న వరి పొలాలు. రసాయనిక వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న వరి చేలు నేలకు వాలిపోయి, నీట మునిగి ఉంటే.. వీటి పక్కన పొలాల్లో ఉన్న ప్రకృతి వ్యవసాయ వరి పంట మాత్రం చెక్కుచెదరకుండా దర్జాగా నిలబడి ఉండటం గురించి అప్పట్లోనే వార్తా కథనాలు చదివిన విషయం చాలా మందికి గుర్తుండే ఉంటుంది. మిచాంగ్ తుపానే కాదు అంతకుముందు కూడా అనేక విపత్కర పరిస్థితుల్లోనూ ఇది స్పష్టంగా కళ్లకు కట్టిన వాస్తవం.

అయితే, ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే.. 'రీజెనరేట్ ఎర్త్' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులైన ఆస్ట్రేలియన్ సాయిల్ మైక్రోబయాలజిస్టు డాక్టర్ ఫిల్ లీ ఈ నెల మొదటి వారంలో ఏపీలో పర్యటించారు. అనంతపురం తదితర జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు తుపానును, కరువును దీటుగా తట్టుకొని నిలబడుతూ సుభిక్షంగా, ఉత్పాదకంగా నిలవటానికి వెనుక గల శాస్త్రీయ కారణాలను డా. ఫిల్ లీ అన్వేషించారు. అనేక కోస్తా జిల్లాల్లో మిచాంగ్ తుపానుకు నేలకొరిగిన రసాయనిక వరి పొలాల్లో గడ్డికి, పక్కనే పడిపోకుండా నిలబడిన ఆయా పొలాల్లో మట్టి నమూనాలను కూడా సేకరించి అధ్యయనం చేశారు.

బంతి పూలను ఏక పంటగా సాగు చేస్తున్న రసాయనిక పొలంలోని మట్టిలో జీవం తక్కువగా ఉందని గుర్తించారు. ఆ పొలం పక్కనే బంతితో పాటు 12 పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలంలోని మట్టి నమూనాలను పరిశోధించగా.. మట్టి కణాల నిర్మాణం, ఆ మట్టిలో వైవిధ్యపూరితమైన సూక్ష్మజీవరాశి ఎంతో సుసంపన్నంగా ఉన్నట్లు గుర్తించానని డా. ఫిల్ లీ వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల మట్టిలో పెరుగుతున్న జీవశక్తి, సూక్ష్మజీవరాశి వైవిధ్యత వల్లనే పంటలకు వైపరీత్యాలను తట్టుకునే శక్తి వస్తోందనడానికి విస్పష్టమైన రుజువులు దొరికాయని ఆయన తెలిపారు.


● మిచాంగ్ తుపాను నాటి వరి రకాలను పరీక్షిస్తున్న డా. ఫిల్ లీ

వరి పొలాల్లో గడ్డికి మధ్య ఉన్న వ్యత్యాసాలే మిటో తన వెంట తెచ్చిన అధునాతన మైక్రోస్కోప్ ద్వారా పరిశోధించారాయన. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన వరి మొక్క కాండంలో కణ నిర్మాణం రసాయనిక వ్యవసాయంలో కన్నా బలంగా, ఈనెలు తేలి ఉండటాన్ని ఆయన గుర్తించారు. 'ప్రకృతి వ్యవసాయంలో పండించిన వరి మొక్కలు చాలా బలంగా ఉన్నాయి. ఇది ప్రకృతి సేద్య బలానికి నిదర్శనం' అన్నారు డా. ఫిల్ లీ. అదేవిధంగా, ఏప్రిల్ మొదటి వారంలో అనంతపురం జిల్లాలో పర్యటించిన ఆయన రసాయనిక, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగవుతున్న పంటలను పరిశీలించారు.

> ప్రకృతి వ్యవసాయం వల్ల మట్టిలో జీవశక్తి, సూక్ష్మజీవరాశి వైవిధ్యత పెరుగుతుంది. అందువల్లనే ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తి ఈ పంటలకు వస్తోందనడానికి ఇప్పుడు విస్పష్టమైన రుజువులు దొరికాయి.
>
> – డాక్టర్ ఫిల్ లీ, ఆస్ట్రేలియన్ సాయిల్ మైక్రోబయాలజిస్టు, 'రీజెనరేట్ ఎర్త్' సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు

ఈ అధ్యయనానికి సంబంధించిన వీడియోలు 'ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్' యూట్యూబ్ ఛానల్‌లో అందుబాటులో ఉన్నాయి.


● ప్రకృతి వ్యవసాయంలో పండించిన వరి కాండం (మైక్రోస్కోప్ చిత్రం)
● రసాయనాలతో పండించిన వరి కాండం

తిరుపతిలో 20,21 తేదీల్లో ఆర్గానిక్ మేళా

తిరుపతి టౌన్ క్లబ్ కూడలిలోని మహతి ఆడిటోరియంలో ఏప్రిల్ 20, 21 తేదీల్లో ఉ. 10.30 గం. నుంచి రాత్రి 8 గం. వరకు స్వచ్ఛంద సంస్థ 'కనెక్ట్ 2 ఫార్మర్' ఆధ్వర్యంలో సేంద్రియ ఆహారోత్పత్తులు ప్రదర్శన, అమ్మకం మేళా జరగనుంది. రైతులు నేరుగా తమ ఆర్గానిక్ పంట ఉత్పత్తులను వినియోగదారులకు అమ్ముకోగలిగే ఏర్పాటు చేయటం.. దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు కూడా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని కనెక్ట్ 2 ఫార్మర్ వ్యవస్థాపకులు శిల్ప తెలిపారు. 20న కషాయాల తయారీపై గంగిరెడ్డి, దేశవాళీ పండ్లు/పూల మొక్కల గ్రాఫ్టింగ్‌పై జె.ఎస్. రెడ్డి శిక్షణ ఇస్తారు. కంపోస్టింగ్‌పై డా.సింధు అవగాహన కల్పిస్తారు. 21న 5 దొంతర్ల పండ్లు, కూరగాయల సాగుపై, ఇంకుడుగుంతల నిర్మాణంపై విజయరామ్ ప్రసంగిస్తారు. ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రకృతివనం ప్రసాద్ ప్రసంగిస్తారు. వివరాలకు.. 63036 06326.

విదిత్ గుజరాతీ విజయం



టొరంటోలో జరుగుతున్న ప్రతిష్టాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో భారత ఆటగాడు విదిత్ గుజరాతీ మరో కీలక విజయాన్ని నమోదు చేశాడు. 9వ రౌండ్‌లో హికారు నకమురా (అమెరికా)ను విదిత్ ఓడించాడు. ఈ గెలుపుతో ఓవరాల్‌గా 4.5 పాయింట్లతో విదిత్...నకమురా, కరువానాలతో కలిసి నాలుగో స్థానంలో నిలిచారు. మరో వైపు ఇద్దరు భారత ఆటగాళ్లు డి.గుకేశ్, ఆర్. ప్రజ్ఞానంద మధ్య జరిగిన గేమ్ 'డ్రా'గా ముగిసింది. తాజా ఫలితం తర్వాత గుకేశ్, నెపోమ్నియాచి 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, 4 పాయింట్లతో ప్రజ్ఞానంద తర్వాతి స్థానంలో ఉన్నాడు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి 9వ రౌండ్ గేమ్ 'డ్రా' అయింది. హోరాహోరీ పోరు తర్వాత హంపి, రష్యాకు చెందిన కటెరినా లాగ్నో తమ గేమ్‌ను సమంగా ముగించారు. హంపికి మధ్యలో విజయావకాశాలు వచ్చినా కటెరినా తెలివిగా ఆడి తప్పించుకోలిగింది. అయితే మరో భారత ప్లేయర్ ఆర్.వైశాలి...చైనాకు చెందిన జోంగి తన్ చేతిలో ఓటమిపాలైంది. ప్రస్తుతం హంపి 4 పాయింట్లతో ముజిచుక్ (ఉక్రెయిన్)తో కలిసి ఐదో స్థానంలో కొనసాగుతోంది.

277 కాదు... 287

ఐపీఎల్‌లో అత్యధిక పరుగులతో సన్‌రైజర్స్ కొత్త రికార్డు

తమ స్కోరునే బద్దలు కొట్టిన హైదరాబాద్

25 పరుగులతో బెంగళూరుపై విజయం

హెడ్ సెంచరీ... చెలరేగిన క్లాసెన్, సమద్


దినేశ్ కార్తీక్ పోరాటం వృథా

287 ఐపీఎల్‌లో ఒక టీమ్ సాధించిన అత్యధిక స్కోరు. ఇదే సీజన్‌లో తాము చేసిన 277 స్కోరును సన్‌రైజర్స్ సవరించింది. ఓవరాల్‌గా టి20ల్లో ఇది రెండో అత్యధిక స్కోరు. ఆసియా క్రీడల్లో మంగోలియాపై నేపాల్ 314 పరుగులు చేసింది.

22 సన్‌రైజర్స్ సిక్సర్లు. గతంలో బెంగళూరు కొట్టిన 21 సిక్సర్ల రికార్డు బద్దలైంది.

4 హెడ్ చేసిన సెంచరీ (39 బంతుల్లో) ఐపీఎల్‌లో నాలుగో వేగవంతమైంది. గేల్ (30), యూసుఫ్ పఠాన్ (37), మిల్లర్ (38) ముందున్నారు. సన్‌రైజర్స్ తరఫున గతంలో వార్నర్ 43 బంతుల్లో సెంచరీ చేశాడు.

549 ఒక టి20ల్లో నమోదైన అత్యధిక పరుగులతో కొత్త రికార్డు. ఇదే సీజన్‌లో హైదరాబాద్, ముంబై మధ్య 523 పరుగులు నమోదయ్యాయి.



హెడ్ సెంచరీ



క్లాసెన్



సమద్

బెంగళూరు: సన్‌రైజర్స్ ఆటతీరు చిన్నస్వామి స్టేడియాన్ని పెద్ద పెద్ద రికార్డుల్లో నిలిపింది. బెంగళూరు టాస్ నెగ్గి ఫీల్డింగ్ ఎంచుకోగానే విధ్వంసానికి పునాది పడింది...బ్యాటింగ్ తుఫాన్‌తో హైదరాబాద్ మ్యాచ్ గెలిచింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒక సీజన్‌లో తమ రికార్డుకు '2.0' ను చూపించింది. ముంబైపై 277 రికార్డును రోజుల వ్యవధిలోనే 287 పరుగుల అత్యధిక స్కోరుతో హైదరాబాద్ జట్టు తిరగరాసింది. ఈ ఎండల్ని తట్టుకోలేని జనాలకు మెరుపుల పండగని పంచిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 25 పరుగుల తేడాతో బెంగళూరుపై గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి మునుపెన్నడూ చేయని 287 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రవిస్ హెడ్ (41 బంతుల్లో 102; 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) శతకం బాదగా... హెన్రిచ్ క్లాసెన్ (31 బంతుల్లో 67; 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశానికే చిల్లులుపడేలా సిక్స్‌లు కొట్టాడు. అనంతరం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 262 పరుగులు చేసింది. దినేశ్ కార్తీక్ (35 బంతుల్లో 83; 5 ఫోర్లు, 7 సిక్స్‌లు) దంచేశాడు చివరి వరకు పోరాడగా..డుప్లెసిస్ (28 బంతుల్లో 62; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరిపించాడు.

దంచుడే... దంచుడు!

రెండో ఓవర్ నుంచే హెడ్ వీరంగం మొదలైంది. టాప్లీ ఓవర్లో 4, 6 కొట్టగా, ఫెర్గూసన్ ఐదో ఓవర్లో రెండు సిక్స్‌లతో పాటు ఓ బౌండరీ బాదాడు. దీన్ని యశ్ తదుపరి ఓవర్లోనూ రిపీట్ చేయడంతో 20 బంతుల్లో హెడ్ ఫిఫ్టీ పూర్తవగా, పవర్‌ప్లే స్కోరు 76/0. జాక్స్ ఏడో ఓవర్ వేస్తే హెడ్ వరుసగా 4, 6, 6 బాదేశాడు. తర్వాత అభిషేక్ సిక్సర్‌తో 7.1 ఓవర్లోనే సన్‌రైజర్స్ వందను దాటేసింది. తర్వాతి ఓవర్లో అభిషేక్ (22 బంతుల్లో 34; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)ను టాప్లీ అవుట్ చేసి 108 పరుగుల ఓపెనింగ్ జోడీని విడగొట్టాడు. క్లాసెన్ క్రీజులోకి రాగా... వైశాక్ 12వ ఓవర్లో మూడు ఫోర్లతో హెడ్ 39 బంతుల్లో శతకం పూర్తి చేసుకొని కాసేపటికే అవుటయ్యాడు.

ఇక క్లాసెన్ వంతు!

అప్పటిదాకా అడపాదడపా షాట్లతో 21 పరుగులు చేసిన క్లాసెన్ బాదే బాధ్యత తను తీసుకున్నాడు. లోమ్రోర్ 9 బంతులేసిన 14వ ఓవర్లో రెండు భారీ సిక్స్‌లు కొట్టాడు. తదుపరి వైశాక్ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ కొట్టి 23 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. టాప్లీ, ఫెర్గూసన్‌ల వరుస ఓవర్లలో ఒక్కో సిక్స్‌తో విరుచుకుపడిన క్లాసెన్‌కు ఫెర్గూసన్ చెక్‌పెట్టాడు. క్రీజులో ఉన్న మార్క్‌రమ్ (17 బంతుల్లో 32నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)కు అప్పుడే వచ్చిన సమద్ (10 బంతుల్లో 37 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) తోడయ్యాడు. వచ్చీ రాగానే టార్గెట్ తుఫాన్‌పై కదం తొక్కుతూ టాప్లీ వేసిన 19వ ఓవర్లో ఆడిన ఐదు బంతుల్ని 4, 4, 6, 6, 4లుగా బాదాడు. ఆఖరి ఓవర్లో మార్క్‌రమ్ 4, 6 కొడితే సమద్ మరో సిక్సర్ బాదాడు. 19వ ఓవర్లో 25, 20వ ఓవర్లో 21 పరుగులు హైదరాబాద్ గెలుపులో కీలకమయ్యాయి.

బెంగళూరు తగ్గలేదు!

ఎంతకొట్టినా ఎంతకీ కరగని లక్ష్యమని బెంగళూరు బెదిరిపోలేదు. ఆఖరి దాకా తగ్గేదే లే అన్నట్లుగా సన్‌రైజర్స్ ఫీల్డర్లను చెమటలు పట్టించింది. ఓపెనర్లు కోహ్లి (20 బంతుల్లో 42; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), డుప్లెసిస్ కొండంత లక్ష్యానికి దీటైన ఆరంభం ఇచ్చారు. ఇద్దరు తొలి ఓవర్లో చెరో బౌండరీతో ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టారు. తర్వాత ఓవర్ ఓవర్‌కూ సిక్స్‌లు, ఫోర్లతో వేగాన్ని పెంచారు. భువీ నాలుగో ఓవర్లో ఇద్దరు చెరో 2 బౌండరీలతో 3.5 ఓవర్లోనే బెంగళూరు 50 దాటింది. నటరాజన్, కమిన్స్ ఓవర్లలో అవలీలగా ఫోర్లు, సిక్స్‌లు బాదడంతో పవర్‌ప్లేలో జట్టు 78/0 స్కోరు చేసింది. కోహ్లిని మార్కండే బౌల్డ్ చేయడంతో తొలిదెబ్బ తగిలింది. మరోవైపు డుప్లెసిస్ 24 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. కానీ విల్‌జాక్స్ (7) నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో దురదృష్టవశాత్తు రనౌటవడం, పటిదార్ (9)తో పాటు డుప్లెసిస్ స్వల్పవ్యవధిలో పెవిలియన్ చేరడం జట్టును వెనుకబడేలా చేసింది. అయితే పదో ఓవర్లో క్రీజులోకి వచ్చిన దినేశ్ కార్తీక్ షాట్లతో విరుచుకుపడటంతో భారీ స్కోరు కాస్తా దిగి వస్తుండటంతో హైదరాబాద్ శిబిరం కాస్తా ఇబ్బంది పడింది. 23 బంతుల్లో కార్తీక్ ఫిఫ్టీ పూర్తిచేసుకున్నాడు. అయితే 12 బంతుల్లో 58 పరుగుల సమీకరణం కష్టసాధ్యం కావడంతో పాటు 19వ ఓవర్లో 6, 4 కొట్టిన కార్తీక్‌ను నటరాజన్ అవుట్ చేయడంతో పరాజయం ఖాయమైంది. 11, 12 ఓవర్లలో వరుసగా 5, 8 పరుగులే రావడం.... 15వ ఓవర్లో కమిన్స్... హిట్టర్ మహిపాల్ (11 బంతుల్లో 19; 2 సిక్స్‌లు)ను అవుట్ చేసి 6 పరుగులే ఇవ్వడం సన్‌రైజర్స్‌ను గట్టెక్కించింది. లేదంటే పరిస్థితి కచ్చితంగా మరోలా ఉండేది!

స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) ఫెర్గూసన్ (బి) టాప్లీ 34; హెడ్ (సి) డుప్లెసిస్ (బి) ఫెర్గూసన్ 102; క్లాసెన్ (సి) వైశాక్ (బి) ఫెర్గూసన్ 67; మార్క్‌రమ్ నాటౌట్ 32; సమద్ నాటౌట్ 37; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (20 ఓవర్లలో 3 వికెట్లకు) 287. **వికెట్ల పతనం:** 1-108, 2-165, 3-231. **బౌలింగ్:** విల్ జాక్స్ 3-0-32-0, టాప్లీ 4-0-68-1, యశ్ దయాళ్ 4-0-51-0, ఫెర్గూసన్ 4-0-52-2, వైశాక్ 4-0-64-0, మహిపాల్ 1-0-18-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (బి) మార్కండే 42; డుప్లెసిస్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 62; జాక్స్ రనౌట్ 7; పటిదార్ (సి) నితీశ్ (బి) మార్కండే 9; సౌరవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కమిన్స్ 0; దినేశ్ కార్తీక్ (సి) క్లాసెన్ (బి) నటరాజన్ 83; మహిపాల్ (బి) కమిన్స్ 19; అనూజ్ నాటౌట్ 25; వైశాక్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (20 ఓవర్లలో 7 వికెట్లకు) 262. **వికెట్ల పతనం:** 1-80, 2-100, 3-111, 4-121, 5-122, 6-181, 7-244. **బౌలింగ్:** అభిషేక్ 1-0-10-0, భువనేశ్వర్ 4-0-60-0, షహబాజ్ 1-0-18-0, నటరాజన్ 4-0-47-1, కమిన్స్ 4-0-43-3, మార్కండే 4-0-46-2, ఉనాద్కట్ 2-0-37-0.



కార్తీక్

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X రాజస్తాన్
వేదిక: కోల్‌కతా

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	6	5	1	10	0.767
కోల్‌కతా	5	4	1	8	1.688
చెన్నై	6	4	2	8	0.726
హైదరాబాద్	6	4	2	8	0.502
లక్నో	6	3	3	6	0.038
గుజరాత్	6	3	3	6	-0.637
పంజాబ్	6	2	4	4	-0.218
ముంబై	6	2	4	4	-0.234
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	7	1	6	2	-1.185

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

సినిమా

మేలో ఆ ఒక్కటీ అడక్కు



ఫరియా అబ్దుల్లా, 'అల్లరి' నరేశ్

మండే వేసవిలో థియేటర్లలో నవ్వుల జల్లులు కురిపించేందుకు 'అల్లరి' నరేశ్ సిద్ధమయ్యారు. ఆయన హీరోగా మల్లి అంకం దర్శకత్వం వహించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మించారు. భరత్ లక్ష్మీపతి సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమాని వేసవి సెలవులను పురస్కరించుకుని మే 3న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించిన థియేట్రికల్ రిలీజ్ హక్కులను ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్ ఎల్ఎల్‌పీ పొందింది. ''పూర్తి స్థాయి వినోదాత్మకంగా రూపొందిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. చాలా కాలంగా నన్ను పూర్తిగా ఫన్ రోల్‌లో చూడాలని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. అది ఈ సినిమాతో కుదిరింది'' అన్నారు 'అల్లరి' నరేశ్.

పొలిటికల్ కామెడీ

సాయి కుమార్ లీడ్ రోల్‌లో, వినయ్, అరుణ్, దీప్తి వర్మ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం: ఫర్ ఓట్'. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని సోమవారం విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''ఇప్పటివరకు తెలుగులో చాలా తక్కువ సెటైరికల్ కాన్సెప్ట్స్ వచ్చాయి. అందులోనూ పొలిటికల్ సెటైరికల్ కామెడీ సినిమాలు చాలా తక్కువ. ఇప్పుడు అదే తరహాలో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' సినిమా వస్తోంది. ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రిలో చేశాం. త్వరలోనే ట్రైలర్ రిలీజ్ చేసి, సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.



సాయి కుమార్

ఘనంగా డైరెక్టర్ శంకర్ కుమార్తె వివాహం



శంకర్, ఐశ్వర్య, తరుణ్, రజనీకాంత్

ప్రముఖ దర్శకుడు శంకర్ పెద్ద కుమార్తె ఐశ్వర్య వివాహం సోమవారం ఘనంగా జరిగింది. తన అసిస్టెంట్ డైరెక్టర్ తరుణ్ కార్తికేయన్‌తో ఐశ్వర్య పెళ్లి జరిపించారు శంకర్. చెన్నైలోని ఓ ప్రముఖ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలో ఇరు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పాటు సినీ ప్రముఖులు సందడి చేశారు. శంకర్‌కి ఇద్దరు కుమార్తెలు (ఐశ్వర్య, అదితి), ఓ కుమారుడు(అర్జిత్) ఉన్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరిలో తరుణ్-ఐశ్వర్య నిశ్చితార్థం జరగ్గా, సోమవారం వారు ఏడడుగులు వేశారు. ఈ వివాహానికి హీరోలు రజనీకాంత్, కమల్‌హాసన్, విక్రమ్, సూర్య, కార్తీ, హీరోయిన్ నయనతార, డైరెక్టర్ విఘ్నేశ్ శివన్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇదిలా ఉంటే.. ఐశ్వర్యకు 2021లోనే దామోదర్ రోహిత్ అనే తమిళ క్రికెటర్‌తో వివాహం అయింది. అయితే కొన్ని కారణాల వల్ల ఇద్దరూ విడాకులు తీసుకున్నారు.

మీ కల కోసం బతకండి



'మిస్టర్ అండ్ మిస్ మహి' పోస్టర్

''వాళ్లిద్దరూ ఒకరినొకరు కలుసుకునేవరకూ తమ కలను సాకారం చేసుకోవడానికి కృషి చేసే సత్తా తమకు ఉందని ఇద్దరికీ తెలియదు. ఆ ఇద్దరి ప్రేమ, వారి కలను మే 31న థియేటర్లలో చూడండి'' అంటూ 'మిస్టర్ అండ్ మిస్ మహి' మూవీ ఫస్ట్ పోస్టర్‌ని షేర్ చేశారు జాన్వీ కపూర్. స్టేడియంలో క్రికెటర్స్‌ని మహిమా, మహేంద్ర ఉత్సాహపరుస్తున్నట్లుగా ఉన్న ఈ పోస్టర్‌పై ''మీ తల్లిదండ్రుల కలను నిజం చేయడానికి కాదు.. మీ కల కోసం మీరు బతకండి'' అని రాసి ఉంది. రాజ్‌కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా శరణ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్టర్ అండ్ మిస్ మహి'. ఈ చిత్రంలో మహేంద్ర పాత్రను రాజ్‌కుమార్, మహిమా పాత్రను జాన్వీ చేశారు. ఇందులో జాన్వీ కూడా క్రికెటర్‌గా కనిపిస్తారు. ఇందుకోసం ఆరు నెలల పాటు ఆమె క్రికెట్‌లో శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ 19న విడుదల కావాల్సి ఉంది. కానీ, మే 31కి విడుదల చేస్తున్నట్లు రెండు రోజుల క్రితం చిత్రనిర్మాత కరణ్ జోహార్ ప్రకటించారు. చిత్రకథానాయిక జాన్వీ కపూర్ సోమవారం సినిమా పోస్టర్ షేర్ చేసి, పై విధంగా పేర్కొన్నారు. అలాగే ''మీరు నెరవేర్చుకునేవన్నీ మీ కలలే'' అంటూ రాజ్‌కుమార్ రావ్ ఇదే పోస్టర్‌ని షేర్ చేశారు.

ఎన్టీఆర్‌తో నటించాలని ఉంది - ఊర్వశి



ఊర్వశి, ఎన్టీఆర్

ఊర్వశి రౌతేలా.. ప్రత్యేకించి పరిచయం అక్కర్లేని పేరు. తన గ్లామర్‌తో అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ ప్రేక్షకుల్లో.. ప్రత్యేకించి యువతలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారీ బ్యూటీ. తాజాగా ఊర్వశి రౌతేలా ఎక్స్‌లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట హల్‌చల్ చేస్తోంది. ఎన్టీఆర్‌తో కలిసి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేయడం ఇండస్ట్రీ వర్గాల్లో, ఎన్టీఆర్ అభిమానుల్లో చర్చకు తెరలేపింది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందుతున్న 'దేవర' సినిమాలో ఊర్వశి నటించనున్నారేమో? అనే చర్చలు జరుగుతున్నాయి. 'వార్ 2' హిందీ సినిమా చిత్రీకరణ కోసం ముంబయ్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ఆయనతో జిమ్‌లో దిగిన ఫొటోను ఊర్వశి సోషల్ మీడియాలో షేర్ చేసి.. ''ఎన్టీఆర్‌గారు మన ప్రియమైన, నిజమైన గ్లోబల్ సూపర్ స్టార్. క్రమశిక్షణ, నిజాయితీ, వినయపూర్వకంగా ఉండే వ్యక్తి. మీ దయ, ప్రోత్సాహానికి కృతజ్ఞతలు. మీ వ్యక్తిత్వం నిజంగా ప్రశంసనీయం. సమీప భవిష్యత్తులో మీతో కలిసి పని చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్ చూసిన ఎన్టీఆర్ ఫ్యాన్స్ 'దేవర' చిత్రంలో ఊర్వశి రౌతేలా ప్రత్యేక పాటలో కనిపించనున్నారా? అంటూ కామెంట్లు చేస్తున్నారు. కాగా ఊర్వశి తెలుగులో 'వాల్తేరు వీరయ్య, ఏజెంట్, బ్రో, స్కంద' వంటి చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో తన డ్యాన్స్‌తో అలరించారు. మరి... ఎన్టీఆర్ సినిమాలో నటించాలనే ఆసక్తి కనబరుస్తున్న ఊర్వశికి ఆ చాన్స్ వస్తుందా? అనేది చూడాలి.



సాహసోపేతమైన కథ

'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు హీరో తేజ సజ్జా. తాజాగా ఆయన కొత్త సినిమా ప్రకటన వచ్చింది. 'ఈగల్' ఫేమ్ కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమా నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేసింది యూనిట్. 'హను-మాన్' చిత్రంలో సాంప్రదాయ దుస్తుల్లో కనిపించిన తేజ.. కొత్త పోస్టర్‌లో స్టైలిష్ మేకోవర్‌లో కనిపించారు. ''సూపర్ యోధ సాహసోపేతమైన కథతో పాన్ ఇండియా మూవీగా ఇది తెరకెక్కనుంది. 'ఈగల్' తర్వాత కార్తీక్ ఘట్టమనేనితో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న రెండో చిత్రం ఇది. ఈ సినిమా పూర్తి వివరాలను ఈ నెల 18న ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, క్రియేటివ్ ప్రొడ్యూసర్: కృతీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.



తేజ

భర్త డైరెక్షన్‌లో...



ఎమ్మా స్టోన్

హాలీవుడ్‌కి చెందిన క్రేజీ కపుల్స్‌లో డేవ్ మెక్‌క్యారీ, ఎమ్మా స్టోన్ జోడీ ఒకటి. దర్శక-రచయిత, హాస్య నటుడు డేవ్, నటి ఎమ్మా దాదాపు 2016లో ప్రేమలో పడి, 2020లో పెళ్లి చేసుకున్నారు. 2021లో వీరికో పాప పుట్టింది. వ్యక్తిగత జీవితం జోష్‌గా ఉన్న నేపథ్యంలో గత నెల 10న జరిగిన ఆస్కార్ అవార్డు వేడుకలో 'పూర్ థింగ్స్' చిత్రానికి గాను ఎమ్మా స్టోన్ ఉత్తమ నటి అవార్డు అందుకున్నారు. 2016లో ఉత్తమ నటిగా 'లా లా ల్యాండ్' చిత్రానికి ఆస్కార్ అందుకున్న ఎమ్మాకి 'పూర్ థింగ్స్'తో మరో అవార్డు దక్కింది. ఈ చిత్రానికి డేవ్, ఎమ్మా కూడా నిర్మాతలు. రెండోసారి ప్రతిష్ఠాత్మక ఆస్కార్ అవార్డు అందుకున్న ఆనందంలో ఉన్న ఎమ్మా స్టోన్‌కి మరో మంచి సినిమా ఇవ్వాలని డేవ్ మెక్‌క్యారీ ప్లాన్ చేస్తున్నారట. ఈ చిత్రానికి తానే దర్శకత్వం వహించాలని కూడా అనుకుంటున్నారట. దర్శకుడిగా డేవ్‌కి 'బ్రిగ్స్‌బీ బియర్' (2017) తొలి చిత్రం. ఆ తర్వాత మరో సినిమాకి మెగాఫోన్ పట్టలేదు. ఇప్పుడు భార్య కోసం మళ్లీ డైరెక్టర్‌గా స్టార్ట్, కెమెరా, యాక్షన్ చెప్పడానికి రెడీ అయ్యారు డేవ్.

సామాజిక అంశంతో...



అర్జున్, కిశోరి

'బిగ్ బాస్' ఫేమ్ అర్జున్ అంబటి, కిశోరీ దాత్రక్ జంటగా రవిశంకర్, చైతన్యా రావు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తెప్ప సముద్రం'. సతీష్ రాపోలు దర్శకత్వంలో బేబి వైష్ణవి సమర్పణలో నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న రిలీజ్ అవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఈ మూవీలోని తొలి పాటను, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి రెండో పాటను రిలీజ్ చేశారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య ట్రైలర్‌ని విడుదల చేశారు. ''చిన్నపిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని సామాజిక అంశాలను మా సినిమాలో ప్రస్తావించాం'' అన్నారు సతీష్ రాపోలు. ''ఈ సినిమా ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసేలా ఉంటుంది'' అన్నారు రాఘవేంద్రగౌడ్, అర్జున్ అంబటి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
845	247
73,400	22,272

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,095	▽	80
డోజోన్స్	37,983	△	1
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,965	▽	30
డాక్స్	18,026	△	96
షాంఘై	3,057	△	38
నికాయ్	39,234	▽	291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	72,813
బంగారం (99.5 స్వచ్ఛత)	72,521
వెండి (కిలో)	83,452

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.04	84.06
£	బ్రిటన్ పౌండ్		104.56	106.76
€	యూరో		87.82	90.16
¥	జపాన్ ఎన్ (100)		53.77	54.97
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.20	55.12
S$	సింగపూర్ డాలర్		59.26	63.40
SAR	సౌదీ రియాల్		21.37	22.88
UAE D	యూఏఈ దిర్హామ్		21.84	23.58
¥	చైనా యువాన్		10.40	12.38

అంబుజా చేతికి మై హోమ్ గ్రైండింగ్

తమిళనాడులోని యూనిట్ కొనుగోలు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అంబుజా సిమెంట్స్ తాజాగా మై హోమ్ గ్రూప్‌నకు చెందిన సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌ను కొనుగోలు చేయనుంది. ఇందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు అదానీ గ్రూప్ సంస్థ అంబుజా వెల్లడించింది. దీనిలో భాగంగా తమిళనాడులోని ట్యూటికోరిన్‌లోగల 1.5 ఎంటీపీఏ గ్రైండింగ్ యూనిట్‌ను దాదాపు రూ. 414 కోట్లకు సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. అంతర్గత వనరుల నుంచి నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది.

బ్రోకింగ్ బిజినెస్‌లోకి జియో

బ్లాక్‌రాక్‌తో వెల్త్ మేనేజ్‌మెంట్ జేవీ ఏర్పాటు

న్యూఢిల్లీ: వెల్త్ మేనేజ్‌మెంట్‌తో పాటు బ్రోకింగ్ బిజినెస్ నిర్వహణకు వీలుగా జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ చేతులు కలిపాయి. సమాన భాగస్వామ్యం(50: 50)తో సంయుక్త సంస్థ(జేవీ) ఏర్పాటుకు ఒప్పందంపై సంతకాలు చేసినట్లు జియో ఫైనాన్షియల్ తెలియజేసింది. తద్వారా బ్లాక్‌రాక్ అడ్వయిజర్స్ సింగపూర్ పీటీఈతో కలసి వెల్త్ మేనేజ్‌మెంట్, బ్రోకరేజీ జేవీకి తెరతీయనున్నట్లు వెల్లడించింది. ఈ జేవీ ద్వారా బ్లాక్‌రాక్ ఇంక్‌తో బంధం మరింత బలపడనున్నట్లు ఈ సందర్భంగా పేర్కొంది. 2023 జులై26న వెల్త్‌మేనేజ్‌మెంట్ జేవీని ఏర్పాటు చేయనున్నట్లు జియో ఫైనాన్షియల్ ప్రకటించిన విషయం విదితమే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	419-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	404-00
విజయవాడ	404-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

మార్కెట్లకు యుద్ధ భయం

- ఇరాన్ - ఇజ్రాయిల్ ఉద్రిక్తతల షాక్
- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు
- సెన్సెక్స్ 845 పాయింట్ల పతనం
- 22,300 దిగువకు నిఫ్టీ
- రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి




ముంబై: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతలు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీన సంకేతాల ప్రభావంతో స్టాక్ సూచీలు సోమవారం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల అనిశ్చితి, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు, మార్చిలో టోకు ద్రవ్యోల్బణం మూడు నెలల గరిష్టానికి చేరుకోవడం తదితర అంశాలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఉదయం సెన్సెక్స్ 930 పాయింట్ల 73,315 వద్ద, నిఫ్టీ 180 పాయింట్లు క్షీణించి 22,339 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి ఏ దశలోనూ కొనుగోళ్ల మద్దతు లభించకపోవడంతో సూచీలు రోజంతా నష్టాల్లో కదలాడాయి. చివరికి సెన్సెక్స్ 845 పాయింట్లు పతనమై 2 వారాల కనిష్టం దిగువన 73,400 వద్ద నిలిచింది. నిఫ్టీ 247 పాయింట్లు క్షీణించి 22,272 వద్ద స్థిరపడింది. ఒక్క ఆయిల్‌అండ్‌గ్యాస్ మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫైనాన్సియల్ సర్వీసెస్, సర్వీసెస్, ఐటీ, బ్యాంకింగ్ ఇండెక్సులు మెటల్, ఆటో షేర్లు భారీ నష్టాలు చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3,288 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,763 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో ఒక్క చైనా(1%) మినహా అన్ని దేశాల సూచీలు దాదాపు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడంతో యూరప్ మార్కెట్లు కోలుకున్నాయి.

- సెన్సెక్స్ 845 పాయింట్ల పతనంతో బీఎస్ఈలో రూ.5.18 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.394 లక్షల కోట్లకు దిగివచ్చింది. కాగా ఈ సూచీలో 30 షేర్లకు గానూ మారుతీ సుజుకీ (1%), నెస్లే (0.62%), సన్‌ఫార్మా(0.10%) మాత్రమే లాభపడ్డాయి.
- ఐటీ దిగ్గజం టీసీఎస్ షేరు ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.3942 వద్ద నిలిచింది. క్యూ4 ఫలితాలు మెప్పించడంతో ట్రేడింగ్ ప్రారంభంలో 1.50% పెరిగి రూ.4063 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే నష్టాల మార్కెట్ ట్రేడింగ్‌లో భాగంగా ఈ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది.
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం దేశీయ ఆయిల్‌అండ్‌గ్యాస్ కంపెనీల షేర్లకు కలిసొచ్చింది. ఓఎన్‌జీసీ 6%, ఐజీఎల్ 2%, ఐఓఎల్, గెయిల్ 1.50% చొప్పున లాభపడ్డాయి. జీఎస్‌పీఎల్ 1% లాభపడ్డాయి.
- ప్రతి ఈక్విటీ షేరుకు రూ.118 ప్రత్యేక డివిడెండ్ చెల్లించేందుకు బోర్డు ఆమోదించడంతో ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ షేరు 7% లాభపడి రూ.523 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 14% ఎగసి రూ.558 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది.

వృద్ధి, వడ్డీ రేటు మార్పులకు ఆ ఇద్దరి నుంచి ఒత్తిడి

స్వీయకథలో ప్రణబ్, చిదంబరంపై దువ్వూరి వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ప్రణబ్ ముఖర్జీ, పి. చిదంబరం ఆర్థిక మంత్రులుగా పని చేసిన సమయంలో సానుకూల సెంటిమెంటు కోసం వడ్డీ రేట్లను తగ్గించాలని, వృద్ధి రేటును పెంచి చూపాలని తమపై తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు ఉండేవని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు వెల్లడించారు. రిజర్వ్ బ్యాంక్ స్వయం ప్రతిపత్తికి ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం గురించి ప్రభుత్వంలో కొంతైనా అవగాహన ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల 'జస్ట్ ఎ మెర్సినరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరియర్' పేరిట రాసిన స్వీయకథలో దువ్వూరి ఈ విషయాలు పేర్కొన్నారు. వడ్డీ రేట్ల విషయంలోనే కాకుండా ఇతరత్రా అంశాల్లోనూ ప్రభుత్వం నుంచి ఆర్‌బీఐపై ఒత్తిడి ఉండేదని ఒక అధ్యాయంలో ఆయన ప్రస్తావించారు. 'ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు జరిగిన విషయమిది. ఆర్థిక కార్యదర్శి అరవింద్ మాయారాం, ప్రధాన ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు మా అంచనాలను సవాలు చేశారు. సానుకూల సెంటిమెంటును పెంపొందించాల్సిన భారాన్ని ప్రభుత్వంతో పాటు ఆర్‌బీఐ కూడా పంచుకోవాల్సిన అవసరం ఉందన్న వాదనలు వచ్చాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలకు సెంట్రల్ బ్యాంకులు సహకరిస్తుంటే మన దగ్గర మాత్రం ఆర్‌బీఐ తిరుగుబాటు ధోరణిలో ఉంటోందంటూ మాయారాం వ్యాఖ్యానించారు. అయినప్పటికీ ప్రభుత్వానికి ఆర్‌బీఐ చీర్‌లీడరుగా ఉండాలన్న డిమాండ్‌కి నేను తలొగ్గలేదు' అని దువ్వూరి పేర్కొన్నారు.

చిదంబరం విషయానికొస్తే .. వడ్డీ రేట్లు తగ్గించాలంటూ ఆర్‌బీఐపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు దువ్వూరి చెప్పారు. పరిస్థితులను సమీక్షించిన మీదట తాను అంగీకరించలేదన్నారు. దీంతో కలవరానికి గురైన చిదంబరం అసాధారణ రీతిలో ఆర్‌బీఐపై అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కారని వివరించారు. ఏపీలోని పార్వతీపురంలో సబ్-కలెక్టరుగా కెరియర్‌ను ప్రారంభించిన దువ్వూరి కేంద్ర ఆర్థిక కార్యదర్శిగా, అటు పైన అంతర్జాతీయ మాంద్యం పరిస్థితుల్లో ఆర్‌బీఐ గవర్నర్‌గా కూడా పని చేసిన సంగతి తెలిసిందే.

3 నెలల గరిష్టానికి టోకు ధరలు

మార్చిలో డబ్ల్యూపీఐ 0.53 శాతం



న్యూఢిల్లీ: దేశీయంగా టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యూపీఐ) మూడు నెలల గరిష్టానికి ఎగిసింది. కూరగాయలు, బంగాళదుంప, ఉల్లి, ముడి చమురు మొదలైన వాటి ధరల పెరుగుదల కారణంగా మార్చిలో 0.53 శాతంగా (ప్రొవిజనల్) నమోదైంది. ఫిబ్రవరిలో ఇది 0.20 శాతంగా ఉంది. గతేడాది మార్చిలో ఇది 1.41 శాతంగా నమోదైంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు మైనస్‌లోనే ఉన్న టోకు ధరల ఆధారిత సూచీ నవంబర్‌లో ప్లస్ 0.26 శాతానికి వచ్చింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. రిటైల్ ద్రవ్యోల్బణం అయిదు నెలల కనిష్ఠ స్థాయి 4.85 శాతానికి తగ్గిన నేపథ్యంలో తాజా టోకు గణాంకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బేస్ ఎఫెక్ట్ తగ్గుతుండటంతో రాబోయే రోజుల్లో డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు తెలిపారు. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో ఆహారోత్పత్తుల ద్రవ్యోల్బణం 5.42 శాతం నుంచి 6.88 శాతానికి చేరింది. కూరగాయల ధరల పెరుగుదల మైనస్ 2.39 శాతం నుంచి 19.52 శాతానికి ఎగిసింది.

మార్చి వాణిజ్య ఎగుమతులు ఫ్లాట్

41.68 బిలియన్ డాలర్లకు చేరిక



న్యూఢిల్లీ: దేశీ వాణిజ్య ఎగుమతులు గత నెల(మార్చి)లో నామమాత్ర క్షీణతతో41.68 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ బాటలో మార్చితో ముగిసిన పూర్తి ఏడాది(2023-24)కి సైతం 3 శాతం నీరసించి 437 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. రాజకీయ, భౌగోళిక సవాళ్లు గ్లోబల్ షిప్‌మెంట్స్‌ను దెబ్బతీశాయి. మరోపక్క మార్చిలో దిగుమతులు సైతం 6 శాతం క్షీణించాయి. వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం 57.28 బిలియన్ డాలర్లను తాకాయి. దీంతో గత నెలలో వాణిజ్య లోటు 15.6 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఆర్థిక సంవత్సరం మొత్తం దిగుమతులు 5.4 శాతం తక్కువగా 677.24 బిలియన్ డాలర్లను తాకాయి. వెరసి గతేడాదికి ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం(వాణిజ్య లోటు) 240.17 బిలియన్ డాలర్లుగా నమోదైంది. మధ్యప్రాచ్యంలో సంక్షోభం ముదురుతున్న నేపథ్యంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు వాణిజ్య కార్యదర్శి సునీల్ బర్త్వాల్ తెలియజేశారు. అవసరమైనప్పుడు తగిన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

6 నెలల్లో 5జీ సేవల విస్తరణ

- వొడాఫోన్ ఐడియా
- 18 నుంచి ఎఫ్‌పీవో



ముంబై: టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐ) ప్రతిపాదిత రూ. 18,000 కోట్ల ఎఫ్‌పీవో ద్వారా నిధులు సమీకరణ అనంతరం 6-9 నెలల్లోగా 5జీ సర్వీసులు విస్తరించే యోచనలో ఉంది. నిధుల కొరత వల్లే ఇప్పటివరకు సర్వీసులను ప్రారంభించలేకపోయామని సంస్థ సీఈవో అక్షయ ముంద్రా తెలిపారు. రాబోయే 24-30 నెలల్లో తమ మొత్తం ఆదాయంలో 5జీ వాటా 40 శాతం వరకు ఉండగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎఫ్‌పీవో ద్వారా సేకరించే నిధుల్లో రూ. 5,720 కోట్ల మొత్తాన్ని 5జీ సర్వీసులకు వినియోగించనున్నట్లు ముంద్రా వివరించారు. వొడా-ఐడియా ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్‌పీవో) ఏప్రిల్ 18న ప్రారంభమై 22తో ముగియనుంది. ఇందుకోసం ధర శ్రేణిని షేరుకు రూ. 10-11గా నిర్ణయించారు. ఫాలో ఆన్ ఆఫర్ ద్వారా సేకరించే రూ. 18,000 కోట్లలో రూ. 15,000 కోట్ల మొత్తాన్ని 5జీ సేవల విస్తరణ, ఇతరత్రా పెట్టుబడుల కోసం వినియోగించుకోనున్నట్లు ముంద్రా వివరించారు. ప్రధానంగా కస్టమర్లు చేజారి పోకుండా చూసుకోవడం, యూజరుపై సగటు ఆదాయాన్ని (ఆర్పూ) పెంచుకోవడం, నెట్‌వర్క్‌పై పెట్టుబడులు పెట్టడం తమకు ప్రాధాన్యతాంశాలుగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. 2జీ యూజర్లు ఎక్కువగా ఉన్నందున తమ ఆర్పూ మొత్తం పరిశ్రమలోనే తక్కువగా ఉంటుందని చెప్పారు. అయితే, ప్రస్తుతం తమ 21.5 కోట్ల యూజర్లలో కేవలం 2జీనే వినియోగించే వారి సంఖ్య 42 శాతంగా ఉంటుందని, వీరంతా 4జీకి అప్‌గ్రేడ్ అయ్యే అవకాశాలు ఉన్నందున ఆర్పూ మెరుగుపడేందుకు ఆస్కారం ఉందన్నారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌పీసీఐఎల్, ముంబైలో 400 ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు

ముంబైలోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్).. ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 400.
» **విభాగాలు:** మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ,బీటెక్,బీఎస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 30.04.2024 నాటికి 26 ఏళ్లు మించకూడదు.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.56,100.
» **ఎంపిక విధానం:** గేట్ 2022/2023/2024 స్కోరు,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024
» **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా(ఎన్ఎస్‌డీ)..2024-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డ్రామాటిక్ ఆర్ట్స్‌లో డిప్లొమా కోర్సు(ఫుల్ టైం రెసిడెన్షియల్)లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 32
» **కోర్సులు:** యాక్టింగ్, డిజైన్, డైరెక్షన్ ఇతర థియేటర్ సంబంధిత కోర్సులు.
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. థియేటర్ ప్రొడక్షన్స్‌లో పార్టిసిపేషన్‌తో పాటు హిందీ/ఇంగ్లిష్ భాషల్లో పరిజ్ఞానం ఉండాలి.
» **బోధనా మాధ్యమం:** హిందీ/ఇంగ్లిష్.
» **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష/ఆడిషన్, ఫైనల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.05.2024
» **ప్రిలిమినరీ పరీక్ష/ఆడిషన్ నిర్వహణ తేది:** మే-జూన్ 2024.
» **వెబ్‌సైట్:** https://nsd.gov.in/delhi

ఐఐటీ గాంధీనగర్‌లో ఎంటెక్ ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గాంధీనగర్(ఐఐటీ).. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంటెక్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** బయోలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్-ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎర్త్ సిస్టమ్ సైన్సెస్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ డిజైన్ అండ్ టెక్నాలజీ.
» **స్కాలర్‌షిప్:** నెలకు రూ.12,400.
» **అర్హత:** 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్ లేదా ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.04.2024
» **వెబ్‌సైట్:** https://www.iitgn.ac.in

నిట్ జలంధర్‌లో ఎంబీఏ కోర్సులో ప్రవేశాలు

జలంధర్‌లోని డా.బి.ఆర్.అంబేద్కర్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) డిపార్ట్‌మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ మేనేజ్‌మెంట్.. 2024-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫుల్‌టైమ్ మాస్టర్ ఆఫ్ బిజినెస్-అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ)-సెషన్ జులై-2024 ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 38.
» **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు 55 శాతం) లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** క్యాట్/సీమ్యాట్/మ్యాట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ స్కోరు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.05.2024
» **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేది:** 25.05.2024
» **వెబ్‌సైట్:** https://www.nitj.ac.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, నాగ్‌పూర్‌లో 861 యాక్ట్ అప్రెంటిస్‌లు

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే నాగ్‌పూర్ డివిజన్‌లో 2024-25 సంవత్సరానికి సంబంధించి మోతిబాగ్ వర్క్‌షాప్‌లో యాక్ట్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 861
» **ట్రేడులు:** ఫిట్టర్, కార్పెంటర్, వెల్డర్, పీఏఎస్ఏ, ఎలక్ట్రీషియన్, స్టెనోగ్రాఫర్, ప్లంబర్, పెయింటర్, వైర్‌మ్యాన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, మెషినిస్ట్, టర్నర్ తదితరాలు.
» **అర్హత:** కనీసం 50% మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 10.04.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్ష మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.05.2024
» **వెబ్‌సైట్:** https://secr.indianrailways.gov.in

సత్వర ఉపాధికి.. సర్టిఫికేషన్స్!

» పది, ఇంటర్‌తో పలు సర్టిఫికేషన్ కోర్సులు
» ఈ కోర్సులతో తక్షణ ఉద్యోగావకాశాలకు మార్గం
» టెక్ మొదలు ట్రెడిషనల్ వరకు కొలువులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ తర్వాత ఎంతో మంది ఉద్యోగావకాశాల కోసం ప్రయత్నం చేస్తుంటారు. ఇందుకోసం తక్షణమే ఉపాధికి ఊతమిచ్చే కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు! పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఉద్యోగం సాధించాలంటే..అందుకు తగ్గ నైపుణ్యాలు పెంచుకోవాలి. దీనికి చక్కటి మార్గం.. సర్టిఫికేషన్ కోర్సులు!! ఈ కోర్సులు పూర్తి చేసుకుంటే.. టెన్త్, ఇంటర్‌తోనే చక్కటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. ఇటీవల పదో తరగతి, ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు ఉపయోగపడేలా.. జాబ్ ఓరియెంటెడ్ సర్టిఫికేషన్ కోర్సులపై ప్రత్యేక కథనం..



ఆఫ్టర్ టెన్త్, ఇంటర్

నేటి కార్పొరేట్ యుగంలో టెక్నికల్ నుంచి ట్రెడిషనల్ వరకూ.. వివిధ రంగాల్లో అవకాశాలు అందుకునేందుకు వీలుంది. ఐటీ మొదలు ఫోటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, బ్యుటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్ వంటి విభాగాల్లో ఉపాధి లభిస్తోంది. ఆరు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో ఉండే స్వల్పకాలిక కోర్సులను పూర్తి చేసుకుంటే.. క్షేత్ర నైపుణ్యాలు సొంతమవుతాయి. ఫలితంగా ఉద్యోగ సాధనతోపాటు మెరుగైన వేతనాలు పొందేందుకు అవకాశం ఉంటుంది.

సైబర్ సెక్యూరిటీ

నేటి డిజిటల్ యుగంలో సైబర్ సెక్యూరిటీ కీలకంగా నిలుస్తోంది. సంస్థలు ఆన్‌లైన్ కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో.. సైబర్ సెక్యూరిటీ విభాగంలో పదో తరగతి, ఇంటర్ అర్హతలతోనే ఉద్యోగాలు పొందే అవకాశం లభిస్తోంది. ఇందుకోసం సైబర్ సెక్యూరిటీ, సైబర్ ఫోరెన్సిక్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ వంటి వాటిపై అవగాహన తప్పనిసరి. ఈ స్కిల్స్ కోసం ఆరు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో సర్టిఫికేషన్ కోర్సులు చేయొచ్చు. పలు సంస్థలు ఆరు నెలల సర్టిఫికెట్ ఇన్ సైబర్ సెక్యూరిటీ కోర్సును అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో సాఫ్ట్‌వేర్ భద్రత, ఎథికల్ హ్యాకింగ్, సైబర్ సెక్యూరిటీ అనాలిసిస్, అప్లికేషన్స్ ఆఫ్ అటాక్స్, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ అనాలిసిస్, డేటా ప్రొటెక్షన్,హార్డ్‌వేర్ ప్రొటెక్షన్ తదితరాలపై శిక్షణ ఇస్తారు. ఈ సర్టిఫికేషన్ పూర్తి చేసుకున్న వారికి ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు, ఇతర రంగాల్లోని సంస్థల్లో ఐటీ విభాగాల్లో సైబర్ సెక్యూరిటీ టీమ్ అసిస్టెంట్స్, అసోసియేట్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

హార్డ్‌వేర్ నిపుణులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్‌తో ఐటీ రంగంలోని హార్డ్‌వేర్ విభాగాల్లో ఉపాధి పొందే అవకాశం ఉంది. ఇందుకు హార్డ్‌వేర్ మెయింటనెన్స్ ప్రధాన మార్గంగా నిలుస్తోంది. కంప్యూటర్‌ను ఆపరేట్ చేయడానికి అవసరమైన సీపీయూ మెయింటనెన్స్, నెట్ వర్కింగ్, లోకల్ ఏరియా నెట్‌వర్క్ నిర్వహణ వంటి నైపుణ్యాలు హార్డ్‌వేర్ విభాగంలో చాలా కీలకం. దీనికి సంబంధించి ప్రస్తుతం డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్ అండ్ నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ రిపెయిర్ అండ్ మెయింటనెన్స్ ఆఫ్ సిస్టమ్స్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, నిమ్స్‌మే, సెట్విన్ వంటి సంస్థలు ఈ కోర్సులను బోధిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. చిన్న, మధ్య తరహా సంస్థల్లో హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్ అసిస్టెంట్స్, సపోర్ట్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు.

కంప్యూటర్ కోర్సులు

పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హతతోనే కంప్యూటర్‌పై అవగాహన పెంచుకునేందుకు పలు సర్టిఫికేషన్స్ అందుబాటులో ఉన్నాయి. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. సీసీఎన్ఏ, సీసీఎన్‌పీ, ఎస్ఏపీ, కోర్-జావా ప్రోగ్రామింగ్, అడ్వాన్స్‌డ్ జావా ప్రోగ్రామింగ్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్, సీ++, ఎంఎస్ ఆఫీస్ అండ్ ఇంటర్నెట్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ వంటి కోర్సులున్నాయి. ఇవి మూడు నెలల నుంచి సంవత్సరం వ్యవధిలో ఉంటాయి. ఎన్ఎస్‌డీసీ ఐటీ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆధ్వర్యంలోనూ ఈ కోర్సులను నేర్చుకునే అవకాశం ఉంది. వీటిని పూర్తి చేసుకుంటే.. ఐటీ, ఐటీ అనుబంధ విభాగాల్లో అసిస్టెంట్స్, సపోర్టింగ్ ఎగ్జిక్యూటివ్స్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి.

మైక్రోసాఫ్ట్ ఆఫీస్ స్పెషలిస్ట్

సంస్థలు, కార్యాలయాల్లో క్లరికల్ కేడర్‌లో కొలువులు పొందేందుకు ఉపయోగపడే కోర్సు.. మైక్రోసాఫ్ట్ ఆఫీస్ స్పెషలిస్ట్. ఈ కోర్సు ద్వారా ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్‌గా పేర్కొనే వర్డ్, ఎక్సెల్, పవర్‌పాయింట్ తదితర బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ లభిస్తాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే సీహెచ్ఎస్ఎల్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ రిక్రూట్‌మెంట్ పరీక్షల్లో సైతం స్కిల్ టెస్ట్ పేరుతో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఎంఎస్ ఆఫీస్ స్పెషలిస్ట్ నైపుణ్యాలను పొందితే ఈ సీపీటీలోనూ విజయం సాధించొచ్చు. పలు ఇన్‌స్టిట్యూట్‌లు ఈ కోర్సులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నాయి. ఈ సర్టిఫికేషన్ చేతిలో ఉంటే ఎంట్రీ లెవల్ ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుంది. అడ్మినిస్ట్రేషన్ ఎగ్జిక్యూటివ్, ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి కొలువుల్లో చేరితే నెలకు కనీసం రూ.12 నుంచి రూ.15 వేల ప్రారంభ వేతనం లభిస్తుంది.

డీటీపీ

ప్రస్తుత కంప్యూటర్ యుగంలో యువత ఉపాధికి మార్గంగా నిలుస్తున్న మరో టెక్ అనుబంధ కోర్సు.. డెస్క్‌టాప్ పబ్లిషింగ్. దీనికోసం డాక్యుమెంటేషన్, లెటర్ రైటింగ్, ఎంఎస్ ఆఫీస్ టూల్స్, టైపింగ్, ఫోటోషాప్ వంటివి నేర్చుకోవాలి. డీటీపీలో సర్టిఫికేషన్లు పూర్తి చేస్తే.. డేటాఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీస్ అసిస్టెంట్లుగా ఉపాధి లభిస్తుంది. సొంతంగా డీటీపీ సెంటర్ ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందొచ్చు.

వీడియో ఎడిటింగ్

వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలతో చక్కటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. పదో తరగతి,ఇంటర్మీడియెట్ అర్హతతో పలు స్వల్పకాలిక కోర్సులు పూర్తి చేసుకునే అవకాశముంది. వీడియో ఎడిటింగ్‌కు సంబంధించి యుడెమీ,ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ ఆఫ్ ఓపెన్ లెర్నింగ్, కోర్సెరా, టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ వంటి సంస్థలు మూడు నెలల నుంచి ఏడాది వ్యవధిలో వీడియో ఎడిటింగ్, లీనియర్, నాన్-లీనియర్ ఎడిటింగ్ వంటి కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకోవడం ద్వారా.. మీడియా, యానిమేషన్ సంస్థలు, అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో కొలువులు సొంతం చేసుకోవచ్చు.

హోటల్ మేనేజ్‌మెంట్

ఇటీవల కాలంలో ఉద్యోగ కల్పనలో ముందంజలో నిలుస్తున్న మరో విభాగం.. హోటల్ మేనేజ్‌మెంట్. ఇంటర్మీడియెట్ అర్హతతోనే డిప్లొమా ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్, హాస్పిటాలిటీ, టూరిజం వంటి స్వల్పకాలిక కోర్సుల్లో చేరొచ్చు. ఈ కోర్సులను పూర్తి చేసుకోవడం ద్వారా హోటల్స్, రిసార్ట్స్, టూరిజం సంస్థల్లో అసిస్టెంట్ చెఫ్, స్టివార్ట్, గైడ్, బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్, గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్ వంటి ఉద్యోగాలు పొందొచ్చు. అదే విధంగా డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ ప్రొడక్షన్, డిప్లొమా ఇన్ ఫుడ్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ వంటి కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లలో వీటిని అభ్యసించొచ్చు.

ఫొటోగ్రఫీ

ఫొటోగ్రఫీలో ఆరు నెలల షార్ట్ టర్మ్ కోర్సులతో పాటు డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిద్వారా ఫోటో జర్నలిజం, కమర్షియల్ ఫోటోగ్రఫీ, అడ్వర్టైజింగ్, ఫ్యాషన్ ఫోటోగ్రఫీ, ఇండస్ట్రియల్ ఫోటోగ్రఫీ, వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీ, ఏరియల్ ఫోటోగ్రఫీ, సైంటిఫిక్ ఫోటోగ్రఫీ తదితర విభాగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మీడియా, పబ్లిషింగ్ సంస్థలు, అడ్వర్టయిజింగ్ కంపెనీలు ప్రధాన ఉపాధి వేదికలు. సొంతంగా స్టూడియోలను ఏర్పాటు చేసుకోవడంతోపాటు ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్‌గా కూడా పని చేయవచ్చు. సత్యజిత్ రే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్, ఏఏఎఫ్‌టీ వంటి పలు సంస్థలు ఫోటోగ్రఫీలో డిప్లొమా కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

బ్యుటీషియన్

అందానికి మెరుగులు దిద్దే బ్యూటీ షియన్‌లకు డిమాండ్ పెరుగుతోంది. ప్రస్తుతం బ్యుటీషియన్ విభాగంలో సర్టిఫికెట్, డిప్లొమా స్థాయిలో పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారు మీడియా సంస్థలు, ఫిల్మ్ ఇండస్ట్రీలో.. హెయిర్ డ్రెస్సర్, స్కిన్ కేర్ స్పెషలిస్ట్, మేకప్ ఆర్టిస్ట్, కాస్మోటిక్ కన్సల్టెంట్ అండ్ బ్యూటీ అడ్వైజర్, సెలూన్ అండ్ స్పా డైరెక్టర్, నెయిల్ టెక్నీషియన్ అండ్ మేనిక్యూరిస్ట్, బ్యూటీ కన్సల్టెంట్, బ్యూటీ స్కూల్ ఇనస్ట్రక్టర్, కాస్మోటాలజిస్ట్, డెర్మటాలజీ అసిస్టెంట్, మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్ స్పెషలిస్ట్ ఇన్ బ్యూటీ ఇండస్ట్రీ, ఆరోమ్ థెరపిస్ట్‌లుగా స్థిరపడవచ్చు. సొంతంగా బ్యూటీపార్లర్ నిర్వహించవచ్చు. వివాహాలు, జన్మదిన వేడుకలు వంటి సందర్భాల్లో బ్యుటీషియన్లకు ఆదాయం లభిస్తోంది. సెట్విన్, నిమ్స్‌మే వంటి సంస్థలు గ్రూమింగ్, పర్సనల్ గ్రూమింగ్, బ్యుటీషియన్, అడ్వాన్స్ బ్యుటీషియన్, బ్యూటీ కేర్ కోర్సులను అందిస్తున్నాయి.


యానిమేషన్

వీడియో గేమ్స్, కార్టూన్స్, మోషన్ కార్టూన్స్ పట్ల పిల్లల నుంచి పెద్దల వరకు ఆసక్తి పెరుగుతుండడంతో యానిమేషన్ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. దీంతో.. ఈ విభాగంలో నైపుణ్యాలు సొంతం చేసుకున్న వారికి ఉపాధి లభించే అవకాశముంది. ప్రస్తుతం 3డి గేమింగ్, వీడియోలకు ప్రాధాన్యం పెరిగింది. వీటికి సంబంధించి మాడ్యులర్(మోడలింగ్), రిగ్గింగ్, టెక్స్చరింగ్ సెట్ డిజైనర్(ఎ-యానిమేటర్, బి-లిప్సింగ్), కంపోజిటింగ్ కోర్సులు ముఖ్యమైనవి. నిమ్స్‌మే తదితర సంస్థలు ఈ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకుంటే.. వీడియో గేమింగ్ సంస్థలు, మీడియా సంస్థలు, యానిమేషన్ సంస్థలు, ఫిల్మ్ ఇండస్ట్రీలో అవకాశాలు లభిస్తాయి.

క్లుప్తంగా...

రామప్ప ఆలయం @ 811 ఏళ్లు


- 'ట్రిపుల్ టీ'ని అనుసరించిన కాకతీయులు



వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని నిర్మించి నేటికి 811 ఏళ్లు పూర్తవుతాయని శాసనాలు చెబుతున్నాయి. క్రీస్తు శకం 1173వ సంవత్సరంలో కాకతీయుల సర్వ సైన్యాధ్యక్షుడు అయిన రేచర్ల రుద్రుడు రామప్ప ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించాడు. తర్వాత 40 ఏళ్లకు శాలివాహన శకం ప్రకారం శ్రీముఖ నామ సంవత్సరం, చైత్రమాసం, శుక్ల పక్షం, అష్టమ తిథి రోజున ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించినట్లు శిలా శాసనాల్లో పేర్కొన్నారు. తెలుగు క్యాలెండర్ (శాలివాహన శకం) ప్రకారం మంగళవారంతో రామప్ప ఆలయం 811 ఏళ్లు పూర్తి చేసుకుంటుందని సిబ్బంది, పాలంపేట సీనియర్ సిటిజన్లు పేర్కొంటున్నారు. క్రీస్తు శకం 1213లో కాకతీయులు ట్రిపుల్ టీ (టెంపుల్, ట్యాంక్, టౌన్)ని అనుసరించి కట్టడాలు నిర్మించినట్లు వారు వివరించారు. రామప్ప సరస్సు, పాలంపేట గ్రామం కాకతీయుల కాలం నుంచే ఉన్నట్లు తెలిపారు. కాకతీయ ఉత్సవాలు నిర్వహించినట్లుగా ఏటా రామప్ప ఆలయం ప్రారంభించిన చైత్రమాసం, శుక్ల పక్షం, అష్టమ తిథి రోజున ఉత్సవాలు నిర్వహించాలని పాలంపేట ప్రముఖులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

యాదాద్రీశుడి వార్షికాదాయం రూ.224.25 కోట్లు

- వివరాలు విడుదల చేసిన ఆలయ ఈఓ భాస్కర్‌రావు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సర ఆదాయ, వ్యయాలను దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు సోమవారం విడుదల చేశారు. ఆలయానికి వార్షిక ఆదాయం రూ. 224,25,87,229.39 రాగా.. వార్షిక వ్యయం రూ.214,55,85,249 అయినట్లు వెల్లడించారు. ఇక వాస్తవ ఆదాయం రూ.151,00,40,535.23 రాగా వాస్తవ వ్యయం రూ.119,53,76,018 అయ్యిందని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి పెన్షన్ ఫండ్ కింద రూ.20 కోట్లు నూతన ఎఫ్‌డీఆర్‌ను ఖరీదు చేసినట్లు చెప్పారు.

కోమటిరెడ్డికి 'ఆటా' ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: జూన్ 7 నుంచి 9 వరకు అమెరికాలో జరిగే ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్) ద్వివార్షిక మహాసభలకు రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానం అందింది. అమెరికాలోని అట్లాంటాలోని 'జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్'లో నిర్వహించే ఆటా కన్వెన్షన్, యూత్ కాన్ఫరెన్స్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని ఆటా ప్రతినిధులు సోమవారం మంత్రిని కలిసి కోరారు. ఈ మేరకు ఆటా కన్వీనర్ పాశం కిరణ్‌రెడ్డి ఆహ్వాన లేఖను మంత్రికి అందించారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



రమేశ్ (ఫైల్)

ముత్తారం (మంథని): వడదెబ్బకు గురై ఓ వ్యవసాయ కూలీ మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మొగిలి రమేశ్ ఉరఫ్ రవి (45) వడదెబ్బ తగిలి మరణించాడని స్థానికులు తెలిపారు. ఓడేడు సమీపంలోని మానేరు దాటాక జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారులో ఆదివారం పొలం పనులకు వెళ్లిన రవి.. సాయంత్రం వరకూ ఇంటికి రాలేదు. కంగారుపడిన కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికారు. మానేరు ఇసుకలో అస్వస్థతకు గురై పడి ఉన్నట్లు గుర్తించారు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా రమేశ్ చనిపోయాడు. ఇదేవిషయంపై ముత్తారం ప్రభుత్వ వైద్య సిబ్బందిని సంప్రదించగా రమేశ్ మానేరులో అస్వస్థతకు గురై చనిపోయాడని, ఇందుకు వడదెబ్బ కారణమని తమ దృష్టికి వచ్చిందన్నారు.

లాసెట్ గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: లాసెట్ ఆన్‌లైన్ దరఖాస్తు గడువును పొడిగించారు. ఈనెల 25 వరకు ఎలాంటి పెనాల్టీ లేకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి సమీపంలోనే పరీక్ష కేంద్రాలు కేటాయించే అవకాశముందని తెలిపారు.

రామయ్య కల్యాణ క్రతువులో కీలక ఘట్టం

భద్రాద్రి రామాలయంలో ఘనంగా ధ్వజారోహణం

ఏర్పాట్లను పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ వేడుకను ఆలయ అర్చకులు సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీ మహావిష్ణువుకు ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి చిత్రపటాన్ని తెల్లటి వస్త్రంపై చిత్రించి ధ్వజస్తంభంపై ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో తిరువారాధన, సేవాకాలం, నివేదన, మంగళాశాసనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గరుడ పటంతో గిరి ప్రదక్షిణ చేసి, ధ్వజారోహణం గావించారు. గరుడ ప్రసాదాన్ని సంతానం లేని మహిళా భక్తులకు అందజేశారు. ఈ ప్రసాదం స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. కాగా, మంగళవారం సాయంత్రం మిథిలా స్టేడియం వద్ద ఎదుర్కోలు వేడుక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రామయ్య కల్యాణోత్సవ ఏర్పాట్లను దేవాదాయ, పౌరసంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు సోమవారం పరిశీలించారు.

కల్యాణానికి సిరిసిల్ల చీర

శ్రీసీతారాముల కల్యాణానికి సిరిసిల్లకు చెందిన వెల్ది హరిప్రసాద్ ప్రతీ ఏడాది స్వయంగా నేసిన చీరను



భద్రాద్రి రామాలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

బహుమతిగా ఇస్తున్నారు. ఈ ఏడాది కూడా 800 గ్రాముల బరువుతో చీర తయారు చేయగా.. రెండు గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, పట్టు దారాలతో ఈ చీరను నేయటం విశేషం. చీర కొంగులో సీతారాముల కల్యాణ చిత్రాన్ని నేయడం మరింత ఆకర్షణగా నిలిచింది.

సీఎస్ చేతుల మీదుగా పట్టు వస్త్రాలు!

శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టు వస్త్రాలు అందించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం లేనందున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పట్టువస్త్రాలు సమర్పిస్తారని సమాచారం.

సీతారామచంద్ర కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి అనుమతివ్వండి

సీఈవోకు దేవాదాయ శాఖమంత్రి సురేఖ లేఖ

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా భద్రాచల సీతారామచంద్ర స్వామి కల్యాణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అనుమతివ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వికాస్ రాజ్‌కు దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాలకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించడంతో సీఈవోకు మంత్రి లేఖరాశారు. కులమతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది భక్తులు వీక్షించాలనుకునే కల్యాణ మహోత్సవ ప్రత్యక్ష ప్రసారాలను ఎన్నికల కోడ్ నుంచి మినహాయించాలని కోరారు. భద్రాచలం సీతారాముల దేవస్థానం ప్రాశస్త్యం, ఆచార సంప్రదాయాలు, భక్తుల నమ్మకాలు, కల్యాణ మహోత్సవం సందర్భంగా 40 ఏళ్ల నుంచి సాగుతున్న ప్రత్యక్ష ప్రసారాల గురించి మంత్రి ఈ లేఖలో ప్రస్తావించారు.



చేతిగొడుగుల సాయంతో పనిచేస్తున్న కూలీలు

భగభగ ఎండ... గొడుగులే అండ!

ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరింది. వేరుశనగ పంట తీసేందుకు వెళ్లిన లక్ష్మీంపూర్ గ్రామానికి చెందిన కూలీలు ఎండ తీవ్రతను తాళలేక వెంట తెచ్చుకున్న చేతిగొడుగుల సాయంతో పనిచేస్తున్నారు. జిల్లాలోని తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులోని పంట చేనులో కన్పించిన ఈ దృశ్యం ఎండల తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రాష్ట్రంలో సాధారణ వర్షపాతమే!

▶ మొదటి పేజీ తరువాయి

106శాతం వరకు వానలు పడొచ్చని వెల్లడించింది. అంటే సాధారణం కంటే కాస్త ఎక్కువే కావడం గమనార్హం. నైరుతి సీజన్‌లో వర్షపాత అంచనాలపై మరింత స్పష్టమైన సమాచారాన్ని మే నెలాఖరులో విడుదల చేస్తామని వాతావరణ శాఖ ప్రకటించింది.

కొనసాగుతున్న ఎల్‌నినో..

ప్రస్తుతం భూమధ్యరేఖపై పసిఫిక్ మహా సముద్రంలో మధ్యస్థ ఎల్‌నినో పరిస్థితులు నెలకొన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. తాజా అంచనాల మేరకు ఈ ఎల్‌నినో.. నైరుతి సీజన్ ప్రారంభమయ్యే సమయంలో బలహీనపడే అవకాశం ఎక్కువని వివరించింది. వర్షాకాలం ద్వితీయార్థంలో పూర్తిగా బలహీనపడి.. మంచి వర్షాలు నమోదు కావొచ్చని పేర్కొంది.

'ఆర్టీసీ ఆరోగ్యం' మెరుగుపడింది

ఏడాది క్రితం తొలిసారి గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరుతో హెల్త్ చెకప్

- ప్రతి ఉద్యోగి హెల్త్ ప్రొఫైల్ రూపొందించి తదనుగుణంగా చికిత్సలు
- తీవ్ర గుండె సమస్యలున్న వారికి శస్త్రచికిత్సలు, ప్రత్యేక మెడికేషన్
- నలుగురిని తప్ప అందరి ప్రాణాలు కాపాడిన వైద్యులు
- మరోసారి హెల్త్ ప్రొఫైల్ అప్డేట్‌కు నిర్ణయం
- ఈ నెలాఖరులో 43 వేల మంది ఉద్యోగులకు 17 రకాల వైద్యపరీక్షలు

''డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు... ఆర్టీసీలో నిత్యం ఒత్తిడి మధ్య విధులు నిర్వర్తిస్తుంటారు. వారిలో చాలామంది ఆరోగ్యంపై కూడా అంతగా దృష్టి సారించరు. అందుకే ఈ ఉద్యోగుల్లో తరచూ చాలామంది తీవ్ర అనారోగ్యానికి గురవుతుంటారు. ఆర్టీసీ ఉద్యోగుల్లో 287 మంది గుండె సంబంధిత తీవ్ర సమస్యలతో బాధపడుతున్నట్టు ఏడాది క్రితం గుర్తించారు. వారిపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన వారికి బైపాస్ ఆపరేషన్లు, యాంజియోగ్రామ్, యాంజియోప్లాస్ట్, స్టెంట్లు వంటి చికిత్సలు చేయించారు. దీంతో వీరిలో నలుగురు మినహా మిగతావారంతా మళ్లీ కోలుకుని ఆరోగ్యవంతులయ్యారు.



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో 43 వేల మంది ఉద్యోగులకు సంపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించాలని సంస్థ నిర్ణయించింది. ఏడాది క్రితం గ్రాండ్ హెల్త్ చాలెంజ్ పేరుతో ఉద్యోగులందరికీ నిర్వహించిన వైద్య పరీక్షలు సత్ఫలితాలనిచ్చాయి. సంస్థలో సాలీనా సగటున 150 నుంచి 200 మంది మృత్యువాత పడుతున్నారు. ఆరోగ్యంపై సరైన శ్రద్ధ తీసుకోకపోవటమే దీనికి ప్రధాన కారణమని సంస్థ ఎండీ సజ్జనార్ గుర్తించి సామూహిక వైద్య పరీక్షలకు శ్రీకారం చుట్టారు. ఓ ప్రైవేటు సంస్థకు ఈ బాధ్యత అప్పగించి ఆయా డిపోల్లోనే 17 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయించారు. వారి అనారోగ్య సమస్యల ఆధారంగా చికిత్సలు, మందుల వాడకంపై దృష్టి సారించారు. తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి, నిమ్స్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో హెల్త్ ప్రొఫైల్ ఆధారంగా చికిత్సలు కొనసాగుతున్నాయి. దీంతో చాలామంది ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది.

గుండె వ్యాధులపై ప్రత్యేక దృష్టి

గుండె సంబంధిత తీవ్ర సమస్యలతో బాధపడుతున్న 287 మందిపై ప్రత్యేక దృష్టి సారించారు. వీరిలో ఆరుగురికి బైపాస్ సర్జరీలు, 25 మందికి వెంటనే స్టెంట్లు అమర్చారు. మరికొందరికి సర్జరీలు జరుపుతూ వచ్చారు. వీరంతా తంచన్‌గా మందులు వాడేలా ఆయా డిపో మేనేజర్లకు బాధ్యతలు అప్పగించారు. కాస్త నిర్లక్ష్యం వహించిన నలుగురు మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. మిగతావారంతా క్రమంగా కోలుకుంటూ విధుల్లో చలాకీగానే ఉంటున్నారు. ఇతర అనారోగ్యాలకు కూడా చికిత్సలు చేయించారు. వారి హెల్త్‌ప్రొఫైల్ సిద్ధమై ఏడాది దాటినందున, అందరికీ మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించి కొత్త హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని ఎండీ సజ్జనార్ నిర్ణయించారు.

నెలాఖరులో మళ్లీ వైద్యపరీక్షలు

మరోసారి వైద్య పరీక్షలు ఈ నెలాఖరుకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్థాయికి అభివృద్ధి చేశారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేశారు. అవసరమైతే నిమ్స్‌లో కూడా చికిత్సలు చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల కోసం నిమ్స్‌లో ఓ బ్లాక్‌ను కూడా ఏర్పాటు చేయించారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందుతోందనే చెప్పాలి.

మధుయాష్కీ గౌడ్‌కు మాతృవియోగం



మధుయాష్కీ తల్లి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

హయత్‌నగర్: ఏఐసీసీ కార్యదర్శి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ తల్లి యాష్కీ అనసూయ (85) కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె.. సోమవారం ఉదయం బంజారాహిల్స్‌లోని మధుయాష్కీగౌడ్ ఇంట్లో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మరణ వార్త తెలిసిన పలువురు కాంగ్రెస్ నాయకులు మధుయాష్కీని పరామర్శించారు. మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు అనసూయ పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

సీఎం సంతాపం..: మధుయాష్కీ తల్లి మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కాగా అనసూయ పార్థివదేహాన్ని సోమవారం మధ్యాహ్నం హయత్‌నగర్‌లోని మధుయాష్కీ సొంత ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం హయత్‌నగర్‌లోని వారి వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పులి మనుగడ కోసం అటవీ గ్రామాల తరలింపు



లారీలో గ్రామాన్ని వదిలి వెళ్తున్న మైసంపేట్ వాసులు

కడెం: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో పులి మనుగడ కోసం కోర్ ఏరియాలో ఉన్న నిర్మల్ జిల్లా కడెం మండలం రాంపూర్, మైసంపేట్ గ్రామాలను అటవీశాఖ అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. అటవీశాఖ నిర్ణయం మేరకు కడెం మండలం కొత్త మద్దిపడగ సమీపంలో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీకి రెండు గ్రామాల ప్రజల తరలింపు ప్రక్రియ సోమవారం ప్రారంభించారు. రాంపూర్, మైసంపేట్ గ్రామాల్లో మొత్తం 94 కుటుంబాలుండగా సోమవారం 9 కుటుంబాలను అటవీ అధికారులు ప్రత్యేక వాహనాల్లో పునరావాస కాలనీకి తరలించారు.

అంబేడ్కర్‌ను అనాథను చేశారు

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్, ఆయన మంత్రివర్గ సహచరులు నివాళులర్పించకపోవడం దుర్మార్గమని బీఆర్ఎస్ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అనాథను చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంఘాలు అంబేడ్కర్ స్మృతి వనానికి వెళ్లకుండా తాళాలు వేయడం దారుణమన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో సోమవారం నిరంజన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'అనాదిగా అంబేడ్కర్ మీద కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదు. 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' పేరిట 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిలబెట్టుకున్నాం. కేసీఆర్ ఏర్పాటు చేసిన వాటి పట్ల వ్యతిరేకత ఉంటే ఇకపై సెక్రటేరియట్‌కు కూడా రాకుండా ఇంట్లో కూర్చోండి' అని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.